
'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 336

శనివారం 19-8-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



బుమ్రా బృందం శుభారంభం

తొలి టీ20లో ఐర్లాండ్‌పై డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో విజయం - 13లో



జియో ఫైనాన్స్ లిస్టింగ్

21న బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈలలో ట్రేడింగ్. షేర్ల కేటాయింపు పూర్తి - 13లో



2047 నాటికి వికాస్ భారత్

2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ అవతరిస్తుందంటూ పలు నివేదికలను ప్రధాని మోదీ లింక్డ్‌ఇన్‌లో పోస్టు చేశారు.

వివరాలు 6లో ▸



మణిపూర్‌లో మళ్లీ హింస

మణిపూర్‌లోని ఉఖ్రుల్ జిల్లా థోవాయ్ గ్రామంలో శుక్రవారం జరిగిన హింసాత్మక ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు.

వివరాలు 6లో ▸



కోటాలో కొత్త ఫ్యాన్లు

రాజస్తాన్‌లోని కోటాలో విద్యార్థుల ఆత్మహత్యల నిరోధానికి హాస్టళ్లలోని గదుల్లో స్ప్రింగ్ డివైజ్ ఫ్యాన్లు అమర్చబోతున్నారు.

వివరాలు 6లో ▸



జాబిల్లికి మరింత చేరువగా..

చంద్రయాన్‌–3లో భాగంగా ల్యాండర్ మాడ్యూల్‌ను ఇస్రో శాస్త్రవేత్తలు శుక్రవారం జాబిల్లికి మరింత చేరువ చేశారు.


వివరాలు 6లో ▸

'మార్గదర్శి' హ్యాండ్సప్

చందాదారులకు రూ.2 వేల కోట్లకు పైగా బకాయిలు

మార్గదర్శి కార్యాలయాల చుట్టూ చందాదారుల ప్రదక్షిణలు

- డబ్బులెప్పుడిస్తారంటూ నిలదీతలు
- వాయిదాల మీద వాయిదాలతో తిప్పుకుంటున్న మేనేజర్లు
- దిక్కు తోచక పలు చోట్ల ముఖం చాటివేత
- ఒత్తిడి తెస్తున్న ఒక సామాజికవర్గం వారికి మాత్రం చెల్లింపులు
- ఇదంతా రామోజీ అక్రమ పెట్టుబడుల పాపమే.. డిఫాల్ట్ చందాదారుల పేరిటా మోసాలు
- 50 వేల మంది చందాదారుల సొమ్ము ప్రశ్నార్థకం.. వీరి హక్కుల పరిరక్షణపై సర్కారు దృష్టి
- ఆస్తుల ఆటాచ్‌మెంట్‌కు నిర్ణయం



ఈనాడు రామోజీరావు అక్రమ ఆర్థిక సామ్రాజ్యానికి పునాది అయిన 'మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్' చేతులు ఎత్తేసిందా? చిట్టీల కాల పరిమితి తీరినప్పటికీ చందాదారులకు డబ్బులు చెల్లించడం లేదా? చెల్లించాల్సిన మొత్తాన్ని డిపాజిట్‌గా స్వీకరించి పబ్బం గడుపుతోందా? చాలా ఊళ్లలో చందాదారులు డబ్బుల కోసం మార్గదర్శి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారా? వారికి ఏం సమాధానం చెప్పాలో తెలియక ఆ సంస్థ మేనేజర్లు ముఖం చాటేస్తున్నారా? కొందరికి మాత్రమే చెల్లింపులు చేస్తున్నారా? ఈ ప్రశ్నలన్నింటికీ అవుననే సమాధానం వినిపిస్తోంది.

సాక్షి, అమరావతి: 'మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్' చందాదారుల సొమ్మును రామోజీరావు అక్రమంగా తమ సొంత పెట్టుబడులుగా మళ్లించడంతో ఆ సంస్థ ఒట్టిపోయింది. చిట్టీలు పాడిన చందాదారులకు ప్రైజ్ మనీ చెల్లించలేక ముఖం చాటేస్తోంది. రాష్ట్రంలోని 37 బ్రాంచిల పరిధిలో వేలాది మంది చందాదారులకు చిట్టీల మొత్తం బకాయి పడింది. దాంతోపాటు అక్రమ డిపాజిట్ల కాల పరిమితి ముగిసినప్పటికీ చెల్లించకపోవడం

మిగతా 2వ పేజీలో ▶

విజయవాడలో హయత్ ప్లేస్ హోటల్‌ను ప్రారంభించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్. చిత్రంలో మంత్రులు, హయత్ విజయవాడ చైర్మన్ వీరాస్వామి, అధికారులు



ఉత్తమ టూరిజం పాలసీ తెచ్చాం

రాష్ట్రంలో అంతర్జాతీయ బ్రాండ్ హోటళ్ల ఏర్పాటుకు పూర్తి సహకారం

- విజయవాడలో హయత్ ప్లేస్ హోటల్‌ను ప్రారంభించిన సీఎం జగన్
- దేవినేని అవినాశ్ నివాసం వద్ద ముఖ్యమంత్రికి ప్రజల ఘన స్వాగతం

సాక్షి ప్రతినిధి, విజయవాడ: రాష్ట్రంలో అంతర్జాతీయ బ్రాండ్ హోటళ్లు మరిన్ని ఏర్పాటయ్యేలా ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ పర్యాటక కేంద్రాల జాబితాలో చేర్చి మన ఆతిథ్యం విశిష్టతను చాటుకునేలా ప్రభుత్వం ప్రోత్సాహకాలతో తోడ్పాటు అందిస్తుందని చెప్పారు. విజయవాడలోని ఏలూరు రోడ్డులో నూతనంగా నిర్మించిన 'హయత్ ప్లేస్' హోటల్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ శుక్రవారం ప్రారంభించారు. విజయవాడలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి ప్రముఖ హోటళ్లు, ప్రసిద్ధి చెందిన బ్రాండ్స్ తమ కార్యకలాపాలను ప్రారంభించేలా ఉత్తమ టూరిజం పాలసీని తెచ్చినట్లు చెప్పారు. ఉత్తమ పర్యాటక విధానాలే కాకుండా చైన్ హోటళ్లను కూడా

మిగతా 2వ పేజీలో ▶

ఫ్యాక్ట్ చెక్



వెటర్నరీ అంబులెన్స్ ద్వారా పశువులకు ఇంటి ముందు వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది

ఎవరి కోసం మీ 'పశు' వాదన రామోజీ?

- మూగ జీవాలకు అండగా నిలుస్తుంటే నిందలేలా?
- ఆర్బీకేల ద్వారా గ్రామ స్థాయిలో నాణ్యమైన పశు వైద్య సేవలు
- నియోజకవర్గానికి రెండు వెటర్నరీ అంబులెన్స్‌లు
- నేరుగా పాడి రైతులకు సలహాలు, సూచనలు
- ఆర్బీకేల ద్వారా గ్రామ స్థాయిలో పశు విజ్ఞాన బడులు
- నాలుగేళ్లలో ఎన్నో విప్లవాత్మక మార్పులు
- పొరుగు రాష్ట్రాలన్నీ ప్రశంసిస్తుంటే చంద్రబాబు కోసమే కదా దుష్ప్రచారం?

14లో

న్యూస్‌రీల్

మత్స్యకారులకు తప్పిన పెను ముప్పు



చేపల వేట కోసం గుజరాత్‌లోని వీరావల్ తీర ప్రాంతానికి వెళ్లిన ఏపీ మత్స్యకారుల పడవ ప్రమాదవశాత్తూ మునిగిపోయింది. తోటి మత్స్యకారులు, కోస్ట్‌గార్డ్ సిబ్బంది సకాలంలో స్పందించి పడవలో ఉన్న 8 మంది మత్స్యకారులను రక్షించారు.

వివరాలు 5లో ▸

భవిష్యత్ వెలుగులకు ప్రణాళిక



రాష్ట్ర విద్యుత్ సంస్థలు భవిష్యత్ విద్యుత్ అవసరాలకు అనుగుణంగా విద్యుత్ ప్రణాళికను రూపొందించి ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్‌సీ)కి నివేదికలు సమర్పించాయి. వీటిపై విశాఖలోని కొత్త క్యాంపు కార్యాలయంలో శనివారం విచారణ జరగనుంది.

వివరాలు 5లో ▸

ఇదండీ సంగతి



మనకీ ఉంది గుబులు సార్! శరద్‌పవార్ కూటమితో ఉంటారా ఉండరా అని!

పదేళ్లుగా పాలిటిక్స్‌లో ఉన్నా..

సీఎం పోస్టుకు సిద్ధం

టీడీపీతో పొత్తుపై చర్చలు జరుగుతున్నాయి: పవన్‌కళ్యాణ్

- 'రాజకీయాల్లో నాకు పదేళ్ల అనుభవం వచ్చింది. సీఎం పదవికి సిద్ధమయ్యా. నాతో ఏ పార్టీలు కలిసొస్తాయన్నది ఆలోచిస్తున్నా. టీడీపీతో పొత్తుపై చర్చలు జరుగుతున్నాయి. వైఎస్సార్‌సీపీ పాలనతో పోల్చుకుంటే అవినీతి తక్కువనే ఉద్దేశంతో టీడీపీకి మద్దతిస్తున్నా. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై పోరాడలేను. దీనిపై గతంలో ప్రధానికి చెబితే ఆయన విని ఊరుకున్నారు. ప్రధానితో గొడవలు పెట్టుకుంటే పని జరగదు' అని జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ అన్నారు.



14లో



కొత్తగా 195 యూనిట్లకు భూమి కేటాయింపు

- 467.13 ఎకరాలు కేటాయించిన ఏపీఐఐసీ
- రూ.5,153.43 కోట్ల పెట్టుబడులు.. 10,219 మందికి ఉపాధి
- భూమి కేటాయింపులో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు పెద్దపీట
- 57 శాతం కంపెనీలు ఈ వర్గాలవే

3లో

డాక్టర్ 'ఏపీ'!

ఐదు కొత్త కాలేజీలతో అదనంగా 750 ఎంబీబీఎస్ సీట్లు

- రాష్ట్రంలో కొనసాగుతున్న మెడికల్ అడ్మిషన్ల ప్రక్రియ
- మొదటి దశ కౌన్సెలింగ్‌లోనే కన్వీనర్ సీట్లన్నీ భర్తీ.. వచ్చే ఏడాది మరో 5 కాలేజీలను ప్రారంభించేలా సన్నద్ధం
- రాష్ట్రంలో ఏకంగా 17 కొత్త వైద్య కళాశాలలను నెలకొల్పుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- వైద్య విద్య కోసం విదేశాలకు తగ్గనున్న విద్యార్థులు

2లో

గుంటూరు జిల్లా తాడేపల్లిలో సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న కాంట్రాక్టు లెక్చరర్లు



కాంట్రాక్టు లెక్చరర్ల జీవితాల్లో వెలుగులు

3లో

- సీఎం జగన్ నిర్ణయంపై హర్షాతిరేకాలు.. ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం
- తాడేపల్లికి భారీగా తరలివచ్చిన ప్రభుత్వ కాంట్రాక్టు లెక్చరర్లు
- రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన ఉద్యోగులు
- రెండు దశాబ్దాల సమస్యకు ముఖ్యమంత్రి జగన్ పరిష్కారం: సజ్జల రామకృష్ణారెడ్డి

కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడ గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న నేచురల్ ఫార్మింగ్ అసోసియేట్ కె.అరుణ రెండు సెంట్ల స్థలంలో కూరగాయలు, ఆకు కూరలు పండిస్తూ.. వాటిని అదే గ్రామంలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాలకు ఉచితంగా అందిస్తోంది. అదే మండలం లొద్దిపల్లి గ్రామానికి చెందిన మాస్టర్ ట్రైనర్ ప్రసుధ తన ఇంటి ఎదురుగా ఐదు సెంట్ల స్థలంలో 18 రకాల ఆకు కూరలు, కూరగాయలు పండిస్తూ నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలకు మార్కెట్ ధరకే సరఫరా చేస్తున్నారు. తద్వారా ఆయా అంగన్‌వాడీల్లో ఐదేళ్లలోపు పిల్లలు 80 మంది, 30 మంది గర్భిణీలు, 20 మంది బాలింతలు పౌష్టికాహారంతో లబ్ధి పొందుతున్నారు. ఇదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ప్రోత్సాహంతో రైతు సాధికారత సిబ్బంది అంగన్‌వాడీ కేంద్రాలకు ఆకు కూరలు, కూరగాయలను ఉచితంగాను, నామమాత్రపు ధరలకు అందిస్తుండటం విశేషం.



ప్రకృతి వ్యవసాయం చేస్తున్న కె.అరుణ

అంగన్‌వాడీల్లో పోషకాహార తోటలు

ప్రకృతి సాగుతో గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం

- ఫుడ్ బాస్కెట్ పేరుతో కమ్యూనిటీ గార్డెన్స్.. ఫుడ్ ప్లేట్ పేరుతో పోషకాహారం
- రాష్ట్రంలో 135 కమ్యూనిటీ న్యూట్రీ గార్డెన్స్.. 8,563 పెరటి తోటలు
- 355 సంస్థాగత పోషకాహార తోటలు

సాక్షి, అమరావతి: అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాల ఆవరణలు, హాస్టల్ ప్రాంగణాల్లో పోషకాహార తోటలు మొలకెత్తుతున్నాయి. పెరటి తోటల పెంపకాన్ని రాష్ట్రంలో పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నారు. దీనికి తోడు రైతు సాధికార సిబ్బంది తాము నివసించే ఇంటి ఆవరణ, చుట్టుపక్కల ఉండే ఖాళీ స్థలాలు, పొలాల్లో పోషకాహార పెరటి తోటలను ప్రకృతి సాగు పద్ధతిలో పెంచుతున్నారు. ఆ తోటల నుంచి వచ్చే కూరగాయలు, ఆకు కూరలను సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్నారు. ఎలాంటి రసాయన అవశేషాలు లేని ఆకుకూరలు, కాయగూరలతో రెట్టింపు పౌష్టికాహారం అందుతోందని గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సత్ఫలితాలు వస్తున్నాయ్

ఏడాదిన్నర కాలంగా అమలవుతున్న పోషకాహార పెరటి తోటల పెంపకంతో మంచి ఫలితాలు వస్తున్నాయి. ఉదాహరణకు కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లు మండలం లొద్దిపల్లి గ్రామంలో 2021 అక్టోబర్ నెలలో తక్కువ బరువు కలిగిన పిల్లల సంఖ్య ఆరుగురు ఉంటే.. పెరటి తోటల సాగుతో పోషకాహారం అందించడంతో ఈ ఏడాది మే నెలలో తక్కువ బరువు ఉన్న వారి సంఖ్య ఒక్కరికే పరిమితమైంది. వయసుకు తగ్గ ఎత్తు లేని పిల్లల సంఖ్య 2021 అక్టోబర్‌లో ముగ్గురు ఉంటే.. 2023 మే నాటికి ఆ సంఖ్య సున్నాకు చేరుకుంది. అదే మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో 2021 అక్టోబర్ నెలలో తక్కువ బరువు కలిగిన పిల్ల సంఖ్య ఆరుగురు నుంచి 2023 మే నెలలో కేవలం ఇద్దరికి చేరింది. వయసుకు తగ్గ ఎత్తులేని పిల్లల సంఖ్య 2021 అక్టోబర్‌లో ఐదుగురు ఉంటే 2023 మే నాటికి ఆ సంఖ్య రెండుకు తగ్గటం గమనార్హం.

'ఫుడ్ బాస్కెట్' పేరుతో కమ్యూనిటీ న్యూట్రీ గార్డెన్స్

రసాయన రహిత ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను అందరికీ అందుబాటులోకి తీసుకురావాలనే సంకల్పంతో అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ కార్యక్రమం సత్ఫలితాలు అందిస్తోంది. ప్రజలకు అనేక రకాల పౌష్టికాహార ఉత్పత్తులను అందించడంతోపాటు అనేక రకాల ఆకు కూరలు, కూరగాయల సాగులోనూ ప్రజలను భాగస్వాముల్ని చేస్తోంది. ఇందుకోసం 'ఫుడ్ బాస్కెట్' పేరుతో గ్రామాల్లో కమ్యూనిటీ న్యూట్రీ గార్డెన్స్, వ్యక్తిగత పెరటి తోటల పెంపకాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, హాస్టల్ ఆవరణల్లో సంస్థాగత పోషకాహార తోటలు పెంచుతున్నారు. రాష్ట్రంలో 135 కమ్యూనిటీ న్యూట్రీ గార్డెన్స్, 8,563 వ్యక్తిగత పెరటి తోటలు, 355 సంస్థాగత పోషకాహార తోటలు (అంగన్‌వాడీ సెంటర్లు 189, పాఠశాల ప్రాంగణాల్లో 166) పెంచి.. వాటిద్వారా వస్తున్న అనేక రకాల రసాయన రహిత ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను అంగన్‌వాడీ కేంద్రాలకు అందిస్తున్నారు.

'ఫుడ్ ప్లేట్' పేరుతో పౌష్టికాహారం

రాష్ట్రంలో పౌష్టికాహార లోపంతో బాధపడే వారికి 'ఫుడ్ ప్లేట్' పేరుతో అనేక రకాల పౌష్టికాహార పదార్థాలను అందించే కృషి జరుగుతోంది. పౌష్టికాహారం కోసం పెరటి తోటలు పెంచడంతోపాటు పండించిన ఆహారం తీసుకునేలా పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తల్లిదండ్రులకు, పిల్లలకు, ఉపాధ్యాయులకు, అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన పెంచుతుండటం విశేషం.

ఇషా–శివ జోడీకి స్వర్ణం



ప్రపంచ సీనియర్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్ ఖాతాలో తొలి స్వర్ణ పతకం చేరింది. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో ఇషా సింగ్–శివా నర్వాల్ జోడీ పసిడి పతకం సాధించింది. ఫైనల్లో 16–10తో తర్హాన్ ఇలేదా–యూసుఫ్ డికెచ్(తుర్కియే) ద్వయంపై వారు విజయం సాధించారు.

13లో

క్లుప్తంగా...

జర్మనీలో నర్సింగ్ ఉద్యోగ అవకాశాలపై శిక్షణ

సాక్షి, అమరావతి: జర్మనీలో నర్సింగ్ ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునేలా ఇండో యూరో సింక్రనైజేషన్‌తో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. తాడేపల్లిలోని ఏపీఎస్ఎస్‌డీసీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం రెండు సంస్థల ప్రతినిధులు ఒప్పందం చేసుకున్నారు. రాష్ట్రంలోని నర్సింగ్ విద్యాసంస్థల్లో జర్మనీ భాషతో పాటు అక్కడ పనిచేసేలా విద్యార్థులను తీర్చిదిద్దుతారు. ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ, సీఈవో వి.వినోద్‌కుమార్, ఐఈఎస్ ప్రెసిడెంట్ రాజీవంగపండు పాల్గొన్నారు.

విశాఖలో ఏపీఈఆర్‌సీ క్యాంపు కార్యాలయం ప్రారంభం


క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి తదితరులు

సాక్షి, విశాఖపట్నం: ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాల విద్యుత్ వినియోగదారుల సమస్యలను ఇకపై విశాఖ కేంద్రంగా పరిష్కరిస్తామని ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి వెల్లడించారు. విశాఖలోని ఏపీఈపీడీసీఎల్ ప్రధాన కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఏపీఈఆర్‌సీ క్యాంపు కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఏపీఈఆర్సీ సభ్యులు పాల్గొన్నారు.

వర్చువల్ రియాల్టీ ల్యాబ్‌లు ప్రారంభం

కంచరపాలెం (విశాఖపట్నం): ఐటీఐ కూడలి కంచరపాలెం పాత పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో ఏర్పాటు చేసిన వర్చువల్ రియాల్టీ ల్యాబ్, ప్లంబర్ ల్యాబ్‌లను రాష్ట్ర ఉపాధి, శిక్షణ శాఖ డైరెక్టర్ డాక్టర్ నవ్య ఐఏఎస్ శుక్రవారం ప్రారంభించారు. దక్షిణ భారత దేశంలోనే మొదటి సారిగా మన రాష్ట్రంలోని పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో ఈ ల్యాబ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాస్తవికతకు దగ్గరగా ఉండే నూతన 3డీ విధానం ద్వారా విద్యార్థులకు ప్రాక్టికల్ పరిజ్ఞానానికి ఉపయుక్తంగా ఉంటుందన్నారు.

సమాచారం లేకుండా విదేశాలకు శైలజ

తెలంగాణ హైకోర్టులో ఏపీ ప్రభుత్వం వాదనలు



సాక్షి, హైదరాబాద్: మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో తీవ్ర అవకతవకలు, డిపాజిట్ల మళ్లింపు కేసులో ఏపీ సీఐడీ విచారణ ఎదుర్కొంటున్న ఆ సంస్థ ఎండీ శైలజా కిరణ్ దర్యాప్తు అధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా విదేశాలకు వెళ్లారని ఏపీ ప్రభుత్వం తెలంగాణ హైకోర్టుకు తెలిపింది. అందుకే లుక్‌ఔట్ నోటీసుల విషయంలో తాము ముందుకు వెళ్లాల్సి వచ్చిందని వివరించింది. విచారణ సందర్భంగా సీఐడీ ఏఎస్పీలు రాజశేఖర్‌రావు, రవికుమార్ శుక్రవారం కోర్టుకు హాజరయ్యారు. వాదనలకు కొంత సమయం కావాలని ఇరు వైపులా న్యాయవాదులు కోరడంతో హైకోర్టు తదుపరి విచారణను సెప్టెంబర్ 15కు వాయిదా వేసింది. తమపై కఠిన చర్యలు చేపట్టరాదంటూ మార్చి 21న తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ఉల్లంఘిస్తూ ఏపీ ప్రభుత్వం లుక్‌ఔట్ నోటీసు జారీ చేసిందని మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్, శైలజా కిరణ్ వేర్వేరుగా కోర్టు ధిక్కరణ పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై న్యాయమూర్తి జస్టిస్ సురేందర్ విచారణ చేపట్టారు. అనారోగ్య కారణాలతో అదనపు డీజీపీ ఎస్.సంజయ్, అధికారిక కారణాలతో ఏపీ హోంశాఖ ముఖ్య కార్యదర్శి హరీశ్ హాజరుకాలేకపోయారని ఏపీ ప్రభుత్వ తరఫు న్యాయవాది కైలాసనాథ్ రెడ్డి తెలిపారు. ఈ పిటిషన్లకు సంబంధించి తాము కౌంటర్లు దాఖలు చేసినట్లు చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి విచారణను వాయిదా వేశారు.

మావోయిస్టు అగ్రనేత సాయన్న కన్నుమూత!



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: మావోయిస్టు అగ్రనేత మల్లా రాజిరెడ్డి అలియాస్ సాయన్న మృతిచెందారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఈ నెల 16న ఛత్తీస్‌గఢ్‌లోని దండకారణ్యంలో మరణించినట్లు సమాచారం. అయితే రాజిరెడ్డి మరణవార్తను మావోయిస్టులు ఇంకా ధ్రువీకరించలేదు. పార్టీ నుంచి అధికారిక ప్రకటన రానప్పటికీ నిఘా వర్గాలు మాత్రం దీన్ని ధ్రువీకరిస్తున్నాయి. ఆయన మృతదేహం వద్ద అనుచరులు రోదిస్తున్న వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఎగ్లాస్‌పూర్ పరిధిలోని శాస్త్రులపల్లికి చెందిన మల్లా రాజిరెడ్డి అలియాస్ సత్తెన్న, సాయన్న, మీసాల సాయన్న, సాగర్, అశోక్, దేశ్‌పాండేగా దళంలో ప్రసిద్ధుడు.

డాక్టర్ 'ఏపీ'!

- ఐదు కొత్త కాలేజీలతో అదనంగా 750 ఎంబీబీఎస్ సీట్లు
- రాష్ట్రంలో కొనసాగుతున్న మెడికల్ అడ్మిషన్ల ప్రక్రియ

సాక్షి, అమరావతి: తమ పిల్లలను డాక్టర్లుగా చూడాలని కోరుకుంటున్న వారి కలలు సాకారం కావడంతో పాటు రాష్ట్రంలో అన్ని జిల్లాలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు చేరువ కావడంతో పేదలకు ఆరోగ్య భరోసా చేకూరుతోంది. వందేళ్ల చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రంలో ఈ ఏడాది నుంచి ఒకేసారి 5 కొత్త వైద్య కళాశాలలను సీఎం జగన్ ప్రభుత్వం ప్రారంభిస్తోంది. దీంతో ఏకంగా 750 ఎంబీబీఎస్ సీట్లు అదనంగా అందుబాటులోకి రావడంతో మన విద్యార్థులకు వైద్య విద్య అవకాశాలు భారీగా పెరిగాయి. ప్రస్తుతం నంద్యాల, మచిలీపట్నం, ఏలూరు, రాజమహేంద్రవరం, విజయనగరం కొత్త మెడికల్ కాలేజీల్లో 2023–24 ఎంబీబీఎస్ అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతోంది.


విజయనగరం మెడికల్ కళాశాల ల్యాబొరేటరీ

తొలి రౌండ్‌లోనే కొత్త వైద్య కళాశాలల్లో కన్వీనర్ కోటా సీట్లన్నీ భర్తీ అయ్యాయి. రెండు మూడు రోజుల్లో సెల్ఫ్ ఫైనాన్స్ సీట్ల కేటాయింపు కూడా పూర్తి కానుంది.

రిజర్వేషన్ వర్గాలకు భారీ మేలు

కొత్తగా ప్రారంభిస్తున్న వైద్య కళాశాలల్లో ఒక్కో చోట 150 చొప్పున మొత్తం 750 సీట్లు ఉన్నాయి. ఇందులో 15 శాతం సీట్లు ఆల్ ఇండియా కోటా కింద పోగా మిగిలిన సీట్లలో 50 శాతం కన్వీనర్ కోటాకు కేటాయించారు. గతేడాది వరకూ ప్రభుత్వ రంగంలోని 12, 18 మైనారిటీ, ప్రైవేట్ కళాశాలల్లో 3,360 కన్వీనర్ కోటా సీట్లు ఉండేవి. ఈ ఏడాది ఐదు కొత్త కళాశాలల ఏర్పాటుతో ఒక్కో చోట 64 చొప్పున 320 సీట్లు కన్వీనర్ కోటాలో అదనంగా వచ్చి చేరాయి. దీంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు మెరిట్ విద్యార్థులకు భారీ మేలు చేకూరింది.


మచిలీపట్నం మెడికల్ కళాశాల

వలసలకు తెర

వైద్య విద్య డిమాండ్‌కు తగ్గట్టుగా రాష్ట్రంలో కళాశాలలు లేకపోవడంతో కజకిస్తాన్, ఉక్రెయిన్, చైనా, రష్యా తదితర దేశాలకు మన విద్యార్థులు వలస వెళుతున్నారు. వీటిని అరికట్టడంతోపాటు ప్రజలకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు చేరువ చేసేందుకు సీఎం జగన్ రూ.8,480 కోట్ల వ్యయంతో ఏకంగా 17 కొత్త వైద్య కళాశాలలు నెలకొల్పుతున్నారు. ఈ ఏడాది ఐదు కొత్త వైద్య కళాశాలల్లో 750 ఎంబీబీఎస్ సీట్లు అదనంగా అందుబాటులోకి వచ్చాయి. వచ్చే విద్యా సంవత్సరం మరో ఐదు, ఆ తర్వాత ఏడాది మిగిలిన ఏడు వైద్య కళాశాలలను ప్రారంభించనున్నారు. మొత్తం 17 కొత్త వైద్య కళాశాలల ఏర్పాటు ద్వారా ఏకంగా 2,550 సీట్లు అదనంగా పెరగనున్నాయి. వైద్య విద్య సీట్ల పెరుగుదలతో మన దగ్గర డాక్టర్ చదువులకు అవకాశాలు విస్తృతమై వలసలకు తెర పడనుంది.

అన్ని వసతులతో

తొలి ఏడాది ఎంబీబీఎస్ విద్యార్థుల అకడమిక్ కార్యకలాపాల కోసం కొత్త ఆస్పత్రుల్లో అన్ని వసతులను కల్పించారు. నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) నిబంధనలకు అనుగుణంగా బోధనాస్పత్రి, కళాశాలలను అభివృద్ధి చేశారు. ఐదు చోట్ల ఇప్పటికే ఉన్న జిల్లా ఆస్పత్రులను బోధనాస్పత్రులుగా అభివృద్ధి చేసిన ప్రభుత్వం వైద్యులు, సిబ్బంది, వైద్య పరికరాలను పూర్తి స్థాయిలో సమకూర్చింది. కళాశాలల్లో హైఎండ్ ఏవీ సదుపాయంతో లెక్చర్ గ్యాలరీలు, 3 వేల పుస్తకాలు, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ మెడికల్ జర్నల్స్ సేకరణతో సెంట్రల్ లైబ్రరీ, రీడింగ్ ఏరియా, అత్యాధునిక పరికరాలతో ల్యాబొరేటరీలు, టీచింగ్ రూమ్స్‌ను ఏర్పాటు చేశారు. హ్యూమన్ అనాటమీ, క్లినికల్ ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, ఫిజియాలజీ/హెమటాలజీ, సెంట్రల్ ల్యాబొరేటరీ, స్కిల్ డెవలప్‌మెంట్, రీసెర్చ్ ల్యాబ్‌లలో అన్ని వనరులు సమకూర్చారు. అమ్మాయిలు, అబ్బాయిలకు వేర్వేరు హాస్టళ్లు సిద్ధం చేశారు.

భవిష్యత్ తరాలకు బలమైన పునాదులు



ఏ దేశం, రాష్ట్రం అభివృద్ధికైనా విద్య, వైద్య రంగాలు గట్టి పునాదులు. యూరప్‌తోపాటు చైనా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, జపాన్, ఇజ్రాయెల్, క్యూబా, ఫిలిప్పీన్స్ లాంటి దేశాలు అనేక రంగాల్లో ముందంజలో ఉండటానికి ప్రధాన కారణం ఈ రెండు రంగాలకు ప్రాధాన్యం ఇవ్వడమే. దూరదృష్టితో సీఎం జగన్ రేపటి తరాల భవిత కోసం విద్య, వైద్య రంగాలను బలోపేతం చేస్తున్నారు.

– విడదల రజిని, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి

ఎన్నో ప్రయోజనాలు..



ఇన్నాళ్లూ ప్రైవేట్ కళాశాలల్లో సీట్లు వచ్చినా ఫీజుల భారాన్ని భరించలేక ఎంబీబీఎస్ చదివేందుకు విదేశాలు, ఇతర రాష్ట్రాలకు వెళ్తున్నారు. అక్కడ కోర్సు పూర్తి చేయడానికి ఐదేళ్లు పడుతోంది. ఇక ఎన్ఎంసీ నిర్వహించే పరీక్షలో ఉత్తీర్ణులై హౌస్ సర్జన్ పూర్తి చేసే క్రమంలో రెండు మూడేళ్లు వృథా అవుతోంది. అంతేకాకుండా అక్కడ చదివితే పీజీ ప్రవేశాల్లో నాన్–లోకల్‌గా పరిగణిస్తున్నారు. ఇలా ఇబ్బందులు ఎదుర్కొంటున్న మన విద్యార్థులకు ఊరట కల్పిస్తూ ప్రభుత్వ రంగంలోనే కొత్త వైద్య కళాశాలలు ఏర్పాటు కావడం శుభ పరిణామం. ప్రైవేట్ కళాశాలలతో పోలిస్తే ప్రభుత్వాస్పత్రుల్లో పలు ప్రయోజనాలుంటాయి. బోధనాస్పత్రుల్లో అపారమైన క్లినికల్ మెటీరియల్, అనుభవజ్ఞులైన సిబ్బంది ఉంటారు.

– డాక్టర్ బాబ్జీ, వైస్ చాన్సలర్, డా. వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం

క్లినికల్ స్కిల్స్ పెరుగుతాయి..



ప్రైవేట్ కళాశాలలకు ఏ మాత్రం తీసిపోకుండా కొత్త వైద్య కళాశాలల్లో ఎంతో మెరుగైన సదుపాయాలను ప్రభుత్వం కల్పించింది. 25 ఏళ్లకుపైగా అనుభవం కలిగిన ప్రిన్సిపాళ్లు, సూపరింటెండెంట్‌లను కళాశాలలు, ఆస్పత్రుల్లో నియమించారు. ఎన్ఎంసీ నిబంధనలకు అనుగుణంగా వనరులున్నాయి. దశాబ్దాలుగా సేవలందిస్తున్న జిల్లా ఆస్పత్రులనే బోధనాస్పత్రులుగా అభివృద్ధి చేశాం. దీంతో ఐపీ, ఓపీ, ఇతర సేవలు మెరుగ్గా కొనసాగుతున్నాయి. ఈ తరహా ఆస్పత్రులకు అనుసంధానమైన ప్రభుత్వ వైద్య కళాశాలల్లో చదవడం విద్యార్థులకు ఎంతో మంచిది. విద్యార్థుల్లో క్లినికల్ స్కిల్స్ అభివృద్ధి చెందుతాయి. ఇది వారి భవిష్యత్‌కు ఎంతో మేలు చేస్తుంది.

– డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్, ఏపీఎంఎస్ఐడీసీ

త్వరలో తరగతులు ప్రారంభం



ప్రస్తుతం కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. త్వరలో తరగతులు ప్రారంభిస్తాం. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో కొత్త వైద్య కళాశాలలను తీర్చిదిద్దాలనే దృఢ సంకల్పంతో సీఎం జగన్ ముందుకు వెళుతున్నారు.

– డాక్టర్ నరసింహం, డీఎంఈ

ఉత్తమ టూరిజం పాలసీ తెచ్చాం


హయత్ హోటల్లో సీఎం జగన్, చిత్రంలో హయత్ విజయవాడ చైర్మన్ వీరాస్వామి, మంత్రులు తదితరులు

▶ మొదటి పేజీ తరువాయి

ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఒబెరాయ్‌తో మొదలుకుని ఇవాళ ప్రారంభిస్తున్న హయత్ వరకు దాదాపు 11 పెద్ద బ్రాండ్ల సంస్థలను ప్రోత్సహిస్తూ ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమం ఇతరులకు స్ఫూర్తినిస్తూ మరింత మంది పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. హయత్ విజయవాడ చైర్మన్ వీరాస్వామి, హయత్ ఇంటర్నేషనల్ ఏరియా ప్రెసిడెంట్ శ్రీకాంత్, మేనేజింగ్ డైరెక్టర్ సాయి కార్తీక్‌తోపాటు ఈ ప్రాజెక్టులో పాలు పంచుకున్న అందరికీ శుభాభినందనలు తెలియచేశారు.

డైనమిక్ సీఎం.. బెస్ట్ టూరిజం పాలసీ

ప్రపంచ పర్యాటకులను ఆకర్షించే విధంగా అధునాతన వసతులతో హయత్ ప్లేస్‌ను తీర్చిదిద్దినట్లు హయత్ చైర్మన్ వీరాస్వామి చెప్పారు. హోటల్‌ను వందల సంఖ్యలో గదుల సదుపాయంతో అందుబాటులోకి తెచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం రాయితీలతో పాటు అన్ని రకాల సహాయ సహకారాలను అందచేసినట్లు తెలిపారు. డైనమిక్ సీఎం జగన్ ఉత్తమ టూరిజం పాలసీల ద్వారా రాయితీలు ఇచ్చి ప్రోత్సహిస్తున్నారని ఏరియా ప్రెసిడెంట్ శ్రీకాంత్ ధన్యవాదాలు తెలియచేశారు. హయత్ ప్లేస్ హోటల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో హోంశాఖ మంత్రి తానేటి వనిత, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, పర్యాటకశాఖ మంత్రి ఆర్కే రోజా, గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణు, కైలే అనిల్ కుమార్, అబ్బయ్యచౌదరి, ఎమ్మెల్సీ రుహుల్లా, పార్టీ తూర్పు నియోజక వర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాశ్, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఫైబర్‌నెట్ చైర్మన్ గౌతంరెడ్డి, టూరిజం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ, ఎండీ కన్నబాబు, కలెక్టర్ ఢిల్లీ రావు తదితరులు పాల్గొన్నారు.

అవినాశ్ నివాసానికి సీఎం జగన్

హయత్ ప్లేస్ హోటల్ ప్రారంభోత్సవానికి వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌ను విజయవాడ తూర్పు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ దేవినేని అవినాశ్ తమ నివాసానికి రావాలని సాదరంగా ఆహ్వానించారు. గుణదలలోని అవినాశ్ నివాసం వద్ద సీఎం జగన్‌కు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు భారీ సంఖ్యలో తరలి వచ్చి ఘన స్వాగతం పలికారు. జై జగన్ అని నినాదాలు చేస్తూ పూల వర్షం కురిపించారు. అవినాష్ కుటుంబ సభ్యులను సీఎం జగన్ ఆప్యాయంగా పలకరించారు. రాజకీయ జీవితం కల్పించిన సీఎం జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటామని అవినాశ్ కుటుంబ సభ్యులు భావోద్వేగానికి లోనయ్యారు. పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, తూర్పు నియోజకవర్గ నేతలు సీఎంను కలిశారు.

సమసమాజ స్థాపనే ప్రభుత్వ ధ్యేయం

- నిర్ణయాధికారంలో వెనుకబడిన వర్గాలకు ప్రాతినిధ్యం
- ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి


మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఏజెన్సీ, మైదాన ప్రాంతాల మధ్య అసమానతలు తొలగించి సమసమాజాన్ని నెలకొల్పటమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రజావ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. శాసన మండలి సభ్యులుగా నియమితులైన ప్రొఫెసర్ డాక్టర్ కుంభా రవిబాబు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం శుక్రవారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా రవిబాబు తన పదవికి పూర్తి స్థాయిలో న్యాయం చేశారని అన్నారు. అటువంటి వ్యక్తిని గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నియమించటం అతని సమర్థతకు నిదర్శనమన్నారు. నిర్ణయాధికారంలో దళితులు, గిరిజనులు, బహుజనులకు ప్రాతినిధ్యం కల్పించిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. కొండ కోనల్లో నివసించే గిరిజన ప్రజల కోసం ఆస్పత్రులు ఏర్పాటుచేసి అక్కడ నిపుణులైన వైద్యులను నియమించడం గిరిజనులపట్ల సీఎం జగన్‌కు ఉన్న ప్రేమాభిమానాలకు తార్కాణమని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతవాసుల సమగ్రాభివృద్ధికి సుమారు 10 లక్షల ఎకరాలను జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కేటాయించిందన్నారు. త్వరగా ఎన్నికలు వచ్చి తాను సీఎం అయిపోవాలన్న ఆలోచన తప్ప తన హయాంలో ఏం మేలు చేశాడో చెప్పుకోలేని స్థితిలో చంద్రబాబు ఉన్నాడని విమర్శించారు. ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర మాట్లాడుతూ.. ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా తన పదవికి న్యాయం చేసిన కుంభా రవిబాబు మైదాన, ఏజెన్సీ ప్రాంతాల మధ్య వారధిగా ఉంటారని తెలిపారు. మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడుతూ ఆదివాసీ చట్టాన్ని అమలు చేసి 6,76,000 మంది గిరిజనులకు పట్టాలు ఇచ్చిన ఘనత నాటి వైఎస్సార్, నేటి సీఎం జగన్‌దన్నారు. మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ వైఎస్ కుటుంబం వెనుకబడినవర్గాల ప్రజల కోసమే రాజకీయాల్లోకి వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు, ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవినేని అవినాశ్, విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎస్టీ కార్పొరేషన్ ట్రైకార్ డైరెక్టర్ మద్దిల రామకృష్ణ, వివిధ జిల్లాల ఆదివాసీ, గిరిజన సంఘాలు, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

'మార్గదర్శి' హ్యాండ్సప్

▶ మొదటి పేజీ తరువాయి

గమనార్హం. మొత్తంగా కనీసం రూ.2 వేల కోట్లకుపైగా బకాయిలు పడటంతో మార్గదర్శి దుకాణం మూత పడే పరిస్థితికి వచ్చింది. స్టాంపులు–రిజిస్ట్రేషన్లు, సీఐడీ అధికారులు రాష్ట్రంలోని 37 మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో వరుసగా రెండో రోజు శుక్రవారం కూడా నిర్వహిస్తున్న సోదాల్లో ఆ సంస్థ అక్రమాలు భారీగా బయట పడుతున్నాయి. తద్వారా ఈ సంస్థ ఏ క్షణంలో అయినా పేలిపోయే నీటి బుడగ అని స్పష్టమవుతోంది.

దివాలా అంచుకు మార్గదర్శి

మార్గదర్శి చిట్‌ఫండ్స్‌పై సీఐడీ కేసు నమోదు చేయడంతో రాష్ట్రంలో 2022 నవంబర్ నుంచి కొత్త చిట్టీ గ్రూపులు నిలిచిపోయాయి. అక్రమంగా నిధుల మళ్లింపుతో కొత్తగా చిట్టీలు వేసేందుకు చందాదారులు ముందుకు రావడం లేదు. దాంతో మనీ సర్క్యులేషన్ (గొలుసుకట్టు మోసాలు) తరహాలో వ్యాపారం నిర్వహిస్తున్న రామోజీరావుకు ఊహించని ఎదురు దెబ్బ తగిలింది. దీంతో పాత చిట్టీల చందాదారులకు చిట్టీ పాటల మొత్తం (ప్రైజ్ మనీ) చెల్లించడం తలకు మించిన భారంగా పరిణమించింది. మార్గదర్శి చిట్ ఫండ్స్ రాష్ట్రంలో దాదాపు 9 నెలలుగా తమ చందాదారులకు ప్రైజ్‌మనీ సక్రమంగా చెల్లించలేకపోతోందని స్టాంపులు– రిజిస్ట్రేషన్లు, సీఐడీ అధికారుల సోదాల్లో వెల్లడైనట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. రాష్ట్రంలో మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు ఉన్న 37 బ్రాంచీల పరిధిలో వేలాది మంది చందాదారులకు 9 నెలలుగా ప్రైజ్ మనీ చెల్లించడం లేదు. నెలకు రూ.260 కోట్ల టర్నోవర్ ఉండే మార్గదర్శి.. అందులో రూ.80 కోట్లు డివిడెండ్లుగా చెల్లించాల్సి ఉండగా.. రూ.180 కోట్ల వరకు చిట్టీ పాటల ప్రైజ్ మనీగా ఇవ్వాల్సి ఉంది. 2022 నవంబర్ నుంచి ఆ ప్రైజ్ మనీ మొత్తం సక్రమంగా చెల్లించక పోవడంతో బకాయిలు పేరుకుపోయాయి. ఆ ప్రకారం 9 నెలలకు రూ.1,620 కోట్ల వరకు బకాయిలు పేరుకుపోయాయని సీఐడీ అధికారులు గుర్తించినట్టు తెలిసింది. 2022 నవంబర్‌కు ముందు చిట్టీలు పాడిన చందాదారులకు పూర్తిగా ప్రైజ్ మనీ చెల్లించకుండా రశీదు రూపంలో అక్రమంగా డిపాజిట్లు సేకరించింది. 4 శాతం నుంచి 5 శాతం వడ్డీ చొప్పున ఆరు నెలల నుంచి రెండేళ్ల కాల పరిమితితో అక్రమ డిపాజిట్లు సేకరించింది. కాల పరిమితి ముగిసిన ఆ రశీదు డిపాజిట్లను కూడా 9 నెలలుగా చెల్లించలేకపోతోంది. ఈ బకాయిలు కూడా కలిపి మొత్తంగా దాదాపు రూ.2 వేల కోట్ల వరకు మార్గదర్శి చిట్ ఫండ్స్ బకాయి పడినట్టు సమాచారం.

ఏమండీ.. డబ్బులెప్పుడిస్తారు?

9 నెలలుగా చిట్టీ పాటల మొత్తం చెల్లించకపోవడంతో పెద్ద సంఖ్యలో చందాదారులు మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వారితోపాటు మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో రశీదు రూపంలో డిపాజిట్లు చేసిన వారు కూడా తమ సొమ్ము కోసం ప్రాధేయపడుతున్నారు. 'ఏమండీ.. మీ ఇబ్బందులతో మాకు సంబంధం లేదు. మా డబ్బులు ఎప్పుడిస్తారో చెప్పండి. మీరు తప్పులు చేయబట్టే మాకీ ఇబ్బందులు' అంటూ బాధితులు నిలదీస్తున్నారు. నిబంధనల ప్రకారం మూడు ష్యూరిటీలు చూపించినా.. వారు ప్రభుత్వ ఉద్యోగులు అయినా సరే ఏవేవో కొర్రీలు వేస్తూ డబ్బులు ఇచ్చేందుకు తిరస్కరిస్తున్నారు. అక్కడక్కడ ఒత్తిడి తెస్తున్న ఒక సామాజికవర్గం వారికి మాత్రం చిట్టీల మొత్తం చెల్లిస్తున్నట్లు స్టాంపులు–రిజిస్ట్రేషన్లు, సీఐడీ అధికారుల పరిశీలనలో వెల్లడైంది.

కీలక పత్రాలు స్వాధీనం

మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో నిర్వహించిన సోదాల్లో సీఐడీ అధికారులు కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. లెడ్జర్లు, తేదీలు లేకుండా పెద్ద సంఖ్యలో చెక్కులు, నిధుల మళ్లింపునకు సంబంధించిన ఆధారాలు, చందాదారుల బకాయిలకు సంబంధించిన పత్రాలు మొదలైనవి స్వాధీనం చేసుకున్నట్టు తెలుస్తోంది.

ఇది నిధుల మళ్లింపు పాపం

కేంద్ర చిట్ ఫండ్స్ చట్టం–1982 ప్రకారం చందాదారుల సొమ్మును ఇతర వ్యాపారాల్లో పెట్టుబడిగా పెట్టకూడదు. చందాదారులు చెల్లించే చిట్టీ సొమ్మును సంబంధిత బ్రాంచి పరిధిలోని జాతీయ బ్యాంకులో డిపాజిట్ చేయాలి. చిట్ ఫండ్స్ సంస్థ ఏ కారణంతోనైనా ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతే చందాదారులు నష్టపోకుండా ఆ నిబంధనలు విధించారు. ఎందుకంటే అక్రమంగా పెట్టిన పెట్టుబడులు వెంటనే వెనక్కి తేవడం సాధ్యం కాదు. కానీ ఈ రెండు నిబంధనలను రామోజీరావు ఏనాడూ పట్టించుకోలేదు. చందాదారులు చెల్లించిన సొమ్మును మ్యూచువల్ ఫండ్స్‌లో తమ కుటుంబ సభ్యుల పేరిట పెట్టుబడిగా పెట్టారు. దాంతోపాటు తమ కుటుంబ సంస్థలైన ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, ఉషోదయ ఎంటర్ ప్రైజస్‌లో పెట్టుబడులుగా మళ్లించడంతో మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారులు నష్టపోయే పరిస్థితి ఏర్పడింది.

ఇతర రాష్ట్రాల్లోనూ అలజడి

ఈ నేపథ్యంలో తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుల్లోని మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచిల నుంచి నిధులను ఆంధ్రప్రదేశ్‌లోని బ్రాంచిలకు మళ్లించాలని ఆ సంస్థ భావించినట్టు సమాచారం. కాగా ఆంధ్రప్రదేశ్‌లో చందాదారులను ముంచేసినట్టుగానే తమ నిధులను కూడా అక్రమంగా మళ్లిస్తారేమోనని ఆ రాష్ట్రాల్లోని చందాదారులు ఆందోళన చెందుతున్నారు. వారు ఆ రాష్ట్రాల్లోని బ్రాంచి మేనేజర్లను తరచూ సంప్రదిస్తూ తమ చిట్టీ పాటల మొత్తం వెంటనే చెల్లించాలని స్పష్టం చేస్తున్నారు. ఏమాత్రం ఆలస్యమైనా పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరిస్తున్నారు. దీంతో ఇతర రాష్ట్రాల్లో కూడా పోలీసు కేసులు నమోదైతే తట్టుకోలేమని మార్గదర్శి యాజమాన్యం బెంబేలెత్తుతోంది. మొత్తంగా మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు అన్ని దారులు మూసుకుపోయి ఆర్థికంగా అష్టదిగ్బంధనంలో చిక్కుకుపోయిందని చెప్పవచ్చు.

50 వేల మంది పరిస్థితి ఏమిటి?

రాష్ట్రంలోని 37 బ్రాంచిల పరిధిలో మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు 2022 నవంబర్ నాటికి దాదాపు లక్ష మంది చందాదారులు ఉండేవారు. మార్గదర్శి అక్రమాలు బయట పడటంతో ఆ తర్వాత కొత్త చిట్టీలు వేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో 20 వేల మంది కొత్త చందాదారులు నిలిచిపోయారు. పాత చందాదారులు లక్ష మందిలో దాదాపు 50 వేల మందికి సంబంధించిన చిట్టీల కాల పరిమితి ముగిసింది. మిగిలిన 50 వేల మంది చందాదారుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది.

డిఫాల్ట్ ముసుగులో దందా

డిఫాల్ట్ చందాదారుల ముసుగులో మార్గదర్శి చిట్ ఫండ్స్ యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతున్నట్టు స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ అధికారుల సోదాల్లో బయటపడింది. ఒక చందాదారుడు ఒక నెల చందా చెల్లించాక 8 నెలలు చందాలు చెల్లించకపోతే ఆయన/ఆమె డిఫాల్టర్ అవుతారు. అటువంటి డిఫాల్ట్ చందాదారులను చిట్టీ పాటకు అనుమతించకూడదు. కానీ 9 నెలల తర్వాత ఆ డిఫాల్ట్ చందాదారుని నుంచి బకాయి పడిన 8 నెలల చందాలకు చెక్కులు తీసుకున్నట్టుగా చూపిస్తున్నారు. ఆ చందాదారుని చిట్టీ పాటకు అనుమతిస్తున్నారు. ఆ చిట్టీ పాట ఆ చందాదారునికే వచ్చేట్టుగా చేస్తున్నారు. కానీ అసలు విషయం ఏమిటంటే... అసలు అక్కడ డిఫాల్ట్ చందాదారుని పేరిట మార్గదర్శి చిట్‌ఫండ్సే ఈ దందా నడుపుతోంది. ఎందుకంటే ఆ చందాదారు ఇచ్చినట్టు చూపిస్తున్న చెక్కులను ఎన్‌క్యాష్‌మెంట్ కోసం బ్యాంకులో జమ చేయడం లేదు. అంటే చెక్కులు ఇచ్చినట్టు చూపడం.. చిట్టీ పాటకు అనుమతించడం అంతా బోగస్ అని సీఐడీ సోదాల్లో వెల్లడైంది. ఆ ముసుగులో నల్లధనాన్ని భారీగా చలామణిలోకి తీసుకువస్తున్నారన్నది స్పష్టమైంది. మరోవైపు డిఫాల్ట్ చందాదారులను అనుమతించడంతో సక్రమంగా చందాలు చెల్లించే చందాదారులు డివిడెండ్ నష్టపోతున్నారు.

సర్కారు 'అటాచ్‌మెంట్' నిర్ణయం

అగ్రిగోల్డ్ సంస్థ తరహాలో చందాదారులకు సొమ్ము చెల్లించలేక మార్గదర్శి చిట్ ఫండ్స్ చేతులెత్తేస్తే.. వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుగానే అప్రమత్తమైంది. ఇందులో భాగంగా మార్గదర్శి చిట్ ఫండ్స్ అక్రమంగా పెట్టిన పెట్టుబడులను అటాచ్ చేసేందుకు సీఐడీకి అనుమతిచ్చింది. మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టిన రూ.1,035 కోట్లతోపాటు రామోజీరావు కుటుంబ సంస్థలైన ఉషా కిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్‌లో 88.50 శాతం వాటా, ఉషోదయ ఎంటర్ ప్రైజస్‌లో 44.50 శాతం వాటాను అటాచ్ చేసేందుకు అనుమతి కోరుతూ సీఐడీ న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసింది. దాంతో మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక పరిస్థితి కుదేలైందన్న విషయం వ్యాపార, పారిశ్రామికవర్గాలకు స్పష్టమైంది. ఇతర వ్యాపార సంస్థల నుంచి గుట్టుచప్పుడు కాకుండా నిధులు సేకరిద్దామన్న రామోజీ వ్యూహం బెడిసి కొట్టినట్టు సమాచారం.

గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారం

సాక్షి, అమరావతి: గవర్నర్ కోటాలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన మండలి సభ్యులుగా నియమితులైన కర్రి పద్మ శ్రీ , డాక్టర్ కుంభా రవిబాబు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేను రాజు తన చాంబరులో ఇద్దరి చేత ఎమ్మెల్సీలుగా ప్రమాణం చేయించారు. ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు)సజ్జల రామకృష్ణారెడ్డి, మాజీ మంత్రి కురసాల కన్నబాబు, ఎమ్మెల్యే విశ్వసరాయి కళావతి తదితరులు నూతన ఎమ్మెల్సీలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో శాసన సభ సెక్రటరీ జనరల్ డా.పి.పి.కె. రామాచార్యులు, శాసన మండలి ఓఎస్డీ సత్యనారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.


సీఎంను కలిసిన ఎమ్మెల్సీలు రవిబాబు, పద్మశ్రీ

ఎమ్మెల్సీలుగా ప్రమాణ స్వీకారం చేసిన కర్రి పద్మశ్రీ, డాక్టర్ కుంభా రవిబాబు తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. కుటుంబ సభ్యులతో సహా సీఎం జగన్‌ని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

కాంట్రాక్టు లెక్చరర్ల జీవితాల్లో వెలుగులు

సీఎం వైఎస్ జగన్ నిర్ణయంపై హర్షాతిరేకాలు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగులకు సంబంధించి ఇబ్బందికరంగా ఉన్న ఐదేళ్ల నిబంధనను తొలగించి 2014 జూన్ 2వ తేదీకి ముందు పనిచేసిన అందరినీ రెగ్యులర్ చేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయానికి కాంట్రాక్టు లెక్చరర్లు హర్షం వ్యక్తం చేశారు. తాడేపల్లిలో వీరంతా జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపే కార్యక్రమం నిర్వహించారు. సీఎం జగన్ నిర్ణయంతో విద్యాశాఖలో జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కాలేజీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లు ఎక్కువమందికి లబ్ధి చేకూరిందన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి వేలాది మంది కాంట్రాక్టు లెక్చరర్లు తాడేపల్లిలోని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ సీఎం చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి భారీ కేక్‌ను కట్‌చేసి సజ్జల రామకృష్ణారెడ్డిని గజమాలతో సత్కరించారు. తమ తరఫున సీఎంకు ధన్యవాదాలు తెలియజేయాలని వారు విన్నవించారు. అనంతరం జై సీఎం జగన్ అంటూ నినదించారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. తాత్కాలిక ఉద్యోగుల గుండెల్లో సీఎం జగనన్న చిరస్థాయిగా నిలిచిపోతారని వారందరూ కొనియాడారు. అనంతరం సజ్జల మాట్లాడుతూ.. సీఎం జగన్ అటు ప్రజలు ఇటు ఉద్యోగుల శ్రేయస్సు కోసం అహర్నిశలు కృషిచేస్తున్నారని తెలిపారు. పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకున్నారన్నారు. రెండు దశాబ్దాలకు పైగా అపరిష్కృతంగా ఉన్న సమస్యను సీఎం జగన్ ప్రభుత్వం ఆర్థిక భారమైనా పరిష్కరించి రెగ్యులరైజ్ చేయడం చారిత్రాత్మక నిర్ణయమని తెలిపారు. ఈ సందర్భంగా.. ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగులు పలువురు మాట్లాడారు. వారు ఏమన్నారంటే..


ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతగా నినాదాలు చేస్తున్న ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట్ లెక్చరర్ ఉద్యోగుల అసోసియేషన్ సభ్యులు

గత పాలకులు ఎగతాళి చేశారు



ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగుల జీతాలు పెంచమంటే మీకిదే ఎక్కువని గత పాలకులు గేలి చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగనన్న మా బాధలు చూసి స్వయంగా మా ధర్నా శిబిరాలకు వచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చి మాట నిలబెట్టుకున్నారు. కలకాలం ఆయనకు రుణపడి ఉంటాం.

– కల్లూరి శ్రీనివాస్, కాంట్రాక్ట్ లెక్చరర్స్ జేఏసీ కో–చైర్మన్

10 వేలకు పైగా కుటుంబాల్లో వెలుగులు



రెండు దశాబ్దాలకు పైగా అపరిష్కృతంగా ఉన్న సమస్యను సీఎం జగన్ పరిష్కరించారు. చంద్రబాబు మమ్మల్ని పట్టించుకోలేదు. కానీ, జగన్ పాదయాత్రలో మా సమస్యను విని సీఎం అయ్యాక చిత్తశుద్ధితో పరిష్కరించారు. ఈ నిర్ణయంతో 10,117 కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపారు. మా కుటుంబాలు ఆయనకు అండగా ఉంటాయి.

– డి. ఉమాదేవి, కాంట్రాక్ట్ లెక్చరర్ల జేఏసీ మహిళా కార్యదర్శి

సీఎం మేలు మరువలేం..



సీఎం జగనన్న మాట ఇచ్చారు.. నిలబెట్టుకున్నారు. పది కాలాలపాటు సీఎం జగనన్న ముఖ్యమంత్రిగా ఈ రాష్ట్రాన్ని పాలించాలి. మహిళా ఉద్యోగులందరం కలిసి ఆయనకు కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాం. ఆయనకు దైవకృప, ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయి.

– ఆర్. దీప, కాంట్రాక్ట్ లెక్చరర్ (కాంట్రాక్ట్ లెక్చరర్ల జేఏసీ మహిళా కార్యదర్శి)

ఐదేళ్ల నిబంధన తొలగింపు చరిత్రాత్మకం..

సీఎం జగనన్న తీసుకున్న రెగ్యులరైజేషన్ నిర్ణయం 4,500 మంది కాంట్రాక్టు ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపింది. ఐదేళ్ల నిబంధన తొలగింపు నిర్ణయం చరిత్రాత్మకం. జీవితాంతం సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం. వైఎస్ జగన్ మళ్లీ సీఎం అయ్యేందుకు నిరంతరం కృషిచేస్తాం.

– కుమ్మరకుంట సురేష్, కాంట్రాక్ట్ లెక్చరర్స్ జేఏసీ రాష్ట్ర చైర్మన్

10 లక్షల జనాభాకు 100 ఎంబీబీఎస్ సీట్లు

- ఈ నిష్పత్తి ఆధారంగా కొత్త వైద్య కళాశాలలకు అనుమతులు
- ఇకపై 50, 100, 150 సీట్లకే అనుమతి
- కనీసం 220 పడకల బోధనాస్పత్రి తప్పనిసరి
- కొత్త వైద్య కళాశాలల అనుమతులకు ఎన్ఎంసీ మార్గదర్శకాలు విడుదల

సాక్షి, అమరావతి: ఇకపై 10 లక్షల జనాభాకు 100 ఎంబీబీఎస్ సీట్ల ప్రాతిపదికన కొత్త వైద్య కళాశాలల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేస్తామని నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) వెల్లడించింది. ఈ మేరకు 2024–25 విద్యా సంవత్సరం నుంచి కొత్త వైద్య కళాశాలలు ఏర్పాటు, ఎంబీబీఎస్ సీట్ల పెంపునకు సంబంధించి కనీస ప్రామాణిక అవసరాలు (మినిమమ్ స్టాండర్డ్స్ రిక్వైర్మెంట్స్)–2023 మార్గదర్శకాలను ఎన్ఎంసీ శుక్రవారం విడుదల చేసింది. అదే విధంగా.. 2024–25 విద్యా సంవత్సరానికి నూతన కళాశాలల ఏర్పాటు, మెడికల్ సీట్ల పెంపునకు దరఖాస్తులను ఆహ్వానించారు. ఈ నూతన మార్గదర్శకాల ప్రకారం..

- ఇకపై కొత్త వైద్య కళాశాలల్లో 50, 100, 150 సీట్ల వరకే అనుమతిస్తారు.
- ఎంబీబీఎస్ విద్యార్థులు, కళాశాలల్లో పనిచేసే బోధనా సిబ్బందికి ఆధార్ ఆధారిత అటెండెన్స్ విధానాన్ని అమలుచేస్తారు. ప్రతి ఒక్కరికీ ఏడాదికి కనీసం 75 శాతం హాజరు ఉండాలి.
- కళాశాల, బోధనాసుపత్రులకు వేర్వేరు భవనాలు ఉన్నట్లయితే వాటి మధ్య దూరాన్ని గరిష్టంగా 30 నిమిషాల్లో చేరేలా ఉండాలి.
- బోధనాస్పత్రిలో కనీసం 220 పడకలుండాలి.
- కళాశాలల్లో కచ్చితంగా 21 విభాగాలు ఉండాల్సిందే.
- కొత్తగా ఇంటిగ్రేటివ్ మెడిసిన్ రీసెర్చ్‌ను.. సిబ్బంది పిల్లల కోసం చైల్డ్‌కేర్ సెంటర్‌ను ఏర్పాటుచేయాలి.
- మూడు మ్యూజియంలు ఉండాలి. అందులో ఒకటి అనాటమీ, రెండు.. పాథాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్.. మూడోది ఫార్మకాలజీ, మైక్రోబయాలజీ, కమ్యూనిటీ మెడిసిన్‌కు కేటాయించాలి. వీటితో పాటు లైబ్రరీ, స్కిల్ ల్యాబొరేటరీ సదుపాయాలుండాలి.
- కళాశాలకు అనుబంధంగా గ్రామీణ ఆరోగ్య శిక్షణ కేంద్రాలు/కమ్యూనిటీ హెల్త్/అర్బన్ హెల్త్ సెంటర్లు ఉండాలి.
- ఒక్కో కేంద్రంలో 15 మంది చొప్పున విద్యార్థులను ఇంటర్న్స్‌గా పోస్ట్ చేయాలి.

కొత్తగా 195 యూనిట్లకు భూమి కేటాయింపు

సాక్షి, అమరావతి: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతోంది. పరిశ్రమలకు భూ కేటాయింపుల్లో ఈ వర్గాలకు పెద్ద పీట వేస్తోంది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు తాజాగా చేసిన భూ కేటాయింపుల్లోనూ వీరికి అధిక ప్రాధాన్యతనిచ్చింది. రాష్ట్రంలో కొత్తగా 195 పరిశ్రమలకు 467.13 ఎకరాలు కేటాయిస్తూ ప్రభుత్వం శుక్రవారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ పరిశ్రమల్లో 57 శాతం అంటే 111 యూనిట్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందినవే. అందులో అత్యధికంగా మహిళల యూనిట్లే ఉన్నాయి. 54 యూనిట్లు ఎస్సీ వర్గాలకు చెందిన వారు ఏర్పాటు చేస్తుండగా, ఎస్టీలు 15, బీసీలు 42 యూనిట్లు ఏర్పాటు చేస్తున్నారు. మొత్తం 195 యూనిట్ల ద్వారా రూ.5,153.43 కోట్ల పెట్టుబడులు రానున్నాయి. 10,219 మందికి ఉపాధి లభిస్తుంది. రెండు సెంట్ల భూమి నుంచి రెండు ఎకరాల లోపు భూమిలో చిన్న పెట్టుబడులతో బడుగు, బలహీన వర్గాలు ఈ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నాయి. వీటిలో ఆటోమొబైల్ వెల్డింగ్స్, పేపర్ ప్లేట్స్, బొమ్మల తయారీ, రెడీమేడ్ గార్మెంట్స్, వుడ్ కార్వింగ్, కుట్టు మిషన్ల తయారీ, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి యూనిట్లు ఎక్కువగా ఉన్నాయి.

జనరల్ కేటగిరీ విభాగంలో పెద్ద పరిశ్రమలు

జనరల్ కేటగిరీ విభాగంలో జరిగిన భూ కేటాయింపుల్లో అత్యధికంగా భారీ పరిశ్రమలు ఉన్నాయి. హెల్లా ఇన్‌ఫ్రా నాయుడుపేట ఇండస్ట్రియల్ పార్కులో రూ.260.70 కోట్లతో పీవీసీ పైపుల తయారీ యూనిట్ ఏర్పాటు చేస్తోంది. ఈ పరిశ్రమకు 26.75 ఎకరాలు కేటాయించారు. ఏఐఎల్ డిక్సన్ కొప్పర్తి ఈఎంసీలో 0.46 ఎకరాల్లో రూ.105.26 కోట్లతో డిజిటల్ వీడియో రికార్డులు, కెమెరాల తయారీ పరిశ్రమ ఏర్పాటు చేస్తోంది. గ్రేస్ వెంచర్స్ రూ.520 కోట్లతో నాయుడుపేటలో బయో ఇథనాల్ యూనిట్, ఆరోకెమ్ ఇంగ్రిడియంట్స్ రూ.320 కోట్లతో నాయుడుపేట సెజ్‌లో ఆరోమా ఇంగ్రిడియంట్స్ యూనిట్, ఎవరెస్ట్ స్టీల్ రూ.242.13 కోట్లతో అనంతపురంలో పీఈబీ ప్లాంట్, అబీస్ ప్రొటీన్స్ రూ.150 కోట్లతో చిత్తూరులో చికెన్ ప్రాసెసింగ్ యూనిట్, తారకేశ్వర లాజిస్టిక్ పార్క్ రూ.180 కోట్లతో విశాఖలో వేర్‌హౌసింగ్, రూ.1,771.50 కోట్లతో హిందాల్కో తిరుపతిలో అల్యూమినియం ఉత్పత్తుల తయారీ యూనిట్ ఏర్పాటు చేయడానికి భూములు కేటాయించారు.

నిషేధిత జాబితా నుంచి నెలలో 'అసైన్డ్'కు విముక్తి

- 'అసైన్డ్' హక్కులపై స్పీడు పెంచిన ప్రభుత్వం
- జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ యంత్రాంగానికి టైం లైన్
- గ్రామాల్లో 50 ఎకరాలుంటే వారంలో 22(ఎ) నుంచి తొలగింపు
- 150 ఎకరాలకు 2 వారాలు, 250 ఎకరాలకు 3 వారాలు
- 250 ఎకరాలకు పైబడి ఉంటే నెలలో విముక్తి
- 15 లక్షల మందికి పైగా రైతులకు లబ్ధి
- వీరిలో అత్యధిక శాతం దళితులే



సాక్షి, అమరావతి: అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పిస్తూ చట్ట సవరణ చేసిన ప్రభుత్వం.. దాన్ని వేగంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే దీనిపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయగా, ఎప్పటిలోగా పూర్తి చేయాలనే విషయంపై తాజాగా అధికార యంత్రాంగానికి టైం లైన్ నిర్దేశించింది. నెల రోజుల్లో రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో కసరత్తు ముగించి అసైన్‌మెంట్ జరిగి 20 సంవత్సరాలు పూర్తయిన అసైన్డ్ భూములను నిషేధిత ఆస్తుల జాబితా (22)ఏ నుంచి తొలగించాలని ఆదేశించింది. అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పిస్తూ చట్ట సవరణ చేసిన గత నెల 31వ తేదీకి ఈ భూములు సంబంధిత రైతులు, వారి వారసులు లేదా లీగల్ హైర్స్ ఆధీనంలో ఉంటే వారికి యాజమాన్య హక్కులు లభిస్తాయి. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, భూపరిపాలన ప్రధాన కమిషనర్ జి. సాయిప్రసాద్ జిల్లా కలెక్టర్లకు ఆదేశాలిచ్చారు.

వారం నుంచి నెల రోజుల గడువు

రైతుకు కేటాయించి 20 సంవత్సరాలు పూర్తయిన అసైన్డ్ భూములను 22 (ఎ) నుంచి తొలగించేందుకు వీఆర్వో నుంచి తహశీల్దార్, జేసీ, కలెక్టర్లు చేయాల్సిన పనులను కూడా వివరిస్తూ ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చింది. ఇప్పుడు 50 ఎకరాల వరకు అసైన్డ్ భూములున్న గ్రామాల్లో వారం రోజుల్లో వాటిని 22(ఎ) నుంచి తొలగించాలని సూచించింది. 150 వరకు ఉంటే రెండు వారాలు, 250 ఎకరాలు ఉంటే మూడు వారాలు, 250 ఎకరాలకు పైబడి అసైన్డ్ భూములుంటే నాలుగు వారాల్లో (నెల రోజుల్లో) ఆ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని స్పష్టం చేసింది. ఈ గడువు ప్రకారం పని జరిగేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా 22 లక్షల ఎకరాల అసైన్డ్ భూములపై రైతులకు యాజమాన్య హక్కులు లభిస్తాయి. ఈ భూములపై హక్కులు ఇవ్వాలని అనేక సంవత్సరాలుగా కోరుతున్న 15 లక్షల మందికిపైగా రైతులు లబ్ధి పొందనున్నారు. వారిలో మెజారిటీ రైతులు దళితులే.

అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ హరి మృతి


బంధన హరి

కాకినాడ/సాక్షి,అమరావతి: ఆంధ్రప్రదేశ్ అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్, మత్స్యకార నాయకులు బంధన హరి (64) శుక్రవారం మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలున్నారు. కొద్ది రోజులుగా అస్వస్థతతో బాధపడుతున్న ఆయన శుక్రవారం ఉదయం జిల్లా కేంద్రం కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కన్నుమూశారు. మత్స్యకార సామాజిక వర్గాల్లో పట్టున్న బంధన హరి సుదీర్ఘకాలంగా రాజకీయాల్లో కొనసాగుతున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయనను ఆంధ్రప్రదేశ్ అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారు.

సీఎం జగన్ సంతాపం..

రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ బందన హరి మృతి పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు సీఎం ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాగా, కాకినాడ ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు, ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి కూడా బంధన హరి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

ఔత్సాహిక బ్రాహ్మణ పారిశ్రామికవేత్తలకు రుణాలు

- విజయవాడలో సెప్టెంబరు 10న అవగాహన కార్యక్రమం
- ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ

సాక్షి, అమరావతి: బ్రాహ్మణుల్లోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రుణాలిచ్చే విషయంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ నిర్ణయించింది. ఇందుకోసం విజయవాడలో స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్‌చైర్మన్ మల్లాది విష్ణు అధ్యక్షతన సెప్టెంబరు 10న ప్రాంతీయ అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ప్రాంతీయ ప్రతినిధి జి. శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సొసైటీ ద్వారా వివిధ రకాల గ్రూపు రుణాలను కూడా పంపిణీ చేస్తున్నామని.. పురోహిత మిత్ర కార్యక్రమంలో పురోహితులు లేదా చిన్న ఆలయాల్లో పనిచేసే నలుగురికి కలిపి గరిష్టంగా రూ.1.60 లక్షల చొప్పున.. అర్చక మిత్ర కార్యక్రమంలో, ఆలయాల్లో అర్చకులుగా పనిచేసే వారికి తగిన ష్యూరిటీ మీద వారి వేతనంపై 18 రెట్లు గానీ లేదా గరిష్టంగా రూ.10 లక్షల రుణాలు అందజేస్తున్నామన్నారు. అలాగే, బ్రాహ్మణులలో కొత్తగా వ్యాపారాలు ఏర్పాటుచేసుకోదలిచిన వారికి.. ఇప్పటికే వ్యాపారాలు నిర్వహించే వారికీ రూ.2 లక్షల వరకు బిజినెస్ రుణాలు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. ఇక అరుంధతి కార్యక్రమంలో.. ముగ్గురేసి బ్రాహ్మణ మహిళలకు రూ.45 వేల నుంచి గరిష్టంగా రూ.లక్షన్నర మొత్తం రుణంగా ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే, సమాచార మిత్ర కార్యక్రమంలో బ్రాహ్మణ జర్నలిస్టులకు రూ.50 వేల వరకు.. బ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన ప్రభుత్వోద్యోగులకు గరిష్టంగా రూ.10 లక్షల వరకు వ్యక్తిగత రుణాలు ఇస్తామన్నారు.

తెలంగాణ

బ్యాటరీల సామర్థ్యం పెంచడంపై దృష్టిపెట్టాలి

- శాస్త్రవేత్తలకు నీతి ఆయోగ్ సభ్యుడు వీకే సారస్వత్ పిలుపు
- ఆల్టిమైన్ ఆధ్వర్యంలో ఏఆర్‌సీఐలో దేశంలోనే తొలి ఎల్ఎఫ్‌పీ ప్లాంట్ ఆవిష్కరణ

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ వాహనాలు ఎక్కువ దూరం వెళ్లగలిగేలా సామర్థ్యాన్ని పెంచే బ్యాటరీల తయారీపై శాస్త్రవేత్తలు దృష్టిపెట్టాలని నీతి ఆయోగ్ సభ్యుడు వీకే సారస్వత్ పిలుపునిచ్చారు. ప్రస్తుతం విద్యుత్ వాహనాలతోపాటు చాలా రకాల ఉపకరణాల్లో వినియోగిస్తున్న లిథియం– అయాన్ బ్యాటరీల్లోని క్యాథోడ్‌లకు కావాల్సిన 'లిథియం ఫెర్రో ఫాస్ఫేట్ (ఎల్ఎఫ్‌పీ)' తయారీకి ఆల్టిమైన్ సంస్థ ఏఆర్‌సీఐలో పైలట్ ప్రాజెక్టును ఏర్పాటు చేసింది. ఈ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం సందర్భంగా శుక్రవారం జరిగిన కార్యక్రమంలో సారస్వత్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. హైదరాబాద్‌లోని 'ఇంటర్నేషనల్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ సెంటర్ ఫర్ పౌడర్ మెటలర్జీ అండ్ న్యూ మెటీరియల్స్ (ఏఆర్‌సీఐ)' అభివృద్ధి చేసిన సాంకేతిక పరిజ్ఞానానికి ఆల్టిమైన్ మరింత పదును పెట్టి అతితక్కువ కాలంలో మార్కెట్‌లోకి తీసుకొచ్చిందన్నారు. ఎల్ఎఫ్‌పీ తయారీకి కావాల్సిన 85 శాతం ముడిపదార్థాలను స్థానికంగా సేకరిస్తుండటంతో బ్యాటరీల ధరలు తగ్గి, విద్యుత్ వాహనాల వినియోగాన్ని పెంచుతుందని చెప్పారు. ఇక ఆల్టిమైన్ తరహాలోనే ఇతర కంపెనీలు కూడా ప్రభుత్వ సంస్థల పరిశోధనల సాయంతో సామాజిక అవసరాలను తీర్చే టెక్నాలజీలను అభివృద్ధి చేయాలని కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన అణు శాస్త్రవేత్త, ఏఆర్‌సీఐ గవర్నింగ్ కౌన్సిల్ అధ్యక్షుడు డాక్టర్ అనిల్ కాకోద్కర్ పిలుపునిచ్చారు. ఇక ఎల్ఎఫ్‌పీని స్థానికంగా తయారు చేసుకోవడం వల్ల విదేశాలపై ఆధారపడటం తగ్గుతుందని ఆల్టిమైన్ సంస్థ సీఈవో అంజని శ్రీమౌర్య తెలిపారు.

జాతీయ మత్స్యకార సంఘం ఉపాధ్యక్షుడిగా పూర్ణ చంద్రరావు



సాక్షి, అమరావతి: జాతీయ మత్స్యకార సంఘం (ఎన్ఏఎఫ్) జాతీయ ఉపాధ్యక్షుడిగా బంధన పూర్ణచందరరావును నియమించినట్లు ఆ సంఘ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ అనంత నగేష్ బాబు తెలిపారు. శుక్రవారం బెంగళూరులో జరిగిన జాతీయ కౌన్సిల్, కార్యవర్గ సమావేశంలో పూర్ణను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల కంటే ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మత్స్యకారులకు అండగా నిలిచిందని తెలిపారు. కాగా, పూర్ణ చంద్రరావు ప్రస్తుతం ఏపీ మత్స్యకారుల కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఉన్నారు.

● ఆనాటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విశాఖపట్టణం ఎయిర్‌పోర్టులో జరిగిన హత్యాయత్నాన్ని నిరసిస్తూ గుంటూరు జిల్లా మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) 2018లో చేసిన ధర్నాపై టీడీపీ పెట్టిన అక్రమ కేసును శుక్రవారం మంగళగిరి కోర్టు కొట్టేసింది.

> ఏ మనస్సు సంచరించే ఇంద్రియాలకు లోబడి వాటిననుసరిస్తుందో, అది నీటిలో పడవను గాలి లాగివేసినట్లు పురుషుని ప్రజ్ఞను లాగి వేస్తుంది.
> – హిందూ ధర్మం

సాక్షి

శనివారం, 19 ఆగస్టు 2023

ప్రశంసనీయమైన ప్రయత్నం

'అక్కడ అనాథల ఆక్రందన. అక్కడ అసహాయుల ఆర్తనాదం. అక్కడ పేదల కన్నీటి జాలు. అదే సుమా కోర్టు....' సుప్రసిద్ధ రచయిత రాచకొండ విశ్వనాథ శాస్త్రి అరవై రెండేళ్లనాటి 'న్యాయం' కథలో గుండెల్ని పిండే వాక్యాలివి. ఈ అనాథల్లో, ఈ అసహాయుల్లో, ఈ నిరుపేదల్లో మహిళలకు మరిన్ని కష్టాలు! ఆలస్యంగానైనా మన సర్వోన్నత న్యాయస్థానం ఈ విషయంలో ప్రశంసనీయమైన పని చేసింది. న్యాయస్థానాల్లో సాగే వాదప్రతివాదాల్లో, విచారణల్లో, తీర్పుల్లో మహిళలకు సంబంధించి దశాబ్దాలుగా ఎంతో అలవోకగా వాడుతున్న పదాలను ఇకపై ఉపయోగించడానికి వీల్లేదంటూ సుప్రీంకోర్టు నిర్దేశించింది. ఆ పదాలకు ప్రత్యామ్నాయంగా ఏయే పదాలను ఉపయోగించాలో వివరిస్తూ బుధవారం ఒక పుస్తకాన్ని విడుదల చేసింది. వ్యవస్థలన్నీ ఎక్కడినుంచో ఊడిపడవు. సమాజంలో ఉండే అసమానతలు, వివక్ష, ఆధిపత్య ధోరణులు వంటి సమస్త అవలక్షణాలూ వ్యవస్థల్లో కూడా ప్రతిఫలిస్తుంటాయి. న్యాయస్థానాల్లో ఈ పెడధోరణులు ఉండరాదని విశ్వసించి, అందుకోసం కృషి చేసిన న్యాయమూర్తులు లేకపోలేదు. కానీ వ్యక్తులుగా కృషి చేయటం వేరు, వ్యవస్థే తనంత తాను సరిదిద్దుకునేందుకు పూనుకోవడం వేరు. వృత్తి ఉద్యోగాలరీత్యా సరేగానీ... పౌరుల్లో అత్యధికులు కేసుల్లో ఇరుక్కొని కోర్టు మెట్లెక్కాలనీ, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాలనీ కోరుకోరు. మహిళల్లో ఈ విముఖత మరింత ఎక్కువ. ఇతరచోట్ల కంటే అక్కడ లింగ వివక్ష అధికం కావటమే ఇందుకు కారణం. మరీ ముఖ్యంగా కింది కోర్టుల్లో మహిళల పట్ల ఉపయోగించే భాష, సంబోధనలు అమానవీయంగా ఉంటాయి. పర్యవసానంగా న్యాయం కోసం వెళ్లేవారికి అవమానాలే మిగులుతున్నాయి.

మన రాజ్యాంగం అన్ని అంశాల్లో సమానత్వాన్ని ప్రబోధించింది. లింగ, వర్ణ, జాతి, కుల, మతాలను ఆధారం చేసుకుని వివక్ష ప్రదర్శించరాదని నిర్దేశించింది. ఇందుకు రాజ్యాంగ పీఠిక మాత్రమే కాదు... 14, 15, 16 అధికరణలతోపాటు 325 అధికరణం కూడా సాక్ష్యాలు. ఆదేశిక సూత్రాల్లో సైతం లింగ సమానతను సాధించటానికి ప్రభుత్వాలు పాటుపడాలన్న ఆకాంక్ష వ్యక్తమైంది. లింగ వివక్షకు తావులేకుండా పౌరులందరికీ పనిచేసే హక్కు కల్పించడంతోపాటు, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని 39(డి), 41 అధికరణలు నిర్దేశించాయి. కానీ స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లవుతున్నా ఇవి విరగడ కాలేదు. మహిళల విషయంలో ఎలాంటి దురాచారాలు, పెడ ధోరణులు అలుముకుని ఉన్నాయో మన రాజ్యాంగ నిర్మాతలకు సంపూర్ణ అవగాహన ఉంది. అందుకే వాటిని రూపుమాపటానికి పూనుకొన్నారు. దానికి అనుగుణంగా కాలక్రమంలో ప్రభుత్వాలు చాలా చట్టాలు తీసుకొచ్చాయి. కానీ దురదృష్టమేమంటే అమలు చేసే వ్యవస్థలు సైతం పితృస్వామిక భావజాలంలో కూరుకుపోవటంతో సమానత్వం అసాధ్యమవుతోంది. తమ ముందున్న కేసులోని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి తీర్పు చెప్పవలసిన న్యాయమూర్తులు సైతం విచారణ క్రమంలో కావొచ్చు, తీర్పుల్లో కావొచ్చు... మహిళలకు సంబంధించి సమాజంలో ఉన్న పెడ ధోరణులను ప్రతిబింబించే పదాలను వాడుతుంటారు. ఒక్కోసారి వాంఛనీయం కాని వైఖరిని ప్రదర్శిస్తుంటారు. ఉద్దేశపూర్వకం అయినా కాకపోయినా, వాటివల్ల మౌలికంగా న్యాయం తారుమారు కాకపోయినా... మన రాజ్యాంగం నిర్దేశించిన విలువలకు, విధానాలకు ఆ వైఖరి, ఆ పదాల వాడకం విరుద్ధమైనవి. ఈ విషయంలో రెండో మాటకు తావులేదు. వ్యభిచారం కేసుల్లో, వివాహేతర సంబంధంలో ఉన్న పురుషులకు ప్రత్యేక పదాలు లేవు. కానీ స్త్రీ విషయంలో అలా కాదు... వేశ్య, వ్యభిచారిణి, ఉంపుడు కత్తె, కాముకి అనే అర్థాలు వచ్చే రకరకాల పదాలు ఇంగ్లిష్‌లో ఉన్నాయి. కేసుల విచారణ సమయంలో న్యాయవాదులు, న్యాయమూర్తులు వీటిని యధేచ్ఛగా ఉపయోగిస్తున్నారు. అంతేకాదు... రెచ్చగొట్టే దుస్తులు, పెళ్లికాకుండానే తల్లయిన యువతి వంటివి వాడుతున్నారు.

2012 డిసెంబర్‌లో దేశ రాజధాని నగరంలో కదిలే బస్సులో ఒక యువతిపై మూకుమ్మడి అత్యాచారం జరిగాక కఠినమైన నిర్భయ చట్టం అమల్లోకి వచ్చింది. అత్యంత అమానవీయమైన, దుర్మార్గమైన ఆ ఉదంతం తర్వాత సమాజపు ఆలోచనల్లో పూర్తి మార్పు వస్తుందనీ, మహిళల పట్ల చిన్నచూపు చూసే ధోరణులు తగ్గుతాయనీ అనేకులు ఆశించారు. కానీ సమాజం మాట అటుంచి న్యాయస్థానాల ఆలోచనా ధోరణే పెద్దగా మారలేదు. ఒక అత్యాచారం కేసులో నేరగాడిని నిర్దోషిగా పరిగణిస్తూ యువతులు శారీరక సుఖాలను ఆశించి తమంత తాము పురుషులతో వెళ్లడానికి సిద్ధపడి ఆ తర్వాత నిందపడుతుందన్న భయంతో కిడ్నాప్, అత్యాచారం కథలల్లుతున్నారని ఒక న్యాయ మూర్తి 2013లో వ్యాఖ్యానించారు. సమాజంలో ఇలాంటి ధోరణి పెరుగుతున్నదని ఆయన ఆందోళన కూడా వ్యక్తం చేశారు. అత్యాచారం ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితుడికి 2020లో కర్ణాటక హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది! అత్యాచారానికి గురైన యువతి ఆ వెంటనే నిద్రపోయి, మరునాడు కేసు పెట్టిందనీ, కనుక ఆమె ఫిర్యాదులో నిజాయితీ లేదనీ తేల్చారు. నిరంతర చలనశీలత సమాజ మౌలిక లక్షణం. మారుతున్న కాలానికి అనుగుణంగా భాష మారాలి. ప్రవర్తన, వైఖరి సంస్కారవంతం కావాలి. అది న్యాయస్థానాల నుంచే ప్రారంభం కావాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ భావించటం ప్రశంసనీయం. 19వ శతాబ్దం నాటి చట్టాలను మారుస్తూ ఈమధ్యే మూడు కొత్త బిల్లుల్ని ప్రవేశపెట్టిన కేంద్రం కూడా ఈ కోణంలో వాటిని పునఃసమీక్షించుకుని లింగ వివక్ష ధోరణులున్న నిబంధనలను సవరించుకుంటే మంచిది.

ట్రంప్ ప్రాభవం మళ్లీ పెరిగేనా?

విశ్లేషణ



ప్రశాంత్ ఝా

2024 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ మీద పోటీకి దిగే రిపబ్లికన్ అభ్యర్థి ఎవరు? పోరాటం తిరిగి బైడెన్, ట్రంప్ మధ్యనే ఉంటుందా? వారం రోజుల్లో రిపబ్లికన్ అభ్యర్థుల ప్రాథమిక డిబేట్ మొదలవుతుంది. ఒక పోల్ ప్రకారం, 52.7 శాతం మంది రిపబ్లికన్లు ట్రంప్‌ను సమర్థిస్తుండగా, ఆయన సమీప పోటీదారు డసాంటస్‌కు 14 శాతం మందే మద్దతిచ్చారు. పైగా 86 శాతం మంది రిపబ్లికన్ ఓటర్లు, ట్రంప్‌పై వచ్చిన నేర విచారణలు ఆయన్ని పోటీ చేయకుండా నిరోధించే ఉద్దేశ్యంతో తెచ్చినవని నమ్ముతున్నారు. ఏమైనా రాజకీయ వినోదం కోసం అర్రులు చాచే ప్రజారాశుల కోరికను తనకు అనుకూలంగా మలుచుకోగలిగే శక్తిమంతుడు ట్రంప్!

2022 నవంబర్‌లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో, ప్రతినిధుల సభకు మొత్తం సభ్యులనూ, సెనేట్‌లో మూడింట ఒక వంతు సభ్యులనూ అమెరికన్లు ఎన్నుకున్నప్పుడు– పాత రిపబ్లికన్ వ్యవస్థకు చెందినవారితోపాటు కొందరు డెమొక్రాటిక్ పండితులు డోనాల్డ్ ట్రంప్ రాజకీయాలకు 'నివాళులు' అర్పించారు. ఆ ఎన్నికల్లో ట్రంప్ బలపరిచిన అభ్యర్థులు ఓడిపోయారు. 2020 ఎన్నికలు 'దొంగిలించబడ్డాయని' ట్రంప్ చేసిన ప్రకటనను బలపర్చినవారినీ, జో బైడెన్ చేతిలో ఓడిపోయినా అధికారంలో కొనసాగడానికి ట్రంప్ చేసిన దుస్సాహసిక ప్రయత్నానికి మద్దతు ఇచ్చినవారినీ ఓటర్లు స్పష్టంగా తిరస్కరించారు. ట్రంప్ తన పదవీ కాలంలో తన నామినీలతో నింపిన సుప్రీంకోర్టు గర్భస్రావాలపై ఇచ్చిన తీర్పు మీద మహిళా ఓటర్ల నుంచి వ్యతిరేకత ఎదురైంది. రిపబ్లికన్ పార్టీ నుంచి మరో అధ్యక్ష అభ్యర్థి, ట్రంప్ అత్యంత సమీప పోటీదారు అయిన ఫ్లోరిడా గవర్నర్ రాన్ డసాంటస్ తాజాగా రెండోసారి కూడా గవర్నర్‌గా విజయం సాధించారు. పైగా రిపబ్లికన్ దాతలు, ఆయన ప్రభావవంతమైన మీడియా ఛాంపియన్లు ఇద్దరూ ట్రంప్‌కు దూరమయ్యారు. మరి ఈ కొన్ని నెలలు రాజకీయాల్లో ఎలాంటి తేడాను చూపగలవన్నది ప్రశ్న.

రిపబ్లికన్ అభ్యర్థులు వచ్చే వారం అయోవాలో తమ మొదటి ప్రాథమిక డిబేట్‌కు వెళుతుండగా, ఈ రేసులో ట్రంప్ ఎంత సౌకర్యవంతమైన స్థానంలో ఉన్నారంటే, బహుశా ఆయన ఆ చర్చకు కూడా వెళ్లకపోవచ్చు. 'ఫైవ్‌థర్టీయైట్.కామ్' రిపబ్లికన్ అభ్యర్థుల ప్రాథమిక పోటీల తాజా పోల్స్‌లో, 52.7 శాతం మంది ఓటర్లు ట్రంప్‌ను సమర్థించారు. 14 శాతం మంది మాత్రమే డసాంటస్‌కు మద్దతుగా నిలిచారు. ఇద్దరి మధ్యా ఆశ్చర్యకరంగా 38 శాతం తేడా ఉంది. వచ్చే వారం డిబేట్‌లో కనిపించే మిగతా వారందరూ – ప్రముఖంగా వివేక్ రామస్వామి, నిక్కీ హేలీ, మైక్ పెన్స్, క్రిస్ క్రిస్టీ, టిమ్ స్కాట్‌లకు ఈ పోల్‌లో 10 శాతం కంటే తక్కువ ఓట్లు పడ్డాయి. చాలామందికి 5 శాతం కంటే తక్కువ వచ్చాయి. అయితే, ఏ రాజకీయ నేపథ్యం లేకుండా మొదటిసారి పోటీకి దిగుతున్న వివేక్ రామస్వామికి పెరుగుతున్న ఓటర్ల మద్దతు మాత్రం చెప్పుకోదగ్గది.

ట్రంప్‌కు వ్యతిరేకంగా ఉన్న ప్రతి నేరారోపణ ఆయన పునాదిని బలోపేతం చేయడంలో సహాయపడింది. దాంతోపాటు బైడెన్ పరిపాలనకు వ్యతిరేకంగా రిపబ్లికన్‌లను ఇది సమైక్యపర్చింది. అయితే ఆయనపై ఆరోపించిన ప్రతి నేరాన్ని నిశితంగా చూస్తే, ట్రంప్ ఎంత ప్రమాదకరంగా, నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థమవుతుంది. ఒక శృంగార తారకు డబ్బు చెల్లించాలంటే తన వ్యాపార రికార్డులను తప్పుగా చూపడమే కాకుండా, ఎన్నికల ప్రచారానికి సంబంధించిన ఆర్థిక చట్టాలను ఉల్లంఘించాల్సి ఉంటుందని ట్రంప్‌కు తెలుసు. ఆయినా ఆ మార్గంలోనే ముందుకు సాగారు. వైట్ హౌస్ నుండి జాతీయ భద్రతా



రహస్యాలను దొంగిలించడం, వాటిని తిరిగి ఇవ్వడానికి నిరాకరించడం, వాటిని దాచమని తన వ్యక్తిగత సహాయకుడికి చెబుతూనే, ఆ పత్రాలు తన వద్ద లేవని అబద్ధం చెప్పడం కూడా చట్టవిరుద్ధమని ఆయనకు తెలుసు. దానికెక్కడా సిద్ధపడ్డారు. 2020 ఎన్నికల ఫలితాలను తారుమారు చేయడానికి ప్రయత్నించవద్దని ఆయన సొంత కార్యాలయ సిబ్బందితోపాటు ప్రచార విభాగంలోని చాలామంది విశ్వసనీయమైన వ్యక్తులు ఆయన్ని హెచ్చరించారు. అయినా ఏడు రాష్ట్రాల నుండి మోసపూరిత ఓటర్ల జాబితాను సృష్టించారు, తన ఆదేశాలను పాటించని రాష్ట్ర అధికారులపై ఒత్తిడి తెచ్చారు, ఫలితాల ధృవీకరణను నిరోధించడానికి క్యాపిటల్‌పై దాడి చేయవలసిందని ఒక గుంపును ప్రేరేపించారు. ఒక్కమాటలో చెప్పాలంటే... రాజ్యాంగం, చట్టపరమైన నిర్మాణం, సంస్థాగత నిబంధనలు, పార్టీ సిద్ధాంతాలు, రాజకీయ నియమాలే కాకుండా, ఎలాంటి మంచీ చెడూ నియంత్రణలలో లేని వ్యక్తి ట్రంప్.

అయినప్పటికీ ట్రంప్ తనపై చేసిన మూడు నేరారోపణలను (ఈ వారంలో నాలుగవది ఎదుర్కొన్నారు) కూడా తనకు అనుకూలంగా మార్చుకోవడంలో గొప్ప విజయం సాధించారు. అమెరికన్ డీప్ స్టేట్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్న హీరోలా, ఉదారవాదుల కుట్ర ఎదుర్కొంటున్న బాధితుడిలా ఆయన పాత్రలు మార్చుకుంటున్నారు. మరింతగా విరాళాలను సేకరించడం ప్రారంభించారు (ఈ డబ్బులో చాలా మొత్తం కేసుల ఫీజులకే పోతుంది). పైగా పార్టీలో క్షేత్రస్థాయి వర్గాలు ఆయన వెనుక సంఘటితమవుతున్నాయి. ఇటీవలి సీబీఎస్ న్యూస్ పోల్ ప్రకారం, 86 శాతం మంది రిపబ్లికన్ ఓటర్లు, ట్రంప్‌పై వచ్చిన నేర విచారణలు ఆయన్ని పోటీ చేయకుండా నిరోధించే ఉద్దేశ్యంతో వచ్చినవని నమ్ముతున్నారు. బైడెన్ చట్టబద్ధంగా ఎన్నికయ్యారని 92 శాతం మంది డెమొక్రాట్‌లు విశ్వసిస్తున్నప్పటికీ, 68 శాతం మంది రిపబ్లికన్లు బైడెన్ ఎన్నికను విశ్వసించడం లేదు. అంటే వీళ్లు ట్రంప్ అబద్ధాన్ని గట్టిగా నమ్ముతున్నారు. అయితే ఒహాయో రాష్ట్ర శాసనసభ్యుడు, ట్రంప్ మద్దతుదారు అయిన నీరాజ్ అంటాని ఈ వ్యాసకర్తతో ట్రంప్ పునరుత్థానం గురించి చెప్పిన దానిని కూడా గమనించాలి: ''ఇది ట్రంప్ పార్టీ. మాజీ దేశాధ్యక్షుడు దానిని నిర్వచిస్తున్నారు.''

చివరకు, డసాంటస్ చేస్తున్న ప్రచారంలోని వైఫల్య శకలాలే ట్రంప్ పునరుత్థానాన్ని నిర్దేశిస్తున్నాయి. సాంఘిక సంప్రదాయవాదులను గెలవడం కోసం... జాత్యహంకారం, బానిసత్వం, లైంగికత చుట్టూ ఉన్న బోధనలపై గవర్నర్ డసాంటస్ దాడి చేస్తూ, సాంస్కృతిక మితవాద తీవ్రవాదం ప్రాతిపదికన తన రాజకీయాలను నిర్వచించుకుంటున్నారు. అయితే ఇది ఆయనకు మద్దతు పెరగడంలో సహాయపడలేదు. పూర్వాశ్రమంలో యూఎస్ కాంగ్రెస్‌లో డసాంటస్‌తో కలిసి పనిచేసినవారు ఆయనకు ప్రజాకర్షణ కానీ, సహజమైన రాజకీయ అనుసంధానం కానీ లేవని చెబుతున్నారు. తన ప్రచారాన్ని కూడా పేలవంగా నిర్వహిస్తున్నారు. సిబ్బందిని తరచుగా మార్చడంలో ఇది ప్రతిఫలిస్తోంది. ఇటీవలి ఒక 'న్యూయార్క్ టైమ్స్' కథనం ఎత్తి చూపినట్లుగా, ఫ్లోరిడా గవర్నర్‌ను కనికరం లేకుండా ట్రంప్ ఎగతాళి చేస్తున్నప్పుడు కూడా, ట్రంప్‌ను ఎలా ఎదుర్కోవాలో తెలియక డసాంటస్ తికమక పడుతున్నారు.

రిపబ్లికన్లు వచ్చే జూలైలో మాత్రమే తమ అధ్యక్ష అభ్యర్థి ఎవరనేది నిర్ణయిస్తారు. ట్రంప్ చేస్తున్న న్యాయ పోరాటాలు ఆయన శక్తిని బాగా హరించవచ్చు. అయినా కూడా 2024లో అమెరికాలో జరిగే రాజకీయ పోరాటం తిరిగి బైడెన్, ట్రంప్ మధ్యనే సాగేట్టుగా కనిపిస్తోంది. అయితే అభ్యర్థిగా ట్రంప్ పోటీలో ఉండటం తమకు కలిసొస్తుందని బైడెన్ బృందం నమ్ముతోంది. బ్యాలెట్ పత్రాల్లో ట్రంప్ ఉనికి చాలు... స్వతంత్రులు, మితవాద రిపబ్లికన్లు, సబర్బన్ మహిళలు ఆయనకు దూరం జరగడానికి అన్నది ఈ వర్గం మాట. ట్రంప్ పట్ల వారి అపనమ్మకం, అయిష్టత చాలా తీవ్రస్థాయిలో ఉన్నందున... బైడెన్‌కు రెండవసారి పదవి దక్కడంపై ఉత్సాహం చూపని యువతతో సహా డెమొక్రాటిక్ పార్టీ పునాదిని ఏకీకృతం చేయడంలో ఇవి సహాయపడతాయి. తన పునాదిపై ఇప్పటికీ బలమైన పట్టున్న ట్రంప్‌ను తక్కువగా అంచనా వేయడం పొరపాటు అని వాదించే డెమొక్రాట్లు కూడా ఉన్నారు. అధ్యక్ష ఎన్నికలకు సంబంధించి, అరడజను ఊగిసలాడే రాష్ట్రాల్లో మరోసారి మెజారిటీ కొన్ని వేల ఓట్లకు తగ్గుతుందని వీరి భయం. నిరుత్సాహకరమైన దేశ ఆర్థిక స్థితితో పాటు రాజకీయ వినోదం కోసం అర్రులు చాచే ప్రజారాశుల కోరికను కూడా తనకు అనుకూలంగా ట్రంప్ మలుచు కోగలరు. మొత్తం మీద, వచ్చే నవంబర్‌లో ఏమి జరిగినా, ట్రంప్ కరిష్మా ఇప్పటికీ సజీవంగానే ఉంది. అది అమెరికన్ రాజకీయాలను నిర్దేశిస్తూనే ఉంది.

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయుడు
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

తేడా కొంచెమే...



ఉదార సంస్కృతిలోని అతిలైంగికత లాగానే, పాతివ్రత్య సంస్కృతి కూడా స్త్రీని కేవలం వస్తువుగానే చూస్తుంది. అతిలైంగికత సమాజాల్లో మహిళల శరీరాలను అందరు పురుషులకు సంబంధించిన పబ్లిక్ ప్రాపర్టీగా భావిస్తే, పాతివ్రత్య సంస్కృతిలోనేమో ఆమెను వ్యక్తిగత ఆస్తిగా చూస్తారు. – జారా కే, యాక్టివిస్ట్

ఈజీ సిటీ



ముంబయిని దేశ ఆర్థిక రాజధాని అంటే నవ్వొస్తుంది. 99 శాతం మంది ఆటో, రిక్షావాలాలు 'యూపీఐ'ని అంగీకరించరు. ఆఖరికి పెద్ద షాపులు, పేరున్న చోట్లలో కూడా నగదుతోనే వ్యవహారం. అదే బెంగళూరును చూడండి. ఒక్క రిక్షావాలా దగ్గర మూడు భిన్న 'క్యూఆర్' కోడ్స్ ఉంటాయి. – సుముఖ్ రావు, టెక్ జర్నలిస్ట్

నిర్లిప్తత ముఖ్యం



జీవితంలో నేను నేర్చుకున్న అత్యంత విలువైన విషయం ఏమిటంటే, మనం చేసే పని పట్ల ఎంత మాత్రమూ ఉద్వేగాన్ని పెంచుకో కూడదు. మన పనిలో మనం పెట్టిన విశ్వ ప్రయత్నాలను అసలు ప్రేమించుకోకూడదు. దానిపట్ల జనం ఎంత మాత్రమూ కృతజ్ఞత చూపనప్పుడు అది మనల్ని తీవ్రంగా బాధిస్తుంది. – స్వాతి కె., న్యాయవాది

మొత్తం వీళ్లే!



ఇండియాలో ఒక మనిషి పయనమవుతుంటే సుమారు పాతిక మంది సాగనంపడానికి వస్తారు. ఇలా ప్రపంచంలో మరెక్కడైనా ఉంటుందా? విమానాశ్రయాల్లో మొత్తం ఈ వీడ్కోలు, స్వాగతం చెప్పడానికి వచ్చే జనాలే. – సంజయ్ హెగ్డే, న్యాయవాది

జైహో 'ఇండిరా'!



జకార్తాలో ఒక ఇండోనేషియా యువతిని కలిశాను. ఆమె ఒక ఇంజనీర్. పేరు ఇందిర. ఇది ఇండియా పేరు అని చెప్పింది. ఇదెలా? అని అడిగాను. 'మా అమ్మానాన్న ఇందిరాగాంధీకి వీరాభిమానులు' అంది. – నికితా సూద్, ప్రొఫెసర్

బాగా తెలుసు

అటు చంద్రబాబు నాయుడు, ఇటు పవన్ కల్యాణ్... ప్రజలు జగన్‌మోహన్ రెడ్డికి ఓటు వేసి తప్పు చేశారని తాము చెబుతూనే తమ అను కూల మీడియా సహాయంతో కొందరి ప్రజల చేతా చెప్పిస్తున్నారు. ఇలా చెప్పించడం వలన వారికి మేలు కంటే కీడే ఎక్కువ జరుగుతుంది.


నాడు రాష్ట్రం రెండుగా విడిపోయిన పిమ్మట రాజకీయంగా అనుభవం ఉన్నవాడనే దృష్టితో చంద్రబాబు నాయుడిని ప్రజలు గెలిపించారు. ప్రజల మీద కంటే డబ్బు మీదనే వ్యామోహం గల చంద్రబాబు 'అమరావతి ఆంధ్ర రాజధాని' అంటూ కోటానుకోట్ల రూపాయల కుంభకోణానికి తెరతీశారు. 'ఓటుకు నోటు' కేసులో చంద్రబాబు పాత్రతో దిమ్మ తిరిగిన కేసీఆర్ అప్పటివరకు సాటి తెలుగు రాష్ట్రం పట్ల సానుకూలంగా ఉన్నా ఒక్కసారిగా వ్యతిరేక మయ్యారు. ఇలాంటి చంద్రబాబుకి మరలా ఓటు వేస్తే, ఇంకెన్ని ఓటుకు నోటు కేసులు పుట్టుకొస్తాయో అన్న భయంతో ప్రజలు తదుపరి ఎన్నికల్లో జగన్ మోహన్ రెడ్డి పార్టీని గెలిపించారు.

ఇక పవన్ కల్యాణ్ విషయానికి వస్తే, ఆయనకు రాజకీయ పరిణతి లేదనీ, అది రావడానికి మరో యాభై ఏళ్లు పడుతుందనీ ప్రజలు భావిస్తున్నారు. ఆయన వ్యవహార ధోరణి చూసి ఎప్పటికైనా ఆయన బీజేపీలో చేరతారని అను కుంటున్నారు. అందుకే ప్రజలు వచ్చే ఎన్నికల్లో ఎలా స్పందించాలో అలాగే స్పందిస్తారు. ఓటు వెయ్యడంలో అధిక శాతం ప్రజలు ఎప్పుడూ తప్పు చెయ్యరుగాక చెయ్యరు.

– వి.ఎల్. రాఘవరావు

ఇక అవి నిషేధిత భూములు కావు!

సందర్భం



కొవ్వూరి త్రినాథ్ రెడ్డి

ప్రభుత్వ పాలకులకు చిత్తశుద్ధి లేకపోతే ప్రజలకు కష్టాలు తప్పవు. గత ప్రభుత్వం చేసిన తప్పే దానికి మంచి ఉదాహరణ. ఆ తప్పిదం వల్ల రాష్ట్రంలో సుమారు లక్షల సంఖ్యలో రైతులు కష్టాలలో పడ్డారు. 2013లో 16/2013 చట్టాన్ని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చింది. దాంతో రైతులకు సంబంధించిన లక్షలాది ఎకరాలు భూమిపై ఏ విధమైన లావాదేవీలు జరపడానికి వీలులేకుండా పోయింది. '1956 ఇనాం చట్టం' రద్దు చేసి ఇనాం భూములకు రైత్వారి పట్టాలను ఇవ్వ డానికి ఇనాం తహశీల్దార్లను నియమించి పట్టాలు ఇచ్చింది ప్రభుత్వం. కాని అప్పటి అధికారులు ఏ- రిజిష్టరులో (ఆర్ఎస్ఆర్) రైత్వారీ పట్టాలుగా మార్పు చేయక పోవడం వలన ఈ ఇబ్బందులు వచ్చాయి.



ఆ చట్టం ప్రకారం ఇనాం భూములకు 1956 తర్వాత నుండి ఇచ్చిన పట్టాలన్నీ రద్దయి పోయాయి. ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం కాకుండా ఉంచే (సెక్షన్ 22) జాబితాలో వీటిని 'నిషేధిత భూములు'గా రెవెన్యూ అధికారులు చేర్చారు. వీరు అత్యుత్సాహం, అవగాహనా రాహిత్యంతో ఇనాం భూములే కాకుండా మిగిలిన చుక్కల భూములు, మాజీ సైనికులకు ఇచ్చిన పట్టా భూములు కూడా ఈ జాబితాలో చేరిపోయాయి. తమ దగ్గర అదనంగా ఉన్న సీలింగ్ భూమిని ప్రభుత్వానికి అప్పజెప్పినవారి సొంత భూములను కూడా ఈ జాబితాలో చేర్చారు అధి కారులు. ఏ చట్టమైనా చట్టంగా ఆమోదించిన రోజు నుంచి అమలు చేయడం (ప్రోస్పెక్టివ్), పునరాలోచన (రెట్రాస్పెక్టివ్) తర్వాత అమలుచేయడం అనే రెండు విధానాలలో ఏదో ఒకదాన్ని ప్రభుత్వం అనుసరిస్తుంది. ఈ చట్టం ఆమోదం పొందిన రోజు నుంచే అమలు అయ్యే విధంగా రూపొందినా కాంగ్రెస్ ప్రభుత్వం తన హయాంలో చట్టాన్ని అమలు చేయలేదు.

చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన తర్వాత సొంత పార్టీలో ఎమ్మెల్యేలు దీనిపై వ్యతిరేకత చూపించడంతో 16/2013 చట్టానికి సవరణ చేద్దామని రైతుల భూములను నిషేధిత జాబితా నుండి తీసివేయడానికి ఆర్డినెన్స్ ఇవ్వడం జరిగింది. కానీ ఈ ఆర్డినెన్స్ ఇచ్చిన 6 నెలలలోపు చట్టం చేయాలి. అప్పటి ప్రభుత్వం చట్టాన్ని చేయకుండా గాలికి వదిలేసింది. దీంతో పరిస్థితి మళ్లీ మొదటికే వచ్చింది. కొంతమంది ఈ భూముల్లో ఇల్లు నిర్మించు కొన్నారు. మరి కొంతమంది భూములను అమ్ముకోవడానికి వీలు లేక ఏం చేయాలో తెలియక కొట్టుమిట్టాడారు.

ఇలాంటి పరిస్థితులలో 2019లో జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైసీపీ అధికారంలోకి వచ్చింది. జగన్ ఈ సమస్యకు పరిష్కారం చూపిస్తారనే నమ్మకంతో ఆయన దృష్టికి తీసుకు వెళ్ళడం జరిగింది. అప్పటి నుండి ప్రణాళికాబద్ధంగా ఈ సమస్యను తీర్చాలని సత్సంకల్పంతో రెవెన్యూ మంత్రి అధ్యక్షతన కమిటీని వేశారు జగన్. వివిధ రాష్ట్రాలలోని భూములను పరిశీలన చేసి ఒక నివేదికను ఇమ్మని ముఖ్యమంత్రి ఈ కమిటీని ఆదేశించారు. దాని ప్రకారం ఆ కమిటీ నివేదికను అనుసరించి రైతుల భూముల హక్కులకు భంగం కలుగకుండా భూములను నిషేధిత జాబితాలో ఉన్న చుక్కల భూములతో సహా అన్ని భూములనూ తొలగించడానికి మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది. దీంతో రాష్ట్రంలో లక్షలాది మంది రైతులు హర్షాతిరేకాన్ని వ్యక్తం చేస్తున్నారు.

అలాగే 'జగనన్న శాశ్వత భూహక్కు మరియు భూ రక్ష' (రీసర్వే) పథకం కింద రైతుల భూములను సమగ్రమైన సర్వే చేస్తున్నారు. ఇప్పటి వరకు చాలా భూములను సర్వే చేసింది ప్రభుత్వం. అయితే ఆ సర్వేలో కొన్ని రకాల తప్పులు వచ్చిన ప్పటికీ మరలా వాటిని సరిచేసి ఆ భూములకు ఎలక్ట్రానిక్ పాసుబుక్ ఇవ్వడం జరుగుతుంది. మొత్తం మీద ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రైతు పక్షపాతిగా ప్రజా హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్నారనేది నిజం.

వ్యాసకర్త వైసీపీ రైతు విభాగం కార్యనిర్వాహక ప్రధాన కార్యదర్శి । 94402 04323

ఆ రోజు ఏం జరిగింది?

గద్దర్ మరణానికి ప్రధాన కారకులు చంద్రబాబేననే చర్చ జరుగుతోంది. 1997లో గద్దర్ మీద చంద్రబాబు నాయుడు కాల్పులు జరిపించకుంటే గద్దర్ ఇంకా పదేండ్లు బతికేవారని అనేక మంది బాధపడుతున్నారు. నిజంగా గద్దర్‌కు మొదటి నుంచి ఎలాంటి అనారోగ్య సమస్యలూ లేవు. ఆయన అనారోగ్యానికి ప్రధాన కారణం ఆయన శరీరంలో ఉన్న బుల్లెట్టే. దానిని 25 సంవత్సరాలుగా తన శరీరంలో మోస్తూ తన ప్రయాణాన్ని కొనసాగించారు. ఆ బుల్లెట్ గాయానికి ప్రధాన కారకులు చంద్రబాబేనని తెలుగు నేలంతకూ తెలుసు.

1997 ఏప్రిల్ 6న గద్దర్ మీద జరిగిన కాల్పుల ఘటనపై చంద్రబాబు నాయుడు తాజాగా స్పందిస్తూ... తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని రాజకీయావేదన వ్యక్తం చేశారు. కాల్పులు జరిగిన తర్వాత గద్దర్‌తో అనేకసార్లు మాట్లాడానని కొత్త పల్లవి పాడుతున్నారు. ఇప్పుడు గద్దర్ లేరు కాబట్టి చంద్రబాబు ఈ పల్లవి ఎత్తుకున్నారని అనుకోవాలి. 'గ్రే హౌండ్స్' నుంచి 'గ్రీన్ టైగర్స్' (ఎల్లో టైగర్స్)ను ఏర్పాటు చేసి గద్దర్ మీద కాల్పులు జరిపించింది చంద్రబాబనేది జగమెరిగిన సత్యం. 'తన లక్ష్యం, గద్దర్ లక్ష్యం ఒక్కటే'నని చంద్రబాబు అనడం సిగ్గుమాలినతనానికి పరాకాష్ఠ. గద్దర్ ప్రజల మనిషి. ప్రజల జీవితాలు మారాలనుకున్నారు. దానికోసం తన జీవితాన్ని త్యాగం చేశారు. చంద్రబాబు ప్రజల కోసం ఏం త్యాగం చేశారో చెప్పాలి. ఆయన వరల్డ్ బ్యాంకు మనిషి. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తెలుగు నేల మీద అత్యధికంగా ఎన్‌కౌంటర్లు జరిగాయి. ఎంతోమంది ఉద్యమకారులను పొట్టన పెట్టుకున్నారు. ఎంతోమంది అమాయక ప్రజలను అరెస్టు చేయించి చిత్రహింసలు పెట్టించారు. గద్దర్ కుటుంబాల వంటి కుటుంబాలకు నిద్రలేకుండా చేశారు. వాళ్ల జీవితాల్లో శాంతి లేకుండా చేశారు. ఆనాడు ప్రజా ఉద్యమాలనూ, ప్రజా సంఘాలనూ పని చేయకుండా ఎలా అణచి వేశారో ఇంకా తెలుగు ప్రజలు మర్చిపోలేదు. ఆనాడు తెలుగు నేలనంతా కల్లోలితం చేశారు. ప్రజల గురించీ, తెలంగాణ గురించీ పాట పాడినందుకు గద్దర్ మీద కాల్పులు జరిపించారు.

తనపై జరిగిన దాడి గురించి గద్దర్ ఇలా అన్నారు: 'ఒక రాష్ట్ర ప్రభుత్వం తన పోలీస్ యంత్రాంగంతో ఒక ప్రజా కవిని, కళాకారుణ్ణి చంపడానికి సంసిద్ధమయింది. ఇక ఈ దేశంలో



సామాన్య ప్రజలు ఎలా జీవించగలుగుతారు? ఏప్రిల్ ఆరు సాయంత్రం ఏం జరిగింది? ఏప్రిల్ ఆరో తేదీ, సాయంత్రం ఆరు గంటల సమయం, నేను రేడియో వార్తలు వింటున్నాను. నా భార్య విమల వచ్చి నాతో మాట్లాడడానికి ఎవరో వచ్చారని చెప్పింది. విషయం ఏమిటో తెలుసుకుందామని బయటకు వచ్చాను. ఒక వ్యక్తి వచ్చి తాను వరంగల్ నుంచి వచ్చాననీ, ఇన్‌ఫార్మర్‌నని చిత్రించి నక్సలైట్లు తనను హింసిస్తున్నారనీ చెప్పాడు. సరే లోపలికి వచ్చి గదిలో కూర్చుని కాగితం మీద వివరంగా రాసి ఇవ్వమని అడిగాను. ఆ వ్యక్తి గదిలోకి రాకుండా బయటికి వెళ్లి పోతుండగా, అదేమిటయ్యా, రాసి యివ్వమంటే వెళ్ళిపోతున్నావ్? అని అంటుండగా మరో ముగ్గురు వ్యక్తులు ఇంటి గేటు తెరుచుకుని లోపలికి అడుగుపెట్టారు. వారిలోంచి ఒక వ్యక్తి ఏదో చెబుతూనే షర్టు కింది నుంచి రివాల్వర్ తీసి నా మీద కాల్పులు ప్రారంభించాడు. నేను నా శాయశక్తులా బుల్లెట్ల బారినుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించాను.'' (అరుణతార, మే సంచిక, 1997). నాటి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడే తన మీద కాల్పులు జరిపించాడని గద్దర్ అనేక వేదికల నుంచి ఆరోపించిన సంగతి ఇక్కడ గమనార్హం.

గద్దర్ మీద 1997 ఏప్రిల్ ఆరు ఆదివారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు ఆయనపై కాల్పులు జరిపినప్పుడు గద్దర్ భార్య విమల ఆ క్షణం అక్కడే ఉన్నారు. ఆమెనే ప్రత్యక్ష సాక్షి. తన భర్తపై హత్యాయత్నం చేసింది గ్రేహౌండ్సేనని ఆనాడు ఆమె పత్రికా ముఖంగా చెప్పారు. తనపై దాడి చేసింది గ్రేహౌండ్స్ పోలీసులేనని గద్దర్ కూడా ప్రకటించారు. దోషులెవరో గుర్తుపట్టగలమని భార్య విమల చెప్పారు.

గద్దర్ మీద కాల్పులు జరిగిన తరువాత చంద్రబాబు నాయుడు, పోలీస్ యంత్రాంగం తమ నేరాన్ని కప్పిపుచ్చుకోవడానికి తప్పుడు ప్రకటనలు మొదలెట్టాయి. ఇది పోలీస్ చర్య కాదని చంద్రబాబు ఆనాడు ప్రకటించారు. కానీ 'గ్రీన్ టైగర్లు' అని చెప్పుకొంటూ ప్రభుత్వ వ్యతిరేక చర్యలకు పాల్పడే వాళ్లను చంపుతామని పత్రిక ముఖంగా ప్రకటిస్తుంటే, గద్దర్ మీద కాల్పులు చేసింది మేమేనని వారు చెప్పుకుంటుంటే కూడా చంద్రబాబు విచారణ కూడా చేయించలేదు. దీనిని బట్టి ఈ గ్రీన్ టైగర్ల వెనుక ఎవరున్నారో అర్థం చేసుకోవచ్చు.

– ఎ. మల్లేష్, పరిశోధక విద్యార్థి ఓ.యూ
మొబైల్: 96038 70734

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, నిజ శ్రావణ మాసం, **తిథి:** శు.తదియ రా.7.30 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** ఉత్తర రా.12.14 వరకు, తదుపరి హస్త, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ఉ.5.46 నుండి 7.25 వరకు.
అమృతఘడియలు: సా.4.21 నుండి 6.05 వరకు : **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 5.46, **సూర్యాస్తమయం:** 6.21.

భవిష్యత్ వెలుగులకు ప్రణాళిక



రానున్న పదేళ్ల వరకూ విద్యుత్ సరఫరా, కొనుగోలు, లభ్యత, డిమాండ్‌పై అంచనాలు

- 5వ, 6వ కంట్రోల్ పీరియడ్‌పై స్టేట్ ఎలక్ట్రిసిటీ ప్లాన్‌ను ఏపీఈఆర్సీకి సమర్పించిన విద్యుత్ పంపిణీ సంస్థలు
- 2024–25 నుంచి 2028–29 వరకూ.. 2029–30 నుంచి 2033–34 వరకూ ప్రణాళిక
- విశాఖలో కొత్తగా ప్రారంభించిన క్యాంపు కార్యాలయంలో నేడు తొలి బహిరంగ విచారణ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు తగినట్లుగా భవిష్యత్తు డిమాండ్‌ను అంచనా వేయకపోతే అకస్మాత్తుగా తలెత్తే దుష్పరిణామాలు అంధకారంలో ముంచేస్తాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర విద్యుత్ సంస్థలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ ప్రణాళిక (ఏపీ స్టేట్ ఎలక్ట్రిసిటీ ప్లాన్)ను రూపొందించాయి. రానున్న పదేళ్లలో రాష్ట్ర విద్యుత్ రంగంలో చోటుచేసుకునే మార్పులను అంచనా వేశాయి. పెట్టుబడులు ఎంత పెట్టాలనే దానిపై లెక్కలుగట్టాయి. దానికి తగినట్లుగా చర్యలు తీసుకోవడానికి అనుమతించాల్సిందిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ)కి నివేదికలు సమర్పించాయి. ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ (ఏపీ ట్రాన్స్‌కో), ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు ఇచ్చిన ఈ నివేదికలపై శనివారం ఏపీఈఆర్సీ బహిరంగ విచారణ చేపట్టనుంది. నిజానికి.. ఎప్పుడూ హైదరాబాద్‌లోని కమిషన్ ప్రధాన కార్యాలయంలో జరిగే ఈ విచారణ ఈసారి విశాఖలో కొత్తగా ప్రారంభించిన క్యాంపు కార్యాలయంలో జరగనుంది. కొత్త కార్యాలయం ఏర్పాటైన మరుసటిరోజే తొలి బహిరంగ విచారణ జరుగుతుండటం విశేషం. ఈ విచారణలో వచ్చిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ప్రణాళికపై ఏపీఈఆర్సీ తుది నిర్ణయం తీసుకుంటుంది.

ఎంత అవసరం..

ఏపీ ట్రాన్స్‌కో, డిస్కంలు 2024–25 నుంచి 2028–29 వరకూ 5వ కంట్రోల్ పీరియడ్‌కు, 2029–30 నుంచి 2033–34 వరకూ 6వ కంట్రోల్ పీరియడ్‌కు వివిధ అంశాలపై సమగ్ర అంచనా నివేదికలను రూపొందించాయి. వీటి ప్రకారం.. ప్రస్తుతం సోలార్ రూఫ్‌టాప్ సిస్టం సామర్థ్యం రాష్ట్రంలో 150.152 మెగావాట్లుగా ఉంది. ఇది 2034 నాటికి 661.88 మెగావాట్లకు పెరుగుతుంది. అలాగే, విద్యుత్ వాహనాలు ప్రస్తుతం 68,975 ఉన్నాయి. వీటి సంఖ్య 2034 నాటికి 10,56,617కు చేరుతుంది. ఇవి ప్రస్తుతం 16 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను వాడుతుండగా, పదేళ్లకు 677 మిలియన్ యూనిట్ల విద్యుత్ అవసరమవుతుంది. ఇక గృహ విద్యుత్ వినియోగం ప్రస్తుతం ఏడాదికి 17,330 మిలియన్ యూనిట్లు ఉంది. 2034 నాటికి ఇది 31,374 మిలియన్ యూనిట్లకు పెరగనుంది. అన్ని కేటగిరీలకూ కలిపి ప్రస్తుతం 65,228 మిలియన్ యూనిట్లు ఉండగా, 2034కు 1,30,899 మిలియన్ యూనిట్లు అవసరమవుతుంది. సాంకేతిక, పంపిణీ నష్టాలు పోనూ 1,45,331 మిలియన్ యూనిట్లు ఉంటే తప్ప అందరి అవసరాలు తీరవు.

విద్యుత్ ఎలా వస్తుందంటే..

రాష్ట్ర విద్యుత్ అవసరాలను తీర్చేందుకు ఆంధ్రప్రదేశ్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ (ఏపీజెన్‌కో)కు 3,410 మెగావాట్ల థర్మల్, 1,774 మెగావాట్ల హైడల్ ప్రాజెక్టులు ఉన్నాయి. ఇవికాక..

- విజయవాడ వీటీపీఎస్‌లో 5వ యూనిట్ ఈ ఏడాది సెప్టెంబర్‌లో అందుబాటులోకి వచ్చే అవకాశముంది.
- లోయర్ సీలేరులో 230 మెగావాట్లు, పోలవరంలో 560 మెగావాట్ల 1 నుంచి 7 యూనిట్లు 2024–25లో, 8 నుంచి 12 యూనిట్లలో 400 మెగావాట్లు 2025–26లో, అప్పర్ సీలేరు పంప్డ్ స్టోరేజ్ 1 నుంచి 8 యూనిట్లలో 1,200 మెగావాట్లు 2027–28లో, ఇక్కడే 150 మెగావాట్ల 9వ యూనిట్ 2028–29లో విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించే అవకాశముంది.
- మొత్తంగా ఇప్పుడున్న ఉత్పత్తి సామర్థ్యం 5,184 మెగావాట్లుకు అదనంగా 3,340 మెగావాట్ల సామర్థ్యం ఏపీ జెన్‌కో ద్వారా తోడవ్వనుంది.
- ఇవికాక.. సెంట్రల్ జనరేటింగ్ స్టేషన్స్, ఇండిపెండెంట్ పవర్ జనరేటర్లు, సౌర, పవన విద్యుత్ వస్తుంది.
- వ్యవసాయానికి పగటిపూట తొమ్మిది గంటలు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ (సెకీ) నుంచి 2025 ఆర్థిక సంవత్సరంలో 3 వేల మెగావాట్లు, 2026లో మరో 3 వేల మెగావాట్లు, 2027లో 1000 మెగావాట్లు చొప్పున మొత్తం 7 వేల మెగావాట్లు రానుంది.
- ఈ విద్యుత్‌ను వినియోగదారులకు అందించేందుకు కొత్త సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌మిషన్ లైన్లు నిర్మించనున్నారు.
- ఏపీ ట్రాన్స్‌కో 400 కేవీ, 220 కేవీ, 132 కేవీ సబ్‌స్టేషన్లు 10 నుంచి 2029 నాటికి 718 పెరగనున్నాయి. లైన్లు కూడా 969.15 సర్క్యూట్ కిలోమీటర్లు నుంచి 4,837.16 సీకేఎంకు విస్తరించనున్నాయి.
- ఈ మొత్తం ట్రాన్స్‌మిషన్ కోసం రూ.15,729.41 కోట్లు వ్యయం కానుంది.
- ఇదికాక మౌలిక సదుపాయాల కల్పన, కొత్త సాంకేతిక పరిజ్ఞానం వంటి వాటికి మరింతగా ఖర్చుచేయనున్నారు.

అయ్యయ్యో.. ఇదేమి బాధ రామోజీ!!

వైద్య కళాశాలకు భూములిచ్చినా తప్పేనా?

- ప్రజలందరికీ అందుబాటులో మెడికల్ కాలేజీ వచ్చినా అక్కసేనా?
- నంద్యాలకు మెడికల్ కాలేజీ రాకూడదన్న రాజకీయ దుగ్ధతో కోర్టుల్లో కేసులు
- భూ కేటాయింపులో తప్పులేదంటూ సాక్షాత్తు హైకోర్టు గ్రీన్ సిగ్నల్
- మెడికల్ కళాశాల తొలి దశ నిర్మాణం పూర్తి
- 150 మంది విద్యార్థులకు ఈ ఏడాది నుంచే తరగతులు
- వ్యవసాయ పరిశోధన స్థానానికి ప్రత్యామ్నాయ స్థలం కేటాయింపు



సాక్షి, అమరావతి : ప్రత్యేక జిల్లాతో పాటు ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు నంద్యాల ప్రజల చిరకాల వాంఛ. దశాబ్దాల వీరి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారు. ప్రత్యేక జిల్లా ఏర్పాటుతో పాటు మెడికల్ కళాశాలా మంజూరు చేశారు. ఇప్పటికే తొలి దశ నిర్మాణం పూర్తయి, ఈ ఏడాది నుంచి తరగతులు కూడా మొదలవుతున్నాయి. మెడికల్ కళాశాల, జిల్లా కలెక్టర్ కార్యాలయానికి నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానానికి చెందిన 60 ఎకరాలు కేటాయించారు. దీనికి ప్రతిగా వ్యవసాయ పరిశోధన స్థానానికి మరోచోట 60 ఎకరాలు ఇచ్చారు. ఓ పెద్ద ప్రభుత్వ వైద్య కళాశాల, కలెక్టరేట్ జిల్లా ప్రజలందరికీ అందుబాటులో ఉన్న ప్రదేశంలో నిర్మించడాన్ని రామోజీ సహించలేకపోయారు. ఇదేదో నేరమైనట్లు, ఈ భూములను చంద్రబాబుమాదిరిగా ప్రైవేటు వ్యక్తులు, సంస్థలకు పప్పు బెల్లాల్లా పంచేస్తున్నట్టుగా ప్రభుత్వంపై బురద జల్లుతూ ఈనాడులో కథనాన్ని అచ్చేశారు. మెడికల్ కళాశాల, ప్రజలకు అందుబాటులో వైద్య సౌకర్యాలు రాకూడదన్న ఏకైక లక్ష్యంతో ఈ కథనం అచ్చేశారు. వాస్తవాలు ఏమిటో ఒక్కసారి పరిశీలిద్దాం..

వెనుకబడ్డ రాయలసీమ ప్రాంతంలోని నంద్యాల జిల్లా ప్రజలకు మెడికల్ కాలేజీ నిర్మాణం ఎంతో ఉపయోగకరం. దీని ద్వారా రాయలసీమ ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. ఇదే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నంద్యాల మెడికల్ కళాశాల మంజూరు చేశారు. మెడికల్ కళాశాలకు 50 ఎకరాలు, సమగ్ర కలెక్టరేట్ నిర్మాణానికి మరో 10 ఎకరాలు అవసరమని గుర్తించారు. ప్రజలకు అన్ని విధాలుగా అందుబాటులో ఉన్న వ్యవసాయ పరిశోధన స్థానానికి చెందిన 60 ఎకరాలను వీటికి కేటాయించారు. అందుకు ప్రత్యామ్నాయంగా తంగడంచ వద్ద మరో 60 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని పరిశోధన స్థానానికి కేటాయించారు. వీటి బదిలీ ప్రక్రియ కూడా మొదలైంది. పరిశోధన స్థానానికి ఇంకా ఎంత భూములు అవసరమైనా కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నట్టు కూడా ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో తప్పేమీ లేదు.

అయితే, ఎలాగైనా మెడికల్ కళాశాల నిర్మాణాన్ని ఆపాలన్న ఏకైక లక్ష్యంతో ప్రభుత్వ వైద్య కళాశాలకు భూములు ఇవ్వడాన్ని అడ్డుకుంటూ తెలుగుదేశం పార్టీ అండతో కొందరు హైకోర్టులో కూడా కేసులు వేశారు. ఈ కేసులను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. మెడికల్ కళాశాల నిర్మాణానికి అనుమతించింది. ఈ విషయాన్ని ఈనాడు దినపత్రిక పూర్తిగా విస్మరించింది. రూ.475 కోట్లతో వైఎస్ జగన్ ప్రభుత్వం ఇక్కడ అధునాతన సౌకర్యాలతో కూడిన మెడికల్ కళాశాల నిర్మిస్తోంది. ఈ కళాశాల ఏర్పాటుతో జిల్లా ఆస్పత్రిని జీజీహెచ్‌గా స్థాయి పెంచారు. 11.93 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో మెడికల్ కాలేజీ భవనాలు, హాస్టళ్లు నిర్మిస్తున్నారు. మంచి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. తొలిదశ నిర్మాణాలు పూర్తయ్యాయి. ఈ ఏడాదిలోనే తొలి సంవత్సరం ప్రవేశాలు కూడా జరుగుతున్నాయి. 150 మంది విద్యార్థులు ఇక్కడ తొలి ఏడాది వైద్య విద్యను అభ్యసించబోతున్నారు. మరో వైపు ఇక్కడే 10 ఎకరాల్లో సమగ్ర కలెక్టరేట్ కూడా నిర్మిస్తోంది. దీన్నికూడా ఈనాడు తప్పుబడుతోంది. నిత్యం వందలాది ప్రజలు రాకపోకలు సాగించే మెడికల్ కాలేజీ, కలెక్టరేట్ అందరికీ అందుబాటులో ఉండేలా ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని ఎంపిక చేసుకుంది. అదే ఈనాడుకు కంటగింపయింది. ఒక ప్రభుత్వ వ్యవస్థలకు చెందిన భూములను మరో ప్రభుత్వ వ్యవస్థకు కేటాయిస్తే తప్పుపట్టడం ఈనాడుకే చెల్లింది.

బాల్య వివాహాల కట్టడికి విస్తృత ప్రచారం

- తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి
- బాల్య వివాహాలు చేస్తే పథకాలకు దూరమవుతారనే విషయాన్ని తెలియజేయండి
- ఖాజీలు, పాస్టర్లు, పురోహితులకు తగిన ఆదేశాలివ్వండి
- అధికారులకు సీఎస్ కేఎస్ జవహర్‌రెడ్డి దిశానిర్దేశం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో బాల్య వివాహాల కట్టడికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కేఎస్ జవహర్‌రెడ్డి చెప్పారు. బాల్య వివాహాలు జరిపినా, జరిపేందుకు ప్రయత్నించినా ఆ కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు వర్తించవనే విషయంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికార యంత్రాంగానికి సూచించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో సీఎస్ జవహర్‌రెడ్డి.. బాల్య వివాహాల నియంత్రణకు ఏపీ ప్రొహిబిషన్ ఆఫ్ చైల్డ్ మ్యారేజెస్ రూల్స్–2012, 2023ను కట్టుదిట్టంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. మహిళా, శిశు సంక్షేమం, సెర్ప్, విద్య, వైద్య, ఆరోగ్య, దేవదాయ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. వివిధ స్థాయిల్లో చైల్డ్ మ్యారేజెస్ ప్రొహిబిషన్ అధికారులను నియమించి వారికి తగిన అధికారాలిస్తామని చెప్పారు. వారు నిబంధనలను పక్కాగా అమలు చేస్తూ బాల్య వివాహాలను నియంత్రించాలని స్పష్టం చేశారు. ఈ విషయంలో విఫలమైతే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామ/వార్డు సచివాలయాల స్థాయిలో సర్పంచ్ లేదా వార్డు కౌన్సిలర్ అధ్యక్షతన పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు చేసి.. వార్డు సెక్రటరీ, విలేజ్, వార్డు రెవెన్యూ అధికారి, ఏఎన్ఎం, మహిళా పోలీస్, స్వయం సహాయక సంఘం సభ్యురాలు, స్థానిక పాఠశాల ఉపాధ్యాయుడు లేదా ప్రధానోపాధ్యాయుడు, స్థానిక ఎన్జీఓలను సభ్యులుగా నియమించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ల అధ్యక్షతన కమిటీలు తరచూ సమావేశమై బాల్య వివాహాల నియంత్రణ చట్టం అమలుకు తీసుకుంటున్న చర్యలను సమీక్షించాలని ఆదేశించారు. బాల్య వివాహాలు చేయకుండా ఖాజీలు, పాస్టర్లు, పురోహితులకు ఆదేశాలివ్వాలని సూచించారు. వివాహ రిజిస్ట్రేషన్ గడువును 60 రోజుల నుంచి ఆరు నెలలకు పెంచేందుకు అవసరమైన చర్యలను ప్రభుత్వం చేపట్టిందన్నారు. సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు జి.జయలక్ష్మి, ప్రవీణ్ ప్రకాశ్, ఇంతియాజ్, పాల్ రాజు, జానకి, సురేశ్‌కుమార్, ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సత్వర న్యాయం.. కేరాఫ్ 'దిశ'

మహిళలపై నేరాలకు సంబంధించి ప్రభుత్వం కఠిన చర్యలు

- నిందితులకు ఏడాదిలోపే శిక్షలు
- బీటెక్ విద్యార్థిని రమ్య కేసులో నిందితుడికి మరణశిక్ష
- రేపల్లెలో వివాహితపై రేప్ కేసులో ఇద్దరికి 20 ఏళ్ల జైలుశిక్ష
- రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 103 కేసుల్లో శిక్షలు
- మూడు మరణ శిక్షలు, 37 జీవిత ఖైదులు
- 25 కేసుల్లో 20 ఏళ్లు, మరో 29 కేసుల్లో 10 ఏళ్ల కారాగారం



రమ్యను హత్య చేసిన శశికృష్ణ, రేపల్లె రైల్వేస్టేషన్‌లో మహిళపై సామూహిక అత్యాచారం చేసిన నిందితులు విజయకృష్ణ, నిఖిల్

■ గుంటూరులో 2021, ఆగస్టు 15న బీటెక్ విద్యార్థిని నల్లపు రమ్యను పాశవికంగా నడిరోడ్డుపైనే కుంచాల శశికృష్ణ హత్య చేశాడు. ప్రభుత్వం ఈ కేసును సీరియస్‌గా తీసుకుంది. సీసీ కెమెరాలో నమోదైన హత్యా దృశ్యాల ఆధారంగా నిందితుడు శశికృష్ణను హత్య జరిగిన 12 గంటల్లోపే నరసరావుపేట సమీపంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 36 మందిని విచారించి ఏడు రోజుల్లోనే చార్జిషీట్ దాఖలు చేశారు. హత్య జరిగి ఏడాది కూడా పూర్తి కాకముందే 2022 ఏప్రిల్ 29కి విచారణ కూడా పూర్తి చేసి శిక్ష పడేలా చర్యలు తీసుకున్నారు. ఈ కేసులో శశికృష్ణకు మరణశిక్ష విధిస్తూ ఎస్సీ, ఎస్టీ కేసుల ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి రాంగోపాల్ తీర్పు ఇచ్చారు.

■ గతేడాది ఏప్రిల్ 30 రాత్రి ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం మండలానికి చెందిన గర్భవతి, తన భర్త పిల్లలతో కలిసి కూలి పనుల నిమిత్తం కృష్ణా జిల్లా నాగాయలంకకు బయలుదేరింది. రాత్రి 11.30 గంటల సమయంలో బస్సులు లేకపోవడంతో నాగాయలంకకు వెళ్లలేక రేపల్లె రైల్వేస్టేషన్‌లో నిద్రకు ఉపక్రమించారు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో కొందరు దుండగులు భర్తను చితకబాది రూ.750 నగదు లాగేసుకున్నారు. వివాహితను దూరంగా తీసుకెళ్లి గ్యాంగ్ రేప్‌కు ఒడిగట్టారు. భర్త ఫిర్యాదుతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు డాగ్‌స్క్వాడ్, సీసీ టీవీ ఫుటేజీ, సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను గంటల వ్యవధిలోనే అదుపులోకి తీసుకున్నారు. 15 రోజుల్లోనే చార్జిషీట్ కూడా దాఖలు చేశారు. రెండురోజుల క్రితం నిందితులు విజయకృష్ణ, నిఖిల్‌కు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, జరిమానా విధిస్తూ 4వ అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఆర్.శరత్‌బాబు తీర్పు వెలువరించారు. ... కేవలం ఈ రెండు ఘటనలే కాదు. రాష్ట్రంలో ఎక్కడ మహిళలపై దాడులు, అత్యాచారాలు జరిగినా నిందితులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. చట్టం నుంచి తప్పించుకునే వీలు లేకుండా ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. ఇప్పటివరకు 122 కేసులపై ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి పెట్టగా అందులో 103 కేసుల్లో శిక్షలు పడ్డాయి. గుంటూరు, ప్రకాశం, అన్నమయ్య జిల్లాలకు సంబంధించిన మూడు కేసుల్లో నిందితులకు మరణశిక్ష విధించారు. అలాగే 37 కేసుల్లో జీవిత ఖైదు పడగా, 25 కేసుల్లో 20 ఏళ్లు, 29 కేసుల్లో 10 ఏళ్లు, తొమ్మిది కేసుల్లో ఏడేళ్ల జైలుశిక్షలు పడ్డాయి. మిగిలిన 19 కేసుల్లో ఆరు విచారణలో ఉన్నాయి. మరో మూడు కేసుల్లో తీర్పు ఇవ్వడమే తరువాయి. మిగిలిన పది కేసులు వివిధ దశల్లో ఉన్నాయి.

– సాక్షి ప్రతినిధి, గుంటూరు

మహిళల రక్షణకు దిశ

మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం దిశ యాప్‌ను ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఈ యాప్‌ను కోటి 43 లక్షల మంది డౌన్‌లోడ్ చేసుకోగా.. కోటి 24 లక్షలమందికి పైగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ప్రతి జిల్లాలో ఒక అడిషనల్ ఎస్పీ, ఒక డీఎస్పీ, 15 మంది ఇతర అధికారులతో దిశ కంట్రోల్ రూమ్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దిశ యాప్ వచ్చాక 2,952 మంది మహిళలు, బాలికలను పోలీసులు కాపాడారు. 51 మందిని ఇంటి వద్ద సురక్షితంగా వదిలిపెట్టారు. బాధితుల నుంచి కాల్ రాగానే పట్టణ ప్రాంతాల్లో ఐదు నిమిషాల్లో, రూరల్ ప్రాంతాల్లో 14 నిమిషాల్లోనే పోలీసులు ఘటనా స్థలానికి వెళ్తున్నారు. దిశకు వచ్చిన 30,369 కాల్స్‌పై పోలీసులు చర్యలు తీసుకోగా 2,907 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఇందులో 13,339 మందికి ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఇచ్చారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై విచారణ జరగడానికి గతంలో సగటున 169 రోజులు పట్టేది. అలాంటిది ఇప్పుడు సగటున 38 రోజులు పడుతోంది. 2019లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జీరో ఎఫ్ఐఆర్ (రాష్ట్రంలో ఎక్కడైనా కేసు నమోదు చేసే విధానం) ప్రవేశపెట్టారు. ఇందులో భాగంగా ఇప్పటివరకు 1,557 జీరో ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. పోక్సో, రేప్ కేసుల్లో 60 రోజుల్లో కేసు విచారణ జరగాలనే నిబంధన 2019లో 12.91 శాతం అమలు అయితే ఇప్పుడు అది 85.05 శాతానికి చేరడం విశేషం. మహిళలపై లైంగిక దాడుల్లో ఇన్వెస్టిగేషన్ ట్రాకింగ్ సిస్టమ్ ద్వారా 60 రోజుల్లోనే 91.41 శాతం కేసుల్లో చార్జిషీట్ వేసిన ఘనత ఆంధ్రప్రదేశ్‌కే దక్కింది. ఈ విషయంలో జాతీయ సగటు కేవలం 40 శాతమే. 91.41 శాతం సగటుతో దేశంలో ఏపీ ప్రథమ స్థానంలో నిలిచింది.

ఈ తీర్పులు గుణపాఠం..

మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడేవారికి ఈ తీర్పులు గుణపాఠం. లైంగిక వేధింపులు, అత్యాచారాలు, అఘాయిత్యాలకు పాల్పడేవారు ఎట్టి పరిస్థితుల్లోనూ చట్టం నుంచి తప్పించుకునే వీల్లేకుండా కోర్టు ట్రయల్ మానిటరింగ్ వ్యవస్థను పటిష్టం చేశాం. కోర్టులో సమర్థవంతమైన ట్రయల్ మానిటరింగ్ ద్వారా నిందితులకు శిక్షలు పడే విధంగా కృషి చేస్తున్నాం.

– జి.పాలరాజు, ఐజీ, ఇన్‌చార్జ్, దిశ

మత్స్యకారులకు తప్పిన పెను ముప్పు

- గుజరాత్‌లోని వీరావల్ వద్ద సముద్రంలో మునిగిన పడవ
- పడవలోని ఎనిమిది మంది మత్స్యకారులు సేఫ్
- సకాలంలో స్పందించి కాపాడిన తోటి మత్స్యకారులు, కోస్టుగార్డు సిబ్బంది
- బాధితుల్లో ఆరుగురు శ్రీకాకుళం జిల్లావారే...
- ఒకరిది విజయనగరం జిల్లా.. మరొకరిది కాకినాడ


సముద్రంలో మునిగిపోతున్న పడవ


పక్క పడవలోకి చేరుకున్న మత్స్యకారులు

రణస్థలం: చేపల వేట కోసం గుజరాత్‌లోని వీరావల్ తీర ప్రాంతానికి వెళ్లిన రాష్ట్రానికి చెందిన మత్స్యకారులకు పెను ముప్పు తప్పింది. వేట కోసం తీరం నుంచి సముద్రంలోకి ఐదు కిలో మీటర్ల దూరం వెళ్లిన వారి పడవ ప్రమాదవశాత్తూ మునిగిపోయింది. తోటి మత్స్యకారులు, కోస్ట్‌గార్డ్ సిబ్బంది సకాలంలో స్పందించి పడవలో ఉన్న ఎనిమిది మంది మత్స్యకారులను రక్షించారు. రణస్థలం మత్స్యశాఖ అధికారి గంగాధర్, జీరుపాలెం సర్పంచ్ ఎం.రాముడు తెలిపిన వివరాల ప్రకారం... గుజరాత్ రాష్ట్రంలోని వీరావల్ ప్రాంతానికి వేట కోసం రాష్ట్రం నుంచి మత్స్యకారులు బృందాలుగా ఏర్పడి వెళుతుంటారు. సుమారు మూడు నెలలు అక్కడ వేట సాగించి తర్వాత స్వగ్రామాలకు వస్తారు. ఈ క్రమంలో ప్రస్తుతం వీరావల్ తీర ప్రాంతంలో ఉంటున్న రణస్థలం మండలంలోని జీరుపాలెం గ్రామానికి చెందిన కేశం కొర్లయ్య (పడవ డ్రైవర్), కేశం పండువాడు, సూరాడ చిన్న, అంబటి రాముడు, పుక్కల్ల అసిరయ్య, ఎచ్చెర్ల మండలం బడివానిపేట గ్రామానికి చెందిన బడి తోటయ్య, కాకినాడకు చెందిన టి.వీరబాబు, విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం తిప్పలవలస బర్రి అప్పన్న వేట కోసం పడవలో గురువారం తెల్లవారుజామున సముద్రంలోకి వెళ్లారు. తీరం నుంచి ఐదు కిలోమీటర్లు లోపలికి వెళ్లాక బోటు సైడ్‌లు విరిగిపోయాయి. అనంతరం ఇంజిన్ పాడైపోయింది. క్రమంగా పడవ మునిగిపోతోంది. దీంతో ప్రమాదం గురించి పడవ డ్రైవర్ కేశం కొర్లయ్య తమతోపాటు మరో రెండు పడవల్లో సముద్రంలో వేట సాగిస్తున్న జీరుపాలెం గ్రామానికి చెందిన కేశం అప్పన్న, అమ్మోరు, మైలపల్లి పెద్దయ్యతోపాటు ఇండియన్ కోస్ట్ గార్డు సిబ్బందికి సమాచారం ఇచ్చాడు. జీరుపాలెం గ్రామానికి చెందిన మత్స్యకారులు వెంటనే ప్రమాద స్థలానికి చేరుకుని ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఎనిమిది మందిని కాపాడారు. మునిగిపోతున్న పడవలో ఉన్నవారిని తాడు సాయంతో తమ పడవల్లోకి తీసుకువచ్చి రక్షించారు. అదే సమయంలో కోస్ట్ గార్డ్ సిబ్బంది హెలికాప్టర్ సాయంతో ప్రమాద స్థలాన్ని గుర్తించి సహాయక చర్యలు చేపట్టారు. మత్స్యకారులు అందరూ గురువారం సాయంత్రానికి సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. దీంతో ఉత్కంఠగా ఎదురు చూస్తున్న వారి స్వగ్రామాల్లోని కుటుంబ సభ్యులు, బంధువులు ఊపిరి పీల్చుకున్నారు.

రైల్లో బిహార్ ప్రయాణికుల రౌడీయిజం

- టికెట్ అడగడంతో టీసీపై చేయిచేసుకున్న ప్రయాణికులు
- ఒంగోలు స్టేషన్‌లో దింపి జీఆర్పీ పోలీసులకు అప్పగించిన రైల్వే సిబ్బంది

ఒంగోలు టౌన్: బెంగళూరు నుంచి దానాపూర్ వెళ్లే సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ రైల్లో టికెట్ చెక్ చేస్తున్న టీసీ మీద గూడూరు సమీపంలో బిహార్‌కు చెందిన కొందరు ప్రయాణికులు చేయిచేసుకున్నారు. రైల్వే సిబ్బంది వీరిని ఒంగోలు రైల్వే స్టేషన్‌లో పట్టుకుని రైల్వే పోలీసులకు అప్పగించారు. వివరాలు.. సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్‌లో బిహార్‌కు చెందిన 10 మంది టికెట్ లేకుండా ప్రయాణిస్తున్నారు. గురువారం అర్ధరాత్రి రైలు గూడూరు దాటిన తరువాత స్క్వాడ్ ఇన్‌స్పెక్టర్ సుధీర్ టికెట్లు చెక్ చేస్తున్న సమయంలో బిహార్ ప్రయాణికులు ఆయన మీద చేయి చేసుకున్నారు. రైలు నుంచి తోసివేసేందుకు ప్రయత్నించారు. ఈలోగా రైలు నెల్లూరుకు చేరుకోవడంతో టీసీ నెల్లూరు స్టేషన్‌లో దిగి కంట్రోల్ రూంకు సమాచారం ఇచ్చారు. సమాచారం తెలుసుకున్న ఒంగోలు రైల్వే టీసీలు రైలును ఆపి ఎస్2లో ఉన్న బిహార్ ప్రయాణికుల్లో నలుగురిని పట్టుకుని ఒంగోలు జీఆర్పీ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. ప్రయాణికులను ప్రశ్నించే క్రమంలో సెంట్రీ కానిస్టేబుల్ శ్రీకాంత్, టీసీల మధ్య వాగ్వాదం జరిగింది. కానిస్టేబుల్ తమపై చేయిచేసుకున్నట్లు టీసీలు రైల్వే సీఐ శ్రీకాంత్‌కు ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఉదయం ఒంగోలు రైల్వేస్టేషన్‌కు వచ్చిన డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (రైల్వేస్) పి.మల్లికార్జునరావు జరిగిన ఘటనపై విచారణ జరిపారు. టీసీలను కలిసి మాట్లాడారు. అనంతరం ప్రకటన విడుదలచేశారు. బిహార్ ప్రయాణికులు టీసీ సుధీర్‌తో ఘర్షణ పడటం వాస్తవమేనని, వారిని నెల్లూరులో దించడం కుదరకపోవడంతో ఒంగోలు టీసీలకు సమాచారం ఇచ్చారని తెలిపారు. వారిలో ఆరుగురు వేరే బోగీలోకి వెళ్లిపోవడంతో ఎస్ 2లో ఉన్న నలుగురిని టీసీలు పట్టుకుని జీఆర్పీ పోలీసులకు అప్పగించారని తెలిపారు. తరువాత ప్రయాణికులతో రాజీ చేసుకున్న టీసీలు ఎటువంటి చర్యలు అక్కర్లేదని రాత పూర్వకంగా ఇచ్చినట్లు వెల్లడించారు. ప్రయాణికులపై గతంలో ఎటువంటి నేరచరిత్ర లేదని తెలిపారు. ఈ ఘటనలో సెంట్రీ కానిస్టేబుల్ పి.శ్రీకాంత్ దురుసుగా ప్రవర్తించినట్లు టీసీలు ఫిర్యాదు చేశారని, శాఖాపరంగా విచారణ జరిపి నిజమని తేలితే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఛాయాచిత్రాలే చరిత్రకు నిజమైన శాసనాలు

- నేషనల్ మెడికల్ కమిషన్ డైరెక్టర్ డాక్టర్ జె.బి.రావు
- ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం


ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న జె.బి.రావు

కృష్ణలంక(విజయవాడ తూర్పు): ఛాయాచిత్రాలే చరిత్రకు నిజమైన శాసనాలని నేషనల్ మెడికల్ కమిషన్, న్యూఢిల్లీ, డైరెక్టర్ డాక్టర్ జె.బి.రావు అన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా, ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ కౌన్సిల్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జె.బి.రావు మాట్లాడుతూ ఫొటోగ్రఫీ అనేది మన బాల్యపు జ్ఞాపకాలను పదిల పరిచేదని తెలిపారు. నేటికీ కూడా ఆ స్మృతులను తలుచుకుంటూ ఆనందం పొందుతామన్నారు. అనంతరం పోటీలలో గెలుపొందిన ఛాయా చిత్రకారులను సత్కరించి సర్టిఫికెట్లు, నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా ఫౌండర్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, అధ్యక్షుడు డాక్టర్ నరేంద్ర వెంకటరమణ, జీవీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి బాధ్యుడు గోళ్ల నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

మణిపూర్‌లో మళ్లీ హింస.. ముగ్గురు మృతి

ఇంఫాల్: మణిపూర్‌లో తాజాగా జరిగిన హింసాత్మక ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఉఖ్రుల్ జిల్లాలోని కుకీ ప్రాబల్య థొవాయ్ గ్రామంలో శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. లిటాన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఈ గ్రామంలో శుక్రవారం తుపాకీ కాల్పుల శబ్దాలు వినిపించాయి. అనంతరం పోలీసు బలగాలు గ్రామంతోపాటు చుట్టుపక్కల అటవీ ప్రాంతాల్లో గాలింపు చేపట్టారు. అక్కడికి సమీపంలోని గ్రామానికి చెందిన ముగ్గురు యువకుల మృతదేహాలు వారికి కనిపించాయి. వారి శరీరాలపై గాయాలతోపాటు చేతులు నరికేసి ఉన్నాయి. వీరి వయస్సు 24–35 ఏళ్ల మధ్య ఉంటుంది. నాగాల ప్రాబల్యమున్న ఈ జిల్లాలో హింసాత్మక ఘటనలు చోటుచేసుకోవడం ఇదే మొదటిసారని పోలీసులు తెలిపారు. మణిపూర్‌లో మెజారిటీ మెయితీల జనాభా 53 శాతం కాగా, నాగాలు, కుకీలు కలిపి 40 శాతం వరకు ఉంటారు.

లాలూ బెయిల్ రద్దుపై 25న సుప్రీంకోర్టు విచారణ

సాక్షి, న్యూఢిల్లీ: దాణా కుంభకోణానికి సంబంధించి రాష్ట్రీయ జనతాదళ్(ఆర్జేడీ) అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌కు జార్ఖండ్ హైకోర్టుఇచ్చిన బెయిల్‌ను రద్దు చేయాలంటూ సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌ను ఈ నెల 25న విచారిస్తామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కేసును అత్యవసరంగా విచారించాలని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనానికి ముందు సీబీఐ విజ్ఞప్తి చేసింది. అంగీకరించిన ధర్మాసనం ఈ నెల 25న విచారించే కేసుల జాబితాలో లాలూ కేసును చేర్చాలని రిజిస్ట్రీని ఆదేశించింది. దాణా కుంభకోణానికి సంబంధించి లాలూ యాదవ్‌పై వేర్వేరు కేసులు నమోదయ్యాయి. చైబాసా ట్రెజరీ నుంచి నిధుల విడుదల చేసిన వ్యవహారంలో రెండు కేసుల్లో శిక్షకు గురయ్యారు.

ఇరాన్ అధ్యక్షుడితో ప్రధాని మోదీ సంభాషణ

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ శుక్రవారం ఇరాన్ అధ్యక్షుడు సయ్యద్ ఇబ్రహీం రైసీతో ఫోన్‌లో మాట్లాడారు. ద్వైపాక్షిక, ప్రాంతీయ అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. చాబర్ బహర్ నౌకాశ్రయాన్ని పూర్తి స్థాయిలో కనెక్టివిటీ హబ్‌గా మార్చడం సహా ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు కట్టుబడి ఉన్నట్లు వారు పునరుద్ఘాటించారు. బ్రిక్స్ విస్తరణ వంటి అంతర్జాతీయ వేదికలపై సహకారంపైనా వారు చర్చించారు. దక్షిణాఫ్రికాలో త్వరలో జరగనున్న బ్రిక్స్ శిఖరాగ్ర భేటీ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నట్లు నేతలు పేర్కొన్నారు.



ముందస్తు ఎంపిక వెనుక?

ఎన్నికల షెడ్యూల్ విడుదల కాకముందే అభ్యర్థుల ఖరారు

మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లో ఆదివాసీ ప్రాంతాలపై బీజేపీ గురి

బలహీనంగా ఉన్న స్థానాల్లో బలం పెంచుకునే వ్యూహం

ఇంకా ఎన్నికల వేడి రాజుకోలేదు..
నోటిఫికేషన్ నగారా మోగలేదు
అయినా బీజేపీ అయిదు రాష్ట్రాల ఎన్నికల కసరత్తు ముందుగానే ప్రారంభించింది.
మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల తొలి విడత అభ్యర్థుల జాబితా వెల్లడించింది.
కమలనాథులకు ఎందుకీ తొందర?
అభ్యర్థుల ఎంపిక వెనుక వ్యూహమేంటి?

భారతీయ జనతా పార్టీ గతంలో ఎన్నడూ లేని విధంగా ఎన్నికల షెడ్యూల్ విడుదల కాకముందే మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో అభ్యర్థుల్ని ప్రకటించి అసెంబ్లీ ఎన్నికల సమర శంఖాన్ని పూరించింది. మధ్యప్రదేశ్‌లో 39 మందితో, ఛత్తీస్‌గఢ్‌లో 21 మందితో తొలిజాబితా విడుదల చేసి ప్రత్యర్థి పార్టీల్లో ఎన్నికల వేడి పెంచింది. వచ్చే ఏడాది జరిగే లోక్ సభ ఎన్నికలకు సెమీఫైనల్స్ గా భావించే అయిదు రాష్ట్రాల ఎన్నికల్లో (రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మిజోరం, తెలంగాణ) రెండు రాష్ట్రాల్లో కమలం పార్టీ ముందస్తుగా అభ్యర్థుల్ని ప్రకటించడం వెనుక దాగి ఉన్న వ్యూహంపై రాజకీయ వర్గాల్లో విస్తృతంగా చర్చ జరుగుతోంది. ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేష్ భగేల్ ప్రాతినిధ్యం వహిస్తున్న పటాన్ నియోజకవర్గం నుంచి ఆయన సమీప బంధువు, బీజేపీ ఎంపీ విజయ్ భగేల్‌ను రంగంలోకి దింపి ఈసారి పోటీ రసవత్తరంగా ఉంటుందనే సంకేతాలు పంపింది. గతంలో ఒకసారి భూపేష్ భగేల్‌ను ఓడించిన ఘనత విజయ్‌కు ఉంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, పార్టీ జాతీయ అధ్యక్షుడు జే.పీ నడ్డా తదితరులు హాజరైన బీజేపీ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ సమావేశంలోనే ముందస్తుగా అభ్యర్థుల్ని ఖరారు చేయాలన్న నిర్ణయానికొచ్చారు.

సీట్లలో ఏబీసీడీ వర్గీకరణ

అభ్యర్థుల తొలి జాబితా విడుదలకు ముందు అసెంబ్లీ స్థానాలను ఏ, బీ, సీ, డీ కేటగిరీలుగా విభజించింది.

గత ఎన్నికల్లో గెలిచిన స్థానాలు - ఏ కేటగిరీ	మిశ్రమ ఫలితాలు వచ్చిన స్థానాలు - బీ కేటగిరీ
బలహీనంగా ఉన్న స్థానాలు - సీ కేటగిరీ	ఇప్పటివరకు గెలవని స్థానాలు - డీ కేటగిరీ

సీ, డీ కేటగిరీ సీట్లపై దృష్టి సారించిన కమలనాథులు ఆయా సీట్లకే తొలి జాబితా విడుదల చేశారు.

ఆదివాసీ ప్రాంతాలే గురి

మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో ఆదివాసీల ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో ఇప్పటివరకు బీజేపీ పాగా వెయ్యలేకపోయింది. ఆ ప్రాంతాల్లో ఇప్పటికీ కాంగ్రెస్‌కే పట్టు ఉంది. వారి ఓటు బ్యాంకును కొల్లగొట్టడానికే ముందస్తుగా కసరత్తు పూర్తి చేసి బీజేపీ అభ్యర్థుల్ని ఖరారు చేసింది. ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ అభ్యర్థుల్ని ప్రకటించిన 21 స్థానాల్లో 10 ఎస్టీలకు రిజర్వ్ చేయబడినవే. ఇక మధ్యప్రదేశ్ విషయానికొస్తే 13 స్థానాలు ఎస్టీ రిజర్వ్ సీట్లు. ఆదివాసీ ప్రాంతాల్లో ఎక్కువగా ప్రచారం చేయడానికి వీలుగా అభ్యర్థుల్ని ముందుగానే ప్రకటించింది.

గత అసెంబ్లీ ఎన్నికల్లో చేదు ఫలితాలే

2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ ఎన్నికలు బీజేపీకి చేదు ఫలితాల్నే మిగిల్చాయి. ఛత్తీస్‌గఢ్‌లో మొత్తం 90 అసెంబ్లీ స్థానాలకు గాను బీజేపీ కేవలం 15 సీట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఇక మధ్యప్రదేశ్‌లో మొత్తం 230 స్థానాలకు గాను 109 స్థానాలతో రెండో స్థానంలో నిలిచింది. కాంగ్రెస్ 114 సీట్లతో మెజార్టీకి ఒక్క సీటు దూరంలో మిగిలి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. 2020లో జ్యోతిరాదిత్య సింధియా నేతృత్వంలో కాంగ్రెస్ అసంతృప్త ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించడంతో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను సీఎం పీఠంపై కూర్చోబెట్టింది. ఈ సారి అలాంటి పరిస్థితి రాకూడదనే అభ్యర్థుల ఎంపిక కసరత్తు ముందస్తుగా మొదలు పెట్టింది.

అంతర్గత సర్వేలు ఏం చెబుతున్నాయి ?

మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో బీజేపీ అంతర్గత సర్వేలు కాస్త ఆందోళన పుట్టించేలా ఉన్నాయి. మధ్యప్రదేశ్‌లో 40% మంది సిట్టింగ్ ఎమ్మెల్యేల పనితీరుపై ప్రజల్లో అసంతృప్తి ఉందని వెల్లడైంది. ఇక ఛత్తీస్‌గఢ్‌లో 90 స్థానాలకు గాను 30 నుంచి 32 సీట్లు మాత్రమే గెలుచుకునే అవకాశముందని సర్వేలో తేలింది. ఇటీవల జరిగిన కర్ణాటక ఎన్నికల్లో ఓటమితో బీజేపీ ఇక ఏ ఒక్క రాష్ట్రాన్ని కూడా వదులుకోవడానికి సిద్ధంగా లేదు. అత్యంత కీలకమైన హిందీబెల్ట్‌లో ఒక్క రాష్ట్రంలో ఓడిపోయినా లోక్‌సభ ఎన్నికలపై ప్రభావం పడుతుందన్న ఆందోళన పార్టీ అగ్రనాయకుల్లో ఉంది.

ముందస్తు జాబితాతో మేలే


బీజేపీ అగ్రనాయకులు ఎంతో కసరత్తు చేసి తాము బలహీనంగా ఉన్న సీట్లలో అభ్యర్థుల్ని ప్రకటించారు. ''ఈసారి ఎన్నికల్లో కొత్త వ్యూహాలు అనుసరించాల్సిన అవసరం ఉంది. ముందుగా అభ్యర్థుల్ని ప్రకటించడం వ్యూహంలో భాగమే. అభ్యర్థులు నియోజకవర్గంలో ఎక్కువ సమయం కేటాయించి ప్రజలతో నేరుగా సంబంధాలు ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం ఉంటుంది.''అని బీజేపీ సీనియర్ నేత ఒకరు చెప్పారు. అయితే ఇలా ముందుగా అభ్యర్థుల్ని ప్రకటించడం వల్ల రెబెల్స్ బెడద కూడా ఉంటుంది. ఆ రిస్క్ తీసుకొని మరీ కమలనాథులు ముందడుగు వేశారు. మరి ఫలితాలు ఎలా ఉంటాయో తెలుసుకోవాలంటే కొన్నాళ్లు ఆగాల్సిందే. **- సాక్షి, నేషనల్ డెస్క్**

దేశంలోనే మొట్టమొదటి 3డీ ప్రింటెడ్ పోస్టాఫీసు

బెంగళూరులో ప్రారంభించిన కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్



సాక్షి, బెంగళూరు: దేశంలోనే మొట్టమొదటి త్రీడీ ప్రింటెడ్ పోస్టాఫీసు బెంగళూరులో రూపుదిద్దుకుంది. కంప్యూటరైజ్డ్ 3డీ మోడల్ డ్రాయింగ్ ఇన్‌పుట్ ఆధారంగా కాంక్రీట్‌ను ఒక్కో పొరగా వేసే 3డీ ప్రింటింగ్ టెక్నాలజీని ఉపయోగించి రోబోటిక్ ప్రింటర్‌తో ఇది నిర్మితమైంది. నగరంలోని కేంబ్రిడ్జి లేఔట్‌లో 1,021 చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.40 లక్షలు వచ్చించి, దీనిని నిర్మించారు. ఈ కొత్త పోస్టాఫీసును కేంద్ర రైల్వేలు, కమ్యూనికేషన్లు, ఎలక్ట్రానిక్స్ ఐటీ శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్ శుక్రవారం ప్రారంభించారు. సంప్రదాయ విధానంలో ఇటువంటి భవన నిర్మాణానికి ఆరు నుంచి 8 నెలలవరకు పడుతుంది. కానీ, ఆధునాతన పద్ధతిలో అంతా కలిపి కేవలం 45 రోజుల్లోనే నిర్మాణం పూర్తి చేసుకుంది. 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీతో సమయం, ఖర్చు కలిసొస్తుందని అధికారులు తెలిపారు. ప్రారంభించిన వెంటనే ఈ పోస్టాఫీసులో కార్యకలాపాలు కూడా మొదలైనట్లు వారు వివరించారు. మద్రాస్ ఐఐటీ సాంకేతిక మార్గదర్శకంలో నిర్మాణ సంస్థ లార్సెన్ అండ్ టూబ్రో లిమిటెడ్ దీనిని నిర్మించింది. ఈ ప్రయత్నం స్వావలంబన భారత్ స్ఫూర్తికి నిదర్శనమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. బెంగళూరులో ప్రారంభమైన దేశంలోనే ప్రప్రథమ 3డీ ప్రింటెడ్ పోస్టాఫీసు ప్రతి భారతీయుడికీ గర్వకారణంగా నిలుస్తుందని ఆయన ఎక్స్(పూర్వపు ట్విట్టర్)లో తెలిపారు.



జాబిల్లికి చేరువగా ల్యాండర్ మాడ్యూల్

కక్ష్య దూరం తగ్గింపు ప్రక్రియ విజయవంతం

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): చంద్రయాన్–3 మిషన్‌లో భాగంగా ల్యాండర్ మాడ్యూల్ చందమామకు మరింత చేరువగా వచ్చింది. మాడ్యూల్‌లోని ఇంధనాన్ని శుక్రవారం సాయంత్రం 4 గంటలకు స్వల్పంగా మండించి లూనార్ ఆర్బిట్‌లో కక్ష్య దూరాన్ని తగ్గించే ప్రక్రియను ఇస్రో సైంటిస్టులు విజయవంతంగా నిర్వహించారు. ప్రస్తుతం ల్యాండర్ మాడ్యూల్ చంద్రుడికి 113X157 కిలోమీటర్ల ఎత్తులో పరిభ్రమిస్తోంది. ల్యాండర్ 'విక్రమ్', రోవర్ 'ప్రజ్ఞాన్'తో కూడిన ల్యాండర్ మాడ్యూల్ ఆరోగ్యకరంగా ఉందని ఇస్రో శాస్త్రవేత్తలు ప్రకటించారు. ఈ నెల 20న తెల్లవారుజామున 2 గంటలకు రెండోసారి కక్ష్య దూరాన్ని తగ్గించే ప్రక్రియను చేపట్టనున్నారు. ల్యాండర్ మాడ్యూల్‌ను చంద్రుడికి ఇంకా దగ్గరగా తీసుకెళ్లనున్నారు. రెండో విడత కక్ష్య దూరం తగ్గింపు అనంతరం ఈ నెల 23న ల్యాండర్ మాడ్యూల్‌ను కక్ష్య దూరాన్ని క్రమంగా తగ్గించుకుంటూ చంద్రుడి ఉపరితలంపై దించే ప్రక్రియ నిర్వహిస్తారు.

చంద్రుడి ఫొటోలు పంపించిన చంద్రయాన్-3

చంద్రయాన్–3 మిషన్ చందమామకు 113 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న సమయంలో ల్యాండర్ పొజిషన్ డిటెక్షన్ కెమెరా చిత్రీకరించిన ఛాయాచిత్రాలు, వీడియోలను ఇస్రో శుక్రవారం విడుదల చేసింది. చంద్రయాన్–3 వ్యోమనౌకలోని ప్రొపల్షన్ మాడ్యూల్ నుంచి ల్యాండర్ మాడ్యూల్ విడిపోయిన తర్వాత ల్యాండర్ మాడ్యూల్‌లోని ల్యాండర్ పొజిషన్ డిటెక్షన్ కెమెరా(ఎల్‌పీడీసీ) ఆగస్టు 15న, ల్యాండర్ ఇమేజర్(ఎల్ఐ) కెమెరా–1 ఆగస్టు 17న ఈ చిత్రాలు, వీడియోలను చిత్రీకరించాయి. భూనియంత్రిత కేంద్రానికి పంపించాయి. చంద్రుడి ఉపరితలంపై మట్టి దిబ్బలు, అఖాతాలు ఈ చిత్రాల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయి.

'2047 నాటికి వికాస్ భారత్' తథ్యం

ప్రధాని నరేంద్ర మోదీ ధీమా

న్యూఢిల్లీ/గాంధీనగర్: సమాన, సమ్మిళిత అభివృద్ధిని సాధించే దిశగా భారత్ వేగంగా అడుగులు వేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఆర్థిక ప్రగతి విషయంలో భారత్ నూతన శకంలోకి ప్రవేశిస్తోందంటూ వెలువడిన పలు నివేదికలను ఆయన ప్రస్తావించారు. 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందంటూ నివేదికలు చెబుతున్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు మోదీ శుక్రవారం లింక్డ్‌ఇన్‌లో పోస్టు చేశారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థపై ఎస్‌బీఐ రీసెర్చ్, జర్నలిస్టు అనిల్ పద్మనాభన్ విడుదల చేసిన నివేదికల గురించి ప్రస్తావించారు. గత తొమ్మిదేళ్లలో ప్రజల ఆదాయం భారీగా పెరిగినట్లు ఈ నివేదికలు చెబుతున్నాయని వెల్లడించారు. ఆదాయపు పన్ను రిటర్న్‌లు(ఐటీఆర్) దాఖలు చేసేవారి సంఖ్య పెరుగుతోందని గుర్తుచేశారు. ఉత్తరప్రదేశ్‌లో 2014 జూన్‌లో 1.65 లక్షల ఐటీఆర్‌లు దాఖలు కాగా, 2023 జూన్‌లో 11.92 లక్షల ఐటీఆర్‌లు దాఖలయ్యాయని వివరించారు. మణిపూర్, మిజోరాం, నాగాలాండ్ లాంటి చిన్నరాష్ట్రాల్లోనూ ఐటీఆర్‌ల సంఖ్య తొమ్మిదేళ్లలో 20 శాతం పెరిగిందన్నారు. దేశ ఉమ్మడి ప్రయత్నాలనే కాదు, దేశ శక్తిసామర్థ్యాలను సైతం ఈ నివేదికలు బహిర్గతం చేస్తున్నాయని ప్రధానమంత్రి వివరించారు. '2047 నాటికి వికాస్ భారత్' అనే లక్ష్యాన్ని మనం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

మరో హెల్త్ ఎమర్జెన్సీకి సిద్ధం కావాలి

ప్రజల సంక్షేమం కోసం నవీన ఆవిష్కరణలను, సాంకేతికతను అందరికీ అందుబాటులోకి తీసుకురావాలని ప్రధాని మోదీ సూచించారు. శుక్రవారం గుజరాత్ రాజధాని గాంధీనగర్‌లో జరిగిన జీ20 దేశాల ఆరోగ్య శాఖ మంత్రుల సదస్సులో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. మరో ఆరోగ్య అత్యవసర పరిస్థితిని ఎదుర్కొనేందుకు ప్రపంచం సిద్ధం కావాలని చెప్పారు. గడువు కంటే ముందే భారత్‌లో ప్రజల భాగస్వామ్యంతో క్షయవ్యాధిని(టీబీ) పూర్తిగా అరికట్టబోతున్నామన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న డిజిటల్ ఆరోగ్య కార్యక్రమాలు ఒక ఉమ్మడి వేదికపై రావాలని ఆకాంక్షించారు. డిజిటల్ విధానాలు, నూతన ఆవిష్కరణలతో ఆరోగ్య సేవలను అందుబాటులోకి తీసుకురావొచ్చని అభిప్రాయపడ్డారు. కోవిడ్ మహమ్మారి నుంచి పాఠాలు నేర్చుకోవాలని, అలాంటి ఆరోగ్య అత్యవసర పరిస్థితి తలెత్తితే ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలన్నారు.

ప్రజా ఉద్యమంగా అభివృద్ధి కార్యక్రమాలు



న్యూఢిల్లీ: దేశంలో అభివృద్ధి కార్యక్రమాలను ఒక ప్రజా ఉద్యమంగా నిర్వహించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బీజేపీకి చెందిన జిల్లా పంచాయతీ సభ్యులకు పిలుపునిచ్చారు. 2047 నాటికి భారత్‌ను సౌభాగ్యవంతమైన దేశంగా తీర్చిదిద్దుకోవాలని, ఇందుకోసం ప్రతి గ్రామంలో, ప్రతి తహసీల్ పరిధిలో, ప్రతి జిల్లాలో అభివృద్ధి దీపం వెలిగించాలని ఉద్బోధించారు. శుక్రవారం గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల బీజేపీ స్థానిక సంస్థల సభ్యులు పాల్గొన్న 'క్షేత్రీయ పంచాయతీరాజ్ పరిషత్' శిక్షణా కార్యక్రమంలో ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రసంగించారు. సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్ అనేది కేవలం ఒక నినాదం కాదని, ప్రతిక్షణం ప్రగతి కోసం, ప్రజల కోసం పనిచేయాలని సూచించారు. ముఖ్యమంత్రిగా, తర్వాత ప్రధానమంత్రిగా తనకు ఎదురైన అనుభవాలను పంచుకున్నారు. స్థానిక సంస్థల్లో వేర్వేరు హోదాల్లో ఉన్నవారు గ్రామాలు, జిల్లాల్లో పనులను ప్రాధాన్యతాక్రమంలో చేపట్టాలని అన్నారు. ప్రజల మద్దతుతో అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతం చేయాలని వివరించారు. స్థానిక సంస్థలకు నిధుల కేటాయింపు పెరుగుతోందని, వనరుల కొరత లేదని వెల్లడించారు. గ్రాంట్ కింద గతంలో రూ.70,000 కోట్ల కేటాయింపులు జరిగేవని, ఇప్పుడు రూ.3 లక్షల కోట్లకుపైగానే ఇస్తున్నారని తెలిపారు. దేశంలో తమ ప్రభుత్వం వచ్చాక 30,000కుపైగా జిల్లా పంచాయతీ భవనాలు నిర్మించామని గుర్తుచేశారు. ఉపాధి హామీ నిధులతో పేదలకు ఉపాధి కల్పించడంతోపాటు గ్రామాల్లో ఆస్తులను సృష్టించాలని కోరారు.

'పీఎం విశ్వకర్మ'ను విజయవంతం చేయాలి

బీజేపీ స్థానిక సంస్థల సభ్యులకు శిక్షణ ఇవ్వడానికి మరిన్ని వర్క్‌షాప్‌లు నిర్వహిస్తామని ప్రధాని మోదీ చెప్పారు. ఇవి ఎన్నికల్లో గెలవడానికి కాదని, 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దుకోవడానికేనని స్పష్టం చేశారు. 'పీఎం విశ్వకర్మ' పథకాన్ని విజయవంతం చేయడానికి సహకరించాలని కోరారు. గ్రామాల్లో సంప్రదాయ వృత్తిదారులను గుర్తించాలని, అర్హులతో జాబితాలు తయారు చేయాలని అన్నారు. సంప్రదాయ వృత్తిదారులు గ్రామాల ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతున్నారని ప్రశంసించారు. వారు తమ పనులను సామాజిక బాధ్యతగా నిర్వర్తిస్తున్నారని కొనియాడారు. సంప్రదాయ వృత్తిదారుల సంక్షేమం కోసం బడ్జెట్ కేటాయిస్తున్నామని తెలిపారు. పీఎం విశ్వకర్మ పథకాన్ని సెప్టెంబర్ 17న ప్రారంభిస్తామని మోదీ పునరుద్ఘాటించారు.

ప్రతి భారతీయుడూ జన్మతః హిందువే


జమ్మూకశ్మీర్ మాజీ సీఎం గులాం నబీ ఆజాద్



జమ్మూ: జమ్మూకశ్మీర్ మాజీ సీఎం, డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ ఆజాద్ పార్టీ(డీపీఏపీ) చీఫ్ గులాం నబీ ఆజాద్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దేశంలోని మెజారిటీ ముస్లింలు ఒకప్పుడు హిందువులేనని ఆయన అన్నారు. ఇందుకు ఉదాహరణ కశ్మీరేనంటూ ఆయన.. కశ్మీర్‌లోని ముస్లింలలో అత్యధికులు ఒకప్పుడు కశ్మీరీ పండిట్లేనన్నారు. మతమార్పిడుల వల్లే కశ్మీర్‌లో హిందువుల జనాభా తగ్గిపోయిందని చెప్పారు. థోడాలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాజకీయ ప్రాబల్యం కోసం మతాన్ని వాడుకోరాదన్నారు. అట్లా వాడుకునే వారు రాజకీయంగా బలహీనులని ఆయన వ్యాఖ్యానించారు. ప్రతి భారతీయుడూ పుట్టుకతో హిందువేనని వ్యాఖ్యానించారు. 'ముస్లింలలో కొందరు బయటి నుంచి వచ్చిన వారంటూ ఒక బీజేపీ నాయకుడు అన్నారు. బయటి నుంచి వచ్చిన వారు, లోపలి వారు అంటూ ఎవరూ లేరు. అందరూ ఇక్కడి వారే'అని ఆయన తెలిపారు.'1,500 ఏళ్ల క్రితం ఇస్లాం మనుగడలోకి వచ్చింది. హిందూ మతం పురాతనమైంది. కొందరు ముస్లింలు బయటి నుంచి వచ్చి ఉండొచ్చు'అని ఆయన పేర్కొన్నారు.

పేర్లు తొలగిస్తే చరిత్ర మారదు

నేషనల్ కాన్ఫరెన్స్ చీఫ్ ఫరూక్ అబ్దుల్లా



శ్రీనగర్: ప్రముఖ ప్రాంతాలు, కట్టడాలకున్న నెహ్రూ, ఇందిరాగాంధీ వంటి పేర్లను తొలగించినంత మాత్రాన చరిత్ర దాగదు, మారదని జమ్మూకశ్మీర్ మాజీ సీఎం, నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సీ) చీఫ్ ఫరూక్ అబ్దుల్లా వ్యాఖ్యానించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తమ పార్టీకి చెందని ప్రతి నేత పేరును కనిపించకుండా చేస్తోందని ఆయన విమర్శించారు. అయితే, చరిత్ర ఎన్నటికీ మారదు, శాశ్వతంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. తన తండ్రి, ఎన్‌సీ వ్యవస్థాపకుడు షేక్ మహ్మద్ అబ్దుల్లాను అందరూ పిలుచుకునే షేర్ అనే పేరును 'షేర్–ఇ–కశ్మీర్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్'నుంచి అధికారులు తొలగించడంపై ఆయన పై వ్యాఖ్యలు చేశారు. 'కేంద్ర ప్రభుత్వం మొఘలుల 800 ఏళ్ల పాలనను చరిత్ర పుస్తకాల నుంచి తొలగించింది. దానర్థం వారు లేనట్లేనా? తాజ్ మహల్, ఎర్రకోట, జామా మసీదు, కుతుబ్‌మినార్.. తదితర చారిత్రక నిర్మాణాలకు కారకులెవరని చెబుతారు?, మనం, వాళ్లు శాశ్వతం కాదు. చరిత్ర శాశ్వతం, అది మారదు. ఎప్పటికీ అలాగే ఉంటుంది'అని అబ్దుల్లా పేర్కొన్నారు.

పాక్ ప్రధాని ప్రత్యేక సలహాదారుగా యాసిన్ మాలిక్ భార్య

ఇస్లామాబాద్: పాకిస్తాన్ ఆపద్ధర్మ ప్రధానమంత్రిగా ఇటీవలే పగ్గాలు చేపట్టిన అన్వరుల్ హక్ కాకర్ ప్రత్యేక సలహాదారుగా కశ్మీర్ వేర్పాటువాది యాసిన్ మాలిక్ భార్య ముషాల్ హుసేన్ మాలిక్ నియమితులయ్యారు. ఐదుగురు ప్రత్యేక సలహాదారుల పేర్లలో ఆమె ఒకరు. మానవ హక్కులు, మహిళా సాధికారతపై ప్రధాని ఆమె సలహాలు ఇవ్వనున్నారు. ఈ పదవికి జూనియర్ మంత్రి కంటే తక్కువ హోదా ఉంటుంది. పాక్ పౌరురాలైన ముషాల్ జమ్మూకశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్(జేకేఎల్ఎఫ్) చీఫ్ యాసిన్ మాలిక్‌ను 2009లో పెళ్లి చేసుకున్నారు. ముషాల్ తన కుమార్తెతో కలిసి ఇస్లామాబాద్‌లో నివసిస్తున్నారు. ఉగ్ర నిధుల కేసులో యావజ్జీవ జైలు శిక్ష పడిన యాసిన్ ప్రస్తుతం తీహార్ జైలులో ఉన్నాడు.

ప్రకృతి వైపరీత్యాలతో 2,038 మంది మృతి

న్యూఢిల్లీ: దేశంలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి రుతుపవనాల కారణంగా సంభవించిన వరదలు, పిడుగులు, కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో 2,038 మంది ప్రాణాలు కోల్పోయినట్లు కేంద్ర హోం శాఖ తెలిపింది. ఇందులో అత్యధికంగా బిహార్‌లో 518 మంది, ఆ తర్వాతి స్థానంలో ఉన్న హిమాచల్ ప్రదేశ్‌లో 330 మంది చనిపోయారని వివరించింది. ఏప్రిల్ 1–ఆగస్టు 17వ తేదీ మధ్య కాలంలో వర్షాలు, వరదలకు సంబంధించిన ఘటనల్లో 101 మంది జాడ తెలియకుండా పోగా 1,584 మంది గాయపడినట్లు పేర్కొంది. వర్షాలు, కొండచరియలు విరిగిపడటం, పిడుగుపాటు ఘటనలతో 335 జిల్లాలు ప్రభావితమైనట్లు తెలిపింది.

కోటాలో కొత్త ఫ్యాన్లు

ఆత్మహత్యల నిరోధానికి స్ప్రింగ్ డివైజ్ ఫ్యాన్లు • హాస్టల్స్‌ను ఆదేశించిన యంత్రాంగం



కోటా: పోటీ ప్రవేశ పరీక్షలకిచ్చే కోచింగ్‌కు ప్రసిద్ధి చెందిన రాజస్తాన్ కోటాలో విద్యార్థుల వరస ఆత్మహత్యలు అధికారుల్ని ఆందోళనకు గురి చేస్తున్నాయి. గత వారం రోజుల్లో నలుగురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపింది. దీంతో విద్యార్థుల ఆత్మహత్యల నిరోధానికి స్థానిక యంత్రాంగం నడుం బిగించింది. హాస్టల్స్, పేయింగ్ గెస్ట్ ఇళ్లలోనూ ఫ్యాన్లకి ఆత్మహత్య నిరోధక పరికరం అమర్చి తీరాలని నిబంధనలు ప్రవేశపెట్టింది. హాస్టల్స్‌లో అన్ని గదుల్లోనూ స్ప్రింగ్ డివైజ్ ఫ్యాన్లు అమర్చాలని డిప్యూటీ కమిషనర్ ఒ.పి. బంకార్ ఆదేశాలు జారీ చేశారు. ఈ స్ప్రింగ్ పరికరం ఉండడం వల్ల 20 కేజీల కంటే ఎక్కువ బరువు ఉన్నవారు ఎవరైనా ఫ్యాన్‌కు వేలాడితే వెంటనే దానికి అటాచ్ చేసి ఉన్న స్ప్రింగ్ ఊడిపోయి ఫ్యాన్ పక్కకి ఒరిగిపోతుంది. అప్పుడు ఎవరైనా ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడడం అసాధ్యం. దాంతో పాటు సైరన్ కూడా మోగుతుంది. కోటాలో ఎక్కువ మంది విద్యార్థులు ఫ్యాన్‌కే ఉరి వేసుకొని ప్రాణాలు తీసుకుంటూ ఉండడంతో అధికారులు ఈ కొత్త ఆలోచన చేశారు. గత వారంలో సమావేశమైన స్థానిక యంత్రాంగం విద్యార్థుల ఆత్మహత్య నివారణకు పలు చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. అందులో భాగంగానే సైకియాట్రిస్టులతో విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇప్పించాలని నిర్ణయించారు. ఇప్పుడు ఈ స్ప్రింగ్ సీలింగ్ ఫ్యాన్లను వెంటనే అమర్చాలని అన్ని హాస్టళ్లకు ఆదేశాలు జారీ అయ్యాయి. అయితే ఆత్మహత్యల నిరోధానికి ఈ స్ప్రింగ్ ఫ్యాన్లు ఏ విధంగానూ ఉపయోగపడవని విద్యా రంగ నిపుణులు భావిస్తున్నారు. చదువుల ఒత్తిడి తగ్గేలా చర్యలు తీసుకోవాలే తప్ప, ఇలాంటి పరిష్కారాలు శాశ్వతం కాదని వారి అభిప్రాయంగా ఉంది.

దిగొస్తున్న టమాటా ధర

సెప్టెంబర్ రెండో వారానికి కిలో రూ.30 చేరుతుందని అంచనా



సాక్షి, న్యూఢిల్లీ: నెల రోజులుగా వినియోగదారులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న టమాటా ధరలు క్రమంగా దిగొస్తున్నాయి. టమాటా అధికంగా పండించే ఆంధ్రప్రదేశ్ సహా మహారాష్ట్ర, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, హరియాణా రాష్ట్రాల నుంచి సరఫరా పెరగడంతో ధరలు క్రమంగా దిగొస్తున్నట్లు కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ వెల్లడించింది. గత జూలైలో కిలో ఏకంగా రూ.250 పలికిన టమాటా ధర ప్రస్తుతం రూ.100–120 మధ్యకు చేరుకుందని తెలిపింది. ఈ ధరలు వచ్చే సెప్టెంబర్ రెండో వారానికి సాధారణ స్థాయికి అంటే కిలో రూ.30–40కి చేరుకుంటాయని అంచనా వేసింది. మహారాష్ట్ర నాసిక్‌లోని పింపాల్‌గావ్ బస్వంత్ మార్కెట్‌కు వారం రోజులుగా టమాటా రాక ఆరు రెట్లు పెరిగిందని అధికారులు తెలిపారు. బెంగళూరు వంటి కీలక మార్కెట్లకు కూడా టమాటా సరఫరా పెరిగింది. ఢిల్లీలో మొన్నటి వరకు కిలో రూ.220గా ఉన్న టమాటా ధర శుక్రవారం రూ.100 వరకు పలికింది.

ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ ఎన్నికల కమిటీలు

న్యూఢిల్లీ: ఛత్తీస్‌గఢ్‌లో అధికారాన్ని కాపాడుకోవడానికి కాంగ్రెస్ పార్టీ కసరత్తు ప్రారంభించింది. రాష్ట్ర బీజేపీ అభ్యర్థుల తొలి జాబితా ప్రకటించిన నేపథ్యంలో రేసులో వెనుకబడకుండా ఎన్నికల నిర్వహణ, మేనిఫెస్టో రూపకల్పన కోసం నాలుగు కమిటీలు నియమించింది. ఎలక్షన్ మేనిఫెస్టో కమిటీ, ఎలక్షన్ మేనేజ్‌మెంట్ కమిటీ, క్రమశిక్షణ కమిటీ, ప్రణాళిక, వ్యూహ కమిటీల నియామకానికి శుక్రవారం పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోద ముద్ర వేశారు. ఎన్నికల మేనిఫెస్టో కమిటీకి మహమ్మద్ అక్బర్ నేతృత్వం వహిస్తే శివకుమార్ దహారియా ఆధ్వర్యంలో ఎన్నికల నిర్వహణ కమిటీని ఏర్పాటు చేశారు. 9 మందితో క్రమశిక్షణ కమిటీ, 18 మందితో ప్లానింగ్ కమిటీ ఏర్పాటయ్యాయి.

'40% కమీషన్'పై న్యాయ విచారణ

కర్ణాటక ప్రభుత్వం ఆదేశం

బెంగళూరు: గత బీజేపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ప్రాజెక్టులకు 40 శాతం కమీషన్ డిమాండ్ చేశారనే ఆరోపణలపై న్యాయ విచారణ జరిపించాలని కర్ణాటక ప్రభుత్వం నిర్ణయించింది. మూడు నెలల క్రితం రాష్ట్రంలో అధికార పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ సర్కారు..హైకోర్టు రిటైర్డు జడ్జి జస్టిస్ నాగమోహన్ దాస్ సారథ్యంలోని కమిటీకి విచారణ బాధ్యతలను అప్పగిస్తూ శుక్రవారం ఆదేశాలిచ్చింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల్లో 40 శాతం కమీషన్ కుంభకోణంపై విచారణ జరిపించడం కూడా ఉంది. భారీగా పనులు చేపట్టిన శాఖలపై ఈ కమిషన్ విచారణ చేపట్టనుంది. అన్ని ప్రజా పనుల్లో 40 శాతం కమీషన్ తమ నుంచి వసూలు చేస్తున్నారంటూ కర్ణాటక రాష్ట్ర కాంట్రాక్టర్ల సంఘం అప్పట్లో ప్రధానికి, సీఎంకు లేఖలు రాయడం గమనార్హం. పనులు ప్రారంభించకమునుపే 25 నుంచి 30 శాతం వరకు కమీషన్‌ను ప్రజాప్రతినిధులకు చెల్లించినట్లు కాంట్రాక్టర్లు అందులో ఆరోపించారు.

తాంబరం -వేళాంగని మధ్య ఫెస్టివల్ స్పెషల్ రైళ్లు

కొరుక్కుపేట : నాగపట్నంలో వేళాంగని ఫెస్టివల్‌ను పురస్కరించుకుని ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు తాంబరం- వేళాంగని- తాంబరం మధ్య స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్టు సదరన్ రైల్వే శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. వేళాంగని-తాంబరం స్పెషల్ రైలు (నంబర్ 06003) తాంబరం-వేళాంగని స్పెషల్ చార్జీల ప్రత్యేక రైలు ఈనెల 28వ తేదీ రాత్రి 9 గంటలకు తాంబరంలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 4:30 గంటలకు వేళాంగని చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో రైలు (నంబర్ 06004) వేళాంగని-తాంబరం స్పెషల్ రైలు ఈ నెల 29వ తేదీ రాత్రి 7:30 గంటలకు వేళాంగనిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 3:15 గంటలకు తాంబరం చేరుకుంటుంది. ఈ రైలు చెంగల్‌పట్టు, విల్లుపురం, కడలూరు పోర్టు, చిదంబరం, సీర్గాళి, మైలాడుదుర్రై, తిరువారూర్, నాగపట్నం, వేళాంగనిలో ఆగుతుందని, వీటికి అడ్వాన్స్డ్ రిజర్వేషన్లు ప్రారంభమైనట్టు అధికారులు వెల్లడించారు.

న్యూస్‌రీల్

ఢిల్లీకి గవర్నర్ ఆర్‌ఎన్.రవి



సాక్షి, చెన్నై : రాష్ట్ర గవర్నర్ ఆర్‌ఎన్.రవి శుక్రవారం ఉదయం కుటుంబంతో సహా ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. ఇటీవల రాష్ట్రంలో తనకు వ్యతిరేకంగా వివాదాలు, విభేదాలు, చర్చలు బయలుదేరిన సమయంలో గవర్నర్ ఆర్‌ఎన్.రవి ఢిల్లీకి వెళ్లి వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా నీట్ అంశంపై గవర్నర్ చేసిన వ్యాఖ్యలు తమిళనాట వివాదానికి దారితీశాయి. ఆదివారం అధికార డీఎంకే అనుబంధ విభాగాల నేతృత్వంలో భారీ నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. గవర్నర్ తీరుని నిరసిస్తూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నీట్ వ్యవహారంపై డీఎంకే నిరసనలకు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో గవర్నర్ ఆర్‌ఎన్.రవి ఢిల్లీకి బయలుదేరడం ప్రాధాన్యత సంతరించుకుంది.

భక్తిశ్రద్ధలతో దీప పూజ



దీప పూజ చేస్తున్న మహిళలు

కొరుక్కుపేట: చెన్నై టి.నగర్, జీఎన్ శెట్టి రోడ్డులో ఉన్న పద్మావతి అమ్మవారి ఆలయంలో శుక్రవారం రాత్రి దీప పూజను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు ప్రారంభ మైన ఈ పూజల్లో దాదాపు 150 మందికి పైగా మహిళలు పాల్గొన్నారు. పూజ సామగ్రి ప్రతి వారం ఉభయదారులు (దాతలు) అందజేశారు. టీటీడీ స్థానిక సలహా మండలి-చెన్నై మాజీ అధ్యక్షుడు ఏజే శేఖర్‌రెడ్డి ప్రతి శుక్రవారం సాయంత్రం దీప పూజ నిర్వహించేలా నిర్ణయించారు.

నాటు బాంబులు పేలి యువకుడి దుర్మరణం

– ఐదుగురికి తీవ్ర గాయాలు.

తిరువొత్తియూరు: పాలక్కాడు సమీపంలో సరుకుల వాహనంలో నాటుబాంబులు, టపాసులు, పేలి యువకుడు దుర్మరణం చెందాడు. అదేవిధంగా బాలికలు సహా ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ధర్మపురి జిల్లా పాలక్కాడు సమీపంలోని వేల్ల కోలివళి కరుప్పా కొట్టాయి ప్రాంతానికి చెందిన పరశురామన్, తన కుటుంబ సభ్యులు, బంధువులు, కారిమంగళం సమీపంలో ఉన్న కుల దేవత ఆలయానికి గురువారం రాత్రి సరుకుల వాహనంలో బయలుదేరారు. వాహనం ముందు టపాసులు పేల్చారు. టపాసులు వాహనంలో వున్న నాటు బాంబులు, టపాసులపై పడడంతో అవి ఒక్కసారిగా పేలిపోయాయి. దీంతో బంధువులు వాహనం నుంచి కిందకు తిరిగి పరిగెత్తారు. ఈ ఘటనలో వాహనంలో ఉన్న మహేష్, అతని కుమారుడు విజయ్ కుమార్ (21), పరశురామన్(27), కార్తీక్ కుమార్తె ప్రద్యక్షణ(6) అలగేషన్ కుమారుడు దర్శన్, తిరుపతి కుమార్తె యాసిక, కుమార్ స్వామి కుమారుడు నాగరాజు తీవ్రంగా గాయపడ్డారు. వారిని పాలక్కాడు ఆసుపత్రిలో చేర్చారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ధర్మపురి ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ విజయ్ కుమార్ మృతి చెందాడు. బాలిక యాసిక ఆందోళనకర పరిస్థితుల్లో సేలం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది.

100 మంది వద్ద రూ.50 కోట్ల మోసం

- ఒకే కుటుంబానికి చెందిన నలుగురి అరెస్టు

తిరువొత్తియూరు: 100 మంది వద్ద రూ.50 కోట్లు మోసం చేసిన ఒకే కుటుంబానికి చెందిన నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై ముత్యాలపేటకు చెందిన జోసెఫ్ (44) ప్రైవేట్ సంస్థ ఉద్యోగి. ఇతనికి స్నేహితుని ద్వారా తిరుముల్లైవాయిల్ శాంతిపురం ప్రాంతంలో నివాసముంటున్న ఒకే కుటుంబానికి చెందిన జోసెఫ్ జాయిస్ విక్టోరియా(55), ఫ్రాంక్లిన్ (65), జో ఇంట్రన్స్‌సేవియర్(33), మెర్లిన్ క్రిస్టో (28) పరిచయమయ్యారు. వీరు నుంగంబాకంలో ఒక ప్రైవేటు ట్రేడింగ్ కంపెనీ నడుపుతున్నారు. ఇందులో రూ.లక్ష పెట్టుబడి పెట్టిన వారికి రెండు రెట్లు నగదు ఇస్తున్నట్టు జోసెఫ్‌కు చెప్పారు. ఈ మాటలు నమ్మిన జోసెఫ్ నవంబర్‌లో జోసెఫ్ జాయిస్ విక్టోరియా వద్ద రూ.22 లక్షలు ఇచ్చాడు. దీనికి అతని అకౌంట్‌లో రూ.26 లక్షల నగదు క్రెడిట్ చేశారు. ఇలాగే 100 మందికి పైగా జోసెఫ్ జాయిస్ విక్టోరియా సంస్థలో రూ.50 కోట్ల వరకు నగదు డిపాజిట్ చేశారు. అందుకు తగిన వడ్డీగాని, అసలు గాని వారికి తిరిగి ఇవ్వలేదు. దీనిపై ఆవడి పోలీస్ స్టేషన్లో జోసెఫ్‌తోపాటు మరికొందరు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తిరుముల్లైవాయిల్ పోలీసులు కేసు నమోదు చేసి ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి తీవ్రంగా విచారించారు. అందులో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ట్రేడింగ్ కంపెనీ ద్వారా 100 మంది నుంచి రూ.50 కోట్ల వరకు మోసం చేసినట్టు గుర్తించారు. శుక్రవారం ఒకే కుటుంబానికి చెందిన నలుగురిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచి జైలుకు తరలించారు.

జాలర్ల సంక్షేమమే లక్ష్యం

- కచ్చదీవుల స్వాధీనంతోనే భద్రత
- నిషేధ కాలంలో జాలర్లకు రూ.8000 సాయం



మత్స్యకారులకు సంక్షేమ పథకాలు అందజేస్తున్న సీఎం స్టాలిన్

సాక్షి, చెన్నై : జాలర్ల సంక్షేమమే డీఎంకే ప్రభుత్వ ధ్యేయమని సీఎం ఎంకే స్టాలిన్ స్పష్టం చేశారు. కచ్చదీవుల స్వాధీనం ద్వారానే జాలర్ల భద్రతకు భరోసా కలుగుతుందన్నారు. జాలర్లకు అండగా ఉన్నామని, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సంక్లిష్ట పరిస్థితులు ఎదురయ్యాయని వ్యాఖ్యానించారు. నిషేధకాలంలో జాలర్లకు ఇచ్చే సాయాన్ని రూ.5 వేల నుంచి రూ.8 వేలకు పెంచుతున్నట్టు సీఎం తెలిపారు.

రామనాథపురం జిల్లా రామేశ్వరంలో శుక్రవారం జాలర్ల సంక్షేమం, అభివృద్ధి సహాయకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో జాలర్ల కుటుంబాలకు ఆర్థిక సహాయంతో భరోసా కల్పించే విధంగా సీఎం స్టాలిన్ సహాయకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. తమిళ జాలర్లకు డీఎంకే ప్రభుత్వం ఆది నుంచి అండగా ఉందని గుర్తు చేశారు. తాము ఎంత అండగా ఉన్నా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జాలర్లకు భద్రత కరువైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎంకే హయాంలో కచ్చదీవులు ధారాదత్తం చేసినట్లుగా కేంద్ర పాలకులు వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. చరిత్రను తెలుసుకోకుండా తమపై నిందలు మోపడం మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. బీజేపీ పాలనలోనే జాలర్లపై దాడులు శృతిమించాయని మండిపడ్డారు. తమ ప్రభుత్వం జాలర్లకు అన్ని విధాలుగా అండగా, మద్దతుగా ఉందని స్పష్టం చేశారు. శ్రీలంకలో ఇటీవల కాలంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో తమ ప్రభుత్వం ఆ దేశంలోని తమిళ పౌరులకే కాదు, అందరికీ అండగా సహాయకాలను అందజేసిందని గుర్తు చేశారు. ఆయన తమిళ జాలర్లపై దాడులు ఆగడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వందలాది మంది జాలర్లను అరెస్టు చేశారని, వందకు పైగా పడవలను శ్రీలంక నావికాదళం స్వాధీనం చేసుకుందని వివరించారు. తాము పదే పదే ప్రధానికి లేఖలు రాయడం ద్వారా జాలర్లను విడుదల చేశారని, ఇప్పటి వరకు పడవలను అప్పగించలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. తమిళ జాలర్ల కోసం చిత్త శుద్ధితో తమ ప్రభుత్వం పని చేస్తుందని వేదించారు. అనేక సందర్భాల్లో తమ ప్రభుత్వం కేంద్రం పై ఒత్తిడి తెచ్చినా జాలర్ల భద్రతకు భరోసా కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా తాము ఓర్పుతో వేచి ఉన్నామని, కేంద్రం నుంచి స్పందన రాకుంటే జాలర్ల ఆగ్రహానికి గురికావాల్సి ఉంటుందని హెచ్చరించారు. జాలర్లకు పూర్తి స్థాయిలో భద్రత దక్కాలంటే కచ్చదీవుల స్వాధీనం ద్వారానే సాధ్యమని స్పష్టం చేశారు. భారత భూ భాగంలో మిళితమైన కచ్చదీవులను స్వాధీనం చేసుకోవాలని పలుమార్లు కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చామని, అయినా ఫలితం శూన్యమని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జాలర్లపై దాడులు మరింతగా పెరిగాయని ఆరోపించారు.



అబ్దుల్ కలాం సమాధి వద్ద పుష్పగుచ్ఛాలు వేస్తున్న సీఎం స్టాలిన్

జాలర్లకు జీవన భృతి పెంపు

తమ ప్రభుత్వం జాలర్ల కోసం అహర్నిశలు శ్రమిస్తోందని సీఎం స్టాలిన్ వివరించారు. చేపల వేటకు నిషేధం అమలులో ఉన్న సమయంలో ఇది వరకు జాలర్లకు రూ.5 వేల సహాయకంగా జీవన భృతిని అందజేశామని గుర్తు చేశారు. ఈ ఏడాది నుంచి దీన్ని రూ.8 వేలకు పెంచుతున్నామని ప్రకటించారు. తద్వారా 1.25 లక్షల మంది జాలర్లకు ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. పదే పదే జాలర్లపై దాడులు జరిగిన నేపథ్యంలో తాము కేంద్రానికి విజ్ఞప్తి చేస్తూ వస్తున్నామని, అయినా వారి నుంచి చలనం లేదని అసహనం వ్యక్తం చేశారు. జాలర్ల భద్రత, సంక్షేమం, కుటుంబాల అభివృద్ధిని కాంక్షిస్తూ తమ ప్రభుత్వం విస్తృత కార్యక్రమాలు చేస్తోందని వివరించారు. అనంతరం జాలర్ల కుటుంబాలకు సంక్షేమ పథకాలను అందజేశారు.

జాలర్లకు 10 వరాలు



జాలర్ల కోసం సీఎం ఎంకే స్టాలిన్ పది వరాలను ప్రకటించారు. 14 వేల మంది జాలర్లు లబ్ధి పొందే విధంగా రూ.88.90 కోట్ల విలువైన సహాయకాలను ప్రకటించారు. అలాగే 5035 మంది జాలర్లకు ఇళ్ల పట్టాలను మంజూరు చేయనున్నామని తెలిపారు. 45 వేల మందికి సహకార రుణాలు ఇస్తామని వివరించారు. డీజిల్‌తో నడిచే నాటు పడవలకు ఏడాదికి 3700 లీటర్లు, మర పడవలకు 4400 లీటర్లు అందజేస్తామన్నారు. తగ్గచ్చి పతం జాలర్ల విజ్ఞప్తి మేరకు ఓడరేవును నిర్మిస్తామని ప్రకటించారు. అలాగే 60 ఏళ్ల పైబడిన జాలర్లకు సహాయకాలు అందజేస్తామన్నారు. తూత్తుకుడి, నెల్లై, కన్యాకుమారి జాలర్లకు డీజిల్ పంపిణీ పథకం అమలు చేస్తామని వెల్లడించారు. గుండుగల్, పాంబన్ హార్బర్ల విస్తరణతో పాటు జాలర్లకు ప్రమాద బీమా పథకంగా 205 కుటుంబాలకు ఆర్థిక సాయం అందిస్తామన్నారు. జాలర్ల గృహవసతి పథకం మేరకు అందజేస్తున్న రుణాన్ని రూ.1.70 లక్షల నుంచి రూ.2.40 లక్షలకు పెంచుతున్నామని ప్రకటించారు. అలాగే అలల తాకిడికి గురవుతున్న జాలర్ల గ్రామాలను పరిరక్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని వివరించారు.

ఈపీఎస్‌కు గుర్తింపు

- మహానాడుకు తొలగిన అడ్డంకులు



ఎడపాడి పళనిస్వామి

సాక్షి, చెన్నై: అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడపాడి కె.పళని స్వామికి అడ్డంకులు తొలగాయి. పన్నీర్ సెల్వం దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు శుక్రవారం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే అన్నాడీఎంకే మహానాడుకు వ్యతిరేకంగా మదురై ధర్మాసనంలో దాఖలైన పిటిషన్‌ను న్యాయమూర్తులు తిరస్కరించారు. అన్నాడీఎంకేను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా పలు గ్రూప్‌ల మధ్య జరిగిన సమరంలో కేడర్, నాయకుల మద్దతుతో పళని స్వామి ప్రధాన కార్యదర్శి పగ్గాలు చేపట్టారు. తన బలాన్ని చాటుకునే విధంగా మదురై వేదికగా ఆదివారం బ్రహ్మాండ మహానాడుకు సిద్ధమయ్యారు. భారీ జన సమీకరణతో ఈ మహానాడును జయప్రదం చేయడమే లక్ష్యంగా ఆ పార్టీకి చెందిన ముఖ్య నేతలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో అన్నాడీఎంకే నియమ నిబంధనలకు వ్యతిరేకంగా మాజీ సీఎం పన్నీర్ సెల్వం దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు శుక్రవారం పిటిషన్‌ను విచారణకు స్వీకరించింది. దీనిపై జరిగిన వాద ప్రతివాదాల్లో పళని స్వామికి అనుగుణంగా కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు అనుగుణంగా కేంద్ర ఎన్నికల కమిషన్ కోర్టులో ప్రమాణ పత్రం దాఖలు చేసింది. ఇందులో పళని స్వామికి అనుకూలంగా కేంద్ర ఎన్నికల కమిషన్ గుర్తింపును కల్పించింది. అన్నాడీఎంకే నియమ నిబంధనలకు అనుగుణంగా పళని స్వామి తీసుకునే నిర్ణయాలకు పరోక్షంగా ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఇదే సమయంలో మదురై వేదికగా జరిగే మహానాడుకు వ్యతిరేకంగా మదురై ధర్మాసంలో దాఖలైన పిటిషన్‌పై న్యాయమూర్తి స్పందించారు. మదురైలో జరిగే మహానాడుకు వ్యతిరేకంగా చివరి క్షణంలో పిటిషన్ దాఖలు చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. అదే సమయంలో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శిగా పళని స్వామి నేతృత్వంలో జరిగే మహానాడుకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను న్యాయమూర్తి తిరస్కరించారు.

శరవేగంగా ప్లాస్టిక్ పరిశ్రమ అభివృద్ధి

- ఐదేళ్లలో రూ.10 లక్షల కోట్లకు చేరనున్న వైనం
- సదస్సులో అధ్యక్షుడు మయూర్ డి.షా



సదస్సులో సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న మయూర్ డి.షా తదితరులు

చెన్నై, సాక్షి: భారతీయ ప్లాస్టిక్ పరిశ్రమ వేగంగా వృద్ధి చెందుతోందని, 2027 నాటికి రూ.10 లక్షల కోట్లకు చేరుకుంటుందని ఆల్-ఇండియా ప్లాస్టిక్స్ తయారీదారుల సంఘం (ఏఐపీఎంఏ) అధ్యక్షుడు మయూర్ డి.షా తెలిపారు. చెన్నై నగరంలో శుక్రవారం 5వ టెక్నాలజీ కాన్ఫరెన్స్ ఫర్ గ్రోత్ ఆఫ్ ప్లాస్టిక్ ఇండస్ట్రీస్- 2023ను నిర్వహించారు. మేక్ ఇన్ ఇండియాను ప్రోత్సహించడం, ప్లాస్టిక్ వస్తువుల దిగుమతి ప్రత్యామ్నాయాన్ని సులభతరం చేయడం లక్ష్యంగా జరిగిన ఈ సదస్సులో నిపుణులు, పరిశ్రమల ప్రతినిధులు, పరిశోధకులు, ప్రభుత్వ అధికారులు దేశం నలుమూలల నుంచి విధాన రూపకర్తలు పాల్గొన్నారు. మయూర్ డి.షా మాట్లాడుతూ ప్లాస్టిక్ పరిశ్రమ దేశీయ మార్కెట్‌లో ఉన్నత స్థానంలో ఉందన్నారు. అలాగే ప్రపంచ ప్లాస్టిక్ సరఫరా కేంద్రంగా కూడా ఆవిర్భవించిందని తెలిపారు. ఏఐపీఎంఏ దిగుమతి ప్రత్యామ్నాయం కోసం 553 ప్లాస్టిక్ ఉత్పత్తులను గుర్తించిందన్నారు. మొత్తం రూ.37,500 కోట్ల విలువైన దిగుమతులు, దిగుమతి ప్రత్యామ్నాయం వైపు వెళ్లడం వల్ల దేశంలో 5 లక్షల అదనపు ఉద్యోగాలు ఏర్పడతాయని వివరించారు. ప్లాస్టిక్ పరిశ్రమ పరిమాణం 2022-23లో రూ.3.5 లక్షల కోట్ల నుంచి 2027-28 నాటికి రూ.10 లక్షల కోట్లకు పెరుగుతుందని అంచనా వేస్తున్నట్టు తెలిపారు. సదస్సుకు గౌరవ అతిథిగా విచ్చేసిన సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోకెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ డీజీ

ప్రొఫెసర్ శిశిర్ సిన్హా మాట్లాడుతూ ప్లాస్టిక్ పరిశ్రమ వృద్ధికి వీలు కల్పించే విధానాన్ని వివరించారు. నేషనల్ ప్లాస్టిక్స్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ అలోక్ పరాక్, మిషన్ మోడ్‌లో భారతీయ పరిశ్రమ ప్లాస్టిక్ వస్తువుల దిగుమతి ప్రత్యామ్నాయాన్ని ఎలా చేపట్టగలదు అనే అంశంపై వివరించారు.

కావేరి జలాలపై అత్యవసరంగా విచారించండి

- సుప్రీం కోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి



హొగెనికల్ జలపాతం

సాక్షి, చెన్నై : కావేరి జలాల విడుదలపై త్వరితగతిన నిర్ణయం తీసుకునేందుకు పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టుకు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ తరఫు న్యాయవాదులు తమ వాదనలు వినిపించారు. నాలుగేళ్ల అనంతరం తమిళనాడు, కర్ణాటకల మధ్య మళ్లీ కావేరి జలాల వివాదం నెలకొన్న విషయం తెలిసిందే. తమిళనాడుతో పాటు కర్ణాటకలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఈ ఏడాది డెల్టా జిల్లాల రైతులకు విడుదల కావాల్సిన నీటి శాతం తగ్గింది. జూన్, జూలై, ఆగస్టు నెలల్లో తమిళనాడుకు కర్ణాటక విడుదల చేయాల్సిన నీటిని పూర్తి స్థాయిలో విడుదల చేయలేదు. దీనిపై ఓ వైపు కావేరి యాజమాన్య సంస్థ సమావేశంలో తమిళ అధికారులు ఒత్తిడి తీసుకువచ్చారు. అయినా ఫలితం శూన్యం, కర్ణాటక నుంచి పూర్తి స్థాయిలో నీరు విడుదల కాకపోవడంతో తమిళనాడు ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. గత మూడు నెలలుగా తమిళనాడుకు పంపిణీ చేయాల్సిన నీటిని పూర్తి స్థాయిలో కర్ణాటక నుంచి విడుదల చేయించాలని విజ్ఞప్తి చేసింది. ఈ పిటిషన్‌పై త్వరితగతిన విచారణ జరిపించాలని శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం తరఫున న్యాయవాదులు వాదనలు వినిపించారు. ఈ పిటిషన్‌ను అత్యవసర కేసుగా పరిగణించి విచారించి, న్యాయం చేయాలని సుప్రీం కోర్టు ప్రధాన బెంచ్‌ను విజ్ఞప్తి చేశారు.

ఘనంగా చాంపియన్స్ ఆఫ్ చెన్నై

అవార్డుల ప్రదానోత్సవం



అవార్డు గ్రహీతలతో ఐఐటీ మద్రాసు డైరెక్టర్ కామకోటి, టీఆర్ గోపాలకృష్ణన్

కొరుక్కుపేట : వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న పలువురు ప్రముఖులను కేఎస్‌ఏ ట్రస్ట్-చెన్నై చాంపియన్స్ ఆఫ్ చెన్నై-2023 అవార్డులతో ఘనంగా సత్కరించింది. చెన్నై మైలాపూర్‌లోని పీఎస్ హయ్యర్ సెకండరీ స్కూల్ ప్రాంగణంలో ఉన్న ట్యాగ్ దక్షిణామూర్తి ఆడిటోరియంలో గురువారం రాత్రి కేఎస్‌ఏ ట్రస్ట్-చెన్నై 10వ వార్షిక అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఇందులో ముఖ్యఅతిథిగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ -మద్రాసు (ఐఐటీ-మద్రాసు) డైరెక్టర్ వి.కామకోటి పాల్గొని కళలు, విద్య, ఎంటర్‌ప్రైజెస్, హెల్త్‌కేర్, సైన్స్ ,సామాజిక సేవ, క్రీడలల్లో విశిష్ట సేవకులకు అవార్డులను ప్రదానం చేసి అభినందించారు. అవార్డులు అందుకున్న వారిలో ఆర్కిటెక్ట్ త్రిపురసుందరి సెవ్వెల్ (ఆర్ట్ అండ్ కల్చర్), డాక్టర్ నవిన్ జయకుమార్ (విద్య), అడయార్ ఆనంద భవన్ స్వీట్స్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వాహకులు వెంకటేశన్, రాజా వెంకట కృష్ణన్ (ఎంటర్‌ప్రైజ్), డాక్టర్ రాజన్ రవిచంద్రన్ (హెల్త్‌కేర్), ఎస్ విద్యాకర్ (సామాజిక సేవ), ఎస్‌డీఏటీ-ఏకేపీ టేబుల్ టెన్నిస్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్వాహకులు శ్రీనివాసరావు, మురళీధర రావు(క్రీడలు) ఉన్నారు. ప్రొఫెసర్ కామకోటి మాట్లాడుతూ వివిధ రంగాల్లో ప్రముఖులను గుర్తించి అవార్డులు అందజేయడం హర్షణీయం అని పేర్కొన్నారు. విద్య ఎంత ముఖ్యమో క్రీడలూ అంతే ముఖ్యమన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇష్టమైన క్రీడల్లో ప్రోత్సహించాలని సూచించారు. ముందుగా కెఎస్‌ఏ ట్రస్ట్ ట్రస్టీ టీఆర్ గోపాలకృష్ణన్ స్వాగతోపన్యాసం చేశారు. ట్రస్టీ ఆర్ మణికంఠన్ పాల్గొన్నారు.

యథాతథంగా కోయంబేడు మార్కెట్

కొరుక్కుపేట: చెన్నై కోయంబేడు మార్కెట్‌ను తిరుమళిసైకి తరలించడం లేదని, వదంతులను నమ్మవద్దని అధికారులు తెలిపారు. కోయంబేడు మార్కెట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మాట్లాడుతూ కోయంబేడు మార్కెట్‌ను తిరుమళిసైకి తరలిస్తున్నట్టు జరుగుతున్న ప్రచారం వాస్తవం కాదన్నారు. వ్యాపారులు, సామాన్య ప్రజలు భయపడొద్దన్నారు. సందేహాలను స్టోర్ మేనేజ్‌మెంట్ కార్యాలయంలో నివృత్తి చేసుకోవచ్చని వెల్లడించారు. మార్కెట్ తరలించాలంటే ప్రభుత్వం, స్టోర్ మేనేజ్‌మెంట్ నుంచి నోటీసులు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వం ఎలాంటి నోటిఫికేషన్ జారీ చేయలేదని, పుకార్లను నమ్మవద్దని కోరారు.

రూ.500 నకిలీ నోట్ల చెలామణి

- న్యాయవాది, మాజీ జవాను అరెస్టు



పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ రూ.500 నోట్లు (ఇన్‌సెట్‌లో) అరెస్టయిన అన్నామలై, సుబ్రమణియన్

సాక్షి, చెన్నై : రూ.500 నకిలీ నోట్లను చెలామణి చేస్తున్న న్యాయవాది, మాజీ జవానును అధికారులు శుక్రవారం అరెస్టు చేశారు. వాటిని ముద్రించిన వ్యక్తి కోసం గాలిస్తున్నారు. చెన్నై నుంగంబాక్కంలోని పుష్పానగర్‌కు చెందిన మణి (27), అతని సోదరుడు దినేష్‌తో కలిసి వళ్లువర్ కొట్టం బస్టాప్ సమీపంలోని ప్లాట్‌ఫారమ్‌పై కూరగాయలు, పండ్లను విక్రయిస్తున్నాడు. వీరి దుకాణంలో పుష్పానగర్‌కు చెందిన వీరాస్వామి పనిచేస్తున్నాడు. రెండు నెలలుగా కోయంబేడు హోల్‌సేల్ మార్కెట్‌కు దినేష్, మణి కూరగాయలు, పండ్లు కొనుగోలు చేసేందుకు ఇచ్చిన డబ్బులో పలుమార్లు నకిలీ నోట్లు ఉన్నట్టు తెలిసింది. కోయంబేడు మార్కెట్‌లో వ్యాపారులు ఆ నకిలీ నోట్లను మణి, దినేష్‌కు తిరిగి ఇచ్చారు. దీంతో షాక్‌కు గురైన వారిద్దరూ సాయంత్రం వేళల్లో జనం రద్దీ ఎక్కువగా ఉన్న సమయంలో వారికి ఎవరో రూ.500 నకిలీ నోట్లు ఇస్తున్నారని వాపోయారు. ఈ క్రమంలో గురువారం రాత్రి మణి, దినేష్ వ్యాపారం జరుగుతున్న సమయంలో ఒక వృద్ధుడు వచ్చి రూ.670లకు కూరగాయలు కొనుగోలు చేసి, మూడు రూ.500 నోట్లు ఇచ్చాడు. అవి నకిలీ నోట్లు అని తెలుసుకున్న వీరాస్వామి ఈ విషయాన్ని మణి, దినేష్‌కు తెలిపాడు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని వృద్ధుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో ఆ వృద్ధుడు పల్లికరనైకి చెందిన అన్నామలై (64) అని, అతను మాజీ మిలటరీ జవాను అని తెలిసింది. తర్వాత అన్నామలై ఇచ్చిన సమాచారం మేరకు విరుగంబాక్కంకు చెందిన చెన్నై హైకోర్టు న్యాయవాది సుబ్రమణియన్ (62)ను అరెస్టు చేశారు. అతని ఇంటి నుంచి కటింగ్ మెషిన్, కౌంటింగ్ మెషిన్, రూ.45 లక్షల రూ.500 నకిలీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ నకిలీ నోట్లను వడపళని గంగైయమ్మన్ ఆలయ వీధిలో ఉంటున్న ప్రింటింగ్ ప్రెస్‌లో ముద్రించినట్టు తెలిపారు. వారిని అదుపులోకి తీసుకుని నకిలీ నోట్లను ముద్రించి ఇచ్చిన కుమార్ అనే వ్యక్తి కోసం గాలిస్తున్నారు. ప్రింటింగ్ ప్రెస్‌ను సీజ్ చేశారు.

వన్నియర్ సంఘం భవనానికి సీల్

- రూ.100 కోట్ల విలువైన భూమి స్వాధీనం



అధికారులు సీల్ వేసిన వన్నియర్ సంఘం భవనం

సాక్షి, చెన్నై: చెన్నై సెయింట్ థామస్ మౌంట్‌లో ప్రభుత్వ స్థలంలో పనిచేస్తున్న వన్నియర్ సంఘం భవనానికి అధికారులు శుక్రవారం సీల్ వేశారు. అక్కడున్న రూ.100 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. చెన్నైలోని సెయింట్ థామస్ మౌంట్ - పూందమల్లి రోడ్డు పక్కన రూ.100 కోట్ల విలువ చేసే 41,952 చదరపు అడుగుల ప్రభుత్వ స్థలం ఉంది. ఇక్కడున్న భవనంలో గత 40 ఏళ్లుగా వన్నియర్ సంఘం పనిచేస్తోంది. ఈ నిర్మాణం కోసం పల్లావరం రెవెన్యూ కార్యాలయ అధికారులు వన్నియర్ సంఘం అధికారులకు నోటీసులు పంపినట్లు సమాచారం. వారి నుంచి ఎలాంటి ప్రతిస్పందన లేదు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం దేవాదాయ శాఖ అధికారులు, సెయింట్ థామస్ మౌంట్ జాయింట్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ పోలీసులతో కలిసి భవనం వద్దకు చేరుకున్నారు. లోపల ఉన్న వారిని బయటకు వెళ్లాల్సిందిగా ఆదేశించారు. వారు నిరాకరించడంతో బందోబస్తులో ఉన్న పోలీసులు అక్కడున్న 28 మందిని బయటకు పంపించారు. అనంతరం ఆ భవనానికి సీలు వేశారు. సమాచారం అందుకున్న పీఎంకే నేత, మాజీ మంత్రి ఏకే మూర్తి ఆధ్వర్యంలో అడ్వకేట్ సుబ్రమణి, ఇతర కార్యకర్తలు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఆకస్మికంగా తమను ఆ భవనం నుంచి గెంటివేసినట్టు ఆరోపిస్తూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. అధికారులు ముందుగా నోటీసులు పంపినట్టు వివరించారు. అయినప్పటికీ వారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. దీంతో అక్కడ ఉద్రిక్తత నెలకొనడంతో పోలీసులు వచ్చి వారికి సర్ది చెప్పి పంపించారు.

క్లుప్తంగా

కూలేందుకు సిద్ధంగా పంచాయతీ భవనం


పంచాయతీ భవనం

తిరుత్తణి: పంచాయతీ కార్యాలయ భవనం దుస్థితిలో వుండడంతో నిర్వాహకులు భయాందోళన చెందుతున్నారు. ఆర్కేపేట యూనియన్ నారాయణపురం పంచాయతీ కార్యాలయ భవనం నిర్మించి 40 సంవత్సరాలు పూర్తి కావడంతో భవనం దుస్థితికి చేరుకుంది. పైకప్పు సిమెంటు పుచ్చులూడి, ఇనుప కడ్డీలు తుప్పు పట్టి బలహీనంగా ఉన్నాయి. కొత్త భవనం నిర్మించేందుకు పంచాయతీలో స్థలం లేకపోవడంతో పాత భవనంలోనే కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి కొత్త పంచాయతీ కార్యాలయ భవనం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని గ్రామీణులు కోరుతున్నారు.

సెల్‌ఫోన్ కొనివ్వలేదని యువతి ఆత్మహత్య

అన్నానగర్: తల్లిదండ్రులు సెల్ ఫోన్ కొనివ్వలేదని యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం రాత్రి కన్నగి నగర్ ప్రాంతంలో చోటుచేసుకుంది. చెన్నైలోని కన్నగినగర్‌కు చెందిన మధి (49)కి ముగ్గురు పిల్లలు. పెద్ద కూతురు దేశిక (19) మూర్ఛ వ్యాధితో బాధపడుతూ రాయపేట ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె 10వ తరగతిలోనే పాఠశాలకు వెళ్లడం మానేసింది. తనకు సెల్‌ఫోన్ కొనివ్వాలని తల్లిదండ్రులను చాలా కాలంగా అడుగుతోంది. వారు సెల్‌ఫోన్ కొనివ్వలేదు. ఈ నేపథ్యంలో ఆమె చెల్లెలు ఛార్మికి కొన్ని రోజుల క్రితం సెల్‌ఫోన్ కొనిచ్చారు. దీంతో మనస్తాపం చెందిన దేశిక గురువారం రాత్రి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న కన్నగి నగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దేశిక మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం రాయపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలు


పాల్గొన్న విద్యార్థినులు


డిగ్రీ పట్టాలు అందజేస్తున్న కేంద్ర మంత్రి వీకే సింగ్, వీఐటీ చాన్స్‌లర్ విశ్వనాథన్

వేలూరు: పట్టుదలతో చదివితే విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని కేంద్ర సహాయ మంత్రి వీకే సింగ్ తెలిపారు. వేలూరు వీఐటీ యూనివర్సిటీలో శుక్రవారం ఉదయం 38వ స్నాతకోత్సవాన్ని చాన్స్‌లర్ విశ్వనాథన్ అధ్యక్షతన నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా కేంద్ర మంత్రి వీకే సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ కోర్సుల్లో ఉత్తమ మార్కులు సాధించిన 68 మంది విద్యార్థులకు బంగారు పతకాలు, మొత్తం 8,619 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడంతోపాటు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు స్టార్ట్ అప్ ఇండియా అనే పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. ఈ పథకంలో 2015 వరకు 428 పరిశ్రమలు నమోదయ్యాయన్నారు. వీటి ద్వారా వేల సంఖ్యలో నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాలు పొందారని పేర్కొన్నారు. అదే విధంగా 31 రాష్ట్రాల్లో స్టార్ట్ అప్ ఇండియా పథకంలో పలు దేశాలు పెట్టుబడి పెట్టినట్టు వెల్లడించారు. వీటిలో ఇండియా మొదటి స్థానంలో ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం గత తొమ్మిది సంవత్సరాల్లో దేశాభివృద్ధికి పలు పథకాలను అమలు చేస్తోందన్నారు. విద్యార్థులకు దేశంలో పలు ప్రాంతాల్లో అనేక అవకాశాలున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు నూతన పరిశోధనలపై దృష్టిసారించి దేశాభివృద్ధికి దోహదపడాలన్నారు. ప్రతి జిల్లాకు మెడికల్ కళాశాల ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసినట్టు తెలిపారు. అందులో భాగంగానే ప్రస్తుతం జిల్లాల వారిగా మెడికల్ కళాశాలలు ప్రారంభిస్తున్నామన్నారు. విద్యార్థులు పుస్తకాలు చదవడం ద్వారా మేథోశక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వీఐటీ ఉపాధ్యక్షులు శంకర్, జీవీ సెల్వం, కాదంబరి, రిజిస్ట్రార్ జయభారతి తదితరులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి భువనచంద్ర


వేడుకల్లో పాల్గొన్న తెలుగు శాఖ నిర్వాహకులు, విద్యార్థులు, అతిథులు

కొరుక్కుపేట: కవిగా, గాయకుడిగా, నటుడిగా, సమీక్షకుడిగా, అనువాదకుడిగా, దేశ సేవకుడిగా అనేక పాత్రలు పోషిస్తున్న సినీ గేయ రచయిత భువన చంద్ర బహుముఖ ప్రజ్ఞాశాలి అని రచయిత్రి డాక్టర్ రామలక్ష్మి అభిప్రాయపడ్డారు. మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆధ్వర్యంలో సాహితీవేత్తల జయంత్యుత్సవాల సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం సాహిత్యకారుల జీవన చిత్రాలలో భాగంగా సినీ గేయ రచయిత భువనచంద్ర పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. తెలుగుశాఖ అతిథి ఉపన్యాసకులు డాక్టర్ పాండురంగం కాళియప్ప స్వాగతం పలకగా తెలుగు శాఖాధిపతి ఆచార్య విస్తాలి శంకరరావు అధ్యక్షత వహించి భువనచంద్రకు తెలుగుశాఖతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. అనంతరం రచయిత డాక్టర్ టీఆర్ఎస్. శర్మ అందరికీ మిఠాయిలు పంచిపెట్టారు. రాజధాని కళాశాల విశ్రాంత తెలుగుశాఖాధ్యక్షులు ఆంబ్రూణి మాట్లాడుతూ భువనచంద్ర సాహిత్య సేవలను వివరించారు. రచయిత్రి, గాయని కె.రామలక్ష్మి మాట్లాడుతూ భువనచంద్ర వ్యక్తిత్వాన్ని, సాహితీ మూర్తిమత్వాన్ని గురించి చాలా విపులంగా తెలియజేశారు. ఆయన 571 సినిమాల్లో 1,883 పాటలు రాశారని, నవలలు, కథలు, కవితలు రాసి మంచి గుర్తింపు పొందారని పేర్కొన్నారు. చివరగా భువనచంద్ర సినిమా పాటలను పలువురు గానం చేసి అలరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ టీఆర్ఎస్.శర్మ, ఆచార్య ఎల్‌బీ శంకరరావు, డాక్టర్ ఏఈ శివకుమారి, కృష్ణశాస్త్రి, ధనుంజయ, రేవూరి నాగేశ్వరరావు, డి.నాగరాజు తదితరులు భువనచంద్రకు పుట్టిన రోజు శుభాకాంక్షలను తెలియజేశారు. చివరగా తెలుగుశాఖ అతిథి ఉపన్యాసకులు మాదా శంకరబాబు వందన సమర్పణ చేశారు.

నెల్లికుండ్రం మురుగన్ ఆలయంలో హుండీ చోరీ


హుండీ చోరీ చేసి వెళుతున్న దుండగులు

పళ్లిపట్టు: నెల్లికుండ్రం మురుగన్ ఆలయం హుండీని చోరీ చేసిన దుండగులను పట్టుకునేందుకు పోలీసులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. పళ్లిపట్టు సమీపంలోని అత్తిమాంజేరిపేట నెల్లికుండ్రం కొండపై కొలువై వున్న సుబ్రమణ్యస్వామి ఆలయానికి ప్రతిరోజూ భక్తులు వెళుతుంటారు. స్వామిని దర్శించుకుని హుండీల్లో కానుకలు చెల్లిస్తుంటారు. పది రోజుల క్రితం ఆడికృత్తిక సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు కొండకు కావళ్లు సమర్పించి హుండీల్లో కానుకలు చెల్లించారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం స్వామి దర్శనానికి వెళ్లిన భక్తులు హుండీ చోరీకి గురికావడాన్ని గుర్తించి ఆలయ నిర్వాహకులకు సమాచారం ఇచ్చారు. పోలీసులతోపాటు ఆలయ నిర్వాహకులు కొండ ఆలయం చేరుకుని ఆలయంలోని సీసీ ఫుటేజీని పరిశీలించారు. ఇద్దరు వ్యక్తులు హుండీ తీసుకుని వెళ్లడాన్ని గుర్తించారు. కొండలో హుండీ కూల్చి అందులోని నగలు, నగదు తీసుకెళ్లినట్లు గుర్తించారు. సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను త్వరలో పట్టుకుంటామని పొదటూరుపేట పోలీసులు తెలిపారు.

కోలాహలంగా చిన్నమ్మ పుట్టినరోజు వేడుకలు


ఆర్కేపేటలో బిర్యాని పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నరసింహన్

తిరుత్తణి: చిన్నమ్మ శశికళ పుట్టిన రోజు వేడుకలను శుక్రవారం తిరుత్తణి పరిసర ప్రాంతాల్లో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పేదలకు అన్నదానం చేశారు. తిరుత్తణి, కేజీ.కండ్రిగ, ఆర్కేపేట, పళ్లిపట్టు, పొదటూరుపేట ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో తిరుత్తణి మాజీ ఎమ్మెల్యే నరసింహన్ పాల్గొని పేదలకు అన్నదానం చేశారు. అనంతరం మొక్కలు నాటారు. ఆర్కేపేట తాలూకా కార్యాలయం వద్ద నిర్వహించిన వేడుకల్లో 500 మందికి బిర్యానీ పంపిణీ చేశారు. మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంజీఆర్ యువజన విభాగం అధ్యక్షుడు ఎల్లాపురం ఎల్.రజిని, యూనియన్ కౌన్సిలర్లు చంద్రన్, కల్విక్కరసి శేఖర్, గోవిందమ్మాళ్, నరసింహన్, కార్తికేయన్, జమున, పంచాయతీ సర్పంచ్ గిరిరాజు, మాజీ సర్పంచ్ హరి, ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడు హరిరాజు పాల్గొన్నారు.

సాంకేతిక లోపంతో ఆగిన సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ రైలు


మరమ్మతు పనులు చేస్తున్న సిబ్బంది

తిరువళ్లూరు: థానాపూర్ నుంచి చెన్నై మీదుగా బెంగళూరు వెళుతున్న సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ రైలులో సాంకేతిక లోపం ఏర్పడడంతో 35 నిమిషాల పాటు నిలిచిపోయింది. సమాచారం అందుకున్న సిబ్బంది అక్కడికి చేరుకుని లోపాన్ని సరిచేసి రాకపోకలను పునరుద్ధరించారు. సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ రైలు థానాపూర్ నుంచి ఒంగోలు – గూడూరు మీదుగా చెన్నై సెంట్రల్‌కు చేరుకుని అక్కడి నుంచి తిరువళ్లూరు– అరక్కోణం – కాట్పాడి మీదుగా బెంగళూరుకు వెళుతుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం చెన్నై సెంట్రల్ నుంచి బెంగళూరుకు వెళుతున్న క్రమంలో తిరువళ్లూరు వద్దకు రాగానే బి5 కోచ్‌లో సాంకేతిక లోపం ఏర్పడింది. చక్రాలు తిరగకపోవడాన్ని గుర్తించిన డ్రైవర్ వెంటనే రైలును నిలిపివేశారు. సమాచారం అందుకున్న సిబ్బంది అక్కడికి చేరుకుని దాదాపు 30 నిమిషాల పాటు శ్రమించి లోపాన్ని సరిచేసి రైలును పంపించారు. ఎక్స్‌ప్రెస్ రైలు 30 నిమిషాల పాటు ఆగిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

భర్తను చంపిన మహిళ, ప్రియుడికి యావజ్జీవం

అన్నానగర్: తొట్టియమ్ సమీపంలో భర్తను చంపిన మహిళ, ఆమె ప్రియుడుకి తిరుచ్చి కోర్టు శుక్రవారం యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. తిరుచ్చి జిల్లా తొట్టియమ్ సమీపంలోని అప్పనల్లూర్ పంచాయతీ మదులం పూదూర్ గ్రామానికి చెందిన కుమారవేల్ (35), అముద(30) దంపతులకు ఇద్దరు కుమారులు. కుమారవేల్ తిరుపూర్‌లోని పల్లకౌంటన్ పాళయం సమీపంలోని తులుక్కన్ ఎస్టేట్‌లో నివసిస్తున్నాడు. 2018 జనవరి 13 పొంగల్ పండుగ సందర్భంగా కుమారవేల్ తన భార్య స్వగ్రామమైన తురైయూర్ సమీపంలోని కన్ననూర్ అయ్యంబాలయంలోని కురుంబపట్టికి కుటుంబ సమేతంగా వెళ్లాడు. మరుసటి రోజు రాత్రి 7 గంటల సమయంలో కుమారవేల్ అక్కడి డంప్ ప్రాంతంలో మెడ వెనుక భాగంలో కత్తితో పొడవబడి శవమై కనిపించాడు. జంబునాథపురం పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ఇందులో కుమారవేల్ భార్య అముదకు, ముసిరి వెల్లలపాటికి చెందిన రైతు కన్నన్ (33)కి వివాహానికి ముందే వివాహేతర సంబంధం ఏర్పడింది. తల్లిదండ్రుల ఒత్తిడితో అముద కుమారవేల్‌ను పెళ్లి చేసుకుంది. కన్నన్‌కు సత్య అనే మహిళతో 2016 కంటే ముందే వివాహమైంది. కానీ అముద, కన్నన్ సంబంధాన్ని కొనసాగించారు. ఈ విషయం తెలుసుకున్న సత్య కన్నన్ నుంచి విడిపోయింది. దీంతో కన్నన్, అముదకు మరింత దగ్గరయ్యాడు. దీనికి కుమారవేల్ అడ్డుగా ఉండడంతో అతడిని అముద, కన్నన్ కలిసి హత్య చేసినట్లు తెలిసింది. అముద, కన్నన్‌ను అరెస్టు చేశారు. ఈ కేసు తిరుచ్చి 2వ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో జస్టిస్ జయకుమార్ విచారించారు. నేరం ఇద్దరిపైనా రుజువు కావడంతో కన్నన్, అముదకు యావజ్జీవ కారాగార శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

20, 30 ఏళ్లుగా నాలో మదనమే మామన్నన్


అర్ధశత దినోత్సవంలో మామన్నన్ చిత్ర బృందం

తమిళ సినిమా: నటుడు ఉదయనిధి స్టాలిన్ కథానాయకుడిగా నటించి, తన రెడ్ జెయింట్ మూవీస్ పతాకంపై నిర్మించిన చిత్రం మామన్నన్. నటుడు వడివేలు, ఫాహద్ ఫాజిల్, నటి కీర్తి సురేష్ ముఖ్యపాత్రలో పోషించిన ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతాన్ని అందించారు. మారి సెల్వరాజ్ కథ, దర్శకత్వం బాధ్యతలు నిర్వహించిన ఈ చిత్రం గత జూన్ 29వ తేదీన విడుదలై విశేష ప్రేక్షకాదరణ, సినీ ప్రముఖుల ప్రశంసల మధ్య విజయవంతంగా ప్రదర్శింపబడుతూ 50 రోజులు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ గురువారం సాయంత్రం చెన్నైలోని ఒక నక్షత్ర హోటల్‌లో మామన్నన్ చిత్ర అర్ధ శత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో పాల్గొన్న నటి కీర్తి సురేష్ మాట్లాడుతూ మంచి అనుభవంగా పేర్కొన్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతం చిత్ర విజయానికి ముఖ్య కారణమన్నారు. దర్శకుడు ప్రతి సన్నివేశంలోనూ జీవం ఉట్టిపడేలా దర్శకుడు మారి సెల్వరాజ్ చిత్రాన్ని తెరపై ఆవిష్కరించారని నటుడు వడివేలు పేర్కొన్నారు. తాను ఇంత వరకూ చేసిన హాస్య పాత్రలన్నింటికంటే ఈ చిత్రమే ఎక్కువ పేరు తెచ్చిపెట్టిందని, దీన్ని తాను జీవితాంతం మరిచిపోలేదని అన్నారు. సినిమా అనేది నాలుగు రోజుల్లో ముగిసి పోయేది కాదని, ఏళ్ల తరబడి మాట్లాడుకునేవనీ దర్శకుడు మారి సెల్వరాజ్ పేర్కొన్నారు. అందుకే తాను నిజాలను వినే చెవులు కోసం అన్వేషిస్తూనే ఉంటానన్నారు. ఈ విజయం దర్శకుడు మారి సెల్వరాజ్‌దని నటుడు ఉదయనిధి స్టాలిన్ పేర్కొన్నారు. కథ విన్నప్పుడే మామన్నన్ విజయం సాధిస్తుందనే నమ్మకం కలిగిందన్నారు. ఈ చిత్రం కోసం యూనిట్ అంతా శ్రమించారన్నారు. తాను తొలి చిత్రం ఆరుకల్ ఒరు కన్నాడీ మంచి విజయాన్ని సాధించిందనీ, చివరి చిత్రమైనా మామన్నన్ కూడా విజయం సాధించడం సంతోషంగా ఉందని ఉదయనిధి స్టాలిన్ పేర్కొన్నారు. గత 20, 30 ఏళ్లుగా తనలోని మదనమే మామన్నన్ చిత్రమని ఏఆర్ రెహమాన్ పేర్కొన్నారు. మామన్నన్ చిత్రంలో ఉదయనిధి స్టాలిన్‌తో వడివేలు బైక్‌లో వెళ్లే సన్నివేశాన్ని చూసిన తరువాత మంచి సంగీతాన్ని అందించాలనే నిర్ణయానికి వచ్చానని ఆయన పేర్కొన్నారు.

కోలీవుడ్ టాక్స్


కుంబారి చిత్ర యూనిట్

స్నేహం నేపథ్యంలో కుంబారి

తమిళ సినిమా: రాయల్ ఎంటర్‌ప్రైజెస్ పతాకంపై టి.కుమార దాస్ నిర్మిస్తున్న చిత్రం కుంబారి. ఇందులో విజయ్ విశ్వ, నటి నలీఫ్ జియా, మహిళా సంజీవి నాయకిగానూ, జాన్ విజయ్ పరుత్తివీరన్ సరవణన్, శ్యామ్స్, మధుమిత, సెంథి, కాదల్ సుకుమార్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. కవి జోసెఫ్ కథ దర్శకత్వ బాధ్యతలను నిర్వహించారు. ఈ చిత్రానికి జై ప్రకాష్ జై సన్, పృథ్వీ కలిసి సంగీతాన్ని అందించారు. ప్రసాద్ అర్ముగమ్ ఛాయాగ్రహణంను అందించిన విచిత్ర ఆడియో ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమం ఇటీవల చెన్నైలోని ప్రసాద్ లాబ్‌లో జరిగింది. దర్శకుడు కే భాగ్యరాజ్, ఆర్‌వీ ఉదయ్ కుమార్, ఎస్సార్ ప్రభాకరన్, శరవణ శక్తి, జీవ, అప్పుకుట్టి తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని చిత్రం ఆడియోను ఆవిష్కరించారు. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రం గురించి నిర్మాత కుమార్ దాస్ తెలుపుతూ ఇది స్నేహం నేపథ్యంలో రూపొందించిన చిత్రమని చెప్పారు. ఇందులో ప్రేమ, వినోదం, అన్నాచెల్లెళ్ల సెంటిమెంట్ అంటూ మంచి జనరంజకమైన అంశాలు ఉన్నాయని తెలిపారు. సాధారణంగా చిన్న చిత్రాలని పక్కన పెట్టేస్తున్నారని, ఇలాంటి చిన్న చిత్రాల ద్వారానే ప్రముఖ స్టార్స్ తయారవుతున్నారని అన్నారు. అప్పట్లో చిన్న చిత్రంలో నటించిన శివాజీరావు అనే వ్యక్తి ఇప్పుడు సూపర్ స్టార్‌గా రాణిస్తున్నారని పేర్కొన్నారు. చిత్ర కథానాయకుడు విజయ్ విశ్వ మాట్లాడుతూ కుంబారి చిత్ర షూటింగ్ చాలా వేగంగా పూర్తి చేసినట్లు చెప్పారు. నిర్మాత చిత్ర బడ్జెట్ గురించి ఆలోచించ వద్దని మొదట్లోనే చెప్పారన్నారు. చిత్రం బాగా వచ్చిందని ఆయన చెప్పారు.

మత్తగమ్ సూపర్‌గా ఉంటుంది


ముత్తగమ్ వెబ్‌సిరీస్ యూనిట్

తమిళసినిమా: నటుడు అధర్వ కథానాయకుడిగా నటించిన తొలి వెబ్ సిరీస్ మత్తగం. దర్శకుడు గౌతమ్ మీనన్, నటుడు మణికంఠన్, నటి నిఖిలా విమల్, డీడీ, ఇళవరసు, అరువి తిరునావుక్కరసు, మూనార్ రమేశ్ తదితరులు ముఖ్యపాత్రలు పోషించారు. దీనికి ప్రసాద్ మురుగేశన్ దర్శకత్వం వహించారు. ఎడ్విన్ సాకే ఛాయాగ్రహణంను, దర్శకుడు శివ సంగీతాన్ని అందించారు. ఈ వెబ్ సిరీస్ శుక్రవారం నుంచి డిస్నీ హాట్ స్టార్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సందర్భంగా చెన్నైలోని ప్రసాద్ ల్యాబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నటుడు అధర్వ మాట్లాడుతూ మత్తగమ్ వెబ్ సిరీస్ ను 2018లోనే ప్రారంభించినట్లు చెప్పారు. దర్శకుడు గౌతమ్ మీననే ఈ వెబ్ సిరీస్ ద్వారా ప్రసాద్ మురుగేశన్‌ను పరిచయం చేశారని తెలిపారు. ప్రసాద్ మురుగేశన్ ఈ కథను క్వీన్ చిత్రానికి ముందే సిద్ధం చేశారని చెప్పారు. కథ సూపర్‌గా వచ్చిందని, దీన్ని దర్శకుడు తాను అనుకున్న విధంగా తెరకెక్కించారన్నారు. షూటింగ్లో పూర్తిగా రాత్రి వేళలోనే నిర్వహించినట్లు చెప్పారు. దీనికి ముందుగా బైబిల్ అనే టైటిల్‌ను నిర్ణయించినట్లు, ఆ తర్వాత పలు మార్పులు చేర్పులు చేయడంతో ఇది ఎలా వస్తుందో అన్న సందేహం ఉండేదన్నారు. దర్శకుడు శ్రమనే తమకు పోరాటం ఇచ్చిందన్నారు. ఇప్పుడు దీన్ని స్ట్రీమింగ్ చేస్తున్న డిస్నీ హాట్ స్టార్ ఓటీటీ ప్లాట్ ఫామ్ నిర్వాహకులకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నట్లు అధర్వ పేర్కొన్నారు.

జయం రవికి జంటగా నిత్యామీనన్


నిత్యామీనన్


దర్శకురాలు కృతికా ఉదయనిధి, జయంరవి

తమిళ సినిమా: మణిరత్నం దర్శకత్వం వహించిన భారీ చారిత్రక కథా చిత్రం పొన్నియిన్ సెల్వన్‌లో యువరాజు అరుణ్ మొళి వర్మగా టైటిల్ పాత్రను పోషించి ప్రశంసలు అందుకున్న నటుడు జయం రవి. తాజాగా ఈయన వరుసగా చిత్రాలను చేసుకుంటూ పోతున్నారు. ప్రస్తుతం నటి నయనతారతో కలిసి నటించిన ఇరైవన్ చిత్రం త్వరలో తెరపైకి రావడానికి రెడీ అవుతోంది. దీంతోపాటు సైరన్ చిత్రంలో కీర్తిసురేష్‌తో కలిసి, జీనీ చిత్రంలో కృతిశెట్టితో కలిసి నటిస్తున్నారు. వీటితోపాటు త్వరలో తన అన్నయ్య మోహన్ రాజా దర్శకత్వంలో సూపర్ హిట్ చిత్రం తనీ ఒరువన్‌కు సీక్వెల్‌లో నటించడానికి సిద్ధమవుతున్నారు. దీని గురించి దర్శకుడు మోహన్ రాజా ఇటీవలే అధికారికంగా సామాజిక మాధ్యమాల్లో పేర్కొన్నారు. కాగా తాజాగా మహిళా దర్శకురాలు కృతికా ఉదయనిది దర్శకత్వంలో ఒక చిత్రంలో నటిస్తున్నారన్నారు. ఈ చిత్రాన్ని రెడ్ జెయింట్ మూవీస్ సంస్థ నిర్మిస్తోంది. ఇందులో జయం రవికి జంటగా నటి నిత్యా మీనన్ నటిస్తున్నారు. ఈమె చిన్న గ్యాప్ తర్వాత తమిళంలో నటిస్తున్న చిత్రం ఇది. ఈ క్రేజీ చిత్రానికి ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహమాన్ సంగీతాన్ని అందిస్తున్నారు. ఇంకా టైటిల్‌ను నిర్ణయించని ఈ రేర్ కాంబినేషన్లో రూపొందుతున్న చిత్ర షూటింగ్ ఇప్పటికే ప్రారంభమైంది. జయం రవి త్వరలో ఈ చిత్ర షూటింగ్‌లో పాల్గొనడానికి రెడీ అవుతున్నారు.



షారూఖ్ ఖాన్ కోసమేనట

తమిళ సినిమా: ఏ రంగంలోనైనా డిమాండ్ అండ్ సప్లయి పాలసీ నడుస్తోంది. సినీ రంగంలో నటుడు అజిత్, నటి నయనతార ఇలాంటి పాలసీని కొనసాగిస్తున్నారు. నటుడు అజిత్ రూటే సెపరేటు. తాను తన పని మినహా ఏ ఇతర విషయాలను పట్టించుకోరు. షూటింగ్ లేకపోతే తనకు ఇష్టమైన బైక్ రేసింగ్, రైఫిల్ షూటింగ్ వంటి విషయాలపై దృష్టి సారిస్తారు. ఈయన సినిమాకు సంబంధించిన ఏ కార్యక్రమంలోను పాల్గొనరు. తన చిత్రాల ప్రచార కార్యక్రమాలకు కూడా దూరంగా ఉంటారు. ఈ విషయం గురించి నిర్మాతలకు ముందుగానే చెబుతారు. అదీ అజిత్ పాలసీ. అందుకు సమ్మతించే ఆయనతో చిత్రాలు చేస్తున్నారు. ఇక సంచలన నటి నయనతార రూటు కూడా దాదాపు ఇంతే. మొదట్లో చిత్ర ప్రచార వేడుకల్లో పాల్గొన్న ఈమె నటిగా ఒక స్థాయికి చేరుకున్న తర్వాత వాటికి దూరంగా ఉంటున్నారు. తన భర్త విఘ్నేశ్ శివన్ దర్శకత్వం వహించే చిత్రాలకు, తన సంస్థలో నిర్మించే చిత్రాలకు మాత్రం ప్రమోషన్ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఈ విధానం నిర్మాతలకు నచ్చకపోయినా ఆమెకున్న క్రేజ్ కారణంగా మౌనంగా ఉంటున్నారు. నయనతార తన తాజా చిత్రం జవాన్ ప్రచార కార్యక్రమాలు పాల్గొనడానికి సమాచారం. ఈమె నటించిన తొలి హిందీ చిత్రం జవాన్. ఇందులో కథానాయకుడిగా షారూక్ ఖాన్ నటించాడు. కోలీవుడ్ నటుడు విజయ్ సేతుపతి ప్రతినాయకుడిగా, యోగి బాబు కీలకపాత్రలో నటించారు. ఇక యువ సంగీత కెరటం అనిరుద్ సంగీతాన్ని అందించారు. భారీ అంచనాల మధ్య జవాన్ చిత్రం సెప్టెంబర్ 7వ తేదీన ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది. దీంతో ఈ చిత్ర ప్రచార కార్యక్రమాల్లో నయనతార పాల్గొననున్నట్లు సమాచారం. నటుడు షారూక్ ఖాన్ తన అభిమాన నటుడు అని, అందుకే ఈ చిత్రం ప్రచార కార్యక్రమాల్లో పాల్గొననున్నట్లు నయనతార రీజన్ చెబుతున్నట్లు టాక్ స్ప్రెడ్ అవుతోంది. మొత్తం మీద షారూక్ ఖాన్ కోసం నయనతార తన పాలసీని బ్రేక్ చేస్తున్నారన్న మాట.

క్లుప్తంగా

కృష్ణగిరిలో 8 కొండచిలువలు

అన్నానగర్: క్రిష్ణగిరి పరిసర ప్రాంతంలో 8 కొండ చిలువలు, ఒక నక్షత్ర తాబేలును అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. క్రిష్ణగిరి, వెలంపట్టి, కావేరిపట్నం, పారూరు తదితర ప్రాంతాల్లో కొండచిలువలు సంచరిస్తున్నట్లు ప్రజలు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు అక్కడికి వెళ్లి కొండచిలువలు, ఇతర రకాల పాములను పట్టుకున్నారు. 10 రోజుల్లో 8 కొండచిలువలు, 10 విష సర్పాలు, 3 సారా పాములను పట్టుకున్నారు. అలాగే వేప్పనపల్లి రోడ్డులో అరుదైన జాతి నక్షత్ర తాబేలును స్వాధీనం చేసుకున్నారు. ప్రజలు తాము పెంచుకుంటున్న 2 చిలుకలను అటవీ శాఖ కార్యాలయంలో అప్పగించారు. వీటిని మేలుమలై, వేప్పనపల్లి, మహారాజకడై రిజర్వ్ ఫారెస్టుల్లో వదలనున్నట్లు అధికారులు చెప్పారు.

బస్సు ఢీకొని ఇద్దరి మృతి

అన్నానగర్: ఉలుందూరుపేటలో స్కూటర్‌ను ప్రభుత్వ బస్సు ఢీకొనడంతో ఇద్దరు మృతిచెందారు. కళ్లకురిచ్చి జిల్లా ఉలుందూరుపేట సమీపంలోని పిలరంపట్టు గ్రామానికి చెందిన వీరేశం పంచాయతీ కార్యదర్శి. అతని భార్య కర్పగవల్లి (45). ఆమె స్కూటర్ కొనేందుకు శుక్రవారం ఉలుందూరుపేటకు చెందిన తన పెద్ద కుమారుడు వినీత్ కుమార్ (26)తో కలిసి ఉలుందూరుపేట – విరుదాచలం రోడ్డులో ఉన్న పాత ద్విచక్ర వాహనాలు విక్రయిస్తున్న దుకాణానికి వెళ్లింది. అనంతరం ఇద్దరూ స్కూటర్‌ని ఎంచుకుని ఉలుందూరుపేట – విరుదాచలం రోడ్డులో టెస్ట్ డ్రైవ్‌కు వెళ్లారు. చెన్నై నుంచి సేలం వైపు వెళుతున్న ప్రభుత్వ బస్సు ఢీకొంది. ఇద్దరూ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. సమాచారం అందుకున్న ఉలుందూరుపేట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను కళ్లకురిచ్చి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బావిలో శవంగా తేలిన విద్యార్థిని

అన్నానగర్: విద్యార్థిని బావిలో శవమై తేలిన ఘటన విల్లుపురం జిల్లాలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. సెంజీ సమీపంలో ఉన్న భరతన్ తంగల్ గ్రామానికి చెందిన కన్నియప్పన్ కుమార్తె జనని (16) సెంజీ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 11వ తరగతి చదువుతోంది. గురువారం సాయంత్రం పాఠశాల నుంచి ఎంతసేపయినా ఇంటికి రాలేదు. తల్లిదండ్రులు, బంధువులు వివిధ ప్రాంతాల్లో వెతికారు. సమీపంలో ఉన్న బావిలో మృతదేహం పడి ఉండడం చూసి దిగ్భ్రాంతి చెందిన తల్లిదండ్రులు సత్యమంగళం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని శవపరీక్ష నిమిత్తం ముండ్యంబాక్కం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి హత్యానా లేక ఆత్మహత్యానా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

కత్తులతో రీల్స్ చేసిన యువకుల అరెస్టు

తిరువళ్లూరు: కత్తులతో రీల్స్ చేసి వాటిని సోషల్ మీడియాలో పోస్టు చేసిన ముగ్గురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి సిప్‌కాట్ ప్రాంతానికి చెందిన నలుగురు యువకులు పెద్దపెద్ద కత్తులతో రీల్స్ పేరిట రసాభాస చేశారు. తప్పు జరగకూడదని కొట్టడం లేదు. తప్పు జరగాలి.. ఆ తప్పును మేమే చేయాలి అంటూ రీల్స్ చేయడంతో పాటు యువకుడిని దారుణంగా కొట్టి సంబంధిత వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఈ వీడియో వైరల్ అయ్యింది. విషయం డీజీపీ వరకు వెళ్లడంతో సంబంధిత యువకులను గుర్తించి అరెస్టు చేయాలని పోలీసులను ఆదేశించారు. ముగ్గురు యువకులు గుమ్మిడిపూండి సిప్‌కాట్ సమీపంలోని కాయలర్‌మేడు ప్రాంతానికి చెందిన వారిగా గుర్తించి అరెస్టు చేశారు. పరారీలో వున్న మరో యువకుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

భావితరాలకు దిక్సూచి తరతరాల తిరుమల

- పుస్తకాన్ని ఆవిష్కరించిన టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం: తరతరాల తిరుమల చరిత్ర పుస్తకం భావితరాలకు ఒక దిక్సూచిగా నిలుస్తుందని తెలిపారు. స్థానిక పద్మావతిపురంలోని ఎమ్మెల్యే నివాసంలో శుక్రవారం సీనియర్ జర్నలిస్టు కుమారమంగళం నేతాజీ రచించిన «తరతరాల తిరుమల» పుస్తకాన్ని తిరుపతి ఎమ్మెల్యే, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ స్థానికుడిగా, ఓ సీనియర్ జర్నలిస్టుగా తను చూసిన, తెలుసుకున్న చరిత్ర విషయాలను ఓ పుస్తక రూపంలో తీసుకురావడం అభినందనీయమన్నారు. శ్రీవారు వెలసిన తిరుమల పుణ్యస్థల చరిత్రతో రూపొందించిన ఈ పుస్తకం భక్తులకు ఎంతో దోహదపడుతుందని తెలిపారు. విశ్వం విద్యాసంస్థల అధినేత విశ్వనాథరెడ్డి, సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

తరగతులు బహిష్కరించి విద్యార్థుల నిరసన



తరగతులు బహిష్కరించిన మద్దూరు పాఠశాల విద్యార్థులు



పాఠశాల వెలుపల ధర్నా చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

తిరుత్తణి: ప్రభుత్వ పాఠశాల గదుల గేటు తాళానికి మలం పూయడంపై విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తరగతులు బహిష్కరించి శుక్రవారం నిరసన తెలిపారు. తిరుత్తణి సమీపంలోని మద్దూరు ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో 6వ తరగతి నుంచి ప్లస్‌టూ వరకు 377 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం ప్లస్‌టూ విద్యార్థులు చదువుకునే నాలుగు తరగతి గదుల ఇనుప గేట్ల తాళాలకు మానవ మలం పూసి ఉండడం చూసి ఆగ్రహం చెందిన పాఠశాల ప్రాంగణంలో బైఠాయించారు. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు సైతం అక్కడికి చేరుకుని ధర్నాకు దిగారు. చాలీచాలని తరగతి గదులతో విద్యార్థులు ఇబ్బందులు చెందుతున్నారని, కనీస సౌకర్యాలు లేవని వాపోయారు. ప్రహ



గ్రామీణులతో తహసీల్దార్ మదన్ చర్చలు

రీగోడ లేకపోవడంతో పాఠశాలలో రాత్రి సమయాల్లో కొందరు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అదనపు తరగతి గదులు మంజూరు చేయాలని, ప్రహరీ గోడ నిర్మించాలని, తాగునీటి సదుపాయం కల్పించాలని పది సంవత్సరాల నుంచి ప్రభుత్వాన్ని కోరుతున్నా పట్టించుకోవడం లేదని పాఠశాల పీటీఏ అధ్యక్షుడు మురుగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

అధికారుల మంతనాలు

విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నిరసనతో జిల్లా విద్యాశాఖ అధికారి సుగానందనం, తిరుత్తణి తహసీల్దార్ మదన్, ఆర్‌ఐ కమల్ సహా పోలీసులు పాఠశాలకు చేరుకుని గ్రామీణులతో చర్చలు జరిపారు. పాఠశాల తరగతి గదుల తాళాలకు మలం పూయడంపై విచారిస్తామని తెలిపారు. మలాన్ని తీసుకెళ్లి డీఎన్‌ఏ పరీక్షలు చేపట్టి నిందితులను గుర్తించి చర్యలు తీసుకుంటామని, పాఠశాలకు సంబంధించి కనీస సదుపాయాలు కల్పించి విద్యార్థుల భద్రతకు భరోసా కల్పిస్తామని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

ఆత్మహత్యకు యత్నించిన ఇద్దరి మృతి

తిరువళ్లూరు: తిరువళ్లూరు జిల్లా వెంగల్ సమీపంలోని వేర్వేరు గ్రామాల్లో ఆత్మహత్యకు యత్నించిన ఇద్దరు వ్యక్తులు చికిత్స పొందుతూ మృతిచెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తిరువళ్లూరు జిల్లా మాగరల్‌కండ్రిగ గ్రామానికి చెందిన పళణి(50) కొద్ది రోజులుగా మానసిక వ్యాధితో ఇబ్బంది పడుతున్నాడు. ఈ నేపథ్యంలో జూలై 31న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. బంధువులు అతన్ని తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం చెన్నై వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య భవాని ఫిర్యాదు మేరకు వెంగల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అదేవిధంగా తిరువళ్లూరు జిల్లా అత్తికావనూర్ గ్రామానికి చెందిన సేట్టు కుమారుడు మనోరాజ్(30)కు భార్య స్వరూప(29), పిల్లలు వున్నారు. మద్యం సేవించే అలవాటున్న మనోరాజ్ 15వ తేదీన ఇంట్లో పెయింటింగ్ పనులకు ఉపయోగించే టిన్నర్ తాగి ఆత్మహత్యకు యత్నించాడు. విషయాన్ని గుర్తించిన బంధువులు అతన్ని తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. వెంగల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి

పురుగుల మందు తాగి తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. తిరువళ్లూరు జిల్లా కోవిలంపూడికి చెందిన సుబ్రమణ్యం(68)కు భార్య రాణి(62), నలుగురు కొడుకులు వున్నారు. ముగ్గురికి వివాహమై వేరుగా కాపురం ఉంటున్నారు. సుబ్రమణ్యం, రాణి చిన్న కొడుకు గణేష్‌తో వుంటున్నారు. ఈ నెల 13వ తేదీన వ్యవసాయ పనులకు వెళ్లిన సుబ్రమణ్యం అక్కడ అపస్మారక స్థితిలో ఉండడాన్ని స్థానికులు గుర్తించి భార్యకు సమాచారం ఇచ్చారు. ఆమె బంధువుల సాయంతో అతన్ని తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అతను పురుగుల మందు తాగినట్టు నిర్ధారించి చికిత్స చేపట్టారు. శుక్రవారం ఉదయం పరిస్థితి విషమించి అతను మృతి చెందాడు. మృతుడి భార్య రాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

తిరువళ్లూరు: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన తిరువళ్లూరు జిల్లా సిప్‌కాట్ వద్ద కలకలం రేపింది. తిరువళ్లూరు జిల్లా స్వామిరెడ్డికండ్రిగ గ్రామానికి చెందిన దురైవేలు(53)కు భార్య కుమారి, ఇద్దరు కుమార్తెలు వున్నారు. దురైవేలుతో ఏర్పడిన మనస్పర్థల కారణంగా భార్య, పిల్లలు 25 సంవత్సరాల క్రితం వేరుపడి అంబత్తూరులో నివాసం వుంటున్నారు. దురైవేలు ప్లాస్టిక్ పేపర్లు సేకరించి జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి ప్లాస్టిక్ వస్తువులను సేకరించి ఇంటికి వెళుతుండగా చింతలపాక్కం బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న సిప్‌కాట్ పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని వైద్యశాలకు తరలించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని యువకుడు..

తిరువొత్తియూరు: చెన్నై బేసిన్ బ్రిడ్జి ప్రాంతంలో శుక్రవారం ఉదయం రైలు ఢీకొని యువకుడు మృతిచెందాడు. చెన్నై బేసిన్ బ్రిడ్జ్ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు ఢీకొని తల, మొండెం వేరైన స్థితిలో యువకుడు మృతిచెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని స్టాన్లీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విచారణలో యువకుడు చెన్నై పులియంతోపు కన్యకాపురం సత్యవాణి ముత్తునగర్‌కు చెందిన కీంసింగ్(22)గా తేలింది. అతను పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడా లేక ఆత్మహత్య చేసుకున్నాడా అన్న కోణంతో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కోవిల్‌పట్టిలో వికలాంగుల నిరసన

అన్నానగర్: ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరుతూ వికలాంగులు శుక్రవారం తమిళనాడు వికలాంగుల సంఘం, సౌత్ జోన్ కంబైన్డ్ డిజేబిలిటీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పార్సిల్ ఆధ్వర్యంలో కోవిల్ పట్టి కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఆ సంఘం జిల్లా కార్యదర్శి అళగులక్ష్మి, జిల్లా కార్యవర్గ సభ్యుడు దేవ సహాయం తదితరులు పాల్గొని ఉచిత ఇళ్ల పట్టాలు ఇవ్వాలని నినాదాలు చేశారు. వారితో తహసీల్దార్ లెనిన్, అసిస్టెంట్ కలెక్టర్ నిషాంతిని చర్చలు జరిపారు. వారు మాట్లాడుతూ ఇళ్ల పట్టాల కోసం రెండేళ్లుగా కోరుతున్నా అధికారులు పట్టించుకోలేదని వాపోయారు. జిల్లా వ్యాప్తంగా వికలాంగులకు ఉచితంగా ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. తమ తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తే పరిశీలించి ఇళ్ల పట్టాలు ఇప్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

ప్రత్యేక అలంకరణలో గంగమ్మ దర్శనం



తిరుపతి కల్చరల్: శ్రావణమాసం తొలి శుక్రవారం సందర్భంగా శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని బంగారు, వజ్ర కిరీటం, బంగారు ముఖబింబంతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి అర్చకులు అమ్మవారి పసుపు, కుంకుమ, తీర్థప్రసాదాలు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, ఈవో ఎం.మునిక్రిష్ణయ్య, పాలక మండలి సభ్యులు టి.వెంకటేశ్వరరావు, ఎం.హరినాథ్‌రెడ్డి, పి.ధనశేఖర్, వి.గీత, ఎస్.భారతి పాల్గొన్నారు.

130 కిలోల గుట్కా ప్యాకెట్లు స్వాధీనం

తిరువొత్తియూరు: చెన్నై కొడుంగయూర్‌లో దాచి ఉంచిన 130 కిలోల గుట్కా ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకుని వ్యాపారిని అరెస్టు చేశారు. చెన్నై కొడుంగూర్ ప్రాంతంలో నిషేధిత గుట్కాలు విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచా రం అందింది. దీంతో పోలీసులు శుక్రవారం కొడుంగయూరులో వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో కృష్ణమూర్తి నగర్ భగవతి వీధిలో ఒక ఇంటిలో గుట్కా దాచి ఉంచినట్లు పోలీసులు తెలిసింది. పోలీసులు అక్కడ తనిఖీ చేయగా 130 కిలోల గుట్కా ప్యాకెట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వ్యాపారి ఎలిల్ నగర్ రెండవ వీధికి చెందిన చెల్లప్ప(58)ను అరెస్టు చేశారు. అతన్ని కోర్టులో హాజరు పరిచి పుళల్ జైలుకు తరలించారు.

ద్రౌపదీదేవి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



సుమంగళి వ్రతంలో పాల్గొన్న మహిళలు

పుత్తూరు రూరల్: పట్టణంలోని ద్రౌపదీదేవి సమేత ధర్మరాజులస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం రాత్రి ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 6 గంటలకు బ్రహ్మోత్సవాల ప్రత్యేక అర్చకులు హిమాచలంబాబు ఆధ్వర్యంలో స్థానిక మంచినీళ్ల గుంట నుంచి సంరక్షకుడుగా పోతురాజు ముందు నడుస్తుండగా గెరిగ ఆలయానికి చేరుకుంది. గెరిగ నీటితో అమ్మవారికి అభిషేకం చేశారు. 7 గంటలకు గోపూజ, శ్రీకృష్ణుడికి పాలాభిషేకం జరిపారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు హరికథా గానం జరిగింది. సాయంత్రం 6 గంటలకు పురోహితుడు రమేష్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన సుమంగళి వ్రతం, కుంకుమార్చన, జ్యోతిపూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రాత్రి 8 గంటలకు గెరిగ ఊరేగింపుగా ఆలయానికి చేరుకుంది. అనంతరం అమ్మవారిని విశేషంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు.

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం

రాత్రి 9 గంటలకు రేణుకమ్మ, నాగరాజయాదవ్ ఆధ్వర్యంలో ధ్వజారోహణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి 10 గంటలకు పట్టణానికి చెందిన శ్రీబాలాజీ వీధి నాట్య కళా బృందం ప్రదర్శించిన శశిరేఖ పరిణయం నాటకం అలరించింది. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ లారీమోహన్, సభ్యులు ముకుంద ప్రకాష్, సెల్వరాజ్ పిళ్లై, మునిరాజ, లక్ష్మీసుధ, నిర్మల, మహాదేవి, ఆలయ నిర్వాహకులు సాల్వాకం ఏలుమలైమొదలి, పళణి మొదలి, గోపిమొదలి, పెరుమాళ్‌మొదలి, కుప్పుస్వామిమొదలి పర్యవేక్షించారు.



గెరిగ ఊరేగింపు

నిండైన భక్తికి భగవంతుడే దాసుడు

చంద్రగిరి: నిండు మనసుతో పూజించే భక్తులకు భగవంతుడే దాసుడవుతాడని టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. తమిళనాడులోని కృష్ణగిరి జిల్లా గోపసంద్రంలో ఉన్న దక్షిణ తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి తిరుమలకు పాదయాత్రగా వస్తున్న వందలాది మంది భక్తులకు శుక్రవారం శ్రీనివాసమంగాపురంలో ఆయన స్వాగతం పలికారు. భూమన మాట్లాడుతూ భగవంతుని సేవకు పాదయాత్రగా తరలిరావడం మహద్భాగ్యమన్నారు. వీఐపీలు గంటల సమయం దేవుడి ఎదురుగా ఉన్నా శ్రీవారి చూపు సామాన్య భక్తుల మీదే ఉంటుందని చెప్పారు. పూర్వం పురంధరదాసు, వ్యాసరాజ యతీశ్వరులు, అన్నమాచార్యులు, శ్రీకృష్ణదేవరాయలు తదితర మహనీయులు భక్తి ప్రపత్తులతో తిరుమల కొండలను కాలినడకన అధిరోహించి శ్రీవారి వైభవాన్ని దశ దిశలా వ్యాప్తి చేశారని వివరించారు. వారి అడుగుజాడలలో నడిచి ఆ దేవదేవుని కృపకు అందరూ పాత్రులు కావాలని కోరారు. అనంతరం పాదయాత్ర భక్తులతో శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి వారిని టీటీడీ బోర్డు చైర్మన్ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో జేఈఓ వీరబ్రహ్మం, ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపీనాథ్, సూపరింటెండెంట్ చెంగల్రాయులు, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, దక్షిణ తిరుపతి ఆలయ కమిటీ చైర్మన్ నారాయణ స్వామి పాల్గొన్నారు.

పోటీలతో విద్యార్థులకు మానసికోల్లాసం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అజంతా శంకరరావు, వై.రామకృష్ణ, మోహనశ్రీ తదితరులు

- అజంతా డాక్టర్ కే శంకరరావు
- పోటీల్లో ప్రతిభ చాటుకున్న చిన్నారులు

కొరుక్కుపేట: పోటీలు విద్యార్థుల్లో జ్ఞానాన్ని పెంచడమేకాక మానసికోల్లాసాన్ని ఇస్తాయని అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక సమితి అధ్యక్షుడు అజంతా డాక్టర్ కె.శంకరరావు తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక సమితి ఆధ్వర్యంలో చెన్నై టి.నగర్‌లోని ఆంధ్ర బాలానంద సంఘం వారి బాలానంద విద్యాలయ వేదికగా శుక్రవారం అంతర్ పాఠశాలల పోటీలు నిర్వహించారు. దేశభక్తి, లలిత సంగీత విభాగాల్లో పాటలు పాడడం, చిత్రలేఖనం, వ్యాస రచన, నీతి పద్యాల పఠనం, పర్యావరణం తదితర అంశాల్లో క్విజ్ పోటీలు నిర్వహించారు. కేసరి టీ.నగర్, మైలాపూర్ పాఠశాలలు, ఆంధ్ర బాలానంద సంఘం వారి బాలానంద విద్యాలయ, ఎస్‌కేడీటీ, కేటీసీటీ, ఎస్‌కేపీడీ, శ్రీ వెంకటేశ్వర విద్యాలయ పాఠశాలల్లో ఒకటి నుంచి పన్నెండవ తరగతి వరకూ చదువుతున్న 120 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. సాయంత్రం జరిగిన సమాపనోత్సవంలో అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక సమితి అధ్యక్షుడు అజంతా డాక్టర్ కె.శంకరరావు మాట్లాడుతూ ముప్పయ్యేళ్లుగా అంతర్ పాఠశాలల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్‌కేపీసీ ప్రిన్సిపాల్ మోహనశ్రీ విజేతలకు బహుమతులు అందజేశారు. ఆమె మాట్లాడుతూ చెన్నైలో తెలుగు వారు గర్వపడే విధంగా అనేక సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. తెలుగువారి కోసం ప్రత్యేక రాష్ట్రం కావాలన్న ఉద్దేశంతో పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం మరువలేనిదన్నారు. సమితి కార్యదర్శి వై.రామకృష్ణ, సభ్యురాలు జయశ్రీ, బాలానందం విద్యాలయ కరెస్పాండెంట్ దామెర్ల పద్మావతి, ఆంధ్ర బాలానంద సంఘం చెన్నై శాఖ అధ్యక్షుడు నాగేంద్ర ప్రసాద్, ఇంకా అన్ని పాఠశాలల అధ్యాపకులు పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా యడవల్లి అరుణ శ్రీనాథ్ (పాటలు), నెల్లుట్ల శ్రీనివాస్, లీల (చిత్రలేఖనం, క్విజ్), క్రొవ్విడి రమాదేవి, తిరుమల ఆముక్తమాల్యద, ఉమా శేషు, దామెర్ల సరస్వతి (పద్య పఠనం), లలితా సుధాకర్, ఉండవల్లి జయశ్రీ (వ్యాసరచన) వ్యవహరించారు.

స్నేహితుడిని హత్య చేసిన కేసులో ఇద్దరు యువకుల అరెస్టు

అన్నానగర్: స్నేహితుడిని హత్య చేసిన కేసులో ఇద్దరు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. కోయంబత్తూరులోని పొల్లాచ్చి నేతాజీ రోడ్డుకు చెందిన అరుణ్‌కార్తీక్ (25) డ్రైవర్. గత 10న బయటకు వెళ్తున్నానని చెప్పాడు. తర్వాత కనిపించలేదు. అతని తండ్రి గణేశన్ పొల్లాచ్చి వెస్ట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణలో పోలీసులకు అరుణ్‌కార్తీక్ స్నేహితులు సూర్య ప్రకాష్ (26), అరుణ్‌రాజ్ (25)పై అనుమానం వచ్చింది. గురువారం వారిని పట్టుకుని విచారించగా నగదు ఇచ్చిపుచ్చుకునే విషయంలో ఏర్పడిన తగాదాలో అరుణ్‌కార్తీక్‌ను కొట్టి చంపి మృతదేహాన్ని కల్వారీ సమీపంలో పూడ్చిపెట్టినట్లు తెలిపారు. అరుణ్‌కార్తీక్ మృతదేహాన్ని వెలికి తీసి ఘటనా స్థలంలోనే శవపరీక్ష నిర్వహించారు. అనంతరం పోలీసులు శుక్రవారం ఇద్దరిని అరెస్ట్ చేసి విచారణ చేస్తున్నారు.

హత్య కేసులో వృద్ధుడికి జీవిత ఖైదు

కోయంబత్తూరులో స్నేహితుడిని హత్య చేసిన కేసులో వృద్ధుడికి కోర్టు శుక్రవారం జీవిత ఖైదు విధించింది. కోయంబత్తూరులోని రామ్‌నగర్ అన్సారీ రోడ్డుకి చెందిన సుబ్రమణి (68)తో సుందరరాజన్ (47) కలిసి ఉండేవాడు. ఈ క్రమంలో సుబ్రమణి సెల్‌ఫోన్‌లో పాటలు వింటూ ఉండేవాడు. అతడి స్నేహితుడు సుందరరాజన్ సెల్ ఫోన్ కొనుగోలు చేశాడు. ఆ తర్వాత సుందరరాజన్ సెల్‌ఫోన్‌ను వేరే వ్యక్తికి విక్రయించాడు. దీంతో సుబ్రమణి, సుందరరాజన్ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. 2021 అక్టోబర్ 15న సెల్‌ఫోన్ విషయంలో మళ్లీ ఇద్దరూ గొడవ పడ్డారు. కోపోద్రిక్తుడైన సుబ్రమణి రాయితో సుందరరాజన్ తలపై కొట్టాడు. తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతిచెందాడు. గాంధీపురం పోలీసులు కేసు నమోదు చేసి సుబ్రమణిని అరెస్టు చేశారు. ఈ కేసు కోయంబత్తూరు మొదటి అదనపు సెషన్స్ కోర్టులో విచారణ జరిగింది. న్యాయమూర్తి శశిరేఖ నిందితుడు సుబ్రమణికి జీవిత ఖైదు విధిస్తూ తీర్పు చెప్పారు. రూ.5 వేల జరిమానా కూడా విధించారు.

పరారీలో రూ.22 లక్షలు మోసం చేసిన మహిళ

తిరువొత్తియూరు: కొత్త చాకలిపేటలో వేలం చీటీలు నడుపుతున్న మహిళ వద్ద రూ.22 లక్షలు మోసం చేసి పరారీలో ఉన్న మహిళ కోసం పోలీసులు గాలిస్తున్నారు. కొత్త చాకలిపేట ఇరుసప్పన్ వీధికి చెందిన రాజేశ్వరి (44) వేలం చీటీలు నడుపుతోంది. ఇంటి ఎదురుగా ఉన్న సెల్వి (40) ఆమెతో పరిచయం చేసుకుని రాజేశ్వరి నడుపుతున్న వేలం చీటీలో చేరింది. ఈ క్రమంలో తన సొంత ఊరైన తెన్‌కాశి జిల్లా కీల్‌పులి ఊర్లో తనకు రెడీమేడ్ దుస్తులు తయారు చేసే కంపెనీ వుందని, దాన్ని అభివృద్ధి చేయడానికి డబ్బు అవసరమని చెప్పింది. దీంతో రాజేశ్వరి రూ.22 లక్షల వరకు సెల్వికి ఇచ్చింది. ఆమె కొద్ది నెలలు వడ్డీ చెల్లించింది. గురువారం రాత్రికి రాత్రే సెల్వి ఇల్లు ఖాళీ చేసి పరారైంది. రాజేశ్వరి ఆమె సెల్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ అని వచ్చింది. దీంతో మోసపోయినట్టు గుర్తించి చాకలిపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి పరారీలో ఉన్న సెల్వి కోసం గాలిస్తున్నారు.

రూ.6.25 లక్షల మోసం కేసులో ఇంటి యజమాని అరెస్టు

తిరువొత్తియూరు: చెన్నై వడపలనిలో ఇంటిని లీజుకు ఇచ్చి రూ.6.25 లక్షలు మోసం చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై ఆల్వార్ తిరునగర్ నెహ్రూ వీధికి చెందిన శ్రీరామ్ విగ్నేష్ (33) టీ నగర్‌లో ఉన్న ప్రైవేటు కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి ఆన్‌లైన్‌లో పెరవళ్లూరు రామనగర్ చెందిన మేఘనాథంతో పరిచయం ఏర్పడింది. అతను తనకు వడపలనిలో ఇల్లు ఉందని రూ.6.25 లక్షలకు లీజుకు ఇస్తున్నట్లు తెలిపాడు. దీంతో శ్రీరామ్ విగ్నేష్ పలు దఫాలుగా రూ.6.25 లక్షలు ఇచ్చి గత ఏడాది జూన్ 6వ తేదీన మేఘనాథన్ ఇంటిలో కాపురం పెట్టాడు. రెండు నెలల తర్వాత బ్యాంకు అధికారులు వచ్చి ఇంటిపై అప్పు ఉందని, రూ.50 లక్షలు చెల్లించాలని తెలిపారు. లేకుంటే ఇంటిని జప్తు చేస్తామన్నారు. దీనిపై కోర్టు నుంచి అనుమతి తీసుకున్నామని, ఇంటిలోని వస్తువులు బయటపెట్టి సీలు వేశారు. మోస పోయిన శ్రీరామ్ విగ్నేష్ తిరువికానగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టి కోర్టు కేసులో వున్న ఇంటిపై రూ.6.25 లక్షలు తీసుకొని మోసం చేసిన మేఘనాథన్‌ను అరెస్టు చేశారు.

యువకుడి అదృశ్యం

తిరువళ్లూరు: గుమ్మిడిపూండిలోని శ్రీలంక శరణార్థుల శిబిరానికి చెందిన యువకుడు అదృశ్యమైన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి పెత్తికుప్పంలో శ్రీలంక శరణార్థుల శిబిరం వుంది. ఇక్కడ 937 కుటుంబాలున్నాయి. ఈ ప్రాంతానికి చెందిన విక్టర్‌రాజ్(24) గత 13వ తేదీ నుంచి కనిపించకుండా పోయాడు. కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లేదు. దీంతో గుమ్మిడిపూండి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

1500 లీటర్ల కిరోసిన్ స్వాధీనం

అన్నానగర్: తేంగపట్నం సమీపంలోని ఒక ఇంట్లో నిల్వ ఉంచిన 1500 లీటర్ల కిరోసిన్‌ను జిల్లా అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. కన్యాకుమారి జిల్లా తేంగపట్నం సమీపంలో ఉన్న ఇనాయంబుత్తాన్ తురైలో ప్రభుత్వ సబ్సిడీ కిరోసిన్ నిల్వ ఉంచుతున్నట్లు కిల్లియూర్ జిల్లా పౌర సరఫరాల అధికారికి శుక్రవారం ఉదయం సమాచారం అందింది. కిల్లియూరు సర్కిల్ డిస్ట్రిబ్యూషన్ అధికారి వేణుగోపాల్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అలెక్స్, పుదుకడై సబ్ ఇన్‌స్పెక్టర్ శేఖర్, హెడ్ కానిస్టేబుల్ సునీల్‌రాజ్, హెడ్ కానిస్టేబుల్ జస్టిన్ రాజ్‌లతో కూడిన బృందం ఇనాయంబుత్తాన్ తురై ప్రాంతంలో దాడులు నిర్వహించింది. పీటర్ ఇంటిలో మత్స్యకారులకు ఇచ్చే సబ్సిడీ కిరోసిన్ 41 ప్లాస్టిక్ డబ్బాల్లో నిల్వ ఉంచినట్లు గుర్తించారు. 1500 లీటర్ల కిరోసిన్‌ను స్వాధీనం చేసుకుని వట్టవిళైలోని ప్రభుత్వ డిపోకు అప్పగించారు.

యువతి వద్ద రూ.42 లక్షల మోసం

తిరువొత్తియూరు: బ్యాంకులో వేలానికి ఉంచిన నగలను తక్కువ ధరకు తీసిస్తామని చెప్పి యువతి వద్ద రూ.42 లక్షలు మోసం చేసిన దంపతులు సహా ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. నెల్లై జిల్లా కలక్కాడు పద్మనేరికి చెందిన కుమరవేల్ కుమార్తె ధనలక్ష్మి(36)కి తూత్తుకుడి జిల్లా మాప్పిళ్లై యూరని జ్యోతి బాస్ ఒకటవ వీధికి చెందిన కుమార్ (29), అతని భార్య భవాని (26), కుమార్ తల్లి తమిళ్ సెల్వి (50) దగ్గర బంధువులు. వీరు వేర్వేరు ప్రైవేటు బ్యాంకుల్లో వేలానికి పెట్టిన నగలను తక్కువ ధరకు తీసి ఇస్తామని ధనలక్ష్మిని నమ్మించారు. ఆమె నుంచి రూ.42 లక్షలు తీసుకున్నారు. నగలు తీసివ్వలేదు. దీనిపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి కుమార్, భవాని, తమిళ్ సెల్విని అరెస్టు చేశారు. వారిని కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

క్లుప్తంగా...

10 నిమిషాల్లో బాధితురాలి వద్దకు..

- దిశ యాప్ ద్వారా మహిళ ఫోన్.. వెంటనే పోలీసుల స్పందన
- నిందితుడి అరెస్ట్


బాధితురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీస్

రుద్రవరం(నంద్యాల): పెద్దకంబలూరుకు చెందిన ఓ మహిళను దిశ యాప్ ఆదుకుంది. ఎస్ఐ శరత్‌కుమార్ రెడ్డి తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన మహిళ శుక్రవారం పొలం పనులు ముగించుకుని ఒంటరిగా ఇంటికి వెళ్తోంది. ఇంతలో ప్రసాద్ అనే వ్యక్తి ఆమెపై అఘాయిత్యానికి యత్నించాడు. ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కల వాళ్లు వచ్చేలోపు నిందితుడు పారిపోయాడు. బాధితురాలు దిశ యాప్ ద్వారా పోలీసులకు ఫోన్ చేసింది. 10 నిమిషాల్లో పోలీసులు ఆమె వద్దకు చేరుకుని వివరాలు సేకరించారు. శిరివెళ్ల వైపు పారిపోతున్న నిందితుడిని అరెస్టు చేశారు.

ఎంసీఏ, ఎంబీఏ కోర్సులకు ఫీజుల ఖరారు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎంసీఏ, ఎంబీఏ కోర్సులకు ప్రభుత్వం ఫీజులను ఖరారు చేసింది. ఏపీ ఉన్నత విద్య పర్యవేక్షణ, నియంత్రణ మండలి సిఫారసు మేరకు 248 ఎంబీఏ, 109 ఎంసీఏ కాలేజీల్లో ఒక్కో కోర్సుకు కనిష్టంగా రూ.35వేలు, గరిష్టంగా రూ.60 వేలుగా ఫీజులు నిర్ణయించింది. 2023–24 నుంచి 2025–26 విద్యా సంవత్సరం వరకు ఈ ఫీజులు కొనసాగుతాయని ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు శుక్రవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆయా కళాశాలల్లోని బోధన వసతులు, అడ్మిషన్ల శాతం, ఇతర సౌకర్యాలను పరిశీలించి... వాటికి అనుగుణంగా ఫీజులు నిర్ణయించారు.

టీచర్ల పని సర్దుబాటును నిలిపివేయాలి

- ఫ్యాప్టో రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎస్.వెంకటేశ్వర్లు, మంజుల

సాక్షి, అమరావతి:ఉపాధ్యాయులకు బదిలీలు జరిగి మూడు నెలలు పూర్తికాకుండానే పని సర్దుబాటు పేరుతో చేపట్టిన ప్రక్రియను నిలుపుదల చేయాలని ఫ్యాప్టో రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ మంజుల శుక్రవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెయ్యి మంది ఉపాధ్యాయులను రిలీవ్ చేసినా తిరిగి అదే పాఠశాలల్లో విధులు నిర్వర్తించమని చెప్పడాన్ని తప్పుపట్టారు. జీవో 117ను రద్దు చేయడంతో పాటు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. బదిలీ అయిన 10వేల మంది ఉపాధ్యాయులకు ఇప్పటికీ జీతాలు అందడం లేదని విమర్శించారు. పలు సమస్యలపై శనివారం అన్ని జిల్లాల విద్యాశాఖ కార్యాలయాల ఎదుట నిరసన తెలియజేయనున్నట్లు తెలిపారు. సమస్యలు పరిష్కరించకుంటే ఈ నెల 23న రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట 12 గంటల ధర్నా చేస్తామని హెచ్చరించారు.

విద్యార్థి పోర్టల్‌లో పేరుండాలి

పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్

సాక్షి, అమరావతి: పాఠశాలల్లో వంద శాతం హాజరు నమోదు కోసం ఏర్పాటు చేసిన విద్యార్థి సమాచార పోర్టల్‌లో 2005 సెప్టెంబర్ 1 నుంచి 2018 ఆగస్టు 31 మధ్య జన్మించిన పిల్లల పేర్లు తప్పనిసరిగా నమోదు చేయాలని పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ అధికారులను ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో సమాచారాన్ని పరిశీలించాలన్నారు. ఈ నెల 23 నుంచి ప్రతి బుధవారం ఉదయం 11:00 గంటల నుంచి రాష్ట్రంలోని ఎంఈవోలు, డీఈవోలు, జిల్లా వృత్తి విద్యా అధికారులకు ఫోన్ చేస్తానని.. పోర్టల్‌లో పేరు నమోదు కాకపోవడానికి కారణాలను వివరించాలని కోరారు.

• తెలంగాణ

గని పైకప్పు కూలి ఆపరేటర్ మృతి

గోదావరిఖని(రామగుండం): సింగరేణి సంస్థ రామగుండం డివిజన్‌–1 పరిధి జీడీకే–11 గనిలో గురువారం రాత్రి జరిగిన ప్రమాదంలో జీఎంఎస్ ప్రైవేట్ కంపెనీకి చెందిన కంటిన్యూస్‌మైనర్ ఆపరేటర్ బక్క కృష్ణమురారి (40) అక్కడికక్కడే మృతిచెందాడు. గనిలోని 3 సీమ్ డెవలప్‌మెంట్ ఏరియాల్లో పనులు నిర్వహిస్తున్న క్రమంలో.. మూడు మీటర్ల ఎత్తు, రెండు మీటర్ల పొడవుమేర పైకప్పు కూలి మురారిపై పడింది. ఈ ప్రాంతంలో నిత్యం రిమోట్‌తో యంత్రాన్ని నిర్వహించాల్సి ఉంది. కానీ పది రోజులుగా రిమోట్ పనిచేయకపోవడంతో కేబుల్ ద్వారా యంత్రాన్ని నడిపించడం వల్లే ప్రమాదం జరిగిందని అంటున్నారు. కృష్ణమురారి కాజీపేట్ వాసి.. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

రూ.90 లక్షల పరిహారానికి అంగీకారం

జీఎంఎస్ కంపెనీ నిర్లక్ష్యం వల్లే కార్మికుడు మృతి చెందాడని పేర్కొంటూ కార్మిక సంఘాలు ఆందోళనకు దిగాయి. దీంతో మృతుని కుటుంబానికి రూ.90 లక్షల పరిహారం చెల్లింపునకు అంగీకారం కుదిరింది. వీటిలో రూ.65 లక్షలు ప్రమాద బీమా, రూ.25 లక్షలు జీఎంఎస్ కంపెనీ నష్టపరిహారం అందించనుంది.

తల్లి రొయ్య ఇక లోకల్

అమెరికా నుంచి దిగుమతులకు చెల్లుచీటీ

దేశీయంగానే తల్లి రొయ్యల పునరుత్పత్తి

- 30 శాతం తగ్గనున్న వ్యయభారం
- తొలి దశలో బ్రూడ్‌స్టాక్ మల్టిప్లికేషన్ సెంటర్లు
- మలి దశలో న్యూక్లియర్ బ్రీడింగ్ సెంటర్ల ఏర్పాటు



సాక్షిప్రతినిధి, కాకినాడ: అమెరికన్ తల్లి రొయ్యకు మన ఆక్వా రైతులు త్వరలో గుడ్‌బై చెప్పనున్నారు. తల్లి రొయ్యలను దేశీయంగా మన హేచరీల్లో ఉత్పత్తి చేసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. తీర ప్రాంత రాష్ట్రాల్లోని హేచరీల్లో రొయ్య పిల్లల పునరుత్పత్తి కోసం తల్లి రొయ్యలను కొన్నేళ్లుగా లక్షలు వెచ్చించి అమెరికా నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. మన హేచరీల్లో బ్లాక్ టైగర్(మోనాడామ్) తల్లి రొయ్యలు 2009కి ముందు భారతీయ సముద్ర జలాల్లో లభించేవి. ఆ తర్వాత బ్లాక్‌టైగర్ 60 శాతం బాక్టీరియాతో రోగాల బారిన పడి తల్లి రొయ్యలు దెబ్బతిన్నాయి. అనంతరం రోగాల్లేని తల్లి రొయ్యలను ఉత్పత్తి చేస్తున్న అమెరికా నుంచి వెనామీ దిగుమతికి కేంద్ర ప్రభుత్వం అనుమతించింది. పసిఫిక్ మహాసముద్రంలో మాత్రమే లభించే ఈ వెనామీ(ఎగ్జోటిక్ స్పీసిస్)వైట్‌లెగ్ ష్రింప్‌ను దిగుమతి చేసుకునేలా నిబంధనలను సడలించింది. అమెరికాలో వెనామీని పునరుత్పత్తి చేస్తున్న కంపెనీల్లో ఎంపిక చేసిన 14 కంపెనీల నుంచి తల్లి రొయ్య దిగుమతి చేసుకునేలా ఒప్పందం కుదిరింది. ఇలా దిగుమతి చేసుకునే వెనామీని చెన్నైలోని సెంట్రల్ క్వారంటైన్‌లో ఐదు రోజులు అన్ని పరీక్షల అనంతరం ఒడిశా, గుజరాత్, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ సహా.. మన రాష్ట్రంలోని హేచరీల్లో వినియోగిస్తున్నారు. వెనామీ తల్లి రొయ్య ప్రస్తుతం అమెరికాలో 80 డాలర్లు (రూ.6,400) పలుకుతోంది. కస్టమ్స్, లాజిస్టిక్, ఫ్లైట్ చార్జీలు 30 శాతం అదనంగా కలుపుకొంటే సుమారు రూ.10,000 వరకు అవుతుంది. ఇక్కడి హేచరీలు అమెరికాలోని టెక్సాస్, ఫ్లోరిడా రాష్ట్రాల నుంచి ఏటా 2లక్షల నుంచి 2.50 లక్షల తల్లి రొయ్యలను దిగుమతి చేసుకుంటున్నాయి. దేశవ్యాప్తంగా తీరంలో 550 హేచరీలుంటే అత్యధికంగా మూడొంతులు హేచరీలు కాకినాడ తీరంలోనే ఉండటం విశేషం.

ఇక లక్షలు ఖర్చుపెట్టాల్సిన అవసరం ఉండదు..




బ్రూడ్‌స్టాక్ మల్టిప్లికేషన్ సెంటర్ల ఏర్పాటు ద్వారా మన తల్లి రొయ్యను మనమే పునరుత్పత్తి చేసుకునేందుకు వీలుంటుంది. దీనివల్ల అమెరికా నుంచి లక్షలు ఖర్చుపెట్టి తల్లి రొయ్యలను దిగుమతి చేసుకోవాల్సిన అవసరం ఇక ఉండదు.

– హరినారాయణరావు, ప్రధాన కార్యదర్శి, ఆలిండియా ష్రింప్‌హేచరీస్ అసోసియేషన్

మరో రెండేళ్ల సమయం..

కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీకి కేంద్రం తీసుకొచ్చిన సవరణలు వెనామీ తల్లి రొయ్యల స్థానే.. దేశీయంగా తల్లి రొయ్యల ఉత్పత్తికి మార్గం సుగమం చేశాయని చెప్పొచ్చు. ఇందుకోసం రెండు దశలను కేంద్ర ప్రభుత్వం నిర్దేశించింది. తొలి దశలో బ్రూడ్‌స్టాక్ మల్టిప్లికేషన్ సెంటర్(బీఎంసీ)లు, మలి దశలో న్యూక్లియర్ బ్రీడింగ్ సెంటర్(ఎన్‌బీఎస్)లు నెలకొల్పుకోవచ్చు. ఈ రెండు దశలు పూర్తయ్యేసరికి తల్లి రొయ్య కోసం అమెరికాపై ఆధారపడాల్సిన అవసరం ఉండదు. ఈ రెండు దశలు చేరుకోవడానికి మరో రెండేళ్లు పడుతుందని అంచనా. తొలి దశలో భాగంగా బీఎంసీ ద్వారా తల్లి రొయ్య స్థానంలో పిల్ల రొయ్యలను దిగుమతి చేసుకుంటారు. బ్రూడ్‌స్టాక్ మల్టిప్లికేషన్ సెంటర్(బీఎంసీ)లలో పిల్ల రొయ్యలను పునరుత్పత్తి చేస్తారు. అమెరికా నుంచి దిగుమతిచేసుకునే ఒక తల్లి రొయ్య స్థానంలో అంతే ఖర్చుతో 1000 పిల్ల రొయ్యలను పునరుత్పత్తి చేయొచ్చు. ఇలా పిల్ల రొయ్యలను దిగుమతి చేసుకుని బీఎంసీలలో పునరుత్పత్తి చేస్తారు. ఈ ప్రక్రియ ఇప్పటికే మన రాష్ట్రంలో నిర్వహించేందుకు వీలుగా పలు సెంటర్లకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం నెల్లూరు బీఎంఆర్, భీమవరం ఆమందా, శ్రీకాకుళం కోనాబే, విశాఖలో ఎమ్‌పెడా బీఎంసీ(బ్రూడ్‌స్టాక్ మల్టిప్లికేషన్ సెంటర్స్)లు సిద్ధమయ్యాయి. మలి దశలో ఇక అమెరికా వైపు కన్నెత్తి చూడాల్సిన అవసరం లేకుండా మనమే నేరుగా తల్లి రొయ్యను పునరుత్పత్తి చేయొచ్చు. ఇందుకోసం న్యూక్లియర్ బ్రీడింగ్ సెంటర్లు నెలకొల్పుతారు. ప్రస్తుతం అమెరికాలో మాత్రమే నిర్వహిస్తున్న సెంటినల్ ట్రైల్స్ ఇక్కడ ఏర్పాటు చేసే ఎన్‌బీసీలతో నిర్వహిస్తారు. ఇక్కడి వాతావరణ పరిస్థితులకనుగుణంగా జెనెటిక్ బ్రీడింగ్, జెనెటిక్ ప్రాసెసింగ్ చేస్తారు.

అజేయ కల్లం పిటిషన్‌పై రిజిస్ట్రీ అభ్యంతరాలు తోసివేత



- పిటిషన్‌కు నంబర్ కేటాయించాలని రిజిస్ట్రీకి తెలంగాణ హైకోర్టు ఆదేశం
- చెప్పని విషయాలను చెప్పినట్లు సీబీఐ అధికారి రికార్డ్ చేశారు
- వాటిని చార్జిషీట్ నుంచి తొలగించేలా ఆదేశాలివ్వండి
- హైకోర్టులో అజేయ కల్లం పిటిషన్

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ తన వాంగ్మూలాన్ని వక్రీకరించిందని, తాను చెప్పని విషయాలను చెప్పినట్లు చార్జిషీట్‌లో పేర్కొందని, వాటిని చార్జిషీట్ నుంచి తొలగించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారు అజేయ కల్లం దాఖలు చేసిన పిటిషన్‌పై రిజిస్ట్రీ లేవనెత్తిన అభ్యంతరాలను తెలంగాణ హైకోర్టు తోసిపుచ్చింది. అజేయ కల్లం దాఖలు చేసిన పిటిషన్‌కు నంబర్ కేటాయించాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

అజేయ కల్లం దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రీ అభ్యంతరాలు లేవనెత్తి, నంబర్ కూడా కేటాయించలేదు. ఈ నేపథ్యంలో అభ్యంతరాలపై విచారణ జరిపి నంబరు కేటాయించాలా వద్దా అన్న అంశాన్ని తేల్చేందుకు ఈ వ్యాజ్యాన్ని హైకోర్టు ముందుంచింది. ఈ వ్యాజ్యంపై జస్టిస్ లక్ష్మణ్ శుక్రవారం విచారణ జరిపారు. పిటిషనర్ తరపు న్యాయవాది పూళ్ల వీర్రాజు వాదనలు వినిపించారు. '2023 ఏప్రిల్ 29న సీఆర్‌సీసీ సెక్షన్ 161 కింద అజేయ కల్లం వాంగ్మూలాన్ని సీబీఐ విచారణాధికారి వికాస్ కుమార్ నమోదు చేశారు. చార్జిషీట్‌లో మాత్రం ముఖేష్ శర్మ అనే అధికారి సంతకం చేశారు. ముఖేశ్ శర్మ ఎవరో కల్లంకు అసలు తెలియదు. విచారణాధికారి వికాస్ కుమార్ పూర్తి ఏకపక్షంగా వ్యవహరించారు. ఈ కారణంగానే దర్యాప్తు బృందం నుంచి ఆయన్ని సుప్రీం కోర్టు మార్చింది. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తి నుంచి చట్టపరంగా వాంగ్మూలం నమోదు చేసే విధానం ఏమిటో వికాస్ కుమార్‌కు తెలియదు. కల్లం చెప్పని విషయాలను చెప్పినట్లు రికార్డ్ చేయడంతోపాటు చెప్పిన విషయాలను మరో అర్థం వచ్చేలా మార్చారు. ఇది చాలా తీవ్రమైన అంశం. అందుకే మాకు జరిగిన అన్యాయాన్ని హైకోర్టు దృష్టికి తీసుకొచ్చేందుకే ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశాం.' అని వీర్రాజు కోర్టుకు నివేదించారు. రిజిస్ట్రీ అభ్యంతరాలను తోసిపుచ్చి తమ పిటిషన్‌కు నంబర్ కేటాయించి విచారణ జరపాలని ఆయన న్యాయమూర్తిని అభ్యర్థించారు. వీర్రాజు వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. రిజిస్ట్రీ అభ్యంతరాలను తోసిపుచ్చారు. పిటిషన్‌కు నంబర్ కేటాయించాలని రిజిస్ట్రీని ఆదేశించారు.

పోలీసుల్ని, ఉద్యోగుల్ని బెదిరించడం దారుణం

- ప్రభుత్వ సలహాదారు చంద్రశేఖర్‌రెడ్డి


సాక్షి, అమరావతి: ప్రతిపక్ష పార్టీలు పోలీసులు, ఉద్యోగులను బెదిరించడం, వారిపై దాడులు చేయించడం దారుణమని ప్రభుత్వ సలహాదారు (ఉద్యోగుల సంక్షేమం) చంద్రశేఖర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కొద్దిరోజుల కిందట అంగళ్లు, పుంగనూరులో జరిగిన ఘటనలు హేయమన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న ప్రతిపక్ష నేత చంద్రబాబు పోలీసులను బెదిరించడం సరికాదన్నారు. పోలీసులను తరమండి, కొట్టండి అంటూ కార్యకర్తలను ఉసిగొల్పి వారిపై దాడులు చేయడమేంటని ప్రశ్నించారు. పాదయాత్ర చేస్తున్న ఆయన కుమారుడు లోకేశ్.. అందరి పేర్లు రెడ్‌బుక్‌లో రాసుకుంటున్నానని, అధికారంలోకొచ్చాక వాళ్ల అంతు చూస్తానని బెదిరించడం హాస్యాస్పదమన్నారు. ఇంతవరకు ఎమ్మెల్యేగా గెలవని వ్యక్తి సీఎం అయినట్టు కలలు కంటూ ఉద్యోగులను బెదిరించడం సిగ్గుచేటన్నారు. మరోవైపు వలంటీర్ వ్యవస్థను జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ బదనాం చేయాలని చూస్తుండటం అన్యాయమన్నారు. కోవిడ్ సమయంలో ఈ నాయకులంతా ఇళ్లల్లోంచి బయటకు రాకుండా దాక్కున్నారని, అప్పుడు ఆ వలంటీర్లే ప్రాణాలకు తెగించి సేవలందించారని చెప్పారు. అవన్నీ మర్చిపోయి వాళ్లపై ఇష్టానుసారం విమర్శలు చేయడం బరితెగించడమేనన్నారు.

గోల్డ్ బాండ్‌గా ఆదిత్యుని బంగారం

7.215 కిలోల బంగారాన్ని భద్రపరిచిన పాలక మండలి

అరసవల్లి: అరసవల్లి శ్రీసూర్యనారాయణస్వామికి భక్తులు హుండీల ద్వారా సమర్పించిన బంగారు వస్తువులు, వినియోగంలో లేని బంగారాన్ని ఆలయ పాలక మండలి సభ్యులు, దేవదాయ శాఖ అధికారులు గోల్డ్ బాండ్ స్కీమ్ రూపంలో విశాఖ ఎస్‌బీఐలో భద్రపరిచారు. మూలవిరాట్టు, ఉత్సవమూర్తుల నిత్య అలంకరణకు, పర్వదినాలకు 10 కిలోల ఆభరణాలను ఉపయోగిస్తున్నారు. ఇవి ఆలయ అధికారులు, అర్చకుల సంరక్షణలో ఉన్నాయి. మిగిలిన 7.215 కిలోల బంగారు వస్తువుల (మొత్తం 293 రకాలు)ను పాలకమండలి సభ్యులు శుక్రవారం దేవదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ ఎంవీ సురేశ్‌బాబు, జ్యూయలరీ వెరిఫికేషన్ ఆఫీసర్ ఏవీ దుర్గా భవానీ సమక్షంలో ఎస్‌బీఐ డిప్యూటీ మేనేజర్ డి.కుమార్, చీఫ్ మేనేజర్ సుధీర్‌కుమార్‌కు అప్పగించారు. వీటిని కరిగించి.. కడ్డీలుగా చేసి విశాఖలోని ఎస్‌బీఐలో భద్రపరుస్తారు. దీనిపై వచ్చే వడ్డీని ఆలయ నిర్వహణకు ఉపయోగిస్తారు.

ఎన్‌సీటీఈ డిప్యూటీ కార్యదర్శికి నాన్ బెయిలబుల్ వారెంట్




- హైకోర్టు ఉత్తర్వులు


సాక్షి, అమరావతి: కోర్టు ఆదేశాలున్నప్పటికీ విచారణకు గైర్హాజరు కావడం పట్ల జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి (ఎన్‌సీటీఈ) డిప్యూటీ కార్యదర్శిపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఆయనకు నాన్ బెయిలబుల్ వారెంట్ (ఎన్‌బీడబ్ల్యూ) జారీ చేసింది. ఆయనను అరెస్ట్ చేసి తమ ముందు హాజరుపరచాలని పోలీసులను ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ఆదేశాలు జారీ చేశారు. తమ కాలేజీ గుర్తింపును రద్దు చేయడాన్ని సవాల్ చేస్తూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పెద్దాపురంలోని నెహ్రూ మెమోరియల్ ఎక్స్ సర్వీస్‌మెన్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ పీడీ చంద్రశేఖర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు విచారణ జరిపారు. గత విచారణ సమయంలో పిటిషనర్ తరఫు న్యాయవాది మతుకుమిల్లి శ్రీవిజయ్ వాదనలు వినిపిస్తూ.. గుర్తింపు రద్దు కోసం ఇచ్చిన షోకాజ్ నోటీసుకు వివరణ ఇచ్చామని, అయినా కూడా ఆ వివరణను పరిగణనలోకి తీసుకోకుండా గుర్తింపు రద్దు చేస్తూ జూలై 7, 2020లో ఉత్తర్వులు జారీ చేశారన్నారు. దీనిపై ఎన్‌సీటీఈ ముందు ఆన్‌లైన్‌లో అప్పీల్ దాఖలు చేశామని, చట్టం నిర్దేశించిన ఫీజు కూడా చెల్లించామన్నారు. అలాగే పోస్టు ద్వారా వినతిపత్రం కూడా పంపామని తెలిపారు. అయితే తమ ముందు ఎలాంటి అప్పీల్ దాఖలు చేయలేదని ఎన్‌సీటీఈ తరఫు న్యాయవాది కోర్టుకు నివేదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి.. ఎన్‌సీటీఈ డిప్యూటీ కార్యదర్శి ఈ నెల 18న స్వయంగా హాజరై వివరణ ఇవ్వాలని స్పష్టం చేశారు. శుక్రవారం జరిగిన విచారణకు డిప్యూటీ కార్యదర్శి రాలేదు. వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను కొట్టేసిన న్యాయమూర్తి డిప్యూటీ కార్యదర్శికి నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేశారు. తదుపరి విచారణను వాయిదా వేశారు.

బెయిల్ పిటిషన్‌ను 2 వారాల్లో పరిష్కరించాలి

- వివేకా హత్య కేసులో హైకోర్టులో భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్ వాదనలు
- ఇష్టం వచ్చినట్లు సీబీఐ అఫిడవిట్‌లు వేయడం తగదు
- విచారణ జాప్యానికే ఇదంతా

సాక్షి, హైదరాబాద్: బెయిల్ పిటిషన్లను రెండు వారాల్లో పరిష్కరించాలని సుప్రీం కోర్టు మార్గదర్శకాలున్నాయని, ఆ మేరకు త్వరగా విచారణ జరిపి ఆదేశాలు ఇవ్వాలని మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితులు వైఎస్ భాస్కర్‌రెడ్డి, గజ్జల ఉదయ్‌కుమార్‌రెడ్డి హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. సీబీఐ ఇష్టం వచ్చినట్లు పేజీలకు పేజీల అఫిడవిట్లు వేస్తోందని, బెయిల్ పిటిషన్‌లో వాదనలను జాప్యం చేసేందుకే ఇలా చేస్తోందని చెప్పారు. సీబీఐ తీరు సరికాదన్నారు. వైఎస్ వివేకా హత్య కేసులో సీబీఐ కోర్టు బెయిలు పిటిషన్లను కొట్టివేయడాన్ని సవాలు చేస్తూ భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. వివేకా హత్య కేసులో దర్యాప్తు పూర్తయిందని, సీబీఐ అభియోగ పత్రాన్ని కూడా దాఖలు చేసిందని తెలిపారు. ఈ కేసులో పిటిషనర్లను అక్రమంగా ఇరికించారని, వారికి వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలూ కోర్టుకు సమర్పించలేదని అన్నారు. ఇప్పటికే 5 నెలలకు పైగా జైలులో ఉన్నారని, భాస్కర్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితి సరిగా లేదని చెప్పారు. ఆయనకు జైలు అధికారులు పలుమార్లు ఆస్పత్రుల్లో పరీక్షలు కూడా చేయించారని తెలిపారు. ఈ సందర్భంగా సీబీఐ కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసింది. వాదనలు విన్న న్యాయమూర్తి.. విచారణను గురువారం మధ్యాహ్నం 2.30 గంటలకు వాయిదా వేశారు.





ప్రేమసౌధం వైపు పర్యాటకుల చూపు



తాజ్‌మహల్‌పైనే దేశ, విదేశీ పర్యాటకులకు మక్కువ

పర్యాటకుల ఆకర్షణలో దేశంలోనే మొదటి స్థానం

గతేడాది భారత్‌కు 61.91 లక్షల విదేశీ పర్యాటకులు

2022 గణాంకాలు వెల్లడించిన కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ

తాజ్‌మహల్ అనగానే ప్రేమకు చిహ్నమైన అపురూపమైన కట్టడం మదిలో మెదులుతుంది. అలాంటి తాజ్‌మహల్‌ను చూడటానికి దేశ, విదేశీ పర్యాటకులు ఎక్కువ మక్కువ చూపిస్తున్నారు. స్వదేశీ పర్యాటకులతో పాటు విదేశీ పర్యాటకులను ఆకర్షించడంలో తాజ్‌మహల్ మొదటి స్థానంలో నిలిచింది. గత ఆర్థిక సంవత్సరం విదేశీ పర్యాటకుల్లో అత్యధికులు తాజ్‌మహల్‌ను సందర్శించారని కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ విడుదల చేసిన 2022 గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఇక విదేశీ పర్యాటకులను ఆకర్షించడంలో ఆగ్రా ఫోర్ట్ రెండో స్థానంలో ఉంది. స్వదేశీ పర్యాటకులను ఆకర్షించడంలో రెడ్ ఫోర్టు రెండో స్థానంలో నిలిచిందని ఆ గణాంకాలు పేర్కొన్నాయి. గతేడాది దేశానికి మొత్తం 61,91,399 మంది విదేశీ పర్యాటకులు వచ్చారు. ఇందులో అత్యధికంగా పది దేశాల నుంచే 45,65,072 మంది ఉన్నారు. 2021లో కోవిడ్ ఆంక్షలు కారణంగా విదేశీ పర్యాటకుల సంఖ్య గణనీయంగా తగ్గిన విషయం తెలిసిందే. అయితే 2022లో విదేశీ పర్యాటకుల సంఖ్య భారీగా పెరిగింది. 2021లో విదేశీ పర్యాటకుల సంఖ్య 15,27,114 మంది మాత్రమే ఉండగా 2022లో ఏకంగా 61.91 లక్షలకు చేరింది. అంటే 2022లో విదేశీ పర్యాటకుల వృద్ధి 305.4 శాతంగా నమోదైంది.

– సాక్షి, అమరావతి

2022లో విదేశీ పర్యాటకులు అత్యధికంగా సందర్శించిన టాప్ 10 పర్యాటక ప్రాంతాలు

విదేశీ పర్యాటకులు (లక్షల్లో)

ప్రాంతం	పర్యాటకులు
1.తాజ్ మహల్	3.28
2.ఆగ్రా కోట	1.20
3.ఫతేపూర్ సిక్రి	0.52
4.ఇత్‌మద్‌ఉద్దౌలా సమాధి	0.36
5.సాహెత్–మాహెత్	0.32
6.మెహతాబ్ బాగ్	0.14
7.అక్బర్ సమాధి సికంద్రా	0.08
8.రామ్ బాగ్	0.02
9.రెసిడెన్సీ భవనాలు	0.01
10. సమాధి సికంద్రా	0.003

2022లో దేశీయ పర్యాటకులు అత్యధికంగా సందర్శించిన టాప్ 10 పర్యాటక ప్రాంతాలు

దేశీయ పర్యాటకులు (లక్షల్లో)

ప్రాంతం	పర్యాటకులు
1.తాజ్ మహల్	45.13
2.ఎర్రకోట	22.01
3. సూర్య దేవాలయం	21.33
4.ఆగ్రా కోట	15.99
5. కుతుబ్ మినార్	15.24
6. గోల్కొండ	14.06
7.మామల్లపురం	13.84
8.ఎల్లోరా గుహలు	13.32
9. బీబీ కా మక్బరా	10.85
10.హుమాయున్ సమాధి	10.81

• తెలంగాణ

కొడుకే కాలయముడు

- ఇంటి స్థలం విషయమై ఘర్షణ
- రోకలి బండతో మోది తల్లి హత్య

ఇల్లెందు రూరల్: స్థలం విషయమై జరిగిన ఘర్షణలో కన్నకొడుకే కాలయముడయ్యాడు. రోకలిబండతో మోది తల్లిని హత్య చేశాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం బొజ్జాయిగూడెం గ్రామపంచాయతీ పరిధి మొదుగులగూడెంలో శుక్రవారం జరిగిన ఈ సంఘటనపై సీఐ కరుణాకర్, స్థానికులు తెలిపిన వివరాలివి. మొదుగులగూడెంకు చెందిన మెరుగు పద్మ (60)కు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. చిన్న కుమారుడు వేణు ఆత్మహత్య చేసుకోగా.. పెద్ద కుమారుడు యాకయ్య ఎనిమిదేళ్ల క్రితం మహబూబాబాద్ జిల్లా విస్సంపల్లి వలస వెళ్లి ఉంటున్నాడు. అయితే తరచూ తల్లితో ఘర్షణ పడే యాకయ్య.. గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు రెండు రోజుల క్రితం భార్యతో మొదుగులగూడెం వచ్చాడు. ప్రస్తుతం నివసిస్తున్న ఇంటి జాగాలో గృహలక్ష్మి పథకం కింద ఇల్లు నిర్మించుకునేందుకు దరఖాస్తు చేసుకున్న పద్మ.. పక్కనే ఉన్న స్థలంలో ఇంటి కోసం దరఖాస్తు చేసుకోవాలని యాకయ్యకు సూచించింది. కానీ గౌడ సంఘం తరఫున బొజ్జాయిగూడెంలో మంజూరు చేసిన స్థలమే కావాలని యాకయ్య కోరాడు. ఆ స్థలం ఆడబిడ్డ ఉమారాణికి ఇస్తానని తల్లి చెప్పడంతో ఘర్షణకు దిగి వెళ్లిపోయాడు. మళ్లీ శుక్రవారం మధ్యాహ్నం కూడా భార్య కవితతో కలిసి మొదుగులగూడెం వచ్చిన యాకయ్య తల్లితో ఘర్షణ పడ్డాడు. ఈక్రమంలోనే ఇంట్లోని రోకలిబండతో తలపై బలంగా మోదగా పద్మకు తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందింది. గ్రామస్తుల ద్వారా సమాచారం తెలుసుకున్న సీఐ కరుణాకర్ చేరుకుని విచారణ చేపట్టారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

"ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మ...
ఏమేమి కాయొప్పునే గౌరమ్మ!
తంగేడు పువ్వులో... తంగేడు కాయలో...
ఆట చిలుకలు రెండు... పాట చిలుకలు రెండు..."

* * *

"చిత్తూ చిత్తుల బొమ్మ శివుని ముద్దులగుమ్మ
బంగారు బొమ్మ దొరికేనమ్మా ఈ వాడలోన..."



న్యూజెర్సీలో బతుకమ్మ వేడుక (ఫైల్ ఫొటో)

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో! అమెరికా బతుకమ్మ ఉయ్యాలో!!



దీప్తి మామిడి

''ఇలా ఒకటా... రెండా... లెక్కలేనన్ని బతుకమ్మ పాటలు మా నాలుకల మీద నాట్యమాడుతుంటాయి. గ్రామాల్లో గడిచిన బాల్యం జీవితాన్ని నేర్పుతుంది. తెలంగాణ గ్రామాల్లో బాల్యం బతుకమ్మ పాటల రూపంలో సమాజంలో జీవించడాన్ని నేర్పుతుంది. నిరక్షరాస్యులు కూడా ఈ పాటలను లయబద్ధంగా పాడతారు. బతుకమ్మ పాటల సాహిత్యం వాళ్ల నాలుకల మీద ఒదిగిపోయింది. తమకు తెలిసిన చిన్న చిన్న పదాలతో జీవితాన్ని అల్లేశారు గ్రామీణ మహిళలు. మా నాన్న ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో ఇంజనీర్. మా అమ్మమ్మ గారి ఊరు జగిత్యాల జిల్లా, వెలుగుమట్ల. నా చదువు పుట్టపర్తిలో, సెలవులు అమ్మమ్మ ఊరిలో. దసరా సెలవులు వస్తున్నాయంటే సంతోషం అంతా ఇంతా కాదు. దేశమంతా దేవీ నవరాత్రులు జరుపుకుంటూ ఉంటే మేము బతుకమ్మ వేడుకలు చేసుకుంటాం. గౌరమ్మ అందరి మనసుల్లో కొలువుంటుంది, మాట, పాట, ఆట అన్నీ గౌరమ్మ కోసమే అన్నట్లు ఉంటుందీ వేడుక. ఇంత గొప్ప వేడుకకు దూరమయ్యానని అమెరికా వెళ్లిన తర్వాత కానీ తెలియలేదు. అందుకే అమెరికాలో బతుకమ్మను పేర్చాను'' అన్నారు దీప్తి మామిడి... కాదు, కాదు, బతుకమ్మ దీప్తి.

''నేను 2007లో యూఎస్‌కి వెళ్లాను. న్యూజెర్సీలో ఉండేవాళ్లం. పెళ్లయి, ఒక బిడ్డకు తల్లిని. భర్త, పాప, ప్రొఫెషన్‌తో రోజులు బిజీగా గడిచి పోయేవి. డబ్బు కూడా బాగా కనిపించేది. కొద్ది నెలల్లోనే... ఏదో మిస్సవుతున్నామనే బెంగ మొదలైంది. వ్యాక్యూమ్ ఏమిటనేది స్పష్టంగా తెలియలేదు, కానీ బాల్యం, సెలవుల్లో బతుకమ్మ వేడుక మరీ మరీ గుర్తుకు వస్తుండేది. బతుకమ్మ కోసం ఇండియాకి రావడం కుదరకపోతే నేనున్న చోటే బతుకమ్మ వేడుక చేసుకోవచ్చు కదా! అనిపించింది. అలా అక్కడున్న తెలుగువాళ్లను ఆహ్వానించి బతుకమ్మ వేడుక చేశాను. మొదటి ఏడాది పదిహేను మందికి లోపే... పదేళ్లు దాటేసరికి ఆ నంబరు ఐదారు వందలకు చేరింది. అందరికీ భోజనాలు మా ఇంట్లోనే. ఏటా ఒక పెళ్లి చేసినట్లు ఉండేది. ఇండియా నుంచి తెలంగాణ పిండివంటలను తెప్పించుకోవడం, ఆ రోజు వండుకోవాల్సినవన్నీ మా ఇంట్లోనే వండడం, ఆ వంటల కోసం దినుసులను సేకరించడం, స్నేహితులందరినీ ఆహ్వానించడం, పూలు తెచ్చుకుని ఒక్కొక్కటీ పేర్చడం... ఇలా ప్రతి ఘట్టాన్నీ ఎంజాయ్ చేసేదాన్ని. 'ఏటా అంతంత ఖర్చు ఎందుకు' అని స్నేహితులు అనేవాళ్లే కానీ మా వారు ఒక్కసారి కూడా అడగలేదు. నా సంతోషం కోసం చేసుకుంటున్న ఖర్చు అని అర్థం చేసుకునేవారు.

ఎప్పుడూ అన్నం ఉంటుంది!

యూఎస్‌లో మా ఇంట్లో డైనింగ్ టేబుల్ మీద ఎప్పుడూ అన్నం, కూరలుండేవి. మా కన్సల్టెన్సీకి వచ్చిన వాళ్లు, ముఖ్యంగా బ్యాచిలర్స్ కోసం ఈ ఏర్పాటు. మేము యూఎస్‌లో అడుగుపెట్టిన కొన్నాళ్లకే రెసిషన్ వచ్చింది. అప్పుడు పడిన ఇబ్బందులు నాకిప్పటికీ గుర్తే. అందుకే యూఎస్‌కి వచ్చిన కుర్రాళ్లు మన తెలుగింటి రుచులతో భోజనం చేస్తారు కదా! అనుకునేదాన్ని. షడ్రసోపేతమైన భోజనం అని కాదు కానీ కనీసం పప్పుచారయినా ఉండేది. ఈ అలవాటుకు బీజం పడింది కూడా అమ్మమ్మ దగ్గరే. అమ్మమ్మ పెద్ద పాత్రలో అంబలి చేయించి ఇంటి ముందు పెట్టేది. చాలామంది పొలం పనులకు వెళ్తూ దారిలో మా ఇంటి ముందాగి అంబలి తాగి, ఆవకాయ ముక్క చప్పరించుకుంటూ వెళ్లేవాళ్లు. ఆకలి తీర్చడంలో, అవసరమైన వాళ్లకు సహాయం చేయడంలో ఉండే సంతృప్తి మరి దేనిలోనూ ఉండదు. మా డ్రైవర్ ఇతర పనివాళ్ల పిల్లల చదువు కోసం ఫీజులు కట్టినప్పుడు మరొకరి జీవితానికి మనవంతు సహాయం చేస్తున్నామనే భావన సంతృప్తినిస్తుంది. అవకాశం లేనప్పుడు ఎలాగూ చేయలేం, వెసులుబాటు ఉన్నప్పుడయినా చేసి తీరాలి. మన ఎదుగుదల కోసం సమాజం నుంచి మనం తీసుకుంటాం, మనం ఎదిగిన తరవాత మరొకరి ఎదుగుదల కోసం ఆపన్న హస్తాన్ని అందించి తీరాలనేది పుట్టపర్తి స్కూల్ నేర్పించిన వాల్యూ బేస్డ్ ఎడ్యుకేషన్. మా అమ్మ ఫ్రెండ్ లీలా ఆంటీ కూడా బతుకమ్మ పండుగను బాగా చేసేవారు. ఆమె ఎన్విరాన్‌మెంట్ యాక్టివిస్ట్. గునుగుపూలు వాటర్‌బాడీస్‌ని శుద్ధి చేస్తాయని చెప్తూ ఈ పండుగ వెనుక ఉన్న పర్యావరణ పరిరక్షణను వివరించేవారు. ఇవన్నీ మైండ్‌లో ఒక్కటొక్కటిగా అల్లుకుంటూ ఇలా దండ కూర్చుకున్నాయి.

బతుకమ్మ దీప్తినయ్యాను!

యూఎస్ జీవితం నాకు చాలా నేర్పించిందనే చెప్పాలి. అక్కడ అన్నీ ఉంటాయి కానీ ఏదో లేదనే వెలితి. రొటీన్ లైఫ్‌ని జాయ్‌ఫుల్‌గా మలుచుకోవడానికి నాకు బతుకమ్మ ఒక దారి చూపించింది. అప్పట్లో యూఎస్ ఇంతగా ఇండియనైజ్ కాలేదు. ఇప్పుడైతే న్యూజెర్సీ, డాలస్‌తోపాటు కొన్ని నగరాలు పూర్తిగా భారతీయలవే అన్నట్లు, తెలుగువాళ్ల ఊళ్లే అన్నట్లయిపోయాయి. మన పండుగలు ఇప్పుడు అందరూ చేసుకుంటున్నారు. నేను మొదలుపెట్టడంతో నేను బతుకమ్మ దీప్తినయ్యాను. 'దీప్తి మామిడి'గా అమెరికాలో అడుగుపెట్టాను. మూడేళ్ల కిందట తిరిగి వచ్చేటప్పటికి నా పేరు 'బతుకమ్మ దీప్తి'గా మారింది. బతుకమ్మ పాటకు మ్యూజిక్ మొదలైతే చాలు... ఒళ్లు పులకించిపోతుంది. పూనకం వచ్చినట్లే ఉంటుంది. మీతో మాట్లాడుతున్నా సరే... బతుకమ్మ ఫీల్ వచ్చేస్తుంది. చూడండి గూజ్‌బంప్స్ వచ్చేశాయి'' అని చేతులను చూపించారు బతుకమ్మ దీప్తి.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

న్యూస్‌మేకర్ - లక్ష్మి

గిరిజన సరస్వతి

జె.ఇ.ఇ. ఎంట్రన్స్‌లో ర్యాంకు కొట్టడం సామాన్యం కాదు. అందుకై కొందరు రాజస్తాన్ వెళ్తారు. కొందరు హైదరాబాద్, విజయవాడ చేరుకుంటారు. తల్లిదండ్రులు గైడ్ చేస్తారు. కాని నిరక్షరాస్యులైన తల్లిదండ్రులకు పుట్టిన కోయ విద్యార్థిని కొర్సా లక్ష్మి గురుకుల పాఠశాలలో చదువుకునే మంచి ర్యాంకు సాధించింది. పాట్నా ఐఐటీలో సీటు సాధించింది. కోయలలో ఒక అమ్మాయి సాధించిన స్ఫూర్తినిచ్చే విజయం ఇది. కొర్సా లక్ష్మి పరిచయం.

కొంతమంది ఇళ్లల్లో, నిజానికి చాలామంది ఇళ్లల్లో పిల్లలు జె.ఇ.ఇ. ఎంట్రన్స్ రాయడానికి తల్లిదండ్రులు చాలా శ్రద్ధ పెడతారు. బాగా చదివించే కోచింగ్ సెంటర్ కోసం అవసరమైతే రాజస్థాన్‌లోని కోటాకు వెళతారు లేదా హైదరాబాద్, విజయవాడలలో ప్రఖ్యాత కోచింగ్ సెంటర్‌లలో వేస్తారు. ఇక పిల్లలు ఇంట్లో ఉండి చదువుకుంటుంటే టీవీలు బంద్ చేస్తారు. మాటా పలుకూ లేకుండా పిల్లలు ఇరవై నాలుగ్గంటలూ చదువుకునేలా చేస్తారు. మెటీరియల్ తెచ్చిస్తారు. చాలా హైరానా పడతారు. అదేం తప్పు కాదు. కాని ఇలాంటివన్నీ లేకుండా కూడా కొంతమంది విజయం సాధిస్తుంటారు. కొత్తగూడెంలోని గిరిజన గురుకుల పాఠశాలలో చదువుకున్న కోయ విద్యార్థిని కుర్సా లక్ష్మి అలాంటి విజేతే. పట్టుదలతో చదువుకుని ర్యాంకు సాధించిన విజేత.



తండ్రి కన్నయ్య, తల్లి శాంతమ్మలతో లక్ష్మి

ఇసులమ్మే తండ్రి కూతురు

కొత్తగూడెం నుంచి దాదాపు 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న గిరిజన తండా కాటాయగూడెం. 300 గడపలున్న గ్రామం ఇది. అందరూ కోయలే. వ్యవసాయ కూలీలే. ఏ కొద్ది మందికో కాసింత భూమి ఉంటుంది. కొర్సా లక్ష్మి తండ్రి కన్నయ్యకు ఎకరం భూమి ఉంది. కాని వాన పడితేనే పండుతుంది. కన్నయ్య వ్యవసాయ కూలీగా వెళతాడు. తల్లి శాంతమ్మ కూడా. వ్యవసాయ పనులు లేనప్పుడు తన టీవీఎస్ ఎక్సెల్ మీద ఐస్ బాక్స్ పెట్టుకుని ఐసులమ్ముతాడు. ముగ్గురు పిల్లలు. కాని పెద్ద కొడుకు చదువు ఇష్టం లేక 7వ తరగతిలో ఇంట్లో నుంచి పారిపోయాడు. రెండో కొడుకు మామూలు చదువే. చివరి అమ్మాయి లక్ష్మి బాగా చదువుకోవాలని నిశ్చయించుకుంది.

పిన్ని స్ఫూర్తి

కన్న తల్లిదండ్రులు చదువు లేని వారు కావడాన లక్ష్మికి చదువులో ఏ సాయమూ చేయలేకపోయేవారు. ఆరవ తరగతి నుంచి కొత్తగూడెం గిరిజన గురుకుల పాఠశాలలో చదువుతున్న లక్ష్మికి పిన్ని సుమలత స్ఫూర్తిగా నిలిచింది. డిగ్రీ చదువుకున్న సుమలత హాస్టల్‌లో ఉన్న లక్ష్మిని తరచూ కలుస్తూ చదువు విలువ చెబుతూ వచ్చింది. డబ్బుకు విలువ ఇవ్వని వారు కూడా చదువుకు విలువ ఇస్తారని తెలిపింది. సెలవుల్లో ఇంటికి తీసుకువచ్చి లక్ష్మి మంచి చెడ్డలు చూసేది. ఆమె మాటలు లక్ష్మి మనసులో నాటుకుపోయాయి. 'ఏ రోజూ కూడా రాత్రి ఒంటి గంట లోపు లక్ష్మి పుస్తకం మూయగా చూడలేదు' అని లక్ష్మి బాబాయ్ రవి తెలిపాడు.

గురుకుల పాఠశాలలో

కొత్తగూడెంలోని గిరిజన గురుకుల పాఠశాలలో దాదాపు వేయి మంది అమ్మాయిలు 6 నుంచి ఇంటర్ వరకూ చదువుతున్నారు. ప్రిన్సిపాల్ దేవదాసు, ఉపాధ్యాయులు వీరి చదువు మీద బాగా శ్రద్ధ పెడుతున్నారు. చురుకైన విద్యార్థినులను ఎంపిక చేసి జె.ఇ.ఇలో శిక్షణ ఇస్తున్నారు. ఇంటర్‌లో ఎం.పి.సి తీసుకున్న లక్ష్మి 992 మార్కులు సాధించింది. దాంతో ఇంకా ఉత్సాహంతో జె.ఇ.ఇకి ప్రిపేర్ అయ్యింది. జె.ఇ.ఇ అడ్వాన్స్‌డ్‌లో 1371వ ర్యాంకు సాధించింది. పాట్నా ఐ.ఐ.టిలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్‌లో మొన్నటి ఆగస్టు మొదటివారంలో సీటు పొందింది. గురుకుల పాఠశాల నుంచి ఈ ఘనత సాధించిన అమ్మాయి లక్ష్మే.

ఐ.ఏ.ఎస్ చేయాలని...

బాగా చదువుకుని ఐ.ఏ.ఎస్ చేయాలనేది తన లక్ష్యమని కొర్సా లక్ష్మి చెప్పింది. జె.ఇ.ఇలో మంచి ర్యాంకు సాధించి ఐ.ఐ.టిలో సీటు పొందడంతో ఐ.టి.డి.ఏ అధికారులు లక్ష్మిని ప్రశంసించారు. ట్యాబ్ ఇచ్చి ఆర్థిక సహాయం చేశారు. లక్ష్మి ఇంత బాగా చదవడంతో ఇంకా కొంతమంది ఆమె చదువును ప్రోత్సహించడానికి ముందుకొచ్చారు. ఆ ప్రోత్సాహం వల్ల లక్ష్మి ఐ.ఏ.ఎస్ చదివి పేద వర్గాల కోసం పని చేయాలని నిశ్చయించుకుంది.



నేడు వరల్డ్ ఫొటోగ్రఫీ డే

వారియర్ కెమెరా

● కర్తవ్యాన్ని గుర్తు చేసే కెమెరా కన్ను



ఆరతి కుమార్ రావు

ఆరతి కెమెరాతో మాట్లాడి చూడండి... చేపల సవ్వడి లేని నదుల దీనత్వాన్ని గురించి చెబుతుంది. చేవ లేని జీవజాలాన్ని గురించి చెబుతుంది. పచ్చదనాన్ని కోల్పోయి నేలకూలనున్న నిర్జీవ వృక్షాల మృత్యుఘోష చెబుతుంది. నదుల నీటిలోని విషాన్ని గురించి వివరంగా చెబుతుంది. స్థూలంగా చెప్పాలంటే...కనిపించే అందాల వెనుక కనిపించని నిశ్శబ్ద విధ్వంసాన్ని గురించి కళ్లకు కడుతూ చెబుతుంది.

బెంగళూరుకు చెందిన ఎన్విరాన్‌మెంటల్ ఫొటోగ్రాఫర్ ఆరతి కుమార్ రావు తన కెమెరాతో పర్యావరణ సంరక్షణం గురించి క్షణం క్షణం గుర్తు చేస్తోంది...

ప్రతి కెమెరాకు ఒక దృష్టి ఉంటుంది. మరి ఆరతి కెమెరా చూసేది ఏమిటి?

అట్టడుగున పడి కన్పించని కథలు, నిజజీవిత కథలు, పట్టించుకోవాల్సిన అవసరం ఉన్నా ఎవరూ పట్టించుకోని కథలు, సంప్రదాయ జీవనశైలులు, వాటిలో వస్తున్న అనూహ్య మార్పులు, పదాలకు దొరకని దృశ్యాలు...ఇలా ఎన్నో ఎన్నెన్నో.

చిన్నప్పటి నుంచి 'నేషనల్ జియోగ్రఫీ' పత్రికలను చూస్తూ పెరిగింది ఆరతి. ఆ ఎల్లో బార్డర్ విండోస్ నుంచి విశాలమైన ప్రపంచాన్ని చూసింది. ఆ పత్రికలోని ఫొటోగ్రాఫ్స్ తనపై ఎంతో ప్రభావం చూపాయి. పదాలతోనే కాదు చిత్రాలతో కూడా గొప్ప సత్యాలు చెప్పవచ్చుననే విషయం అర్థమైంది.


చిన్నప్పటి నుంచి ఫిజిక్స్ అంటే ఇష్టం ఉన్న ఆరతి బయోఫిజిక్స్‌లో మాస్టర్స్ చేసింది.

ఆ తరువాత 'లైఫ్‌టైమ్ టు–డూ' రూపంలో భవిష్యత్ కార్యాచరణను సిద్ధం చేసుకుంది. దానిలో నదులతో పరిచయం ఒకటి. నదులను, వాటి చుట్టూ ఉండే జీవితాన్ని ఫొటోల రూపంలో డాక్యుమెంట్ చేయాలనుకుంది.

కాళ్లకు బలపాలు, కళ్లకు కెమెరాలు కట్టుకొని ఊరూరు తిరిగినా తల్లిదండ్రులు ఎప్పుడూ అభ్యంతర పెట్టలేదు. పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. వివిధ ప్రాంతాలలో తన ఫొటోగ్రఫీకి సంబంధించిన విషయాలను కుటుంబసభ్యులతో పంచుకునేది ఆరతి.

ఫొటోల ద్వారా ఎన్విరాన్‌మెంటల్ స్టోరీ టెల్లింగ్‌లో నేర్పు సంపాదించిన ఆరతి తన ప్రయాణంలో ఎన్నో అనుభవాలను సొంతం చేసుకుంది. పర్యావరణం గురించి మాట్లాడే వారిని అభివృద్ధి వ్యతిరేకులుగా భావించే వారిని కూడా చూసింది.

'రివర్ డైరీస్' అనేది ఆమె ప్రస్థానంలో ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్ట్‌గా పేరు తెచ్చుకుంది. నదుల అందాలతో పాటు వాటికి ఎదురవుతున్న ఆపదలకు 'రివర్ డైరీస్' అద్దం పడతాయి.







చిత్రాలు: ప్రకృతి, ప్రకృతితో ముడిపడిన మనిషి జీవితం

'హింస, వివాదాలు మాత్రమే హెడ్‌లైన్‌గా కనిపిస్తాయి. అయితే పర్యావరణ విధ్వంసం అనే భయానకమైన కనిపించని హింస చాపకింద నీరులా కొనసాగుతుంది' అంటుంది ఆరతి. ఆ కనిపించని హింసమూలాలను నలుగురికి తెలియజేసేలా చేయడంలో తన కెమెరాను బలమైన మాధ్యమంగా ఉపయోగించుకుంటోంది.

ఆరతి ఫొటోగ్రాఫర్ మాత్రమే కాదు రచయిత్రి కూడా. ఆమె పుస్తకాలలో 'మార్జిన్‌ల్యాండ్స్: ఇండియన్ ల్యాండ్‌స్కేప్స్ ఆన్ ది బ్రింక్' ఒకటి. ఇందులో లడఖ్ నుంచి సుందరబన్ వరకు ప్రకృతికి సంబంధించిన ఎన్నో సుందరచిత్రాలను కళ్లకు కడుతుంది. గంగ–బ్రహ్మపుత్ర–మేఘన పరీవాహక ప్రాంతాలకు తీసుకువెళుతుంది. భౌగోళిక అందాలతో పాటు ఎదురవుతున్న ప్రమాదాలను, అక్కడి ప్రజలు మాట్లాడుకునే పదాలను పరిచయం చేస్తుంది.

'నిర్మాణాలు, ఇతరత్రా విధ్వంసక కార్యకలాపాల వల్ల ప్రమాదం అంచున ఉన్న ప్రకృతిని కాపాడు కోవడం అనేది మన చేతిలోనే ఉంది' అని ఈ పుస్తకం ద్వారా చెబుతుంది ఆరతి.

'పర్యావరణంలో వచ్చే మార్పులు, అవి మన జీవితాల్లో తెచ్చే మార్పులను నా కెమెరా ద్వారా ఇక ముందు కూడా కథలుగా చెప్పాలనుకుంటున్నాను' అంటోంది ఆరతి.

ఒకానొక సందర్భంలో తన నిరసన గళాన్ని ఇలా వినిపించింది ఆరతి,...,

'కరువుకాటకాలు, వరదలలాంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు మాత్రమే పర్యావరణ విధ్వంసం, పరిరక్షణ గురించి మాట్లాడుకుంటారు. ఆ తరువాత ఎవరి పనుల్లో వారు మునిగిపోతారు'

అయితే ఆరతిలాంటి ఎన్విరాన్‌మెంటల్ ఫొటోగ్రాఫర్‌లు తమ చిత్రాల ద్వారా పర్యావరణ పరిరక్షణకు సంబంధించి మన కర్తవ్యాన్ని ఎప్పటికప్పుడు గుర్తు చేస్తూనే ఉన్నారు.

కవితకేదీ కాదు అనర్హం అన్న చందాన మెటల్, ప్లాస్టిక్, పాత గాడ్జెట్స్ ఏదైనా ఆయన చేతిలో పెట్టారంటే అందమైన శిల్పంగా మారాల్సిందే. అరవైఏళ్ల వయసులో చిన్నప్పటి హాబీని కెరీర్‌గా మలుచుకున్నాడు విశ్వనాథ్ మల్లాబ్బి దావంగిరె. ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఇకో ఆర్ట్‌గా మార్చి అబ్బురపరుస్తున్నాడు ఈ పెద్దాయన.

ఈ-వేస్ట్ శిల్పి



విశ్వనాథ్

బెంగళూరుకు చెందిన విశ్వనాథ్ తండ్రి డీఎమ్ శంభు ప్రముఖ శిల్పి ఇంకా పెయింటర్ కూడా. విశ్వనాథ్ మెడిసిన్ చదివి మంచి డాక్టర్ కావాలని శంభు కలలు కనేవారు. చిన్నప్పటి నుంచి సెకండ్ హ్యాండ్ వస్తువులను సరికొత్తగా మార్చడమంటే విశ్వనాథ్‌కు ఆసక్తి ఎక్కువ. ఫైన్ ఆర్ట్స్‌లో బ్యాచిలర్ డిగ్రీ చేయాలని నిర్ణయించుకున్నాడు.

చదువు పూర్తైన తరువాత తరువాత మీడియాలోకంప్యూటర్ వీడియో గ్రాఫిక్ ఆర్టిస్ట్‌గా చేరాడు. అలా కెరీర్ ప్రారంభించిన విశ్వనాథ్ ఒక్కోమెట్టు ఎదుగుతూ విప్రోలో చేరాడు. ఇక్కడ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తూనే ఖాళీ సమయం, వారాంతాలలో ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఇకోఆర్ట్‌గా ఎలా మార్చాలని పరిశోధిస్తుండేవాడు. రకరకాల ప్రయోగాల తరువాత.. గాడ్జెట్స్ వ్యర్థాలను ఉపయోగించి చిన్నచిన్న జంతువులు తయారు చేశాడు. అవి ముద్దుగా ఎంతో ఆకర్షణీయంగా ఉండడంతో తన ఇకో ఆర్ట్‌ను పెంచుకుంటూ పోయాడు.



ఫ్యాషన్ జ్యూవెలరీ నుంచి అందమైన శిల్పాలు, రోబోలదాకా అన్ని ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో తయారు చేస్తున్నాడు.

ఏరికోరి ఎంచుకుని...

ఎలక్ట్రానిక్ వ్యర్థాలు పర్యావరణానికి ప్రాణాంతకంగా మారాయని తెలుసుకుని ఇకో ఆర్ట్‌ను మరింత సీరియస్‌గా తీసుకున్నాడు విశ్వనాథ్. ఈ క్రమంలోనే ఈ వ్యర్థాలను కొనుక్కునేవాడు. అన్నింటిని గంపగుత్తగా కొనకుండా కంప్యూటర్ విడిభాగాలు, ల్యాప్‌టాప్స్, డేటా కార్డులు, డీవీడీ, వీసీఆర్, ఫ్లాపీ డ్రైవ్స్, సెట్–టాప్‌బాక్స్‌లు, ల్యాండ్‌లైన్, కార్డ్‌లెస్ ఫోన్‌లు, గ్లూకో మీటర్లను ఏరికోరి ఎంచుకుని తీసుకునేవాడు. వీటిలో కూడా రాగి, బంగారం, రంగు రంగుల వైర్లు, కీబోర్డులను ప్రత్యేకంగా సేకరించి రకరకాల బొమ్మల రూపకల్పనకు ఉపయోగిస్తున్నాడు. ఆరు అడుగుల అమ్మాయి రూపంతో విగ్రహం, ప్రముఖ వ్యాపారవేత్త అజీం ప్రేమ్‌జీ ఫోటో, ఇకో జ్యూవెలరీ, కీబోర్డు కామధేనువు వంటి బొమ్మలు ఐదు వందలకు పైగానే తయారు చేశాడు.

హాబీని కెరీర్‌గా...

విశ్వనాథ్ తయారు చేసిన బొమ్మలు ఆకర్షణీయంగా అందంగా ఆకట్టుకుంటుండడంతో విక్రయించడం మొదలు పెట్టాడు. రెండేళ్ల క్రితం రిటైర్ అయిన విశ్వనాథ్.. తొలినాళ్లల్లో హాబీగా ఉన్న ఇకోఆర్ట్‌ను పూర్తి సమయం కేటాయిస్తూ ఇకోఆర్ట్ వస్తువులు విక్రయిస్తూ సరికొత్త కెరీర్‌ను సృష్టించుకున్నాడు. ఇకోఆర్ట్ వస్తువులు కొనే కస్టమర్లు ఢిల్లీలోనేగాక, యూరప్, నెదర్లాండ్స్, అమెరికా వంటి దేశాల్లో ఇకో ఆర్ట్ కోసం కస్టమర్లు ఎగబడుతున్నారు. దేశంలోనేగాక విదేశాల్లో తన ఇకో ఆర్ట్‌ను ప్రదర్శిస్తూ మంచి ఆదరణ పొందుతున్నాడు.





వందల కేజీలపైనే...

కీబోర్డు కీల నుంచి గోడగడియారంలో భాగాల వరకు అన్నీ సేకరించి ఇకో ఆర్ట్ రూపొందిస్తోన్న విశ్వనాథ్ ఇప్పటిదాకా రెండువందల కేజీల ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఇకో ఆర్ట్స్‌గా మార్చాడు. అయితే ఈ ఇకో ఆర్ట్ అంత సులభం కాదని విశ్వనాథ్ చెబుతున్నాడు. ''ఈ – వ్యర్థాల నుంచి ఆర్ట్ కావాల్సిన భాగాలను సేకరించి వాటికి ఆకారం, రంగు వేసి తుదిమెరుగులు దిద్దడానికి చాలా సమయం పడుతుంది. జ్యూవెలరీ తయారు చేయడానికి రెండు మూడు నిమిషాలు పడితే, శిల్పాలు తయారు చేయడానికి వారాలు, నెలలు పడుతుంది. అయినప్పటికీ ప్రస్తుతం రీసైక్లింగ్ చేసిన ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉంది. ఇటు కస్టమర్ల మనసు దోచుకోవడంతోపాటూ, పర్యావరణానికి హానీ కలగకుండా ఈ ఇకోఆర్ట్ ఎంతో సంతృప్తినిస్తుంది. ముందు ముందు మరిన్ని కళారూపాలు తీసుకురానున్నాను''అని విశ్వనాథ్ చెబుతున్నాడు.

కళ్లల్లో ఎర్రటి మచ్చలు కనిపిస్తున్నాయా?



హై బీపీ లేదా హైపర్ టెన్షన్... ఎక్కువ మందిని ఇబ్బంది పెడుతున్న ముఖ్య ఆరోగ్య సమస్య. ఒకరకంగా చెప్పాలంటే ఇది సైలెంట్ కిల్లర్ కూడా. ఎందుకంటే బీపీ అదుపులో లేకపోతే నేరుగా గుండెపైనే ప్రభావం పడుతుంది. గుండెపోటు, స్ట్రోక్, మూత్రపిండాల వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి బీపీని ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవడం, హెచ్చు తగ్గులుంటే తగిన మందులు వాడటం అవసరం. ఎందుకంటే ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా, ఇది చాప కింది నీరులా అంతర్గత అవయవాలపై తీవ్ర దుష్ప్రభావాన్ని కలిగిస్తుంది. రక్తపోటు ఉన్న వారు ఆహారం విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఉప్పు తగ్గించడం వాటిలో ముఖ్యమైనది.

అధిక రక్తపోటును గుర్తించడానికి ఉత్తమ మార్గం క్రమం తప్పకుండా బీపీ చెక్ చేయించుకోవడం. రక్తపోటు ఎక్కువగా ఉంటే కొన్ని లక్షణాలు బయటపడతాయి. కళ్ళల్లో కూడా కొన్ని లక్షణాలు కనిపిస్తాయి.

ఎలాంటి లక్షణాలు?

రక్తపోటు అధికమైతే మీ కళ్ళల్లో ఎర్రటి మచ్చలు కనిపిస్తాయి. ఇది రక్తనాళాల విచ్ఛిన్నం వల్ల జరుగుతుంది. కళ్ళు ఎర్రగా కనిపిస్తే బీపీ చెక్ చేసుకోవడం చాలా అవసరం. అధిక రక్తపోటు వల్ల దృష్టి సమస్యలు కూడా వస్తాయి. అందువల్ల కళ్లు ఎర్రగా కనిపిస్తుంటే ఓసారి బీపీ చెక్ చేయించుకోవాలని గుర్తుంచుకోండి.

కళ్ళల్లో కనిపించే ఈ సంకేతాలు కాకుండా బీపీ అధికమైనప్పుడు మరికొన్ని లక్షణాలు కనిపిస్తాయి. అవి ఏమిటంటే...
- ఛాతీలో నొప్పి పెట్టడం
- శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఏర్పడడం
- మూత్రంలో రక్తం కనిపించడం
- ఛాతీ, మెడ, చెవుల్లో ఇబ్బందిగా అనిపించడం
- తలనొప్పి తీవ్రంగా రావడం
- చిన్న చిన్న పనులు చేసినా తీవ్రమైన అలసట.

పిల్లలకు మీ సమయాన్ని ఇస్తున్నారా?



పిల్లలకు తల్లిదండ్రులు ఇవ్వగల అత్యంత విలువైన కానుక ఏదైనా ఉందంటే అది కేవలం సమయం మాత్రమే. సమయం ఎందుకు విలువైనది అని అంటే, గడిచిన క్షణం అయినా తిరిగి రాదు. అందువల్ల వారితో విలువైన, నాణ్యమైన సమయాన్ని గడిపి, వారికి మంచి జ్ఞాపకాలను మిగల్చండి. వారితో గడిపేందుకు ఏమేం చేయవచ్చో చూద్దాం...

పిల్లలతో కలిసి చదవడం, పనిపాటలు చేయడం నుంచి ఆటలు ఆడటం వరకు.. వారితో మీ బంధం బలపడడానికి, అనుబంధాలు అల్లుకోవడానికి తోడ్పడతాయి.

పుస్తక పఠనం
పిల్లలతో బంధాన్ని పెంచుకోవడానికి, వారి భాషానైపుణ్యాలను పెంపొందించడానికి పుస్తకపఠనం గొప్ప మార్గం. వయస్సుకి తగినవి, మీ పిల్లలు ఆనందిస్తారని మీరు భావించే పుస్తకాలను ఎంచుకుని వాటిని పిల్లలతో కలిసి బిగ్గరగా చదవవచ్చు లేదా వాళ్లే చదివి మీకు వినిపించేలా చేయవచ్చు. ఒకవేళ పుస్తకాలు లేకపోతే తెలుగు లేదా ఇంగ్లీష్ వార్తాపత్రికలు చదవడంతో దినచర్య ప్రారంభించడం మంచిది.

కలిసి ఆటలు ఆడటం
మీ పిల్లల సామాజిక నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి ఆటలు ఆడటం ఒక ఆహ్లాదకరమైన మార్గం. బోర్డ్ గేమ్‌లు, కార్డ్‌గేమ్‌లు, అవుట్‌డోర్ గేమ్‌లు వంటి అనేకరకాల ఇండోర్ లేదా ఓట్‌డోర్ గేమ్స్ పిల్లలతో ఆడచ్చు. చెస్, స్నేక్స్ అండ్ లేడర్స్ (పాముపటం), అష్టాచెమ్మా, పచ్చీస్ వంటివి పిల్లలతో కలిసి ఆడటం వల్ల వారిలో క్రీడానైపుణ్యాలు పెంపొందుతాయి.

విహారయాత్రలకు వెళ్లడం
పిల్లలు కొత్త విషయాలను అనుభూతించడానికి, వారి చుట్టూ ఉన్న ప్రపంచాన్ని తెలుసుకోవడానికి ఔటింగ్‌లకు వెళ్లడం గొప్పమార్గం. పార్క్, జూపార్క్, మ్యూజియం లేదా ఇంకేదైనా చూపించడానికి వారిని అప్పుడప్పుడు బయటకు తీసుకెళ్లడం ద్వారా వారితో ఎక్కువ సమయం గడపవచ్చు.



కళానైపుణ్యాన్ని పెంపొందించడం
కళలు పిల్లలు తమను తాము నిరూపించుకోవడానికి, తమ నైపుణ్యాన్ని మెరుగుపరచుకోవడానికి కళలు ఒక ఆహ్లాదకరమైన చక్కటి మార్గం. మీరు మీ పిల్లలకు క్రేయాన్‌లు, మార్కర్‌లు, పెయింట్, క్లే వంటి ఆర్ట్ సామాగ్రిని సమకూర్చి, వాటితో వారు ఏమేం చేయాలనుకుంటున్నారో చెప్పించి, వాటిని తయారు చేసేందుకు వారితో కలిసి పనిచేయండి. వారికి కావలసిన వాటిని వారే తయారు చేసుకునేలా వారిని ప్రోత్సహించండి.

కలిసి వంట చేయడం
ఉదయం పూట చేసే బ్రేక్‌ఫాస్ట్ నుంచి, మధ్యాన్నం వారు తినే లంచ్ వరకు వారికి ఇష్టమైన వాటిని లేదా మీ ఇంట్లో ఉన్న వాటితో టిఫిన్లు, స్నాక్స్, లంచ్ ప్రిపేర్ చేయడంలో వారి సాయం తీసుకోవడం మంచి పద్ధతి. అంటే తప్పనిసరిగా వారు మీకు హెల్ప్ చేయాలని కాదు... ఆసక్తి ఉంటే వారే సాయం చేయడానికి వచ్చేలా చేసుకోగలిగితే చాలు. ఇది రోజూ కుదరకపోవచ్చు కానీ కనీసం వారికి సెలవురోజుల్లో అయినా సరే, కలిసి వంట చేసుకునే అలవాటు చేయడం మంచిది.



గార్డెనింగ్
పిల్లలు ప్రకృతి, బాధ్యత గురించి తెలుసుకోవడానికి గార్డెనింగ్‌ని మించిన మంచి మార్గం మరోటి లేదని చెప్పొచ్చు. పిల్లలతో కలిసి మీ పెరట్లో కొన్నిమొక్కలు నాటవచ్చు. లేదా మీ డాబాపై కొన్ని కుండీలు ఏర్పాటు చేసి వాటిలో కూడా నాటవచ్చు. వాటికి రోజూ నీళ్లు పోయడం, అవి ఎలా పెరుగుతున్నాయో వారితో కలిసి చూడడం గొప్ప అనుభూతినిస్తుంది.

వాకింగ్ లేదా సైక్లింగ్‌కు తీసుకెళ్లడం
పిల్లలు పది పన్నెండేళ్లలోపు వారైతే వారిని మీతో కలిసి రోజూ వాకింగ్‌కు లేదా సైక్లింగ్‌కు తీసుకెళ్లండి. వారు శారీరకంగా చురుగ్గా ఉండేందుకు, మానసికంగా మీకు దగ్గరయ్యేందుకు మార్నింగ్ వాక్ మంచి మార్గం. అలా చేయడం ద్వారా వారు రోజంతా ఉత్సాహంగా ఉంటారు.


స్వచ్ఛంద సేవలో...
పిల్లలు ఇతరులకు సహాయం చేయడం, ప్రపంచంలో మార్పు తీసుకు రావడం గురించి తెలుసుకోవడానికి వాలంటీరింగ్ ఒక గొప్ప మార్గం. మీరు స్థానికంగా ఉండే ఆశ్రమాల్లో లేదా ఇతర సంస్థలో స్వచ్ఛందంగా సేవ చేయవచ్చు.

మాట్లాడటం... మాట్లాడనివ్వటం
పిల్లలతో నాణ్యమైన సమయాన్ని గడపడానికి ఉత్తమమైన మార్గాలలో ఒకటి వారితో మాట్లాడటం, వారు చెప్పే కబుర్లు ఆసక్తిగా వినడం. వారి రోజువారి స్నేహితులు, వారి ఆసక్తులు, వారి కలల గురించి వారిని అడగండి. వారు చెప్పేది వినండి. అవసరం అయితే వారికి మీ మద్దతును, సహకారాన్ని అందించడం.

ఆహారం... ఆరోగ్యం

శనగపిండి చెరుపు చేస్తుందా?

చాలామందికి శనగపిండి ఆరోగ్యానికి మంచిది కాదనే అపోహ ఉంది. నిజానికి శనగపిండితో ఎన్నెన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. అవేమిటో చూద్దాం.



గోధుమలతో పోలిస్తే శనగపిండిలో క్యాలరీలు తక్కువ... ప్రోటీన్లు ఎక్కువ. అదేవిధంగా శనగపిండిలో ఫోలేట్, విటమిన్ బి6, ఐరన్, మెగ్నీషియమ్, పొటాషియమ్, ఫైబర్ కూడా సమృద్ధిగా లభిస్తుంది.


శనగపిండితో ఆరోగ్య ప్రయోజనాలు...

- శనగపిండిలో గ్లూటెన్ ఉండదు కాబట్టి చాలారకాల అలర్జీలను కలిగించదు.
- శనగల గ్లైసిమిక్ విలువ తక్కువ. కాబట్టి శనగ పిండి వల్ల అంత త్వరగా బరువు పెరగదు. స్థూలకాయం కూడా త్వరగా రాదు.
- శనగపిండిలో తక్కువ గ్లైసీమిక్ విలువ కారణంగా డయాబెటిస్ రోగులకు ఇదెంతో మంచిది. అందుకే డయాబెటిస్ ఉన్నవారు గోధుమల కంటే దీనితో చేసిన పరోటాలూ, రోటీలు తీసుకోవడం మేలు.
- శనగల్లో నీటిలో కరిగే పీచు ఉండటం వల్ల శనగపిండి వాడేవారి గుండె ఆరోగ్యం దీర్ఘకాలం పాటు బాగుంటుంది. శనగపిండి రక్తపోటును కూడా అదుపులో ఉంచుతుంది.
- రక్తహీనతను నివారిస్తుంది. డెర్మటైటిస్ హెర్పిటోఫార్మిస్, కొన్ని రకాల ఆటోఇమ్యూన్ వ్యాధులు, స్క్లిరోసిస్, ఆటిజమ్, ఏడీహెచ్‌డీ వంటివాటిని నివారిస్తుంది.
- శనగపిండిలో గ్రోత్ హార్మోన్స్ ఎక్కువ. అందుకే ఎదిగే పిల్లలకు దీనితో తయారు చేసిన పదార్థాలు పెట్టడం మంచిది. ఇందులోని ఫాస్ఫరస్ వల్ల ఎదిగే పిల్లల ఎముకలు బాగా గట్టి పడతాయి.
- ఇందులో ఫోలేట్ ఎక్కువగా ఉండటం వల్ల కాబోయే తల్లులు, ప్రెగ్నెన్సీ ప్లాన్ చేసుకున్న మహిళలూ దీన్ని వాడటం మేలు. ఇది ఎర్రరక్తకణాలనూ పెంపొందిస్తుంది.

ఈ జాగ్రత్త పాటించాలి మరి...
శనగపిండి కాస్త కడుపు ఉబ్బరం కలిగిస్తుంది అందుకే మల్టీగ్రెయిన్స్ ఆటాతో కలిపి తీసుకుంటే ఈ పొట్ట ఉబ్బరం వంటివి తగ్గుతాయి. శనగపిండిలో ఉండే ఈ ఒక్క ప్రతికూల అంశం కారణంగా దానితో కలిగే అనేక ప్రయోజనాలను వదులుకోవడం సరికాదు.

సినిమా రీల్స్

గందార బాయి...



● శ్రీలీల, రామ్

రామ్, శ్రీలీల జంటగా నటిస్తున్న చిత్రం 'స్కంద'. బోయపాటి శ్రీను దర్శకత్వంలో శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్న ఈ సినిమా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో సెప్టెంబర్ 15న రిలీజ్ కానుంది. ఎస్ఎస్ తమన్ స్వరపరచిన 'స్కంద'లోని 'గందార బాయి..' అంటూ సాగే రెండో పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. ఈ పాటకు అనంత శ్రీరామ్ సాహిత్యం అందించగా, నకాష్ అజీజ్, సౌజన్య భాగవతుల పాడారు. ''ఈ పాటలో రామ్ డ్యాన్స్‌లో డైనమిజమ్ చూపించగా, శ్రీలీల ఎనర్జీతో మ్యాచ్ చేసింది. ప్రేమ్ రక్షిత్ మాస్టర్ నృత్యరీతులు సమకూర్చారు'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సమర్పణ: జీ స్టూడియోస్ సౌత్, పవన్ కుమార్, కెమెరా: సంతోష్ డిటాకే.

కన్నప్పకి శ్రీకారం



● విష్ణు మంచు, నూపుర్, ముఖేష్ కుమార్

విష్ణు మంచు తన కలల ప్రాజెక్ట్ 'కన్నప్ప' చిత్రానికి శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీ కాళహస్తిలో ఈ సినిమాని ప్రారంభించారు. స్టార్ ప్లస్‌లో 'మహాభారత' సిరీస్‌కి దర్శకత్వం వహించిన ముఖేష్ కుమార్ సింగ్ 'కన్నప్ప'కి దర్శకత్వం వహిస్తారు. అవా ఎంటర్‌టైన్మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీపై నటుడు, నిర్మాత మంచు మోహన్‌బాబు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో నూపుర్ సనన్ కథానాయిక. విష్ణు మాట్లాడుతూ– ''భక్త కన్నప్ప, ఆయన భక్తి గొప్పతనాన్ని 'కన్నప్ప' ద్వారా ఈ తరానికి తెలియజేయాలన్నది మా సంకల్పం. భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో రూపొందించనున్న ఈ మూవీలో ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలోని టాప్ నటీనటులు నటిస్తారు. త్వరలో షూటింగ్ ఆరంభించి ఒక్క షెడ్యూల్‌లోనే పూర్తి చేస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ, స్టీఫెన్ దేవాసి.

స్వయం భూ ప్రారంభం



● నిఖిల్

నిఖిల్ హీరోగా నటిస్తున్న కొత్త చిత్రం 'స్వయం భూ'. ఈ చిత్రంలో సంయుక్తా మీనన్ హీరోయిన్. నిర్మాత 'ఠాగూర్ మధు' సమర్పణలో భువన్, శ్రీకర్ నిర్మిస్తున్న ఈ సినిమాకు భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా శుక్రవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. నిర్మాత 'దిల్' రాజు కెమెరా స్విచాన్ చేయగా, నిర్మాత అల్లు అరవింద్ క్లాప్ కొట్టారు. గీత రచయిత రామజోగయ్య శాస్త్రి తొలి షాట్‌కి దర్శకత్వం వహించగా, చదలవాడ శ్రీనివాసరావు స్క్రిప్ట్‌ని మేకర్స్‌కి అందజేశారు. అలాగే 'స్వయం భూ' సినిమాలోని నిఖిల్ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ''నిఖిల్‌ను ఫెరోషియస్ వారియర్‌గా చూపించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. 'స్వయం భూ' సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను ఈ రోజే (ఆగస్టు 18) స్టార్ట్ చేశాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: రవి బస్రూర్, కెమెరా: మనోజ్ పరమహంస, సహనిర్మాతలు: విజయ్ కామిశెట్టి, జీటీ ఆనంద్.


నవంబరులో ఆదికేశవ



● వైష్ణవ్ తేజ్, శ్రీలీల

వైష్ణవ్ తేజ్, శ్రీలీల జంటగా నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ ఫిల్మ్ 'ఆదికేశవ'. శ్రీకాంత్ ఎన్. రెడ్డి దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఇటీవల ఈ సినిమా చిత్రీకరణ ప్యారిస్‌లో జరిగిన విషయం తెలిసిందే. ఈ షూటింగ్ షెడ్యూల్‌తో 'ఆదికేశవ' సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. కాగా ఈ సినిమాను తొలుత ఈ నెల 18న విడుదల చేయాలనుకున్నారు. కానీ కుదర్లేదు. దీంతో 'ఆదికేశవ' చిత్రాన్ని నవంబరు 10న విడుదల చేస్తామని చిత్ర యూనిట్ శుక్రవారం వెల్లడించింది. జోజు జార్జ్, అపర్ణా దాస్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్‌కుమార్.

చాలా విలువైనది



● హృతిక్ శౌర్య

హృతిక్ శౌర్య, తన్వి నేగి జంటగా రవి దర్శకత్వం వహించిన చిత్రం 'ఓటు'. 'చాలా విలువైనది' అనేది ట్యాగ్ లైన్. ఫ్లిక్ నైన్ స్టూడియోస్‌పై ఫ్లిక్ ఫిలిమ్స్ నిర్మించిన ఈ సినిమాకి 'ఓటు' అనే టైటిల్ ఖరారు చేసి, ఫస్ట్ లుక్ విడుదల చేశారు మేకర్స్. ''ఓటు విలువ నేపథ్యంలో రూపొందిన చిత్రమిది. ఫస్ట్ లుక్ సినిమాపై ఆసక్తిని పెంచింది. త్వరలో మా చిత్రం విడుదలకు సన్నాహాలు చేస్తున్నాం'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: అగస్త్య, కెమెరా: ఎస్. రాజశేఖర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రామకృష్ణ.

ట్రైలర్ బాగుంది
- రామ్‌గోపాల్ వర్మ



● రవి, రామ్‌గోపాల్ వర్మ

''సగిలేటి కథ' సినిమా ట్రైలర్ నాకు చాలా ఎగ్జయిటింగ్‌గా అనిపించింది. 'ఏదో జరిగే..' పాటని అందంగా తీశారు. ఈ చిత్రం విజయం సాధించాలి'' అన్నారు డైరెక్టర్ రామ్‌గోపాల్ వర్మ. రవి మహాదాస్యం, విషికా లక్ష్మణ్ జంటగా రాజశేఖర్ సుద్మూన్ దర్శకత్వం వహించిన చిత్రం 'సగిలేటి కథ'. నటుడు నవదీప్ సి–స్పేస్ సమర్పణలో దేవీప్రసాద్ బలివాడ, అశోక్ మిట్టపల్లి నిర్మించారు. జశ్వంత్ పసుపులేటి సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'ఏదో జరిగే..' వీడియో సాంగ్‌ని రామ్‌గోపాల్ వర్మ రిలీజ్ చేశారు. ''నేను సినిమాల్లోకి రావడానికి స్ఫూర్తి వర్మగారే'' అన్నారు దేవీప్రసాద్ బలివాడ. ''రాయలసీమ నేపథ్యంలో సాగే చిత్రమిది'' అన్నారు రాజశేఖర్ సుద్మూన్. ''ఏదో జరిగే..' పాట అందరికీ నచ్చుతుంది'' అన్నారు అశోక్ మిట్టపల్లి. సి స్పేస్ కో ఫౌండర్ పవన్ మాట్లాడారు.

హారర్ సీడీ



● అదాశర్మ

'ది కేరళ స్టోరీ' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత అదా శర్మ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'సీడీ'. 'క్రిమినల్ ఆర్ డెవిల్' అనేది ఉపశీర్షిక. కృష్ణ అన్నం దర్శకత్వంలో ఎస్ఎస్ సీఎమ్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ సైకలాజికల్ అండ్ హారర్ థ్రిల్లర్ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ''ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇచ్చే చిత్రం ఇది. త్వరలోనే రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. విశ్వంత్, 'జబర్దస్త్' రోహిణి, భరణి శంకర్, రమణ భార్గవ్, మహేష్ విట్టా కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఆర్ఆర్ ధృవన్, కెమెరా: సతీష్ ముత్యాల.

జాతి రత్నాలులా అనిపిస్తోంది
- సంపత్ నంది



● వీజే సన్నీ, సంపత్ నంది

వీజే సన్నీ, ప్రితికా శ్రీనివాస్ జంటగా నటించిన చిత్రం 'సౌండ్ పార్టీ'. దర్శకుడు జయశంకర్ సమర్పణలో సంజయ్ శేరి దర్శకత్వంలో రవి పోలి శెట్టి, మహేంద్ర గజేంద్ర, శ్యామ్ గజేంద్ర నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబరులో విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా టీజర్ లాంచ్ వేడుకకు అతిథిగా హాజరై, టీజర్‌ను విడుదల చేసిన దర్శక–నిర్మాత సంపత్ నంది మాట్లాడుతూ– ''సౌండ్ పార్టీ' టీజర్ బాగుంది. మరో 'జాతి రత్నాలు' సినిమాలా ఉంటుందని టీజర్ చూస్తే అర్థం అవుతోంది. ఈ సినిమా అందరికీ పేరు తీసుకురావాలి'' అన్నారు. ''ఈ చిత్రంలో శివన్నారాయణగారు, నేను తండ్రీకొడుకులుగా చేశాం. ఇద్దరం ఫుల్‌గా నవ్విస్తాం'' అన్నారు వీజే సన్నీ. ''మా సినిమాను 28 రోజుల్లో పూర్తి చేయగలిగామంటే అది యూనిట్ సపోర్ట్ వల్లే'' అన్నారు సంజయ్ శేరి. ''ప్రతిభావంతులను ప్రోత్సహించాలనే మా ఫుల్ మూన్ మీడియా ప్రొడక్షన్ బ్యానర్‌ను స్టార్ట్ చేశాం'' అన్నారు రవి పోలిశెట్టి. ''నేను చేయాల్సిన ఈ సినిమాను మా తమ్ముడు సంజయ్‌తో చేయించాను. 'సౌండ్ పార్టీ'ను ఆదరిస్తే జంధ్యాల, ఈవీవీగార్ల తరహా చిత్రాలు సంజయ్ నుంచి చాలా వస్తాయి'' అన్నారు జయశంకర్.


ఖుదీరామ్ కష్టాలు



● రాకేష్ జాగర్లమూడి

భారతదేశ స్వాతంత్ర్య సమరయోధుల్లో అతి చిన్న వయసులో అమరులైన ఖుదీరామ్ బోస్ జీవితం ఆధారంగా రూపొందిన చిత్రం 'ఖుదీరామ్ బోస్'. రాకేష్ జాగర్లమూడి టైటిల్ రోల్‌లో విద్యాసాగర్ రాజు దర్శకత్వం వహించారు. జాగర్లమూడి పార్వతి సమర్పణలో రజితా విజయ్ జాగర్లమూడి ఈ సినిమాను నిర్మించారు. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, బెంగాలీ, హిందీ భాషల్లో రిలీజ్ చేయాలనుకున్నారు. ఇటీవల గోవాలో జరిగిన ఫిల్మ్ ఫెస్టివల్‌లో, అలాగే గౌరవనీయులైన పార్లమెంట్ సభ్యులకు ఈ సినిమాని ప్రదర్శించగా ప్రశంసించారని యూనిట్ పేర్కొంది. అయితే కోట్లాది రూపాయలు ఖర్చు చేసి తీసిన ఈ సినిమా విడుదలకు నోచుకోక, ఆర్థిక సమస్యల ఒత్తిడితో విజయ్ జాగర్లమూడి గుండెపోటుకు గురై, చికిత్స తీసుకుంటున్నారని చిత్ర యూనిట్ పేర్కొంది.

ఒక్కడే పోలీస్



● జేడీ లక్ష్మీనారాయణ, తల్లాడ వెంకన్న

తల్లాడ వెంకన్న హీరోగా, సునీత, శ్రుతిక, మధువని హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'ఒక్కడే 1'. శ్రీపాద రామచంద్రరావు దర్శకత్వంలో తల్లాడ శ్రీలక్ష్మి, తల్లాడ సునీల్ నిర్మించారు. ఈ చిత్రం పోస్టర్, టీజర్‌ని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ, తెలంగాణ ఎమ్మెల్సీ బి. దయానంద్ విడుదల చేసి, సినిమా హిట్ అవ్వాలని ఆకాంక్షించారు. వెంకన్న మాట్లాడుతూ–''పోలీస్ ఆఫీసర్ కావాలనే నా లక్ష్యాన్ని ఈ సినిమా ద్వారా తీర్చుకున్నాను. ఈ చిత్రాన్ని తెలుగు హిందీ, కన్నడ, తమిళ భాషల్లో త్వరలో విడుదల చేస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: రామ్ తవ్వా, కెమెరా: డి. యాదగిరి.


పంచాయితీ ఏంటి?



● విషికా, భరత్

భరత్, విషికా లక్ష్మణ్ జంటగా నూతన దర్శకుడు గంగాధర .టి తెరకెక్కిస్తున్న చిత్రం 'ఏందిరా ఈ పంచాయితీ'. ప్రదీప్ కుమార్ .ఎం నిర్మిస్తున్న ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని రిలీజ్ చేసింది యూనిట్. ''పూర్తి స్థాయి పల్లెటూరి నేపథ్యంలో రూపొందిన చిత్రమిది. ఊరిలోని పంచాయితీల చుట్టూ ఈ చిత్రకథ సాగుతుంది. ఇందులో లవ్ స్టోరీ కూడా ఉంటుంది. త్వరలోనే సినిమా విడుదల తేదీ ప్రకటిస్తాం'' అన్నారు దర్శక–నిర్మాతలు. ఈ చిత్రానికి కెమెరా: సతీష్ మాసం, సంగీతం: పీఆర్ (పెద్దపల్లి రోహిత్).

పట్టణంలో వినోదం



● సుహాస్, షాలిని

సుహాస్, షాలిని కొండేపూడి జంటగా నటిస్తున్న వినోదాత్మక చిత్రం 'కేబుల్ రెడ్డి'. శ్రీధర్ రెడ్డిని దర్శకుడిగా పరిచయం చేస్తూ బాలు వల్లు, ఫణి ఆచార్య నిర్మిస్తున్న ఈ సినిమా ప్రారంభోత్సవం శుక్రవారం హైదరాబాద్‌లో జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు శ్రీధర్ రెడ్డి కెమెరా స్విచ్చాన్ చేయగా, దర్శకుడు శైలేష్ కొలను క్లాప్ కొట్టి, స్క్రిప్ట్‌ని మేకర్స్‌కు అందించారు. అనంతరం సుహాస్ మాట్లాడుతూ– ''రెండు రోజుల్లో ఈ సినిమా షూటింగ్‌ను స్టార్ట్ చేస్తున్నాం'' అన్నారు. ''ఒక టౌన్‌లో జరిగే క్లీన్ ఎంటర్‌టైనర్ ఇది'' అన్నారు శ్రీధర్ రెడ్డి. ''బౌండెడ్ స్క్రిప్ట్‌తో షూట్‌కి వెళ్తున్నాం. మొదటి షెడ్యూల్‌ను 20 రోజుల్లో పూర్తి చేస్తాం'' అన్నారు బాలు వల్లు. ఈ చిత్రానికి సంగీతం: స్మరణ్ సాయి, కెమెరా: మహి రెడ్డి పండుగల.

ఎమోషనల్ లవ్‌స్టోరీ



● ప్రియాంక, యామిన్

యామిన్ రాజ్, విరాట్ కార్తీక్, ప్రియాంకా రేవ్రి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఎమోషనల్ లవ్‌స్టోరీ 'ప్రేమదేశపు యువరాణి'. సాయి సునీల్ నిమ్మల దర్శకత్వంలో ఆనంద్ వేమూరి, హరిప్రసాద్ సీహెచ్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలోని ప్రత్యేక గీతం 'మనక తడి..'ని ఆవిష్కరించారు. అజయ్ పట్నాయక్ స్వరపరచిన ఈ పాటకు కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించగా, గీతామాధురి పాడారు.

సాక్షి బిజినెస్
శనివారం
19-8-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	202	64,948
నిఫ్టీ ▽	55	19,310

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	13,272	▽	45
డోజోన్స్	34,465	▽	10
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,262	▽	48
డాక్స్	15,574	▽	103
షాంఘై	3,132	▽	32
నికాయ్	31,451	▽	175

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై			
బంగారం (99.9 స్వచ్ఛత)	58,471	▽	53
బంగారం (99.5 స్వచ్ఛత)	58,237	▽	53
వెండి (కిలో)	70,447	△	184

జియో ప్రీ-పెయిడ్ మొబైల్ ప్లాన్స్‌లో నెట్‌ఫ్లిక్స్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టెలికం సంస్థ రిలయన్స్ జియో ప్రీ-పెయిడ్ మొబైల్ ప్లాన్స్‌లో నెట్‌ఫ్లిక్స్‌ను జోడించింది. ప్రీ-పెయిడ్ విధానంలో నెట్‌ఫ్లిక్స్ సబ్‌స్క్రిప్షన్‌ను అందించడం ప్రపంచంలో ఇదే తొలిసారి అని జియో ప్రకటించింది. నెట్‌ఫ్లిక్స్ సబ్‌స్క్రిప్షన్‌తో రూ.1,099, రూ.1,499 ప్రీ-పెయిడ్ మొబైల్ ప్లాన్స్‌ను 84 రోజుల కాలపరిమితితో కంపెనీ ప్రవేశపెట్టింది. జియో పోస్ట్‌పెయిడ్, జియో ఫైబర్ ప్లాన్స్‌లో ఇప్పటికే నెట్‌ఫ్లిక్స్ అందుబాటులో ఉంది.



వేదాంత చేతికి మీనాక్షి ఎనర్జీ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: విద్యుత్ ఉత్పత్తి రంగంలో ఉన్న మీనాక్షి ఎనర్జీని రూ.1,440 కోట్లకు కొనుగోలు చేసేందుకు వేదాంత తాజాగా నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) హైదరాబాద్ బెంచ్ నుంచి ఆమోదం పొందింది. రుణ భారంతో ఉన్న మీనాక్షి ఎనర్జీని విక్రయించడానికి పిలిచిన టెండర్లలో విజయవంతమైన బిడ్డర్‌గా వేదాంతను ఈ ఏడాది జనవరిలో ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరులో మీనాక్షి ఎనర్జీకి 1,000 మెగావాట్ల బొగ్గు ఆధారిత విద్యుత్ ప్రాజెక్టు ఉంది. ఈ పవర్ ప్లాంట్‌ను స్వతంత్ర విద్యుత్ ఉత్పత్తిదారుగా నిర్వహించాలని వేదాంత యోచిస్తోంది. అలాగే వినియోగదారులతో విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను కుదుర్చుకోనుంది. కొనుగోలు ప్రక్రియలో భాగంగా రుణదాతలకు ముందస్తుగా రూ.312 కోట్లను వేదాంత చెల్లించనుంది.



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

19-8-2023	
విశాఖ	470-00
చిత్తూరు	523-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	445-00
విజయవాడ	445-00
రిటైల్ ధర (డజను)	72.00
18-8-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	420-00
వరంగల్	422-00
రిటైల్ ధర	4.80

స్థిర వడ్డీ రేటుకు మారే చాన్స్ ఇవ్వండి

- రుణం ఇచ్చేటప్పుడే వడ్డీ పెరిగే అవకాశాలనూ తెలపాలి
- వ్యక్తిగత రుణాలపై బ్యాంకులకు ఆర్‌బీఐ సూచన

ముంబై: చలన వడ్డీ రేటుపై ఈఎంఐలు చెల్లిస్తున్న వ్యక్తిగత రుణగ్రహీతలకు స్థిర వడ్డీ రేటును లేదా కాల పరిమితి పెంపును ఎంచుకునే అవకాశం ఇవ్వాలంటూ బ్యాంకులకు రిజర్వ్ బ్యాంక్ సూచించింది. పెరుగుతున్న వడ్డీ రేట్ల భారం కారణంగా రుణ గ్రహీతలు ప్రతికూల పరిస్థితుల్లోకి జారిపోకుండా ఇది నివారించగలదని ఒక సర్క్యులర్‌లో పేర్కొంది. గతేడాది మే నుంచి ఆర్‌బీఐ రెపో రేటును 250 బేసిస్ పాయింట్లు పెంచడంతో రుణాలపై వడ్డీ భారం కూడా భారీగా పెరిగిపోయి రుణగ్రహీతలు అవస్థలు పడుతున్న నేపథ్యంలో తాజా సర్క్యులర్ ప్రాధాన్యం సంతరించుకుంది. చలన వడ్డీ రేటుపై వ్యక్తిగత రుణాలు ఇచ్చేటప్పుడే .. వడ్డీ రేటు పెరిగి ఈఎంఐ పెరిగినా లేక కాల వ్యవధి పెంచాల్సి వచ్చినా రుణగ్రహీతల చెల్లింపు సామర్థ్యాలు ఎలా ఉండగలవనేది కూడా బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు, హౌసింగ్ ఫైనాన్స్ సంస్థలు (ఆర్‌ఈలు) పరిగణనలోకి తీసుకోవాలని ఆర్‌బీఐ పేర్కొంది. రుణాలిచ్చిన సంస్థలు తమకు సరైన సమాచారం ఇవ్వకుండా లేదా తమ సమ్మతి లేకుండానే ఈఎంఐలను లేదా కాలపరిమితిని పెంచేశాయంటూ రుణగ్రహీతల నుంచి పలు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ఆర్‌బీఐ ఈ సర్క్యులర్ జారీ చేసింది. 'వడ్డీ రేట్లను సవరించేటప్పుడు ఆర్‌ఈలు బోర్డు ఆమోదిత పాలసీ ప్రకారం స్థిర వడ్డీ రేటుకు మారే ఆప్షన్‌ను రుణగ్రహీతలకు ఇవ్వాలి. రుణ కాలవ్యవధిలో ఎన్ని సార్లు ఇలా మారేందుకు అవకాశం ఉంటుందనేది కూడా పాలసీలో పొందుపర్చాలి' అని ఆర్‌బీఐ వివరించింది. సర్క్యులర్‌లో మరిన్ని వివరాలు..



- ■ రుణాన్ని మంజూరు చేసేటప్పుడే ప్రామాణిక వడ్డీ రేట్లు మారితే ఈఎంఐ, కాల పరిమితి కూడా మారే అవకాశాల గురించి రుణగ్రహీతలకు ఆర్‌ఈలు స్పష్టంగా తెలియజేయాలి. ఆ తర్వాత అవి పెరిగిన పక్షంలో తగు మాధ్యమాల ద్వారా రుణగ్రహీతకు తక్షణం తెలియజేయాలి.
- ■ ఈఎంఐని లేదా కాలపరిమితిని పెంచుకోవడం, లేదా రెండు ఆప్షన్లను కూడా వినియోగించుకునే అవకాశాన్ని కల్పించాలి. అలాగే రుణ కాల వ్యవధిలో ఎప్పుడైనా సరే పాక్షికంగానైనా లేదా పూర్తిగానైనా చెల్లించేందుకు అవకాశం ఉండాలి. ముందస్తు చెల్లింపునకు చార్జీలేవైనా విధించడమనేది తత్సంబంధ నిబంధనలకు అనుగుణంగా ఉండాలి.
- ■ ప్రతి త్రైమాసికం ఆఖరులో వసూలు చేసిన అసలు, వడ్డీ వివరాలు, ఈఎంఐ మొత్తం, ఇంకా ఎన్ని ఈఎంఐలు మిగిలి ఉన్నాయి, వార్షిక వడ్డీ రేటు తదితర వివరాల స్టేట్‌మెంట్‌ను రుణగ్రహీతలకు అందుబాటులో ఉంచాలి.
- ■ ప్రస్తుత, కొత్త రుణాలకు నిర్దేశిత నిబంధనలను డిసెంబర్ 31 నాటికల్లా పాటించాలి.

పెనాల్టీ వడ్డీలు వద్దు..

రుణాల చెల్లింపులో డిఫాల్ట్ అయిన వారిపై పెనాల్టీ వడ్డీలు విధించొద్దంటూ మరో నోటిఫికేషన్‌లో బ్యాంకులకు ఆర్‌బీఐ సూచించింది. దానికి బదులుగా సముచిత స్థాయిలో చార్జీలు మాత్రమే విధించవచ్చని తెలిపింది. అటువంటి చార్జీలపై వడ్డీని విధించరాదని పేర్కొంది. 2024 జనవరి 1 నుంచి ఈ నిబంధన అమల్లోకి వస్తుంది. మరోవైపు, ఇన్‌ఫ్రా డెట్ ఫండ్ - ఎన్‌బీఎఫ్‌సీలు (ఐడీఎఫ్-ఎన్‌బీఎఫ్‌సీ) నికరంగా కనీసం రూ. 300 కోట్ల సొంత నిధి (ఎన్‌హెచ్‌ఎఫ్) కలిగి ఉండాలని వాటికి సంబంధించి సవరించిన నిబంధనల్లో ఆర్‌బీఐ పేర్కొంది. ఇన్‌ఫ్రా రంగానికి రుణాలు అందించడంలో ఐడీఎఫ్-ఎన్‌బీఎఫ్‌సీలు మరింత కీలకపాత్ర పోషించేందుకే మార్గదర్శకాలను సవరించినట్లు వివరించింది.

విస్తరణలో ఎంజీ మోటార్స్...

ఏడాది ఆఖరు నాటికి 400 షోరూమ్స్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఆటోమొబైల్ సంస్థ ఎంజీ మోటార్స్ దేశీయంగా తమ కార్యకలాపాలను మరింతగా విస్తరిస్తోంది. ప్రస్తుతం దాదాపు 330 స్టోర్స్ ఉండగా.. ఏడాది ఆఖరు నాటికి వీటిని 400కు పెంచుకోనుంది. తెలంగాణలో 9 స్టోర్స్ ఉండగా.. వీటిని 20కి పెంచుకోనుంది. హైదరాబాద్‌లో కొత్తగా మూడు స్టోర్స్‌ను ప్రారంభించిన సందర్భంగా ఎంజీ మోటార్ ఇండియా డిప్యూటీ ఎండీ గౌరవ్ గుప్తా ఈ విషయాలు తెలిపారు. తెలంగాణలో 13,000 పైచిలుకు వాహనాలను విక్రయించినట్లు ఆయన వివరించారు. గతేడాది ఇక్కడ 4,000 పైచిలుకు వాహనాలను విక్రయించగా, ఈసారి 5,000 వాహనాలను లక్ష్యంగా పెట్టుకున్నట్లు గుప్తా తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ వాహనాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు మెరుగ్గా ఉండటంతో ఎలక్ట్రిక్ కార్ల వినియోగం పుంజుకుంటోందని చెప్పారు. అటు ఆంధ్రప్రదేశ్‌లోనూ విజయవాడ, విశాఖ, రాజమండ్రి తదితర ప్రాంతాల్లో తమ స్టోర్స్ ఉన్నట్లు తెలిపారు. ఏడాదికో కొత్త మోడల్‌ను ప్రవేశపెట్టాలనే వ్యూహంతో ముందుకెడుతున్నామని.. వచ్చే సంవత్సరం మరో కొత్త వాహనాన్ని ప్రవేశపెట్టే ప్రయత్నాల్లో ఉన్నామని ఆయన వివరించారు. ఎంజీ మోటార్స్ ప్రస్తుతం హెక్టర్, జీయస్, కామెట్ తదితర వాహనాలను విక్రయిస్తోంది.



'ఇండిపెండెన్స్ డే డబుల్ ఆఫర్' ఆగస్టు 20 వరకు పొడిగింపు

న్యూఢిల్లీ: అన్‌లిమిటెడ్ స్టోర్ నిర్వహిస్తున్న 'ఇండిపెండెన్స్ డే డబుల్ ఆఫర్' ఈ ఆగస్టు 20 వరకు పొడిగించినట్లు కంపెనీ ఒక ప్రకటన ద్వారా తెలిపింది. ఇందులో భాగంగా ఒకటి కొంటే ఒకటి ఉచితంగా., అలాగే రూ.3,000 కొనుగోలుపై అంతే విలువైన ఉచిత షాపింగ్ పొందవచ్చు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ ఆగస్టు తొలి వారంలో ప్రకటించిన ఈ ఆఫర్‌కు దేశవ్యాప్తంగా మంచి స్పందన లభిస్తోంది. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కస్టమర్లను కోరింది.



జియో ఫైనాన్స్ లిస్టింగ్ 21న

- బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈలలో ట్రేడింగ్
- గత వారం షేర్ల కేటాయింపు పూర్తి

ముంబై: డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ నుంచి విడివడిన జియో ఫైనాన్షియల్ సర్వీసెస్(జేఎఫ్‌ఎస్‌ఎల్) స్టాక్ ఎక్స్ఛేంజీలలో సోమవారం (21న) లిస్టకానుంది. జియోఫిన్ పేరుతో టీ గ్రూప్‌లో షేర్లు లిస్టకానున్నట్లు బీఎస్‌ఈ తాజాగా పేర్కొంది. ఫైనాన్షియల్ సర్వీసుల విభాగాన్ని(రిలయన్స్ స్ట్రాటజిక్ ఇన్వెస్ట్‌మెంట్ లిమిటెడ్) గత నెలలో రిలయన్స్ ప్రత్యేక కంపెనీగా విడదీసింది. దీంతో షేరు ధరను నిర్ధారించే బాటలో డమ్మీ టికర్‌తో మూడు రోజులపాటు బీఎస్‌ఈ ట్రేడింగ్‌కు వీలు కల్పించింది కూడా. దాదాపు రూ. 262 ధర వద్ద జియో ఫైనాన్షియల్ స్థిరపడిన సంగతి తెలిసిందే. కంపెనీ మార్కెట్ క్యాప్(విలువ) రూ. 1.66 లక్షల కోట్లు(20.3 బిలియన్ డాలర్లు)గా నమోదైంది. వెరసి దేశీయంగా బజాజ్ ఫైనాన్స్ తదుపరి రెండో పెద్ద ఎన్‌బీఎఫ్‌సీగా నిలవనుంది. బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈలలో వచ్చే వారం నుంచి ట్రేడింగ్ షురూ కానుంది. ట్రేడ్ ఫర్ ట్రేడ్ విభాగంలో 10 రోజులపాటు కంపెనీ లిస్టకానున్నట్లు బీఎస్‌ఈ తాజాగా వెల్లడించింది. జేఎఫ్‌ఎస్‌ఎల్ షేర్లను గత వారం తమ వాటాదారులకు రిలయన్స్ కేటాయించింది. వివిధ ఫైనాన్షియల్ సర్వీస్ సొల్యూషన్లు అందిస్తున్న జేఎఫ్‌ఎస్‌ఎల్ బీమా, డిజిటల్ చెల్లింపులు, అసెట్ మేనేజ్‌మెంట్ విభాగాలలో కార్యకలాపాలు విస్తరించనుంది. మ్యూచువల్ ఫండ్ కంపెనీ ఏర్పాటుకు గత నెలలో అసెట్ మేనేజ్‌మెంట్ దిగ్గజం బ్లాక్‌రాక్‌తో చేతులు కలిపింది.



65 వేల దిగువకు సెన్సెక్స్

- ఐటీ, మెటల్ షేర్లలో అమ్మకాలు
- సూచీలకు రెండోరోజూ నష్టాలే

ముంబై: ఐటీ, టెక్, మెటల్ షేర్లలో అమ్మకాలు తలెత్తడంతో స్టాక్ సూచీలు రెండోరోజూ నష్టాలు చవిచూశాయి. విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు, ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని ప్రతికూలతలూ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. సెన్సెక్స్ ఉదయం 125 పాయింట్ల నష్టంతో 65,026 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 396 పాయింట్లు పతనమై 64,755 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. ఆఖర్లో కొనుగోళ్ల మద్దతు లభించడంతో కొంతమేర నష్టాలు భర్తీ చేసుకుంది. చివరికి 202 పాయింట్లు క్షీణించి 64,948 వద్ద స్థిరపడింది. నిఫ్టీ రోజంతా 19,254 - 19,365 శ్రేణిలో కదలాడింది. ఆఖరికి 55 పాయింట్ల నష్టపోయి 19,310 వద్ద నిలిచింది. ఎఫ్‌ఎంసీజీ, మెటల్, ప్రభుత్వరంగ రంగ బ్యాంకులు షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.267 ఈక్విటీ షేర్లను విక్రయించగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.339 కోట్ల షేర్లను కొన్నారు. ఈ వారం మొత్తంగా సెన్సెక్స్ 374 పాయింట్లు, నిఫ్టీ 118 పాయింట్లు చొప్పున నష్టపోయాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- అమెరికాలో టెక్నాలజీ షేర్లకు ప్రాతినిధ్యం వహించే నాస్‌డాక్ సూచీ పతన ప్రభావం దేశీయ ఐటీ షేర్లపై పడింది. టీసీఎస్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, విప్రో షేర్లు 2 నుంచి 1.50% పతనమయ్యాయి.



- ఆరంభ నష్టాలను భర్తీ చేసుకున్న అధిక వెయిటేజీ రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు ఒకశాతం లాభపడి రూ. 2,557 వద్ద స్థిరపడింది. జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ షేర్లు సోమవారం లిస్టింగ్ అవుతున్నట్లు కంపెనీ చేసిన ప్రకటనతో ఈ షేరుకు డిమాండ్ లభించింది.
- నష్టాల మార్కెట్లోనూ కాంకర్డ్ బయోటెక్ లిస్టింగ్ మెప్పించింది. ఇష్యూ ధర(రూ.741)తో పోలిస్తే బీఎస్‌ఈలో 21% ప్రీమియంతో రూ.900 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 33% దూసుకెళ్లి రూ.987 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. చివరికి 27% లాభంతో రూ.942 వద్ద స్థిరపడింది. కంపెనీ విలువ రూ.9,853 కోట్లుగా నమోదైంది.
- 4 ప్రాంతీయ చానెల్స్ లాంచ్‌కు సమాచార, ప్రసార శాఖ ఆమోదం తెలపడంతో ఎన్‌డీటీవీ షేరు 2% లాభపడి రూ.225 వద్ద నిలిచింది. ట్రేడింగ్‌లో 5% బలపడి రూ.232 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది.



నీరజ్ చోప్రాపైనే ఆశలు

ప్రతిష్టాత్మక ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు నేడు హంగేరి రాజధాని బుడాపెస్ట్‌లో తెరలేవనుంది. తొలిసారి భారత్ నుంచి అత్యధికంగా 27 మంది అథ్లెట్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. పతకం ఆశలన్నీ మళ్లీ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రాపైనే ఉన్నాయి. గత ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రజత పతకం నెగ్గిన నీరజ్ ఈసారి స్వర్ణంపై గురి పెట్టాడు. ఈనెల 27న నీరజ్ ఈవెంట్ ఉంది.

స్పెయిన్‌పై భారత్ విజయం

జర్మనీలో జరుగుతున్న నాలుగు దేశాల జూనియర్ పురుషుల హాకీ టోర్నీలో భారత జట్టు తొలి మ్యాచ్‌లో 6-2తో స్పెయిన్ జట్టును ఓడించింది. భారత్ తరఫున రోహిత్ (28వ, 45వ ని.లో), సుదీప్ చిర్మాకో (35వ, 58వ ని.లో) రెండు గోల్స్ చొప్పున చేయగా... అమన్‌దీప్ (25వ ని.లో), బాబీ సింగ్ (53వ ని.లో) ఒక్కో గోల్ అందించారు.


సుదీప్


స్వర్ణ పతకాలతో ఇషా సింగ్, శివా నర్వాల్

ఇషా-శివ జోడీకి స్వర్ణం

10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత్‌కు పసిడి పతకం

బకూ (అజర్‌బైజాన్): ప్రపంచ సీనియర్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్ ఖాతాలో తొలి స్వర్ణ పతకం చేరింది. శుక్రవారం జరిగిన 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో ఇషా సింగ్-శివా నర్వాల్ జోడీ పసిడి పతకం సొంతం చేసుకుంది. తెలంగాణకు చెందిన ఇషా సింగ్... హరియాణాకు చెందిన శివా నర్వాల్ ఫైనల్లో 16-10తో తర్హాన్ ఇలేదా-యూసుఫ్ డికెచ్ (తుర్కియే) ద్వయంపై విజయం సాధించారు. ఫైనల్‌ను మొత్తం 13 రౌండ్లపాటు నిర్వహించారు. ఒక్కో రౌండ్‌లో ఇరు జట్ల షూటర్లు రెండేసి షాట్‌లు లక్ష్యం దిశగా సంధిస్తారు. అత్యధిక పాయింట్లు సాధించిన జోడీకి రెండు పాయింట్ల చొప్పున కేటాయిస్తారు. భారత జోడీ ఎనిమిది రౌండ్‌లలో నెగ్గగా, తుర్కియే జంట ఐదు రౌండ్‌లలో గెలిచింది. అంతకుముందు 65 జోడీలు పాల్గొన్న క్వాలిఫయింగ్‌లో ఇషా సింగ్-శివా నర్వాల్ ద్వయం 583 పాయింట్లు స్కోరు చేసి టాప్ ర్యాంక్‌లో... తర్హాన్-యూసుఫ్ జోడీ 581 పాయింట్లు సాధించి రెండో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించాయి. 580 పాయింట్లతో జియాంగ్ రాన్‌జిన్-జాంగ్ బొవెన్ (చైనా), హనియె-సాజిద్ (ఇరాన్) జంటలు సంయుక్తంగా మూడో స్థానంలో నిలిచి కాంస్య పతక పోరుకు అర్హత పొందాయి. కాంస్య పతక మ్యాచ్‌లో రాన్‌జిన్-జాంగ్ బొవెన్ ద్వయం 17-7తో హనియె-సాజిద్ జంటను ఓడించింది.

మరోవైపు 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత జోడీలకు నిరాశ ఎదురైంది. మెహులీ-ఐశ్వరీ ప్రతాప్ సింగ్ జోడీ 630.2 పాయింట్లు సాధించి తొమ్మిదో స్థానంలో... రమిత-దివ్యాంశ్ జంట 628.3 పాయింట్లు సాధించి 17వ స్థానంలో నిలిచాయి. టాప్-4లో నిలిచిన జోడీలు మాత్రమే స్వర్ణ, రజత, కాంస్య పతకాల మ్యాచ్‌లకు అర్హత సాధిస్తాయి. మహిళల స్కీట్ టీమ్ ఈవెంట్‌లో పరీనాజ్ ధలివాల్, గనీమత్ సెఖోన్, దర్శన రాథోడ్ బృందం 351 పాయింట్లు స్కోరు చేసి నాలుగో స్థానంలో నిలిచింది.

8 ప్రపంచ సీనియర్ షూటింగ్ చాంపియన్‌షిప్ చరిత్రలో భారత్ గెలిచిన స్వర్ణ పతకాలు. గతంలో అభినవ్ బింద్రా (2006: 10 మీటర్ల ఎయిర్ రైఫిల్), మానవ్‌జిత్ సింగ్ (2006: ట్రాప్), తేజస్విని సావంత్ (2010: మహిళల 50 మీటర్ల రైఫిల్ ప్రోన్), ఓంప్రకాశ్ (2018: 50 మీటర్ల పిస్టల్), అంకుర్ మిట్టల్ (2018: డబుల్ ట్రాప్), రుద్రాంక్ష్ (2022: 10 మీటర్ల ఎయిర్ రైఫిల్), రుద్రాంక్ష్, అర్జున్ బబూటా, అంకుశ్ జాదవ్ బృందం (2022: 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ ఈవెంట్) ఈ ఘనత సాధించారు.

వృత్తి అగర్వాల్‌కు రెండో స్వర్ణం

భువనేశ్వర్: జాతీయ సబ్ జూనియర్, జూనియర్ అక్వాటిక్స్ చాంపియన్‌షిప్‌లో శుక్రవారం తెలంగాణకు రెండు పతకాలు లభించాయి. గ్రూప్-1 బాలికల 800 మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగంలో వృత్తి అగర్వాల్ (9ని:20.25 సెకన్లు) పసిడి పతకం గెలిచింది. ఈ టోర్నీలో ఆమెకిది రెండో స్వర్ణం కావడం విశేషం. గ్రూప్-2 బాలికల 400 మీటర్ల వ్యక్తిగత మెడ్లేలో శ్రీనిత్య సాగి (5ని:26 సెకన్లు) రజత పతకం గెలిచింది.



బుమ్రా బృందం
శుభారంభం

- తొలి టి20 మ్యాచ్‌లో ఐర్లాండ్‌పై 'డక్‌వర్త్' పద్ధతిలో భారత్ గెలుపు
- వర్షంతో పూర్తికాని మ్యాచ్
- రేపు రెండో టి20

డబ్లిన్: భారత పేస్ తురుపుముక్క జస్‌ప్రీత్ బుమ్రా (2/24) తన పునరాగమనాన్ని ఘనంగా చాటుకున్నాడు. 11 నెలల సుదీర్ఘ విరామం తర్వాత బరిలోకి దిగిన ఈ సీనియర్ సీమర్ వన్డే ప్రపంచకప్‌కు ముందు భారత బౌలింగ్ దళానికి తాను వెన్నుదన్నుగా ఉంటానని భరోసా ఇచ్చాడు. ఇక మ్యాచ్ విషయానికొస్తే అనుకున్నట్లే భారత్, ఐర్లాండ్ తొలి టి20ని వరుణుడు అడ్డుకున్నాడు. డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో భారత్ 2 పరుగుల తేడాతో ఐర్లాండ్‌పై గెలిచింది. ఈ మ్యాచ్‌తో రింకూ సింగ్, ప్రసిధ్ కృష్ణ భారత్ తరఫున టి20ల్లో అరంగేట్రం చేశారు. మొదట బ్యాటింగ్‌కు దిగిన ఐర్లాండ్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 139 పరుగులు చేసింది. బారీ మెకార్తీ (33 బంతుల్లో 51 నాటౌట్; 4 ఫోర్లు, 4 సిక్సర్లు) మెరిపించాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' బుమ్రా, ప్రసిధ్ కృష్ణ, రవి బిష్ణోయ్ తలా 2 వికెట్లు తీశారు. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన భారత్ వర్షంతో ఆట నిలిచే సమయానికి 6.5 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 47 పరుగులు చేసింది. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (23 బంతుల్లో 24; 3 ఫోర్లు, 1 సిక్స్), రుతురాజ్ గైక్వాడ్ (16 బంతుల్లో 19 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) ధాటిగా ఆడారు. పవర్‌ప్లేలో ఓపెనింగ్ జోడీ 45 పరుగులు చేసింది. ఏడో ఓవర్ వేసిన క్రెయిగ్ యంగ్ 5 బంతులేసి 2 వికెట్లు పడగొట్టాడు. తిలక్ వర్మ (0) డకౌటయ్యాడు. వర్షంతో ఆట నిలిచే సమయానికి డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో భారత విజయ సమీకరణం 45 పరుగులుగా ఉంది. ఈ గెలుపుతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 1-0తో ఆధిక్యంలో నిలిచింది. ఆదివారం ఇదే వేదికపై రెండో మ్యాచ్ జరుగుతుంది.

బుమ్రా ధాటికి...

చాన్నాళ్ల తర్వాత మైదానంలోకి దిగిన భారత పేసర్, కెప్టెన్ బుమ్రా తన పేస్‌లో పదును ఏమాత్రం తగ్గలేదని తొలి ఓవర్లోనే చూపించాడు. అతని ధాటికి ఓపెనర్ బల్బీర్నీ (4) క్లీన్‌బౌల్డ్ కాగా, టక్కర్ (0) ఖాతానే తెరవలేదు. తర్వాత ప్రసిధ్ కృష్ణ కూడా ఐర్లాండ్ ఇన్నింగ్స్‌ను చావుదెబ్బ తీయడంతో 31 పరుగులకే 5 వికెట్లను కోల్పోయింది. అయితే క్యాంఫర్ (33 బంతుల్లో 39; 3 ఫోర్లు, 1 సిక్స్) ఆదుకోగా, మెకార్తీ డెత్ ఓవర్లలో చెలరేగడంతో ఐర్లాండ్ చెప్పుకోదగ్గ స్కోరు చేసింది.



స్కోరు వివరాలు

ఐర్లాండ్ ఇన్నింగ్స్: బల్బీర్నీ (బి) బుమ్రా 4; స్టిర్లింగ్ (బి) బిష్ణోయ్ 11; టక్కర్ (సి) సామ్సన్ (బి) బుమ్రా 0; టెక్టర్ (సి) తిలక్ (బి) ప్రసిధ్ కృష్ణ 9; క్యాంఫర్ (బి) అర్ష్‌దీప్ 39; డాక్‌రెల్ (సి) రుతురాజ్ (బి) ప్రసిధ్ కృష్ణ 1; మార్క్ అడైర్ (ఎల్బీడబ్ల్యూ) (బి) బిష్ణోయ్ 16; మెకార్తీ (నాటౌట్) 51; యంగ్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 139. వికెట్ల పతనం:** 1-4, 2-4, 3-27, 4-27, 5-31, 6-59, 7-116. **బౌలింగ్:** బుమ్రా 4-0-24-2, అర్ష్‌దీప్ 4-0-35-1, ప్రసిధ్ కృష్ణ 4-0-32-2, రవి బిష్ణోయ్ 4-0-23-2, శివమ్ దూబే 1-0-6-0, వాషింగ్టన్ సుందర్ 3-0-19-0.

భారత్ ఇన్నింగ్స్: యశస్వి (సి) స్టిర్లింగ్ (బి) యంగ్ 24; రుతురాజ్ (నాటౌట్) 19; తిలక్ వర్మ (సి) టక్కర్ (బి) యంగ్ 0; సామ్సన్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (6.5 ఓవర్లలో 2 వికెట్లకు) 47. వికెట్ల పతనం:** 1-46, 2-46. **బౌలింగ్:** మార్క్ అడైర్ 1-0-10-0, జోష్ లిటిల్ 3-0-20-0, మెకార్తీ 2-0-14-0, యంగ్ 0.5-0-2-2.

ద్యుతీచంద్‌పై నాలుగేళ్ల నిషేధం

న్యూఢిల్లీ: భారత మహిళా స్ప్రింటర్ ద్యుతీచంద్‌పై నాలుగేళ్ల నిషేధాన్ని విధించారు. ఆమె నిషేధిత ఉత్ప్రేరకాలు తీసుకున్నట్లు పరీక్షల్లో తేలడంతో జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) ఈ చర్యలు తీసుకుంది. గత డిసెంబర్‌లో ఆమె నుంచి రెండుసార్లు నమూనాలను సేకరించి, పరీక్ష చేశారు. ఈ రెండు పరీక్షల్లోనూ భారత అథ్లెట్ పాజిటివ్‌గా దొరికిపోవడంతో గురువారం నిషేధాన్ని ఖరారు చేశారు. ఈ ఏడాది జనవరి 3 నుంచి శిక్షాకాలం మొదలైనట్లు 'నాడా' తెలిపింది. ఒడిశాకు చెందిన 27 ఏళ్ల ద్యుతీ 2018 జకార్తా ఆసియా క్రీడల్లో 100 మీటర్లు, 200 మీటర్ల పరుగులో రెండు రజతాలు నెగ్గింది. 'నాడా' విధించిన నిషేధంపై సవాలు చేస్తానని ద్యుతీచంద్ ప్రకటించింది. నొప్పి నివారణ చికిత్సలో భాగంగానే మందులు తీసుకున్నానని... ఆ మందుల్లో 'అనబాలిక్ ఏజెంట్స్' అవశేషాలు న్నాయని చెప్పింది. అంతేతప్ప ప్రదర్శన మెరుగుపర్చుకునేందుకు ఉత్ప్రేరకాలేవీ వాడలేదని వివరణ ఇచ్చింది. 2021 నవంబర్లో ఆమె లెవెల్-1 క్యాన్సర్ బారిన పడినట్లు చెప్పింది.



గోదావరి టైటాన్స్ గెలుపు

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్ర ప్రీమియర్ లీగ్ టి20 క్రికెట్ టోర్నీలో భాగంగా బెజవాడ టైగర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో గోదావరి టైటాన్స్ ఏడు వికెట్లతో నెగ్గింది. ముందుగా బెజవాడ టైగర్స్ 8 వికెట్లకు 175 పరుగులు చేసింది. అనంతరం గోదావరి టైటాన్స్ 19.1 ఓవర్లలో 3 వికెట్లకు 176 పరుగులు చేసి గెలిచింది. జ్ఞానేశ్వర్ (66; 4 ఫోర్లు, 5 సిక్స్‌లు), హేమంత్ రెడ్డి (61 నాటౌట్; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించారు. వైజాగ్ వారియర్స్‌తో జరిగిన మరో మ్యాచ్‌లో కోస్టల్ రైడర్స్ ఐదు వికెట్లతో నెగ్గింది. ముందుగా వైజాగ్ 8 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 80 పరుగులు చేసింది. ఈ దశలో వర్షంతో అంతరాయం ఏర్పడింది. అనంతరం కోస్టల్ రైడర్స్ విజయలక్ష్యాన్ని 5 ఓవర్లలో 61 పరుగులుగా నిర్ణయించారు. కోస్టల్ జట్టు మరో బంతి ఉండగానే ఐదు వికెట్లకు 65 పరుగులు చేసి గెలిచింది.

అంతిమ్ అదరహో...

- వరుసగా రెండో ఏడాది ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన భారత రెజ్లర్
- 53 కేజీల విభాగంలో పసిడి పతకం
- తొలిసారి భారత మహిళల రెజ్లింగ్ జట్టుకు టీమ్ టైటిల్

అమ్మాన్ సిటీ (జోర్డాన్): భారత యువ మహిళా రెజ్లర్లు శుక్రవారం కొత్త చరిత్రను లిఖించారు. తొలిసారి ప్రపంచ అండర్-20 చాంపియన్‌షిప్‌లో టీమ్ టైటిల్‌ను సొంతం చేసుకున్నారు. హరియాణా అమ్మాయి అంతిమ్ పంఘాల్ వరుసగా రెండో ఏడాది 53 కేజీల విభాగంలో విశ్వవిజేతగా నిలిచి ఈ ఘనత సాధించిన తొలి భారతీయ రెజ్లర్‌గా గుర్తింపు పొందింది. ఫైనల్లో అంతిమ్ 4-0తో మరియా యెఫ్రెమోవా (ఉక్రెయిన్)పై గెలిచింది. ఓవరాల్‌గా ఈ టోర్నీలో అంతిమ్ తన ప్రత్యర్థులకు కేవలం రెండు పాయింట్లే కోల్పోయింది. సవితా దలాల్ (62 కేజీలు) కూడా ప్రపంచ చాంపియన్ అయ్యింది. ఫైనల్లో సవిత 10-0తో చిరినోస్ (వెనిజులా)పై గెలిచింది. అంతిమ్ కుందు (65 కేజీలు) రజతం నెగ్గగా... రీనా (57 కేజీలు), ఆర్జూ (68 కేజీలు), హర్షిత (72 కేజీలు) కాంస్య పతకాలు సాధించారు. గురువారం ప్రియా మాలిక్ (76 కేజీలు) స్వర్ణం నెగ్గిన సంగతి విదితమే. ఓవరాల్‌గా భారత్ ఏడు పతకాలు నెగ్గి 140 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది.



అంతిమ్ పంఘాల్

క్లుప్తంగా...

నేడు పంచాయతీ ఉప ఎన్నికల పోలింగ్

34 సర్పంచ్, 246 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు



సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా 250కి పైగా గ్రామ పంచాయతీల్లో 34 సర్పంచ్ పదవులతో పాటు 246 వార్డు సభ్యుల స్థానాలకు శనివారం పోలింగ్ జరగనుంది. ఎన్నికల నిర్వహణకు కలెక్టర్లు తగిన ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం అధికారులు తెలిపారు. ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ కొనసాగుతుంది. అనంతరం రెండు గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహించి విజేతలను ప్రకటిస్తారు. మొత్తం 34 సర్పంచ్ స్థానాలకు 96 మంది అభ్యర్థులు, 246 వార్డు సభ్యుల పదవులకు 547 మంది పోటీలో ఉన్నారు.

కోస్తాంధ్రలో మోస్తరు వర్షాలు



సాక్షి, విశాఖపట్నం : ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాలకు అనుకుని వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కొనసాగుతోంది. ఇది రానున్న రెండు రోజుల్లో ఉత్తర ఒడిశా, చత్తీస్‌గఢ్‌ల మీదుగా పశ్చిమ వాయవ్య దిశగా పయనించనుంది. దీని ప్రభావంతో రానున్న మూడు రోజులు ఉత్తర కోస్తాంధ్రలో కొన్నిచోట్ల, దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ శుక్రవారం తెలిపింది. గంటకు 30-40 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయని పేర్కొంది. ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులు సంభవించే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

34,122 మందికి పాలిటెక్నిక్ సీట్ల కేటాయింపు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన పాలిసెట్–2023లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు తొలి విడత సీట్లు కేటాయించినట్టు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 34,624 మంది విద్యార్థులు ఆప్షన్లను ఎంపిక చేసుకోగా, 34,122 మందికి సీట్లు కేటాయించామని పేర్కొన్నారు. 88 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో 10,456 సీట్లు, 181 ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో 23,666 సీట్లు భర్తీ చేసినట్టు తెలిపారు. వీరంతా ఈ నెల 23వ తేదీలోపు ఆయా కళాశాలల్లో వ్యక్తిగతంగా రిపోర్టు చేయాలని, ఆ రోజు నుంచే తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాలిటెక్నిక్ కళాశాలల్లో మొత్తం 82,729 సీట్లు ఉన్నాయని, తొలి విడతలో మిగిలిన సీట్లకు తుది విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు.

48 మందితో బీజేపీ కొత్త రాష్ట్ర కమిటీ

సాక్షి, అమరావతి: బీజేపీ ప్రస్తుత రాష్ట్ర కమిటీలో కీలక మార్పులు చేర్పులు చేస్తూ పార్టీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి శుక్రవారం కొత్త రాష్ట్ర కమిటీని ప్రకటించారు. ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా కొనసాగుతున్న నలుగురిలో మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్‌తోపాటు ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డి, వి.సూర్యనారాయణరాజును కొత్తగా ఉపాధ్యక్షులుగా నియమించారు. కాశీ విశ్వనాథరాజు (విశాఖపట్నం), బిట్ర శివన్నారాయణ (గుంటూరు), ఎస్.దయాకర్‌రెడ్డి (తిరుపతి), గారపాటి తపన చౌదరి (ఏలూరు)ను రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా నియమించారు. పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శిగా ఎన్.మధుకర్‌ను కొనసాగించారు. ఉపాధ్యక్షులుగా 11 మందిని, కార్యదర్శులుగా పది మందిని నియమించారు. పార్టీ అనుబంధ సంఘాలు యువ మోర్చా, మహిళా మోర్చా, కిసాన్‌మోర్చా, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మోర్చాల అధ్యక్షులతో పాటు అధికార ప్రతినిధులతో కలిపి మొత్తం 48 మంది సభ్యులతో కొత్త కమిటీని అధ్యక్షురాలు పురందేశ్వరి ప్రకటించారు.

అప్పట్లా కాదు.. ఇప్పటి లోకేశ్ వేరు!


మంగళగిరి కోర్టుకు హాజరైన లోకేశ్

మంగళగిరి : తనపై నిరాధార ఆరోపణలు చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. మంగళగిరి కోర్టుకు శుక్రవారం హాజరైన లోకేశ్ మీడియాతో మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ వాళ్లయినా, ఇతరులైనా, మీడియా సంస్థలైనా ఎవరైనా సరే విష ప్రచారం చేస్తాం.. బురదజల్లుతాం.. అంటే ఊరుకునేదే లేదన్నారు. యువగళం పాదయాత్రకు ముందున్న లోకేశ్ వేరు.. ఇప్పుడున్న లోకేశ్ వేరు అని చెప్పారు. తెలుగుదేశం అధికారంలో వచ్చాక ప్రజలకు ఏం చేయాలన్న దానిని స్పష్టంగా చెబుతానన్నారు. ఈనాడు సంస్థ వ్యతిరేకంగా వార్తలు రాస్తుందనే అక్కసుతోనే మార్గదర్శిపై ప్రభుత్వం దాడులు చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

మన రాష్ట్రంలో పశువైద్యసేవలను ప్రశంసిస్తున్న పొరుగు రాష్ట్రాలు.. అయినా పచ్చ పైత్యంతో అడ్డగోలుగా ఈనాడు దుష్ప్రచారం

ఎవరి కోసం మీ 'పశు' వాదన రామోజీ?

గ్రామానికి ఒక పశు సంవర్థక సహాయకుడు, రెండు మండలాలకు ఒక వెటర్నరీ అంబులెన్స్, ఆర్బీకేల ద్వారా పశుగ్రాసం, సర్టిఫై చేసిన నాణ్యమైన సంపూర్ణ మిశ్రమ దాణా పంపిణీ, పశు పోషణ, నాణ్యమైన పాల ఉత్పత్తి లక్ష్యంగా పశు విజ్ఞాన బడులు, గ్రామ స్థాయిలోనే పాడి రైతు ముంగిట నాణ్యమైన పశు వైద్య సేవలు అందరి కళ్లెదుటే కనిపిస్తున్నాయి. మూగ జీవాలకు బీమా రక్షణ, పశు పోషకులకు భారం తగ్గించేందుకు దేశంలోనే తొలిసారిగా జనరిక్ పశు ఔషధ కేంద్రాల ఏర్పాటు, జగనన్న పాల వెల్లువ ద్వారా పాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పన.. ఇలా నాలుగేళ్లలో ఎన్నో విప్లవాత్మక మార్పులు రాష్ట్రంలో చోటుచేసుకున్నాయి. కానీ 'పచ్చ' పైత్యం తలకెక్కించుకున్న ఈనాడు రామోజీకి మాత్రం ఇవి కనిపించకపోవడం ఆశ్చర్యకరం కానేకాదు.



సాక్షి, అమరావతి : దేశంలో మరే రాష్ట్రంలోనూ లేని రీతిలో మూగ జీవాల ఆరోగ్య పరిరక్షణకు పెద్ద పీట వేస్తూ పశు పోషకుల జీవన ప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా నాలుగేళ్లలో ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తూ దేశానికే ఆంధ్రప్రదేశ్ ఆదర్శంగా నిలిచింది. పొరుగు రాష్ట్రాలు సైతం ఏపీ బాటలో పయనిస్తున్నాయి. పశు వైద్య నిర్వహణలో అత్యుత్తమ రాష్ట్రంగా ఏపీకి కేంద్రంతో సహా పలు జాతీయ, అంతర్జాతీయ సంస్థల ప్రశంసలు.. అవార్డులు.. రివార్డులు దక్కాయి. ఇవన్నీ చూసి ఓర్వలేకపోతున్న రామోజీరావు వాస్తవాలకు ముసుగేసి అభూత కల్పనలు, అవాస్తవాలు వండి వారుస్తూ ప్రభుత్వంపై బురదజల్లడమే పనిగా పెట్టుకున్నారు. 'ఇది మానవత్వమా..దానవత్వమా..?' అంటూ తాజాగా పాడి రైతులను తప్పుదారి పట్టించేలా అబద్ధాలను అచ్చేశారు. ఇందులో నిజానిజాలేంటో చూద్దాం.

ఆరోపణ : పశువులకు మేత కూడా ఇవ్వడం లేదు

వాస్తవం గత ప్రభుత్వ హయాంలో పశువుల శరీర ఎదుగుదలకు, పునరుత్పత్తికి ఉపయోగపడే పచ్చి పశు గ్రాసం (మాగుడు గడ్డి), దాణా వేర్వేరుగా ఇచ్చేవారు. వీటితో పాటు బహిరంగ మార్కెట్‌లో ఎండుగడ్డి కూడా కొనాల్సి వచ్చేది. కిలో రూ.2 చొప్పున మాగుడు గడ్డి, కిలో రూ.4.50 చొప్పున దాణా, కిలో రూ.2 చొప్పున ఎండుగడ్డి కొనేవారు. ఇలా కిలో మేతకు రూ.8.50 వరకు ఖర్చు పెట్టాల్సి వచ్చేది. దీని వల్ల పశు పోషకులకు అదనపు భారం పడేది. ఈ పరిస్థితిని మారుస్తూ పచ్చిగడ్డి, ఎండుగడ్డి, దాణా, ఖనిజ లవణాలు కలిగిన సంపూర్ణ మిశ్రమ దాణా (టీఎంఆర్)ను 60 శాతం రాయితీపై కేవలం కిలో రూ.6.40కే ప్రభుత్వం పశు పోషకులకు అందిస్తోంది. ఈ దాణాపై రాయితీ రూపంలో రూ.9.40 భారం పడుతుంది. ఇలా నాలుగేళ్లలో ఇప్పటి వరకు 1,49,340 మంది పశు పోషకులకు ఆర్బీకేల ద్వారా రూ.117.97 కోట్ల విలువైన 74,670 టన్నుల టీఎంఆర్‌ను అందించింది.



ఆరోపణ : పశు సంక్షేమం విస్మరించారు

వాస్తవం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేశంలో ఎక్కడా లేని విధంగా అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. వీటిలో ప్రధానమైనది పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాలలు. రూ.18.20 కోట్ల వ్యయంతో నియోజకవర్గ స్థాయిలో 154 వైఎస్సార్ పశు వ్యాధి నిర్ధారణ ప్రయోగశాలలు తీసుకొచ్చారు. వీటి ద్వారా పేడ, రక్త, పాల, మూత్ర, చర్మ సంబంధ వ్యాధుల, జీవ క్రియ వ్యాధుల పరీక్షలతో పాటు యాంటీ బయోటిక్ సెన్సిటివిటీ పరీక్షలు నిర్వహిస్తున్నారు. దేశంలో మరెక్కడా లేని విధంగా రూ.240.69 కోట్లతో నియోజకవర్గానికి రెండు చొప్పున 340 డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా రథాలను తీసుకొచ్చారు. 1962 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసిన అర గంటలోనే మారుమూల గ్రామాలకు సైతం ఈ వాహనాలు చేరుకొని పశు పోషకుల గుమ్మం వద్దే నాణ్యమైన పశు వైద్య సేవలందిస్తున్నారు. వీటి ద్వారా ఇప్పటి వరకు 5.25 లక్షల పశువులకు సేవలందించారు. తద్వారా 3.48 లక్షల పశు పోషకులు లబ్ధి పొందారు. ప్రమాదాలు, విపత్తుల వేళ పశువులు మృతి చెందడం వల్ల జీవనోపాధి కోల్పోయే పశు పోషకులు, మేకలు, గొర్రెలు, పందుల పెంపకం దారులకు ధీమా కల్పించేందుకు వైఎస్సార్ పశు బీమా పథకాన్ని అమలు చేస్తున్నారు. ఈ పథకం కింద మరణించిన పశువుకు రూ.30 వేలు, గొర్రె లేదా మేకకు రూ.6 వేలు పరిహారం చెల్లిస్తున్నారు. ఇలా ఇప్పటి వరకు 1,05,043 మంది పశు పోషకులకు చెందిన 1,72,180 పశువులకు బీమా కల్పించారు. ఇప్పటి వరకు 116 చనిపోగా 3 రోజుల వ్యవధిలోనే పరిహారం చెల్లించారు. ఈ ప్రభుత్వ హయాంలో కొత్తగా రూ.20 కోట్లు వెచ్చించి 5,068 కృత్రిమ గర్భధారణ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఆరోపణ : గోకులాలకు మంగళం పాడారు

వాస్తవం గోకులాలు, మినీ గోకులాలకు సంబంధించి గత ప్రభుత్వం చెల్లించకుండా ఎగ్గొట్టిన బకాయిలు దశల వారీగా చెల్లించేందుకు ఈ ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. నూరు శాతం పూర్తయిన గోకులాలు, మినీ గోకులాలకు గడిచిన 4 నెలల నుంచి చెల్లింపులు చేస్తున్నారు. ఈ వాస్తవాలు తెలుసుకోకుండా గత ప్రభుత్వం పెట్టిన బకాయిలు ఈ ప్రభుత్వం చెల్లించడం లేదంటూ రాష్ట్ర ప్రభుత్వంపై బురదజల్లడం రామోజీకే చెల్లింది.

ఇది కదా గుర్తింపు అంటే..

పశు పోషకుల కోసం ఈ ప్రభుత్వం అమలు చేసినన్ని సంక్షేమ కార్యక్రమాలు దేశంలో ఎక్కడా జరగడం లేదని పలు రాష్ట్రాలు కితాబిస్తున్నాయి. ఏపీ బాటలో నడిచేందుకు కేరళ, పంజాబ్ తదితర రాష్ట్రాలు ఉత్సాహం చూపుతున్నాయి. ఇలా నాలుగేళ్లుగా ఈ రంగంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలు, అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల ఫలితంగా జాతీయ, అంతర్జాతీయ స్థాయి అవార్డులు, రివార్డులు లభిస్తున్నాయి. వరుసగా రెండేళ్ల పాటు అగ్రికల్చర్ టు డే గ్రూప్ ద్వారా ఏపీకి యానిమల్ హెల్త్ లీడర్ షిప్ అవార్డులు వరించాయి. 2021-22 సిల్వర్ స్కోచ్, 2020లో కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా నుంచి అవార్డు ఆఫ్ ఎక్సలెన్స్‌తో పాటు 2023లో వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా రథాలకు సిల్వర్ స్కోచ్, వెటర్నరీ టెలీ కాల్ సెంటర్, పశువుల వ్యాధి నిర్ధారణ ల్యాబ్స్‌తో పాటు ఆంధ్ర గోపుష్టి కేంద్రానికి స్కోచ్ మెరిట్ అవార్డులు దక్కాయి. చంద్రబాబు సీఎం పీఠంపై లేనందున రామోజీకి ఇవన్నీ కనిపించడం లేదు.

ఆరోపణ : పశుపోషకులకు ఏ మేలూ చేయలేదు

వాస్తవం ముందెన్నడూ లేని విధంగా గ్రామ స్థాయిలో ఏర్పాటు చేసిన ఆర్బీకేలకు నెలకు రూ.2,750 విలువైన పశువుల మందులు, వైద్య పరికరాలు సరఫరా చేసి గ్రామాలలో నాణ్యమైన పశు వైద్య సేవలను అందిస్తున్నారు. ఇప్పటి వరకు మందులు, వైద్య పరికరాల కోసం ప్రభుత్వం రూ.65.20 కోట్లు ఖర్చు చేసింది. ఆర్బీకేల ద్వారా ఇప్పటి వరకు 1.75 కోట్ల జీవాలకు ప్రథమ చికిత్స, 2.44 కోట్ల జీవాలకు నట్టల నివారణ మందుల పంపిణీ, 2.26 కోట్ల పశువులకు టీకాలు, 16.38 లక్షల పశువులకు కృత్రిమ గర్భధారణ చేయడం ద్వారా 10.63 దూడలకు జన్మిచ్చేలా చేశారు. 34.36 లక్షల పశువులకు పశు ఆరోగ్య సంరక్షణా కార్డ్స్ పంపిణీ చేశారు. 6.14 పశువుల నుంచి నమూనాలను సేకరించి పశు వ్యాధి నిర్ధారణ ల్యాబ్స్ ద్వారా కచ్చితమైన వ్యాధి నిర్ధారణ జరిపి సత్వర వైద్య సేవలందించేలా కృషి చేశారు. 40 శాతం రాయితీపై రూ.17.65 కోట్ల విలువైన 5,195 గడ్డి కత్తిరించు యంత్రాలను పశు పోషకులకు అందించారు. మేలైన పశుపోషణ, నాణ్యమైన పాల ఉత్పత్తి లక్ష్యంగా ఆర్బీకేల ద్వారా గ్రామ స్థాయిలో పశు విజ్ఞాన బడులు నిర్వహిస్తూ లక్షలాది మందికి పశుపోషణలో శిక్షణనిచ్చారు.

ఆరోపణ : ఊరూరా పశుగ్రాసం లేదు


వాస్తవం గత ప్రభుత్వ హయాంలో ఊరూరా పశు గ్రాస క్షేత్రాల పథకం పేరుతో పెద్ద ఎత్తున నిధులు పక్కదారి పట్టాయి. క్షేత్ర స్థాయిలో పశు గ్రాస క్షేత్రాలు లేకుండానే నిధులు దారి మళ్లించినట్టు పలు విచారణల్లో తేటతెల్లమైంది. ఈ అవకతవకలకు ఆస్కారం లేని రీతిలో ప్రస్తుత ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా 75 శాతం రాయితీపై నాణ్యమైన, ధృవీకరించిన పశుగ్రాస విత్తనాలను సరఫరా చేస్తూ ఊరూరా పశు గ్రాసాన్ని అభివృద్ధి చేస్తున్నారు. ఇలా 3,67,400 మంది రైతులకు 75 శాతం రాయితీపై 6,948 టన్నుల పశుగ్రాస విత్తనాలను సరఫరా చేశారు. వాటి ద్వారా రైతులు తమ సొంత క్షేత్రాల్లోనే ఊరూరా పశుగ్రాసాన్ని ఉత్పత్తి చేస్తున్నారు. ఇలా ఇప్పటి వరకు 34 లక్షల టన్నులకు పైగా మేలైన పశుగ్రాసాన్ని ఉత్పత్తి చేసి పశువులకు అందించారు. ధ్రువీకరించిన నాణ్యమైన మేత, దాణ, పశుగ్రాసం అభివృద్ధికి రూ.250 కోట్లతో పశుగ్రాస భద్రతా పాలసీని అమలు చేస్తున్నారు. ఇవేమీ మీకు కనిపించడం లేదా రామోజీ?

నా విజన్‌తో యువత ఆకాశానికి

- బీసీ కులాలకు మేలు చేస్తా
- కాపులకు ఐదు శాతం రిజర్వేషన్ ఇస్తా
- అమలాపురంలో ప్రతిపక్ష నేత చంద్రబాబు
- జనం లేక సభ అట్టర్ ఫ్లాప్...


అమలాపురం గడియారస్తంభం సెంటరులో నిర్వహించిన సభలో పలుచగా ఉన్న జనం

సాక్షి అమలాపురం: తన విజన్‌తో యువత ఆకాశానికి ఎగిరిపోతారని ప్రతిపక్ష నేత చంద్రబాబు తెలిపారు. తన సైన్యం యువతని.. వారికి ఉపాధి కల్పించే బాధ్యత తనదేనన్నారు. అమలాపురంలో వర్క్ స్టేషన్ ఏర్పాటు చేస్తానని.. ఇక్కడే ఉంటూ అమెరికాలో పనిచేసేలా చేస్తానని వెల్లడించారు. బీసీల్లో 150 కులాలకు మేలు చేసి వారి రుణం తీర్చుకుంటానన్నారు. కాపులకు కేంద్రం ఇచ్చిన 10 శాతం రిజర్వేషన్‌లో ఐదు శాతం కేటాయిస్తానని చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో శుక్రవారం నిర్వహించిన బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడారు. జగన్‌కు ఎక్స్‌పెయిరీ డేట్ వచ్చిందన్నారు. ఆయనలా తాను అప్పులు చేయనని.. సంపద సృష్టించి సంక్షేమం వైపు నడిపిస్తానని తెలిపారు. జిల్లా పేరుతో పచ్చని కోనసీమలో అమాయకులపై తప్పుడు కేసులు పెట్టారని ధ్వజమెత్తారు. నిత్యావసర వస్తువుల ధరలు, పన్నులు పెంచుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసుక, మద్యం అమ్మకాలతో దోపిడీ చేస్తున్నారని దుయ్యబట్టారు. తిరుమలలో చిరుతలు ఉంటే మీకు కర్రలు ఇస్తారంట.. ఇంటికొక కర్ర పట్టుకుని వైఎస్సార్‌సీపీ దొంగలను కొట్టండని ప్రజలను రెచ్చగొట్టారు. వైఎస్సార్‌సీపీ నేతలు ఎస్సీలను చంపి డోర్ డెలివరీ చేస్తున్నారని విమర్శించారు. జగన్ ప్రత్యేక హోదా, రైల్వే జోన్, పోలవరం తెచ్చారా అని నిలదీశారు. కోనసీమలో కొబ్బరి, ఆక్వాలకు ప్రత్యేక పాలసీ తెస్తానని చెప్పారు. ఈ సభలో పార్టీ నేతలు గంటి హరీష్ మాధుర్, అయితాబత్తుల ఆనందరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చంద్రబాబు

అమలాపురం సభ అట్టర్ ఫ్లాప్

కాగా అమలాపురంలో చంద్రబాబు సభ అట్టర్ ఫ్లాప్ అయ్యింది. అనుకున్న దానిలో మూడో వంతు కూడా జనం రాలేదు. తొలి నుంచి జనం రాక మీద నమ్మకం లేని పార్టీ నేతలు గడియారస్తంభం సెంటర్‌లో సమావేశ వేదికను రివర్స్‌లో ఏర్పాటు చేశారు. జనం రాకపోతే సెంటర్‌కు ఆనుకుని ఉన్న రోడ్లు ఖాళీగా కనిపించే ప్రమాదముందని ఇలా చేశారు. ఫ్లెక్సీలు కట్టి రోడ్డును ఇరుకుగా చేసినా జనం రాకపోవడంతో పార్టీ నేతలు డీలా పడ్డారు.

విజనరీ కాదు.. పిట్టల దొర

- సెల్‌ఫోన్‌లో టార్చ్‌లైట్‌ను కనిపెట్టా అంటూ పగటి వేషగాడిలా చంద్రబాబు కబుర్లు
- రాఖీలకు పూజ చేస్తున్నా.. కట్టుకుంటే కష్టాలు పోతాయంటూ చాదస్తపు మాటలు
- విజన్ 2047 హామీలను అధికారంలో ఉండగా ఎందుకు అమలు చేయలేదు?
- సీఎం జగన్ సంక్షేమ పాలనకు ప్రజల బ్రహ్మరథం
- ఓర్వలేక చంద్రబాబు దుష్ప్రచారం.. ఫిడేలు వాయిస్తున్న పవన్ కళ్యాణ్
- ప్రభుత్వ సలహాదారు సజ్జల

సాక్షి, అమరావతి: సెల్‌ఫోన్‌లో టార్చ్‌లైట్‌ను కనిపెట్టింది తానేనంటూ పదేపదే చెప్పుకుంటున్న టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఓ పిట్టలదొర అని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యానించారు. 45 రోజులుగా రాఖీలకు పూజ చేస్తున్నానని, వాటిని కట్టుకుంటే కష్టాలన్నీ తీరిపోతాయంటూ పగటి వేషగాడిలా చాదస్తం మాటలు చెబుతున్న చంద్రబాబు గొప్ప విజనరీ అంటూ ఎద్దేవా చేశారు. సజ్జల శుక్రవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు వ్యాఖ్యల వీడియో క్లిప్పింగ్‌లను ప్రదర్శించారు. వార్ధక్యంతో మతి భ్రమించి మాట్లాడుతున్న చంద్రబాబును సీఎంగా చేయడానికి దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్ తపన పడుతున్నారని విమర్శించారు. 45 ఏళ్లుగా రాజకీయాల్లో ఉంటున్న చంద్రబాబు గురించి రాష్ట్ర ప్రజలు ప్రతికూలంగానైనా రోజూ చర్చించుకుంటూనే ఉంటారని చెప్పారు. విజన్ 2047 పేరుతో హామీలను 2014 – 19 మధ్య అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు ఎందుకు అమలు చేయలేదని నిలదీశారు. అధికారంలో ఉన్నప్పుడు విద్యుత్ ఛార్జీలను ఎడాపెడా పెంచేసి ఇప్పుడు తగ్గిస్తానంటూ మాయమాటలు చెబుతున్నారని మండిపడ్డారు.



విడిపోతే కదా మళ్లీ కలవడానికి..?

చంద్రబాబు రాజకీయ ప్రయోజనాల కోసమే పవన్ కళ్యాణ్ జనసేనను స్థాపించారని, వారిద్దరూ ఆది నుంచి కలిసే ఉన్నారని మీడియా అడిగిన ఓ ప్రశ్నకు సజ్జల బదులిచ్చారు. 'అసలు చంద్రబాబు – పవన్ విడిపోతే కదా మళ్లీ కలవడానికి? 2014లో చంద్రబాబును సీఎంగా చేయడం కోసం జనసేనను ఎన్నికల బరిలోకి దించకుండా పవన్ బేషరతుగా టీడీపీకి మద్దతిచ్చారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చడం ద్వారా మళ్లీ చంద్రబాబును సీఎంగా చేయడం కోసమే 2019లో పవన్ విడిగా పోటీ చేశారు' అని స్పష్టం చేశారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీలనివ్వబోనని చెప్పడం ద్వారా టీడీపీతో కలిసి పోటీ చేస్తానని పవన్ చెప్పకనే చెప్పారన్నారు.

విశాఖకు రాజధాని రాకూడదన్నదే వారి లక్ష్యం..

సీఎం జగన్ సంక్షేమ పాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతుండటం చూసి ఓర్వలేకే చంద్రబాబు, పవన్ కళ్యాణ్ దుష్ప్రచారం చేస్తున్నారని సజ్జల మండిపడ్డారు. విశాఖలో చంద్రబాబు హయాంలో జరిగిన తప్పులను సీఎం జగన్ చక్కదిద్దుతున్నారని, వికేంద్రీకరణలో భాగంగా రాష్ట్రంలో ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేసే దిశగా చిత్తశుద్ధితో అడుగులు వేస్తున్నారని తెలిపారు. విశాఖను కార్యనిర్వాహక రాజధానిగా ప్రకటించి అభివృద్ధి చేస్తుంటే ఓర్వలేని చంద్రబాబు అక్కడ శాంతిభద్రతలు అదుపు తప్పాయంటూ దుష్ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఆ ఆర్కెస్ట్రాలో సభ్యుడైన పవన్ నాలుగు రోజులుగా ఫిడేలు వాయిస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్ర వ్యాప్తంగా శాంతి భద్రతలు భేషుగ్గా ఉన్నాయన్నారు. యార్లగడ్డ వెంకట్రావుకు ఏవైనా సమస్యలుంటే తన వద్దగానీ, ప్రాంతీయ పరిశీలకులు అయోధ్య రామిరెడ్డి, మర్రి రాజశేఖర్, సీనియర్ నేతల వద్ద అంతర్గతంగా చర్చించుకోవాలని, బహిరంగ వేదికలపై చర్చించకూడదని చెప్పారు. ప్రజాబలం ఉన్న వైఎస్సార్‌సీపీలో ఒక స్థానం నుంచి పోటీ చేసేందుకు ఎక్కువ మంది పోటీ పడటం సహజమేనన్నారు. ఇప్పుడు పోటీ చేయడానికి అవకాశం రాకపోతే భవిష్యత్‌లో వస్తుందని, పార్టీ నిర్ణయానికి అందరూ కట్టుబడాలని స్పష్టంచేశారు. యార్లగడ్డ ముందే నిర్ణయం తీసుకుని మాట్లాడినట్లుగా ఉందన్నారు. పార్టీ నుంచి వెళితే వెళ్లిపో అని తానెప్పుడూ అనలేదన్నారు.

పదేళ్లుగా పాలిటిక్స్‌లో ఉన్నా.. సీఎం పోస్టుకు సిద్ధం!

- టీడీపీతో పొత్తుపై చర్చలు జరుగుతున్నాయి: పవన్‌కళ్యాణ్
- స్టీల్ ప్లాంట్ కోసం పోరాడలేను
- ప్రధానితో గొడవలు పెట్టుకుంటే పని జరగదు

సాక్షి, విశాఖపట్నం: రాజకీయాల్లో తాను పదేళ్ల అనుభవం సాధించానని, అందువల్ల సీఎం పదవిని చేపట్టేందుకు సంసిద్ధంగా ఉన్నానని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ప్రకటించారు. వారాహి యాత్ర మూడో విడత ముగింపు సందర్భంగా శుక్రవారం విశాఖలోని ఓ హోటల్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఏ రంగంలోనైనా పరిణతి చెందాలంటే కనీసం పదేళ్ల అనుభవం ఉండాలి. నాకు రాజకీయాల్లో పదేళ్ల అనుభవం వచ్చింది. సీఎం పదవికి సిద్ధమయ్యా. అయితే అదొక్కటే సరిపోదు. ఎన్నికల య్యాక సీఎంను ఎమ్మెల్యేలు ఎన్నుకోవాలి. నాతో ఏ పార్టీలు కలిసొస్తాయన్నది ఆలోచిస్తున్నా. అందుకే ఈ ప్రక్రియలో ఓటు చీలకూడదన్నది నా అభిమతం' అని చెప్పారు. టీడీపీతో పొత్తుపై చర్చలు జరుగుతున్నట్లు వెల్లడించారు. ఎన్నికల అనంతరం ఏర్పాటయ్యేది జనసేన – బీజేపీ ప్రభుత్వమా? లేక టీడీపీ – జనసేన మిశ్రమ ప్రభుత్వమా? అన్న దానిపై తేలాల్సి ఉందన్నారు. వైఎస్సార్ సీపీ పాలనతో పోల్చుకుంటే అవినీతి, అక్రమాలు తక్కువనే ఉద్దేశంతో టీడీపీకి మద్దతిస్తున్నట్లు పేర్కొన్నారు.

మందుబాబులకు స్టైపెండ్ ఇస్తా..

రాష్ట్రంలో పోలీసు అధికారులు ప్రభుత్వాన్ని వెనకేసుకొస్తున్నారని పవన్ ఆరోపించారు. అనకాపల్లి జిల్లా నాతవరం మండలంలో 271 హెక్టార్లలో లేట్‌రైట్ పేరిట బాక్సైట్‌ను తవ్వి కడపకు తరలిస్తున్నారని, దీని విలువ రూ.15 వేల కోట్లు ఉంటుందని తన వద్ద సమాచారం ఉందన్నారు. 2011 నుంచి అక్కడ మూడు లక్షల టన్నుల ఖనిజ తవ్వకాలు జరిగాయన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మద్యపాన నిషేధం లేదా నియంత్రణపై దృష్టిసారిస్తామన్నారు. డీ అడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేసి మందుబాబులకు స్టైపెండ్ ఇస్తామని మేనిఫెస్టోలో పెడతామన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు తాను పోరాడలేనని పవన్ స్పష్టం చేశారు. తాను చేయగలిగింది ప్రధాని దృష్టికి తీసుకెళ్లడమేనని, ప్రజలే పోరాటానికి సిద్ధంగా ఉండాలని, ప్రధానితో గొడవలు పెట్టుకుంటే పని జరగదని తేల్చి చెప్పారు. దీనిపై గతంలో తాను ప్రధానికి చెబితే విని ఊరుకున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ఎంపీలు తమ పరపతిని స్టీల్‌ప్లాంట్ కోసం వినియోగించడం లేదని ఆరోపించారు. కాగా మీడియా ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం చెప్పలేక పవన్ ఉక్కిరిబిక్కిరయ్యారు. సమావేశం పూర్తి కాకుండానే అర్ధాంతరంగా నిష్క్రమించారు. కార్యక్రమంలో నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు.

సమాధానం చెప్పలేక అసహనం..

175 నియోజకవర్గాల్లో పోటీ చేయకుండా, మీ బలాన్ని చాటుకోకుండా మీరు ముఖ్యమంత్రి పదవిని ఎలా ఆశిస్తారు? అని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పకుండా పవన్ సమావేశం నుంచి నిష్క్రమించారు. సినిమాల్లో పాత్రలను పోషించిన మాదిరిగా పదేళ్ల అనుభవంతో సీఎం పోస్టుకు తాను సిద్ధంగా ఉన్నట్లు పవన్ వ్యాఖ్యానించడం గమనార్హం. వచ్చే ఎన్నికల్లో గాజువాకలో జనసేన జెండా ఎగురవేస్తామన్నారు కదా..! మరి అక్కడి నుంచి పోటీ చేస్తారా? అని మరో విలేకరి ప్రశ్నించగా.. అది తర్వాత చూద్దామంటూ దాటవేశారు. ఎర్రమట్టి దిబ్బల పరిసర గ్రామాల్లో స్థలాలను టీడీపీ హయాంలోనే ల్యాండ్ పూలింగ్ ద్వారా సేకరించారని, మరి మీరు ఈ ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం ఏమిటి? మీకు అవగాహన లేదా? అని మరో విలేకరి ప్రశ్నించగా.. సమాధానం చెప్పకుండా చిరాకు ప్రదర్శించారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు ఏం చేయబోతున్నారని ఓ విలేకరి ప్రశ్నించగా 'నువ్వు స్టీల్‌ప్లాంట్ నుంచి వచ్చావా?' అని ఎదురు ప్రశ్న వేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులను సమకూర్చలేకపోయిందంటూ పవన్ సమాధానం దాటవేశారు.

పవన్ కళ్యాణ్‌పై చర్యలు తీసుకోండి

విజయవాడ స్పోర్ట్స్: ఒంటరి మహిళల సమాచారాన్ని వలంటీర్లు సేకరించి సంఘ విద్రోహ శక్తులకు ఇస్తున్నారని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలు తన పరువు, ప్రతిష్టలకు భంగం కలిగించాయని విజయవాడ శాంతినగర్‌కు చెందిన వలంటీర్ రంగవల్లి న్యాయమూర్తి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. గత నెలలో వలంటీర్లనుద్దేశించి ఏలూరులో పవన్ చేసిన వ్యాఖ్యలపై వలంటీర్ రంగవల్లి నేరుగా విజయవాడ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తికి ఫిర్యాదు చేశారు. ఆమె వాంగ్మూలాన్ని న్యాయమూర్తి శుక్రవారం రికార్డు చేశారు. 'పవన్ వ్యాఖ్యలను దృష్టిలో పెట్టుకొని నేను నివాసం ఉంటున్న, విధులు నిర్వర్తిస్తున్న ప్రాంతంలో కొందరు సూటిపోటి మాటలతో మనసు గాయపరుస్తున్నారు.' అని ఆమె వాపోయింది. తన పరువు, ప్రతిష్టలకు భంగం కలిగించి సమాజంలో మర్యాద లేకుండా చేసిన పవన్ కళ్యాణ్‌పై చర్యలు తీసుకోవాలని వేడుకుంది. ఆమె నుంచి పూర్తి సమాచారం సేకరించిన న్యాయమూర్తి విచారణను వచ్చే నెల 15కు వాయిదా వేశారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943